₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

జులై - 2020


DECCAN LAND, HYDERABAD


95





- హైదరాబాద్ తొలి మహిళా అనస్థీయా
- జన్యు అమరిక ఇండీజెన్ ప్రాజెక్ట్!
- కరోనాపై అల్లం నారాయణ ఇంటర్వ్యూ
- ఫణిగిరి బౌద్ధ ఆరామ శిథిలాలు


## ఏడు సంవత్సరాల ప్రస్థానం...













తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2020 జులై సంచికతో 95 నెలలు పూర్తి చేసుకుంది. ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తిచేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' కృషి చేసింది. ఇప్పటి వరకు వెలువడిన సంచికలను 12 నెలలకు ఒక సంపుటిగా (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో వచ్చే సంచికలను కూడా ఇదేవిధంగా తీసుకువస్తామని తెలియజేస్తున్నాం. ఆసక్తికలవారు ఒక్కో సంపుటిని రూ.400/-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం). 'ఐఎస్ఎస్ఎన్' ఆమోదం పొందిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక పట్ల చూపుతున్న ఆదరణకు ధన్యవాదాలు.











**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
3-6-712/2, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288

Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAKMAHINDRABANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007




ఫొటో : రాజా దీన్‌దయాళ్ – సేకరణ : మహమ్మద్ సఫీఉల్లా


## మహబూబ్ ఆలీఖాన్

అఫ్జల్ ఉద్దౌలా క్రీ.శ. 1869లో మరణించగా అతని మూడేళ్ళ వయసు గల కుమారుడు మహబూబ్ ఆలీ ఖాన్ ఆరవ అసఫ్ జాగా రాజ్యానికి వచ్చాడు. మహబూబ్ ఆలీఖాన్ హైదరాబాదును పరిపాలించిన అసఫ్‌జాహీ వంశపు ఆరవ నవాబు. ఆగస్టు 17, 1866లో హైదరాబాద్ పురానీ హవేలీలో జన్మించాడు. 1869 నుండి 1911 వరకు హైదరాబాదు రాజ్యాన్ని పరిపాలించాడు. పరమత సహనము కలిగినవాడుగానూ, కళా పోషకుడుగానూ పేరుపొందాడు. పేదసాదల నిత్యపోషకుడిగా ప్రసిద్ధుడు. డిసెంబర్ 12, 1911లో ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మరణించాడు. మక్కామసీదులో వీరి సమాధి నిర్మించారు. దక్కన్‌ల్యాండ్ జూన్ సంచికలో వీరి గురించి విశ్లేషణాత్మక వ్యాసం ఉంది. ఆగస్టు 17న వీరి జన్మదినం సందర్భంగా మరోసారి జ్ఞాపకం చేసుకుంటూ...

TRC
TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com




## కరోనాపై సమగ్రమైన విశ్లేషణ

ఘంటా చక్రపాణి గారు కోవిడ్ -19పై సమగ్రమైన అవగాహనను ప్రజల ముందుకు చక్కగా తీసుకొచ్చిన విధానం అద్భుతంగా ఉన్నది. భవిష్యత్ తరాలకు టెక్నాలజీ యొక్క ఆవశ్యకత వివరించారు. మనుషులు ఎలాంటి విపత్తులైనా ధైర్యంతో ఎదుర్కోవాలని, అట్లాగే వలస కార్మికులగురించి, పర్యావరణం గురించి, ప్రైవేట్ రంగం, ప్రభుత్వాలు తీసుకోవాల్సిన బాధ్యతల చాలా గొప్పగా వివరించారు. మాకు తెలియని చాలా విషయాలు తెలియజేసిన దక్కన్‌ల్యాండ్‌కు ధన్యవాదాలు.

**-ఎ. ప్రవళిక,** హైదరాబాద్

❖ ❖ ❖

## కోవిడ్-19 మీద చాలా విషయాలు తెలిపారు

కోవిడ్-19 వైరస్ మీద వి. ప్రకాశ్‌గారు చాలా చక్కని విశ్లేషణను ఇచ్చారు. వ్యాక్సిన్‌పై ప్రజలకు చక్కని అవగాహన కల్పిస్తునే మనం పాటించాల్సిన జాగ్రత్తలు, భౌతికదూరం తెలియజేశారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న వైద్యరంగ విషయంలో, వైద్యవిధానాలు మన ఆయుర్వేదం, హోమియో, యునాని, సిద్ధవైద్యం ఇలాంటి వాటికి ప్రజలు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. అట్లాగే ఇప్పటి తరం విద్యతో పాటు వ్యవసాయ రంగంపై దృష్టి సారించాలని మన భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశమని మరొక మారు గుర్తు చేసిన విధానం చాలా బాగుంది.

**-సి.పవన్,** ఆదిలాబాద్

❖ ❖ ❖

## మాతృభాష గొప్పతనం

గత మాసంలో ప్రచురింపబడిన తెలుగు భాషాభివృద్ధి- సమస్యలు - పరిష్కరాలు ఆర్టికల్ చాలా అద్భుతంగా వివరించారు. తెలుగు భాషకున్న విశిష్టతను, ఔనత్యాన్ని, మాధుర్యాన్ని పాశ్చాత్య దేశాలలో మన తెలుగు భాషకున్న ప్రాధాన్యతను చాలా చక్కగా వివరించారు. మాతృభాషను కాపాడుకోవలసిన బాధ్యతను మన అందరిపై ఎంతో ఉంది. మన మాతృ భాషపై మమకారాన్ని మరొక మారు గుర్తు చేసిన రాపోలు గారికి ధన్యవాదాలు.

**-పి. కళాంజలి,** సంగారెడ్డి

## బాలచెలిమి గ్రంథాలయం

❖ ❖ ❖

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, జల్లెపల్లిలో 'బాల చెలిమి గ్రంథాలయం' ఈ కరోనా సమయంలో చక్కని ఊతమిచ్చిందనే చెప్పాలి. ఈ గ్రంథాలయం ద్వారా మా ఊరి విద్యార్థులకే కాక చుట్టు ప్రక్కల గ్రామాల పెద్దలు, పిల్లలకు కూడా ఎంతో మార్గదర్శకంగా నిలిచింది. శ్రీ వేదకుమార్ గారికి బాలల పట్ల ఉన్న మక్కువను ఈ గ్రంథాలయం రూపంలో చూపించి తన ఔదార్యాన్ని మరొక మారు చూపించారు. వారికి మా జల్లెపల్లి గ్రంథాలయం విద్యార్థుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు.

**-మక్బూద్ అలి,** జల్లేపల్లి - ఖమ్మం

## త్వరలో మీ ముందుకు 'బాలచెలిమి'

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాస పత్రికను రంగులతో 52 పేజీలు త్వరలో అందచేస్తామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. బాలలలో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన, వినోదాలను అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగే 'బాల చెలిమి'ని త్వరలో మీ ముందుకు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం నిర్వహిస్తున్న **'బాలచెలిమి-ముచ్చట్ల'**లో ప్రసిద్ధ రచయితలు, మేధావులు, ఆర్టిస్ట్‌లు, ఫోటోగ్రాఫర్‌లు, పబ్లిషర్స్, ప్రింటర్స్ పాల్గొని తమ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. బాల రచయితల నుండి బాలల కథలు, గేయాలు, కవితలు, స్కెచ్‌లు, వ్యాసాలు, పొడుపు కథలు, సామెతలు, జాతీయాలు బాలచెలిమిలో ప్రచురణ కోసం ఆహ్వానిస్తున్నాం. బాలచెలిమిని www.balachelimi.com వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు.

**-చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ**

బాల చెలిమి

**మీ రచనలు మాకు పంపవలసిన చిరునామా:**

ఎడిటర్, **"బాలచెలిమి", చంద్రం,** 3-6-712/2, స్ట్రీట్ నెం:12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, తెలంగాణ.

Mobile: 9030626288

E-Mail: desk.chelimi@gmail.com

Website: www.balachelimi.com

## ఆన్‌లైన్ ద్వారా దక్కన్ ల్యాండ్ చందా చెల్లింపు

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరాలు**

Name : DECCAN LAND,
Kotak Account No: 7111218829
Bank: KOTAK MAHINDRA BANK
IFSC Code: KKBK0007463
Branch Code : 007463

ISSN 2581-3188





# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 8 సంచిక : 11 పేజీలు : 68

జులై - 2020


# లోపలి పేజీల్లో...




పల్లా దుర్గయ్య ........ ఆచార్య మసన చెన్నప్ప ........ 6

సహజ వనరులను సహజంగా ఎదగనిద్దాం!... (ఎడిటోరియల్) .... ఎం. వేదకుమార్ ........ 7

తొలి మహిళా అనస్థీషియన్ మన హైదరాబాదీ ........ సంగిశెట్టి శ్రీనివాస్ ........ 9

చంద్రవదనకో చందన తాంబూలం 'అధికమెట్టు' ........ పరవస్తు లోకేశ్వర్ ........ 11

ఫణిగిరి బౌద్ధ ఆరామ శిథిలాలు ........ ఖ్వాజా మహమ్మద్ అహమద్ ........ 15

చరిత్ర దార్శనికుడు ఆచార్య రావుల సోమారెడ్డి ........ అడపా సత్యనారాయణ ........ 17

జన్ను అమరిక ఇండీజెన్ ప్రాజెక్ట్! ........ పుట్టా పెద్ద ఓబులేసు ........ 19

తెగుళ్లు నివారిస్తేనే లాభాల పసుపు ........ పల్లవి/కిషోర్‌కుమార్/అనిల్ ........ 22

ప్రకృతే నియంత్రిస్తుంది! ప్రకృతే శాసిస్తుంది!! ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 23

ఆహుతి అవుతున్న అడవులు ........ డా॥ హిమబిందు ........ 25

కరోనాపై లోతైన అధ్యయనాలు జరగాలి ........ డా॥ బి.వి. సుబ్బారావు (ఇంటర్వ్యూ) ........ 27

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికమాంద్యం ........ అల్లం నారాయణ (ఇంటర్వ్యూ) ........ 31

ప్రకృతి నేర్పే పాఠాలు అర్థం చేసుకోవాలి... ఆచరించాలి ........ ఓల్గా (ఇంటర్వ్యూ) ........ 37

విపత్కర పరిస్థితుల్ని సైన్స్ మాత్రమే ఎదుర్కొంటుంది! ........ ఉ.సా. (ఇంటర్వ్యూ) ........ 41

వన్యప్రాణి రక్షణే జీవ వైవిధ్య పోషణ ........ డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి ........ 45

జీవవైవిధ్య రక్షణే ప్రాణికోటి సంరక్షణ ........ డా॥ బి.ఎం.ఆర్ ........ 47

జ్ఞాపిక అనగానే గుర్తొచ్చేవి పెంబర్తి మెమెంటోలు ........ ఎన్.వి.ఎం. ........ 49

విచారణే ఓ పెద్ద శిక్ష..!? ........ మంగారి రాజేందర్ ........ 53

నల్లమలలో చల్లని పర్యటనలు ........ ద్యావనపల్లి సత్యనారాయణ ........ 55

బాలచెలిమి గ్రంథాలయంతో సెలవుల సద్వినియోగం ........ కట్టా ప్రభాకర్ ........ 59

వలస బతుకులు ........ భూతం ముత్యాలు ........ 61

పుస్తక పరిచయం ........ దక్కన్ న్యూస్ ........ 66



సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

editordeccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

**జగాష్ విలి**

సర్క్యులేషన్

**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

8374995555

కవర్‌పేజీ

**మహబూబ్ ఆలీ ఖాన్**

చిత్రాలు

**కూరెళ్ల శ్రీనివాస్**

layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,

Himayatnagar, Hyderabad - 500 029

TELANGANA

Mobile: 9030626288 Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన డా॥ ఎస్. రఘుకు మా కృతజ్ఞతలు.


'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# పల్లా దుర్గయ్య

తెలంగాణ అనగానే కాకతీయుల రాజధాని వరంగల్లు గుర్తుకు వస్తుంది. వరంగల్లు జిల్లాలోని మడికొండ గ్రామం, మహాకవులకు, పండితులకు పుట్టినిల్లు.

పల్లా దుర్గయ్య గారి స్వగ్రామం ఈ మడికొండే. దుర్గయ్యగారు 25-5-1914 తేదీన పల్లా నర్సమ్మ పాపాయ్య దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులకు వీరు 5వ సంతానం. తండ్రిగారికి వ్యవసాయం, ఉంది. పౌరోహిత్యం కూడా చేసేవారు. కాని దుర్గయ్యగారికి పౌరోహిత్యం అబ్బలేదు.

దుర్గయ్యగారి 3వ అన్నగారైన మడికొండ సత్తెయ్యగారు మంచి హరికథకులుగా పేరుగాంచినారు. ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రంలో అర్థశతాబ్దికి పైగా హరికథలు వినిపించారు.

దుర్గయ్యగారికి వారి తల్లిగారి వల్ల చదువుపట్ల శ్రద్ధ గలిగింది. పైగా బాల్యమిత్రులైన కాళోజి సోదరులు, వానమామలై సోదరులు దుర్గయ్య గారిని ప్రోత్సహించడం వల్ల కూడా దుర్గయ్యగారు విద్యపట్ల శ్రద్ధ వహించారు.

బిరుదురాజు రామరాజుగారు, అనుమల కృష్ణమూర్తి గారు మిత్రులే ఐనప్పటికీ- దుర్గయ్యగారి కంటె చిన్నవారు. కాని వారి స్నేహం గొప్పది.

దుర్గయ్యగారు మడికొండలో ప్రాథమిక విద్యనభ్యసించి, హనుమకొండలో హైస్కూల్ వరకు చదువుకున్నారు.

మడికొండకు, హనుమకొండ 12 కి.మీ. దూరం. ప్రతిరోజు నడిచి వెళ్లవలసి వచ్చేది ఐడికి ప్రయాణ బడలికవల్లనూ, ఆర్థికంగా పేదవారు కావడం వల్లనూ బాల్యంలోనే దుర్గయ్యగారు అనారోగ్యానికి గురుయ్యారు. ఐనా దుర్గయ్య గారు పట్టువిడువని విక్రమార్కులై చదువులో అందరికంటె మిన్నగా రాణించారు.

దుర్గయ్యగారి మీద బహుభాషాకోవిదులైన వానమామలై వెంకటచార్యుల ప్రభావం ఉంది. దుర్గయ్యగారికి మెట్రిక్యులేషన్‌లో ఉండగానే పెళ్లైంది. ఐనా దుర్గయ్యగారు వరంగల్‌లో ఇంటర్ చదివి, హైదరాబాదులో పరీక్ష రాసి పాసైనారు. ఆ తర్వాత 1938లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ.లో చేరి 1940లో అందులో ఉత్తీర్ణులయ్యారు. 'వందేమాతరం' ఉద్యమం కారణంగా ఒక సంవత్సరం వృథా అయింది.

అదే సంవత్సరం తొలిసారిగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో స్నాతకోత్తర తరగతులు మొదలుకావడం, అందులో దుర్గయ్యగారు విద్యార్థిగా చేరిపోవడం జరిగింది. అంతేకాక, 1942లో జరిగిన ఎం.ఏ. తెలుగు పరీక్షలో ఉత్తీర్ణులై మొత్తం విశ్వవిద్యాలయంలోనే పట్టభద్రులైన తొలి ఎం.ఏ. తెలుగు విద్యార్థిగా కీర్తికెక్కారు.

మడికొండ నుంచి హనుమకొండకు వెళ్లడమే కష్టమైన రోజుల్లో హనుమకొండ నుండి హైదరాబాదుకు రావడం ఇంకెంతో కష్టం. ఐనా దుర్గయ్యగారు హైదరాబాదుకు వచ్చి చదువుకోవడంలో వారి మూడవ అన్నగారైన సత్యనారాయణ గారి ప్రోత్సాహం ఎంతగానో ఉంది. అన్నగారు ప్రదర్శించిన గయోపాఖ్యానం నాటకంలో దుర్గయ్యగారు కూడా గయుని వేషం వేయవలసి వచ్చింది. వచ్చిన డబ్బుతో మొదటిసారి హైదరాబాదుకు వచ్చి అప్పటి తెలుగు శాఖ అధ్యక్షులైన రామప్రోలు సుబ్బారావుగారిని కలుసుకోవడం, వారి సహాయంతో ఫ్రీషిప్ రావడం, చదువుకొనసాగడం దుర్గయ్యగారి విద్యాభ్యాసంలో మరువలేని సంఘటనలు.

> **దుర్గయ్యగారి ఇల్లు కవులతో, పండితులతో నిండి సరస్వతీ నిలయంగా భాసించేది. ప్రతిరోజు ఏవో సాహిత్య గోష్ఠులు జరిగేవి. వాటిలో దాశరథి, రామరాజు, నారాయణ రెడ్డి, కాళోజి, వానమామలై మొదలైన ఉద్ధండ పండితులు పాల్గొనేవారు. మరొక్క ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే వట్టికోట ఆళ్వారు స్వామి స్థాపించిన దేశోద్ధారక గ్రంథమాల దుర్గయ్యగారి ఇంట్లోనే నడిచేది.**

దుర్గయ్యగారు 1943లో చాదర్‌ఘాట్‌లో కొత్తగా మొదలైన జూనియర్ కళాశాలలో మొదట పార్ట్‌టైం లెక్చరర్‌గా చేరి ఆ తర్వాత పూర్తికాలపు లెక్చరర్‌గా 13 ఎండ్లు పనిచేశారు. ఆ తర్వాతనే ఉస్మానియా యూనివర్సిటీ నిజాం కళాశాలలో ఆచార్యులుగా నియమితులై 1976లో పదవీ విరమణ చేశారు.

దుర్గయ్యగారి ఇల్లు కవులతో, పండితులతో నిండి సరస్వతీ నిలయంగా భాసించేది. ప్రతిరోజు ఏవో సాహిత్య గోష్ఠులు జరిగేవి. వాటిలో దాశరథి, రామరాజు, నారాయణ రెడ్డి, కాళోజి, వానమామలై మొదలైన ఉద్ధండ పండితులు పాల్గొనేవారు. ఇంకా ప్రముఖ కవి చిత్రకారులు డి. రామలింగంగారు, భాస్కరభట్ల కృష్ణారావుగారు సమావేశాలలో పాల్గొనేవారు.

మరొక్క ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే వట్టికోట ఆళ్వారు స్వామి స్థాపించిన దేశోద్ధారక గ్రంథమాల దుర్గయ్యగారి ఇంట్లోనే నడిచేది.


సమావేశాలకు, గ్రంథాలయానికి వచ్చే ప్రముఖులతో డా॥ దుర్గయ్యగారి ఇల్లు ఎప్పుడు చూసినా సందడిగా ఉండేది.

దుర్గయ్యగారు పిహెచ్.డి. పరిశోధనకి తీసుకున్న అంశం 'ప్రబంధవాఙ్మయ వికాసము- రాయల యుగము" అనేది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు పర్యవేక్షకులు. వారు రచించిన పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథానికి సంబంధించిన ప్రాశస్త్యాన్ని తెలియజేసే సంఘటనను వివరించక తప్పదు.

"సమగ్రాంధ్ర సాహిత్యం 'రూపకల్పనలో తలమునకలైన ఆరుద్రగారు ఒక రోజు పల్లా దుర్గయ్యగారింటిలో ప్రత్యక్షమయ్యారు.

(మిగతా 8వ పేజీలో)

# సహజ వనరులను సహజంగా ఎదగనిద్దాం!




కరోనా ఏ రోజు కారోజు విజృంభిస్తున్నప్పటికీ ఉత్పాదక విధుల నిర్వహణ ఏదో ఒక పరిమితిలోనైనా పునఃప్రారంభమైంది. లాక్‌డౌన్ సడలింపులు మొదలయ్యాయి. భయభయంగానైనా సామాజిక జన జీవితం దారిలో పడుతున్నది. కరోనాతో సహజీవనమంటే ఇదే. కరోనా వల్ల వచ్చిన ఇబ్బందులు, సమస్యలు ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నప్పటికీ మనకి ఒక కొత్త జీవన విధానాన్ని అలవాటు చేసింది. దీనివల్ల భౌతిక, ఆంతరంగిక పరిణామాలతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పులు హర్షనీయాలే. ముఖ్యంగా వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం తగ్గాయి. కాలుష్యరహిత వాతావరణంతో నదీజలాలు శుభ్రపడటమే కాక కాలుష్యరహిత వర్షాలు, అధిక వర్షాలు, పరిశుభ్రమైన భూగర్భజలాల పెంపుదల జరిగింది. శబ్ద కాలుష్యం తగ్గటం వల్ల మానసిక, ఆరోగ్య సమస్యలు తగ్గుముఖం పట్టాయి. సీజనల్ వ్యాధులు తగ్గాయి. దాహార్తితో అల్లాడిన నేల ఇవాళ తడి ఆరని చెమ్మతో, మట్టి వాసనలతో ఆహ్లాదకరంగా ఉంది. ఇవన్నీ సహజ వనరులను సహజంగా ఎదగనివ్వడం ద్వారా సాధ్యమని నిరూపితమైంది.

తెలంగాణ ప్రధానంగా వ్యవసాయాధారిత ప్రాంతం. ఈ ప్రాంతపు ఆదాయ వనరు ప్రధానంగా వ్యవసాయమే. నగరీకరణ, పారిశ్రామికీకరణ లేదని కాదు. అవి కొన్ని నగరాలకు, పట్టణాలకు పరిమితం. గ్రామీణ తెలంగాణ చాలా వరకు వ్యవసాయ జీవనమే. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. వర్షాధారిత, కుంటలు, చెరువుల మీద ఆధారపడిన వ్యవసాయానికి కాళేశ్వరం వంటి అనేక ప్రాజెక్టులు, అనుసంధాన డ్యాములు ద్వారా 33 జిల్లాల్లో 1531 కిలోమీటర్లు పొడవున ప్రధాన కాలువల ద్వారా సాగునీటిని అందిస్తున్నది. దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని డ్యాములు, రిజర్వాయర్లు, సరస్సులు, కాలువలు, టాంకులు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందనడానికి సందేహం లేదు.

జీవనాధారం కోసం, ప్రైవేట్ ఉద్యోగాల కోసం పల్లె వదిలి పట్టణాలకు వచ్చిన వాళ్ళకి ఈ జనారణ్యం రక్షణ ఇవ్వలేదని కరోనా అవగతం చేసింది. ప్రజలు నగరాన్ని వదిలి అమ్మఒడి పల్లెకు తిరుగుముఖం పట్టారు. పల్లెలు తల్లికోడి వలె రెక్కలు చాపి గుండెలకదుముకున్నాయి. కూలి జనం నుండి ఉద్యోగం పోగొట్టుకున్న విద్యాధికుల వరకు అందరికీ వ్యవసాయమే ఆధారమయింది. అప్పటి వరకు కౌలుకిచ్చి పట్టణాలకు వెళ్ళిన వాళ్ళు తమ భూముల్లో తామే స్వయంగా వ్యవసాయం మొదలు పెట్టారు. బీడుపడ్డ భూములకు కూడా సాగునీరు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ విస్తీర్ణత పెరిగింది. దీనికి తోడు వ్యవసాయాభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి అనేక పథకాలు అమలులోకి వచ్చాయి. రాష్ట్ర విత్తన కేంద్రాల ద్వారా సరైన విత్తనాల సరఫరా, వ్యవసాయ పెట్టుబడి మద్దతు, జీవిత భీమా, వర్షాధారిత ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు, ఏ కాలంలో ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో వేయాలో నియంత్రిత పంటల పథకం, రైతులకు లాభసాటైన మార్కెట్ విధానాల అమలు – ఇవన్నీ వ్యవసాయ రంగంలో దేశంలోనే తెలంగాణాను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. జాతీయ వ్యవసాయిక ఉత్పత్తిలో తెలంగాణా ఒక్కటి 54 శాతం అందించి అగ్రభాగాన ఉన్నది. 33 శాతం అడవుల అభివృద్ధి కోసం హరితహారం నిరంతరంగా కొనసాగుతోంది. ఇవన్నీ ఆర్థికాభివృద్ధికే పరిమితమైనవి కావు. ఈ చర్యలు చక్కని పర్యావరణానికి దోహదం చేసి పరోక్షంగా జీవ వైవిధ్యాన్ని నిలబెడుతున్నాయి.

నిరపాయకరమైన ఈ మౌలిక ప్రాకృతిక పరిణామాలు మానవ వికాసాభివృద్ధికి, ఆరోగ్యకర సమాజ ఆవిర్భావానికి నిర్మాణాత్మక అంశాలవుతాయి. మనం జీవిస్తున్న తీరు దీనికి దోహదం చేయాలి.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

వారికి తోడుగా దాశరథిగారు, గుమ్మడి వెంకటేశ్వరరావుగారున్నారు.

పల్లాదుర్గయ్య గారింట్లో ఎవరు వెళ్లినా రుచికరమైన భోజనం, ఫలహారాలు లభించేవి.

ఆరుద్రగారు కూడా ఫలహారం స్వీకరించి "మీ సిద్ధాంత గ్రంథం చూసి ఒక పావుగంటలో ఇస్తాను" అని థీసిస్ తీసుకొని దుర్గయ్యగారి స్టడీరూంలోకి వెళ్లారట. ఉదయం 8 గం॥ల నుంచి మధ్యాహ్నం, 12 గంటల దాకా ఆరుద్ర రూం నుంచి బయటకు రాలేదట. బహుశా ఆరుద్రగారికి దుర్గయ్య గారి పరిశోధన గ్రంథం ఎంతో నచ్చిందని వేరుగా చెప్పవలసిన పనిలేదు.

దుర్గయ్యగారి మీద కళాశాలలో ప్రభావం చూసిన ఆచార్యులు రాయప్రోలువారు, ఖండవల్లివారు. వీరితో పాటు నవ్యాంధ్ర సాహిత్య వీధులు కూరుగంటి సీతారామయ్యగారు కూడా ప్రభావం చూపారు. రాయప్రోలువారు పద్యపాఠం చెప్పేటప్పుడు కుర్చీలో కూర్చొనేవారు కాదు. నిలబడి పద్యాన్ని గొంతెత్తి చదివేవారు. వారి ప్రభావం దుర్గయ్య గారి మీద కూడా పడింది.

ఆ రోజుల్లో ఉర్దూలో బి.ఏ. చదివే ఏర్పాటుండేది. దుర్గయ్యగారు బి.ఏ. దాకా ఉర్దూ మీడియంలోనే చదివారు. తెలుగు ఐచ్ఛికాంశం మాత్రమే. తెలుగు భాషది విచిత్రమైన దుస్థితి. ఇంటర్‌లోను, ఎంఏ.లోను ఒక్కరంటే ఒక్కరే తెలుగు విద్యార్థి. వారే దుర్గయ్యగారు. ఇక బి.ఏ.లో మాత్రం వారికి ఒక తోడు దొరికింది. ఆరుట్ల రామచంద్రారెడ్డి గారే ఆ తోడు.

తెలుగు చదివి ఏం చేస్తారని హేళన చేసేవాళ్లు ఆ రోజుల్లో ఉన్నారు. ఉర్దూకు గౌరవం. ఐనా, తెలుగులో చదివి, తెలుగు గౌరవాన్ని ఇనుమడింప జేసిన దుర్గయ్యగారు 'దుర్గమే' అని చెప్పవచ్చు.

తెలుగును ఐచ్ఛికంగా చదివి, తెలుగు ఉపన్యాసకులుగా ఉద్యోగ జీవితం ఆరంభించినప్పుడు చాదర్‌ఘాట్ కాలేజీలో నెలకు వారికి లభించే జీతం అనండి, భృతి అనండి కేవలం 66 రూపాయలే. ఐనా శాశ్వతోద్యోగాన్ని విడిచి కళాశాల ఉద్యోగానికి రావడం వారదృష్టంగానే భావించినారు.

దుర్గయ్య గారికి ఆంధ్ర సాహిత్య చరిత్రను బోధించడమంటే ఎంతో ఇష్టం. దానితో పాటు విమర్శ అన్నా పద్య కవిత్వం – వచన కవిత్వమన్నా, ఛందస్సు, అలంకార శాస్త్రం అన్నా వారికెంతో ఇష్టమైన బోధనాంశాలు. పరిశోధనలో ఉద్దండులైన దుర్గయ్యగారి దగ్గర చేరిన పరిశోధకులలో మాదిరాజు రంగారావుగారు, జి.వి. సుబ్రహ్మణ్యం గారున్నారు. దుర్గయ్యగారిలో ఒక గొప్ప పరిశోధకులే కాదు, గొప్ప సృజనాత్మక కవి కూడా.

వారి "ప్రబంధ వాఙ్మయవికాసం–రాయల యుగం" అనే పరిశోధన గ్రంథం అటు పండితులకు ఇటు పరిశోధకులతో పాటు, సాహిత్య విద్యార్థులకు నేటికీ ఒక ఆధార గ్రంథంగా భాసిస్తుంది. కుమార సంభవం, శృంగార నైషధం, శృంగార శాకుంతలం వంటి ప్రబంధ పూర్వయుగకావ్యాలలో ప్రబంధ లక్షణాలున్నవి. ఐనప్పటికీ అవి అనువాదాలు కనుక ప్రబంధాలుగా లెక్కింపబడలేదని దుర్గయ్యగారు తెలియజేశారు.

రసవంతములైన, స్వోపజ్ఞములైన స్వతంత్రకావ్యాలే తెలుగులో ప్రబంధాలని, ఐతే, కిరాతార్జునీయం ఆధారంగా మనుచరిత్ర, మాఘకావ్య ఆధారంగా పారిజాతాపహరణం రచింపబడినాయని వివరించారు.

దుర్గయ్యగారు సృజనాత్మక కవి, వారి లేఖిని నుండి 'పాలవెల్లి', 'గంగిరెద్దు' అనే రెండు సృజనాత్మక రచనలు వెలువడ్డాయి. పాలెవల్లి పద్యగేయ సమ్మిశ్రితమైన కవితా సంపుటి. విద్యార్థి దశ మొదలుకొని జీవితంలోని అనేక సందర్భాలను పద్యాలలో, గేయాలలో వర్ణించిన తీరు పాలవెల్లిలో వెల్లి విరిసింది.

దుర్గయ్యగారి అసల్పకల్పనాశక్తి, వర్ణనాపటిమ, దేశీయులు, స్వభాషలోని అందచందాలు అనేవి 'గంగిరెద్దు' అనే ఖండకావ్యంలో కనిపిస్తాయి.

సంప్రదాయబద్ధమైన ఛందస్సులో రచింపబడినప్పటికీ, కథావస్తువు సవ్యమైంది. ఎవరూ అంతవరకు స్పృశించనిది. మొత్తం కావ్యం కరుణరస ప్లావితమై పాఠకుల హృదయాలను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఇందులోని 'సంక్రాంతి' పద్యాలు తెలుగువారి నాలుకల మీద నాట్యం చేశాయి. తెలంగాణ పల్లెపట్టులను గూర్చి ఇంత సహజసుందరంగా చిత్రించే ఖండకావ్యం మరొకటి లేదనిపిస్తుంది. ఈ కావ్యరచన వల్లనే దుర్గయ్య గారికి 'పల్లెకవి' అనే పేరు స్థారకమైంది.

దుర్గయ్యగారు సృజనాత్మక కవి, వారి లేఖిని నుండి 'పాలవెల్లి', 'గంగిరెద్దు' అనే రెండు సృజనాత్మక రచనలు వెలువడ్డాయి. పాలెవల్లి పద్యగేయ సమ్మిశ్రితమైన కవితా సంపుటి. విద్యార్థి దశ మొదలుకొని జీవితంలోని అనేక సందర్భాలను పద్యాలలో, గేయాలలో వర్ణించిన తీరు పాలవెల్లిలో వెల్లి విరిసింది.

దుర్గయ్యగారి రచనలలో "చతుర వచోనిధి" ఉత్తమ విమర్శన గ్రంథం. మనుచరిత్రలో పెద్దన చూపిన చతురవచోనిధిత్వం. ఎన్నో వ్యాసాలలో ఇందులో నిరూపితమైంది. "మను చరిత్ర" సమగ్రంగా దర్శనమిస్తుంది ఇందులో.

దుర్గయ్యగారి సృజనాత్మక రచనలలో ఒకటి 'పారిజాతా పహరణం' అనే గేయ కృతి. ఇది వారి శతజయంతి సందర్భంగా ప్రచురితమైంది...

"ఏ వేళల ఏ సుందరి
ఏ విలాసములు గోరిన
ఆ వేళల ఆ సుందరి
నా విలాసముల దేల్చును" అని శ్రీకృష్ణుని లీలలను చక్కగా గానం చేశారు దుర్గయ్య గారి కావ్యంలో.

అధ్యాపకులుగా ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తూ, అటు పరిశోధనలోనూ, ఇటు సృజనాత్మక రచనలోనూ తనదైన ముద్రవేసిన పల్లా దుర్గయ్యగారు తెలంగాణ రచయితలలో అగ్రశ్రేణికి చెందినవారని చెప్పక తప్పదు.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన* ***'తెలంగాణ తేజోమూర్తులు'*** *నుంచి)*

**–ఆచార్య మసన చెన్నప్ప**

# తొలి మహిళా అనస్థీషియన్

# మన హైదరాబాదీ

వైద్య రంగంలో హైదరాబాద్‌ది విశిష్టమైన స్థానం. మలేరియాకు కారణమైన దోమను కనుక్కున్నది హైదరాబాద్‌లోనే. ఈ విషయాన్ని కనుక్కున్నందుకు రోనాల్డ్ రాస్‌కు 1902లో నోబెల్ బహుమతి దక్కింది. అట్లాగే డాక్టర్ మల్లన్న, ముత్యాల గోవిందరాజులు నాయుడు 1900 ప్రాంతం నాటికే దేశంలో పేరెన్నికగన్న వైద్యులు. నిజామ్ రాజులను ఇన్నేండ్లు ఒకే దృక్కోణంతో చూస్తూ 'ప్రగతిశీలురు' వాళ్ళని దోపిడీదారులు, హిట్లర్, నాజీలతో పోల్చిండ్రు. అయితే నాణేనికి మరోవైపు ఉన్న విషయాన్ని మనం ఇక్కడ గుర్తు చేసుకుందాం. ఈ నిజామ్‌ల కారణం గానే హైదరాబాద్ ఇవ్వాళ 'మెడికల్ టూరిజాని'కి కేంద్రంగా నిలుస్తోంది. ఉస్మానియా, నిలోఫర్, నిమ్స్, ఎం ఎన్‌జె, ఇఎన్‌టీ, సరోజిని, టీబీ హాస్పిటల్స్ హైదరాబాద్ ఘనతను ఎనుకటనే చాటి చెప్పినయి. ఈ విషయాలన్నీ ఉస్మానియా మెడికల్ కాలేజిలోని 'ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసిన్'లో ఇవ్వాళ కొలువు దీరి ఉన్నాయి.



అల్లోపతిలో ఆధునిక పద్ధతుల్లో రోగ నిర్ధారణ, చికిత్స చేసేందుకు 1845లోనే ఇక్కడ 'హైదరాబాద్ మెడికల్ స్కూల్' ప్రారంభమయింది. ఈ స్కూల్‌ని నాలుగో నిజామ్ నవాబ్ నాసిరుద్దౌలా ఏర్పాటు చేసిండు. ఇందులో బ్రిటన్‌లో శిక్షణ పొందిన సర్జన్లు విద్యాబోధన చేసేవారు. డాక్టర్ మెక్లీన్, ఒగిల్వీ, మీర్ అమీర్ అలీ, ముర్రే మరో ఇద్దరు అటెండర్లతో ఈ స్కూలు ప్రారంభమయింది. దీని కన్నా ముందు బొలారంలో ఒక మెడికల్ స్కూల్ ఉండింది కాని సరైన వసతులు లేక దాన్ని మూసివేశారు. ఈ దశలో నాలుగో నిజామ్ నాసిరుద్దౌలా అనారోగ్యంతో బాధపడుతూ ఆయుర్వేదం, యునానీ వైద్యం తీసుకున్నప్పటికీ ఎలాంటి స్వస్థత చేకూర లేదు. బ్రిటీష్ రెసిడెంట్ ఫ్రేజర్ సలహా మేరకు డాక్టర్ మెక్లీన్‌తో వైద్యం చేయించుకోవడానికి సిద్దపడతాడు. అయితే ఎలాంటి అల్లోపతి మందులు మింగబోనని షరతు విధిస్తాడు. పరిశీలన తర్వాత నిజామ్ డయాబిటిస్‌తో బాధపడుతున్నాడని తెలుసుకొని అందుకు డాక్టర్ మెక్లీన్ ఒప్పుకుంటాడు. షరతు ప్రకారం ఎలాంటి మందులు ఇవ్వకుండానే కచ్చితమైన డైట్‌తో నిజామ్‌కు స్వస్థత చేకూరుస్తాడు. దీంతో సంతోషించిన నాలుగో నిజామ్ నాసిరుద్దౌలా బ్రిటీష్ రెసిడెన్సీకి దగ్గరలో 'హైదరాబాద్ మెడికల్ స్కూల్' ప్రారంభించేందుకు అనుమతిస్తాడు. ఈ స్కూల్లో మొదట్లో ఉర్దూ మీడియంలోనే బోధన జరిగింది. ఇంగ్లీషులోని విషయాలను ఉర్దూలోకి తర్జుమా చేసేందుకు ముర్రే అనే సహాయకుడుండేవాడు. ఈ స్కూల్/కళాశాలకు తాను ప్రిన్సిపాల్‌గా వచ్చిన తర్వాత ఎడ్వర్డ్ లారీ 1885 నుంచి ఇంగ్లీషు మాధ్యమంగా బోధన ప్రారంభించిండు. శిక్షణ పొందిన వారికి 'హకీమ్' అనే పట్టాలను ఇచ్చేవారు.

నిజానికి అమెరికా, ఇంగ్లాండ్‌లలో మెడికల్ కాలేజీల్లో స్త్రీలకు అంత ఈజీగా ప్రవేశాలు దొరకని కాలంలోనే హైదరాబాద్‌లో మహిళలకు అవకాశం కల్పించారు. డాక్టర్ ఎడ్వర్డ్ లారీ ప్రోత్సాహం కారణంగానే 1884-85 సంవత్సరంలో హైదరాబాద్ మెడికల్ స్కూల్/కళాశాలలో ఐదు గురు మహిళలు అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ ఐదుగురింట్లో ఇప్పుడు మనం చెప్పుకోబోయే ప్రపంచంలోనే మొట్ట మొదటి మహిళా అనస్థీషియాలజిస్ట్ రూపా భాయి ఫర్దూంజీ కూడా ఉన్నారు.

ఈనాటి సుల్తాన్‌బజార్‌లోని ఆసుపత్రి కేంద్రంగా ప్రారంభమైన ఈ హైదరాబాద్ మెడికల్ కళాశాలలో డాక్టర్ ఎడ్వర్డ్ లారీ నేతృత్వంలో అనేక పరిశోధనలు జరిగాయి. ఆరో నిజామ్ మహబూబ్ అలీఖాన్‌కు వ్యక్తిగత వైద్యుడిగా కూడా పనిచేసిన లారీ బ్రిటిష్ రెసిడెన్సీ (ఇప్పటి సుల్తాన్‌బజార్ దవాఖాన) హాస్పిటల్‌లో సర్జన్‌గా పనిచేస్తూ 1885-1901 మధ్య కాలంలో కొన్ని వేల మందికి క్లోరోఫామ్ ద్వారా అనస్తీషియా ఇచ్చి నొప్పి తెలియకుండా సర్జరీలు చేసిండు. ఆనాటి

ఆరో నిజామ్ మహబూబ్ అలీఖాన్‌తో గల సాన్నిహిత్యంతో ఆయన్ని ఒప్పించి 1888లో మొదటి క్లోరోఫామ్ కమీషన్‌ను 1889లో రెండో క్లోరోఫామ్ కమీషన్‌ని ఇంగ్లండ్‌కు పంపించాడు. ఈ బృందం అక్కడ మనుషులపై, జంతువులపై క్లోరోఫామ్ ద్వారా అనస్థీషియా ఇచ్చి చికిత్స చేసినారు. ఈ బృందంలో సభ్యురాలైన రూపాభాయి ఫర్దూంజీ అనే హైదరాబాద్ ఫార్సి మహిళ ప్రతిభా పాటవాల గురించి లారీ ఎంతగానో పొగిడారు. ఆమెను ప్రత్యేకంగా ఎంపిక చేసి తాను అంతకుముందు వైద్య విద్యాభ్యాసం చేసిన ఎడింబర్గ్‌కు పంపించాడు. వీరి పరిశోధనల్లోని విషయాలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఇంగ్లండ్‌కు చెందిన పత్రికల సంపాదకులు హైదరాబాద్‌కు వచ్చారంటే విషయ ప్రాధా న్యత అర్థమైతది.

నిజానికి క్లోరోఫామ్ అనస్థీషియా మొట్టమొదటి సారిగా ఎడ్వర్డ్ లారీ చదువుకున్న ఎడింబర్గ్‌లో సింప్సన్ అనే అతను నవంబర్ 15, 1847 నాడు వినియోగించాడు. అలాగే ఇండియాలో ఈ అ నస్థీషియాను జనవరి 12, 1848 నాడు వినియోగించారు.

రూపాభాయి ఫర్దూంజీ 1910లో ఎడింబర్గ్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో చదువుకుంది. ఆనాడు అనస్థీషియా మీద ప్రత్యేకంగా కోర్సులు లేకపోవడంతో ఈ రంగాల్లో ఆమె విద్యా భ్యాసం చేసింది. హైదరాబాద్‌లో లారీ దగ్గర పాథాలజీలో శిక్షణ పొందింది. ఇంగ్లండ్‌కు అనిబిసెంట్‌తో కలిసి ఒకే ఓడలో ప్రయాణం చేసింది. దీంతో ఆమెతో సాన్నిహిత్యం ఏర్పడింది. అంతేగాదు అ నిబిసెంట్ ఇంగ్లండ్‌లోని మిత్రులకు ఆమెను రికమెండ్ చేస్తూ యోగ్యతాపత్రాన్ని కూడా ఇచ్చింది. ఫర్దూంజీ 1889 నుంచి 1920 ప్రాంతంలో రిటైరయ్యే వరకూ అంటే దాదాపు 30 ఏండ్లు నగరం లోని బ్రిటిష్ రెసిడెన్సీ, జనానా ఆస్పత్రుల్లో పనిచేసింది. ఆఖరికి చాదర్ఘాట్ (సుల్తాన్‌బజార్) ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా రిటైరయ్యారు. నిజాం ఖాందాన్‌లో ఎంతోమందికి ఈవిడే పురుడు పోసింది. అవివాహితగా ఉన్న ఫర్దూంజీ ఒక్క హైదరాబాద్‌లోనే గాకుండా 1909లో ఇండియాకు తిరిగి వస్తూ సౌదీ అరేబియాలోని ఈడెన్ పోర్టులో దిగి బ్రిటిష్ రెసిడెంట్ కోరిక మేరకు అక్కడ కొంత కాలం వైద్య సేవలు అందించారు. అయితే రూపాభాయి జనన మరణాలు కచ్చితంగా తెలియ రావడం లేదు. ఈమె 1920 ఆ ప్రాంతంలో రిటైరయ్యారంటే బహుశా 1860 ఆ ప్రాంతంలో జన్మించి ఉండవచ్చు.

ఒక రోగికి క్లోరోఫామ్ ద్వారా అనస్థీషియా ఇచ్చిన మహిళ రూపాభాయి ఫర్దూంజీ. ఒక్క ఇండియాలోనే కాదు మొత్తం ప్రపంచం లోనే ఈమె మొట్టమొదటి మహిళ. ఈమె గురించి మెడికల్ జర్నల్స్‌లో అక్కడక్కడా కొంత సమాచారం లభ్యమైతుంది గానీ పూర్తి వివరాలు దొరకడం లేదు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఇలాంటి విషయాలపై మరింత లోతుగా పరిశోధన చేయడానికి వీలు కల్పించాల్సిన అవసరముంది. చరిత్రలో మన ఘనతను చాటిన వారిని సదా యాదికుంచుకోవాలె. అందులో భాగమే ఈ స్మరణ.

– సంగిశెట్టి శ్రీనివాస్,
m : 98492 20321
e : sangishettysrinivas@gmail.com

# దారి పొడుగునా



మందారపూల మాలలా
ఉదయించిన రవి బింబం
మరుక్షణం చుట్టిన చేమంతి పూలచెండు
విరిసిన మల్లెపూలరాశి
తల్లిపొట్టమీద బజ్జున్న బుజ్జిమేకపిల్ల
అప్పుడే లేచి సంబరంగా వేసే గంతులు
పొద్దునే ఆకుపచ్చముఖం కడిగి
కాలువ అద్దంలో ప్రతి బింబం చూసుకొనే చెట్లు
ఈ వైపునుంచి ఆ వైపుకి రెక్కలు చాచి ఎగిరే
కదిలే వెన్నెల వంతెనలు కొంగలు
ఆకుపచ్చని పచ్చిక బల్లలపై
తెల్లని బట్టల్లో పక్కపక్కనే
వరసగా కూర్చొన్న విహంగ విద్యార్థులు
ఫలహారశాల ముందు వినాయకుడికి సమర్పించిన
ఇడ్లీ నైవేద్యం తేనీరు పానీయం
చెట్ల కొమ్మలను ఊపి నేలరాలే పారిజాతాలను
ఏరుకొనే పూల ప్రియులు
వేగంగా నడచే చెమటనదుల
ఉదయపునడకల బాటసారులు
అటు ఇటు కనులవిందు చేసే
ఒకనాటి స్వచ్ఛజలాల గంగా ప్రవాహాలు
నేడు ప్లాస్టిక్ కవర్లతో, పారిశ్రామిక వ్యర్థాలతో
శ్యామల వర్ణ విషపూరిత నీలి జలాల యమునలు
మట్టి అంటు కొంటేనే మహా పాపమన్నట్లు
నేలతల్లి గుండెలపై సిమెంట్ తాపడం చేసే నాగరికులు
సమస్త ప్రజలకు చెందిన పంచభూతాలను
జేబుల్లో దాచుకొని రూపాయిల పంటపండించే బేహారులు
అందాన్ని ఆనందాన్ని అందించే
ప్రకృతిని పరిహసిస్తున్న
పర్యావరణ విధ్వంసకారులు

వేడెక్కిన భూగోళం
నీళ్ళింకిన నేలతల్లినేనా
భావితరాలకు మనమందించే ప్రేమకానుకలు.. !!

–మందరపు హైమవతి
m: 9441062732

# చంద్రవదనకో చందన తాంబూలం

# 'అధికమెట్ట'

మాహ్ లఖా బాయి జననమే ఒక వింత కత. ఆమె తల్లి ఆరు నెలల గర్భవతిగా మౌలాలీ దర్గా సందర్శనానికి మెట్లు ఎక్కుతున్నప్పుడు ఆ కష్టం భరించలేక గర్భవిచ్ఛిత్తి జరిగే సూచనలు కనిపించినై. అప్పుడు ఆమె భర్త పరిగెత్తి దర్గా దగ్గరికి వెళ్లి మొక్కుకుని ప్రసాదాన్ని తెచ్చి ఆమెకు తినిపించగానే ప్రమాదం తప్పిపోయి నెలలు నిండిన తర్వాత ఆడపిల్లను కనింది. "చాంద్ కా తుక్‌డా" లా ఉందని చాంద్ బీబీ పేరు పెట్టారు.

అట్లాంటి ఆ చంద్రవదన రెండు వందల ఏళ్ల క్రితం దానం చేసిన తన జాగీరు భూములే భాగ్‌లింగంపల్లి, కోరంటి, అడిక్‌మెట్, ఉస్మానియా యూనివర్సిటీ, ఇఫ్లూ, మౌలాలీ ప్రాంతాలు. ఆమె పూర్తిపేరు "మాహ్ లఖా బాయి చందా". ఉర్దూలో మాహ్ అంటే చందమామ. లఖా అంటే ముఖం. కవయిత్రిగా ఆమె కలం పేరు చందా. ఆమె కథ ఈ కథ చివరలో చెప్పుకుందాం.



మహ్ లఖా బాయి చందా

నాల్గువందల ఏండ్ల క్రితం "భాగ్ లింగంపల్లి" కుతుబ్‌షాహీల కాలంలో దట్టమైన చింతచెట్లు ఉన్న అడివి ప్రాంతం. అది నవాబుల వేసవి విడిది. అక్కడ విడిది చేసిన నవాబులు, అమీరులు జింకలను వేటాడేవారు. అంతెందుకు ఒక అరవై సంవత్సరాల క్రితం వరకు మా చిన్నప్పుడు అక్కడ పెద్ద చింతలతోపు ఉండేది. పట్టపగలే పలుచని చీకట్లు కమ్ముకుని ఉండేవి. సాయంత్రం అయ్యేసరికి అది తాగుబోతులకు, తిరుగుబోతులకు అడ్డాగా మారేది. పోలీసులు పెద్ద టార్చిలైట్లు పట్టుకుని గాలింపులు, వేధింపులు జరిపేవారు. ఆ తర్వాత అక్కడ హౌజింగ్ బోర్డు కాలనీ ఏర్పడగానే ఆ జింకల వనం కాస్తా జనారణ్యంగా మారిపోయింది.

"జమానా బదల్ గయా". కుతుబ్‌షాహీల కాలం నాటి ఆ "బాగ్"ఇప్పుడు సుందరయ్య పార్కుగా మారిపోయింది.

బాగ్‌లింగంపల్లికి ఎడమవైపు ఇప్పుడు సూర్యనగర్ బస్తీ ఉంది. యాభై ఏండ్ల క్రితమే అప్పటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు రాజ్‌బహద్దూర్‌గౌర్, జువ్వాద్ రజ్వీ, క్రిష్ణమూర్తిలు ఆ ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసి వారు కూడా స్వయంగా అక్కడే ఆ పేదలతో పాటు నివసించారు. రాజ్‌బహద్దూర్‌గౌర్ ఇంటి మీదున్న పేరు "చంబేలీ కే మండ్వే" అనగా మల్లె పందిరి అని అర్థం. ఆ ఇంటి పేరుతోనే మగ్దూం మెహియుద్దీన్ "దో బదన్" హిందీ సిన్మాకు ఒక పాట రాసాడు. ప్రముఖ హిందీ నటి షబనా ఆజ్మీ బాల్యం కొంత కాలం ఈ బస్తీ గల్లీలల్లనే గడిచింది. ఆ రోజులలో అది కమ్యూనిస్టుల కాలనీ.

సూర్యనగర్ రోడ్డు దాటగానే చిక్కడ్‌పల్లి. చిక్కడ్ అనగా బురద. బంజారాహిల్స్‌లో కురిసిన జోరు వానలు వాగులుగా వరదలుగా క్రిందికి ప్రవహించి హుస్సేన్ సాగర్‌లో కలిసి కట్ట మీది నీళ్లు క్రిందికి మత్తడిగా దుంకితే లోతట్టు ప్రాంతం చిత్తడిగా మారి చిక్కడ్‌పల్లి ఐపోయింది. ఒకప్పుడు అక్కడి నివాసులందరూ గొల్లలే. అడుగు తీసి అడుగేస్తే పాదాలు ఆ అడుసులో కూరుకుపోయేవి. ఆ బురదలో కసబిసా తిరుగుతున్న బర్రెలతో ఆ ప్రాంతం "క్షీర సాగరం"లా వర్ధిల్లింది. ఆ పంకిలంలో వెలసిన పద్మాలే ఈనాటి మన త్యాగరాయగాన భవనం, సిటీ సెంట్రల్ లైబ్రరీలు. ఆ చిక్కడ్‌పల్లి బురదలో బర్రెనెక్కి అల్లరల్లరిగా తిరిగి లల్లాయి పదాలు పాడిన ఒక బాలకుడు తర్వాత కాలంలో ప్రముఖ కార్మిక నాయకుడు, కమ్యూనిస్టు నాయకుడుగా మారినాడు. అతని పేరు సత్యనారాయణరెడ్డి. ప్రస్తుతం హిమాయత్‌నగర్‌లోని కమ్యూనిస్టుపార్టీ భవనం మీద ఇతని పేరును

మనం చూడవచ్చు. ఉలాయం అంటే సంస్కృతంలో దున్నపోతు అని అర్థం. దానిమీద కూచుని పాడే పాటలకే లల్లాయి పదాలు అని పేరు వచ్చింది.

బాగ్‌లింగంపల్లికి కుడివైపు ఉన్నదే మన కోరంటి దవాఖానా. దాని అసలు పేరు క్వారంటైన్ హాస్పిటల్. నైజాముల కాలంలో తెల్లదొరలు స్థాపించిన "ఉష్ణమండల వ్యాధుల పరిశోధనా కేంద్రం" అది. 1930లలో నగరంలో ప్లేగు వ్యాపించినప్పుడు రోగులందర్నీ అక్కడే నిర్బంధించేవారు. అదే క్వారంటైన్. ఆ పేరు పలకరాక పామరులు దానిని "కోరంటీ" అని పిలిస్తే పండితులమైన మనం కూడా అలవాటు పడి కోరంటి అనే అంటున్నాం.


దిగుడు బావి

ఆ సడక్ మీద సీదాగా వెళ్లితే అడిక్‌మెట్ ఏరియా వస్తుంది. దాని అసలు పేరు నవాబుల కాలంలో అధిక మెట్ట. పూర్తిగా ఛడావ్ అంటే ఎత్తైన ప్రాంతం. తెల్లదొరలకు నోరు తిరగక, అధికమెట్ట అనలేక అడిక్‌మెట్ అనంగనే ఆ పదాన్నే మనం ఈనాటి వరకు పట్టుకుని వేలాడుతున్నాం. మక్కీకి మక్కీ, లిఖిర్ కే ఫకీర్లం మనం. ఈ అధిక మెట్టలోని ఒక భాగమే నేడు మనం చూస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ మరియు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ లాగ్వేంజెస్‌లు. ఈ రెండింటి సమీపంలో ఉన్న మాణికేశ్వరనగర్ బస్తీ పూర్తిగా వడ్డెరుల బస్తీ. వందేళ్ల క్రితం యూనివర్సిటీ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలందరూ ఈ వొడ్డెరోళ్లే. హైద్రాబాద్ నగరం అంతా దక్కన్ పీఠభూమికి తలమాణికం గనుక రాళ్లకేం కొదువ? కొండలు పగిలేసినం అన్నట్లు శంషాబాద్ దగ్గరున్న గగన్‌పహాడ్‌ను తవ్వి ఆ రాళ్ళను ఎడ్లబండ్ల మీద తెచ్చి 'అధికమెట్ట'ను అధిగమించి ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని నిర్మించిన ఘనత ఈ మాణికేశ్వరినగర్ వొడ్డరులదే! మయసభను నిర్మించిన వారి వారసులు వీరేనేమో!


మౌలాలీ దర్గా ప్రవేశ ద్వారం

యూనివర్సిటీ దాటంగనే కుడివైపు తార్‌నాక మరియు హబ్సీగూడ. ముళ్లకంచెను ఉర్దూలో తార్ అంటారు. నాకా అంటే పోలీస్‌స్టేషన్. అట్లా తార్నకా పేరు వాడుకలోకి వచ్చింది. నైజం కాలంల అబిసీనియా (ఇథోపియా) దేశం నుండి వచ్చిన వారిని హబ్సీలు అనేవారు. ఆ రోజులలో వారు నివసించే బస్తీనే నేటి హబ్సీగూడ. సరే ఇక ఈ "యాదోం కీ బారాత్"ను వదిలిపెట్టి అసలు సంగతిలకు దిగుత.

ఉస్మానియా యూనివర్సిటీ నుండి ముక్కుసూటిగ పోతే మౌలాలీ దర్గా చేరుకుంటాం. పహాడీ షరీఫ్, జహంగీర్ పీర్ దర్గా లాగే ఈ మౌలాలీ దర్గా కూడా ముస్లింలకు పవిత్ర స్థలం. మాహ్ లఖాబాయి జననమే ఒక వింత కథ అని ఆ కథను ప్రారంభంలోనే ప్రస్తావించాను కదా! చందా తల్లిరాజ్ కన్వర్‌బాయి. రాజపుత్ర వనిత. ఆమె ప్రభువుల కొలువులో ఆస్థాన నర్తకి. ఆమె తాజ్ అలీ షా ముస్లింను వివాహం చేసుకుంది. విచిత్రంగా అతను చిత్రకారుడు మరియు చరిత్రకారుడు కూడా! చందా మేనమామ సైన్యాధికారి, తల్లితండ్రులకు ఆమె ఏకైక సంతానం. అయితే నేం "లాఖోం మే ఏక్ హై". తల్లి, తండ్రి, మేనమామల ప్రతిభలకు ఆమె ప్రతిబింబమయ్యింది.

అహమ్మద్ నగర్, బీజాపూర్‌లను పరిపాలించిన ముస్లిం రాణిపేరు చాంద్‌బీబీ (1550-1599) అనేక యుద్ధాలు చేసిన వీరవనిత. బహుభాషావేత్త. సితార్ వాయించేది. చిత్రలేఖనం ఆమె అభిరుచి. మహాలఖా తల్లితండ్రులు తమ కూతురు చాంద్‌బీబీలా ఉండాలని ఆ పేరు పెట్టుకున్నందుకు ఆమె సార్థక నామధేయు రాలయ్యింది.

పదహారు సంవత్సరాలకే ఆమె సంగీత, సాహిత్య నృత్య, గానాలలో గొప్ప విదుషీమణి అయ్యింది. రెండవ నిజాం అలీఖాన్ దర్బారులో ఆస్థాన నర్తకిగా (తవాయిఫ్) 1802లో రంగ ప్రవేశం చేసి అతని మనస్సును గెలుచుకుంది. సుగంధానికి సువర్ణం పూసినట్లు లలిత కళలలోనే గాక యుద్ధకళలైన విలువిద్య, గుర్రపు స్వారీలలో కూడా ఆమె ప్రవీణురాలు. పురుషసైనికుడుగా వేషం ధరించి నవాబుతో పాటు ఆమె యుద్ధరంగాలకు వెళ్లేది. చిత్రలేఖనం, పుస్తక పఠనం ఆమె అభిమాన కాలక్షేపాలు. నిండుపున్నమిలో వండువెన్నెలలా కళాత్మకంగా, రసాత్మకంగా జీవించింది. ఒక నవాబు గారే గాక మహారాజా చందూలాల్, మీరాలం, అరస్తు జా, సర్ జాన్ మాల్కం లాంటి వారెందరో ఆమె కటాక్ష వీక్షణాల కోసం "షమా చుట్టూ తిరిగిన పర్వానాలే" (దీప శిఖ చుట్టూ తిరిగిన శలభాలు).

**హమ్ సోంచ్‌తే థే హమ్ హీ చాహ్‌తే హైం ఆప్‌కో**
**మగర్ ఆప్ కో చాహనే వాలోంకా కాఫిలా నిక్‌లా**
**సోంచ్‌తా హూం ఖుదాసే షికాయత్ కరూం**

**క్యాకహేం ఖుదాభీ ఆప్‌కో చాహనే వాలానిక్‌లా**

"నేనొక్కడినే నిన్ను ప్రేమిస్తున్నాననుకున్నా
కాని నిన్ను ప్రేమించేవాళ్లు కోకొల్లలు.
అల్లాతో మొర పెట్టుకుందామనుకున్నా
అయ్యో ఏం చెప్పను! ఆ అల్లా సహితం నిన్ను ప్రేమించేవాడే"

ఆమె అందాన్ని మెచ్చి నిజాం నవాబు "మాహ్ లఖా" అను బిరుదు ప్రసాదించాడు. అనగా చంద్ర వదన" అని అర్థం. ఆమె కవిత్వం రాసేది. ఆమె "తఖల్లుస్" (కలంపేరు) "చందా". అట్లా అమె పూర్తిపేరు మాహ్ లఖా బాయి చందాగా మారింది. ఆమె కవితల సంకలనం పేరు "దివాన్". మొత్తం భారతదేశంలోనే మొదటిసారి ఉర్దూ కవయిత్రిగా పుస్తకం ప్రచురించిన ఘనత ఆమెదే.



మౌలాలీలో మహ్ లఖా బాయి చందా సమాధి

ఆమె జీవితకాలం 1767-1824. ఆమె కళావతి మాత్రమే గాక విద్యావతి కూడా. ఆమె నివాసం సరస్వతి సన్నిధానం. తన ఇంట్లోనే ఒక పెద్ద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకుంది. దక్కన్ చరిత్ర రాయటానికి ఒక చరిత్రకారుల బృందాన్ని నియమించింది. అనేక మంది పేద రచయితలకు, కవులకు, కళాకారులకు ఆర్థిక సహాయాలను అందచేసేది. ఫార్సీ, అరబ్బీ గ్రంథాలను ఉర్దూలోకి తర్జుమా చేయించింది. రెసిడెన్సీ ప్రేమకథకు నాయికా, నాయకులైన ఖైరున్నిసా, కిర్క్‌పాట్రిక్‌లకు ఈమె దగ్గరి స్నేహితురాలు.



మౌలాలీ దర్గా

ఆ విదుషీమణి అంద చందాలకు, తెలివి తేటలకు నిజాం గులాంగా మారి ఆ "చంద్రవదన చందన తాంబూలాల ఖర్చు'' కోసం ఒక జాగీరును మంజూరు చేశాడు. అదే బాగ్‌లింగంపల్లి నుండి మౌలాలీ దాకా ఆమె జాగీరు ప్రాంతం. ఆ భూములన్నీ ఆమె దానం చేసినందునే తర్వాత కాలంలో ఒక సుందరయ్య భవన గ్రంథాలయం, ఆంధ్ర మహా విద్యాలయం, యూనివర్సిటీ, సీఫెల్, ఆర్కైవ్స్ లాంటివి ఏర్పడినాయి. ఆమె సమాధి మౌలాలీ దర్గా గుట్ట క్రింద ఒక అందమైన పూదోటలో ఉంది. ఆమె వర్ధంతి నాడు ప్రతి ఏటా అక్కడ "మహెఫిల్ - ఏ - సమా'' ముషాయిరా జరుగుతుంది. సంగీత నృత్యకార్యక్రమాలు కూడా జరుగుతాయి. నగరంలోని దివానా - పర్వానాలందరు ఆ దినం ఆమెను "యాది" చేసుకుంటరు.

ప్రముఖ జర్నలిస్టు జి.కృష్ణగారు ఒక ఆదివారం ఆబిడ్స్ ఫుట్‌పాత్‌పై పాతపుస్తకాలు వెదుకుతుంటే మహాలఖా స్వదస్తూరితో ఒక గ్రంథం కనబడిందట. దాని ధర చాలా ఎక్కువగా ఉండేసరికి ఇంటికి వెళ్ళి డబ్బులు తెచ్చేసరికి ఆ పుస్తకాన్ని ఎవరో పుస్తక ప్రియుడు పట్టుకపోయాడని తన "విలేఖరి లోకం" పుస్తకంలో వాపోయాడు.

దీపశిఖలాంటి తన సౌందర్యంతో హైద్రాబాద్ నగరాన్ని రగిలించి వెలిగించిన ఈ విదుషీమణి ప్రస్తుతం గాలి కూడా సడిచేయని, ఆకు కూడా కదలని ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఆ పూదోటలో పెను విశ్రాంతిలో ఉంది. కృతజ్ఞతగా ఎప్పుడైనా వెళ్లి అశ్రుసిక్త నయనాలతో ఆమె సమాధిపై "గుప్పెడు గులాబీలను" నివాళిగా అర్పించండి.

కిర్గీజ్‌స్థాన్ ఒకప్పుడు సోవియట్ యూనియన్‌లో ఒక రిపబ్లిక్. 1990లో దానికి స్వాతంత్ర్యం వచ్చాక రాజధాని అలాతూ స్క్వేర్‌లో లెనిన్ విగ్రహాన్ని తీసేసి వారి జాతీయ రచయిత చెంఘీజ్ ఐత్ మాతోవ్ విగ్రహాన్ని స్థాపించుకున్నారు.

**మరి మనం కూడా భాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య పార్కు పేరును తొలగించి "మాహ్ లఖాబాయి చందా చమన్" అని కొత్త పేరు పెట్టుకుందామా?**

***(షహర్ నామా (హైద్రాబాద్ వీధులు - గాథలు) పుస్తకం నుంచి)***

**-పరవస్తు లోకేశ్వర్,**
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com



# ఏమైపోయారు?

ఏమైపోయారు వీళ్లంతా?
గాలిలో కోటలు నిర్మించే వాళ్లు
మాటలను మంత్రజలంతో తడిపి
జనాలను కన్నీటిముద్దలుగా
చవట దద్దములుగా తీర్చి దిద్దే
ఆధునిక యుగపు ఆటవిక తెగలు
ఏమైపోయారు వీరంతా?

మంత్రాలకు రాలని చింతకాయల
పులుపుదనాన్ని చప్పరిస్తూ
చతికిల బడిపోయారా?
తాము నిర్మించిన చాదస్తాల గోడల కింద
తామే పెళ్లలు పెళ్లలుగా విరిగిపడి పోయారా?
ఏమై పోయాయి వీళ్ల తపస్సులు
ఏమై పోయాయి వీళ్ల ఉత్తుత్తి మహిమలు?

ప్రజల్ని మభ్యపెట్టి మూఢనమ్మకాలతో
కోట్లను వెనకేసుకునే వీళ్ల వ్యాపార
అవినీతి కాషాయ వేషాలు
కంటికి కనిపించని ఒక చిన్న క్రిమిని
అంతం చేయలేని నిస్సహాయతలో
నీలిగి ఏ గోడ మూలో
ఏసీ గదుల నీడల వాడల్లో
ఆశ్రమాల ఆధ్యాత్మిక మత్తు పాకల కింద
కత్తిరించబడుతున్న నీడల్లా
కుదేలయిన ఎముకల బలిబత్తల పోగుల్లా
కునారిల్లి పోతున్నారా
ఏమైపోయారు వీళ్లంతా?

ఆధునిక సైన్స్
మానవులు ఎంతో శ్రమకోర్చి
ఎంతటి విపత్తున్నైనా ఎదిరించి
దేశానికి ప్రాణ భిక్ష పెట్టే
పనిలో తలమునకలై
ప్రాణాలను లెక్క చేయకుండా
క్రిమి సంహారక యుద్ధంలో
అలుపెరగక శ్రమిస్తున్న
ఆధునిక యోధాను
యోధుల్ని చూస్తూనైనా

ఈ సంధికాలంలోనయినా
ఇంకా కళ్లు తెరవకుండా
అన్నీ అవేవో తర తరాలుగా
వాళ్లు మూట కట్టుకున్న దస్త్రాలలోనే
వున్నాయష అంటూ ఇంకా
చిలుకల పలుకులు పలుకుతూ
కొత్త కొత్త బిల్డప్పులిస్తూ
వెన్నెముకలు విరిగి పోయి
శాస్త్ర సాంకేతికత ప్రగతి
మానవ నిత్య చైతన్య ప్రదీప్తికి
ఇక నయినా జేజేలు కొట్టక
వీధి చివర నిలబడి
వీళ్ల పాలరాతి
భవనాల అంచుల్లో పోగుపడి
సామాన్య ప్రజలతో పాటు
చప్పట్లు కొట్టక
ఏమై పోయారు వీళ్లంతా?

వీళ్ల మాయమాటల గొంతులకు
కరోనా ఉరి బిగించిందా?
వీళ్ల మూఢ నమ్మకాల ఉపదేశాలకు
మాస్కులు కట్టి మౌన కక్షుల్ని చేసిందా
వీళ్ల కాపాలిక మాంత్రిక
కట్టూ బొట్టూ చెదిరిపోయి
సమాజంపైన పైన వీళ్ల వ్యాపారపు
రాజకీయపు రట్టూ జారిపోయి
రంగులూ చెదిరిపోయి
ఏ కలుగుల్లో ఎలుకల్లా
దాక్కున్నారా?

సిగ్గుతో సగం చచ్చిపోయి
మానవ ప్రగతి కనిపెట్టే
మహా టీకాకోసం
సిల్కు వస్త్రాలు చుట్టిన
వాళ్ల ఖరీదయిన
ఆకాశ భవనాల మూలల్లో
వణుకుతూ ఎదురు చూస్తున్నారా?

ఇకనైనా బుద్ధి తెచ్చుకుని
మాయమాటలతో జనాన్ని మభ్యపెట్టే
మహిమల వృత్తుల్ని అటకెక్కించి
ఆధునిక మానవుడికి నమస్కరిస్తూ
సాష్టాంగ పడుతున్నారా?

మనిషిదే చివరి గెలుపని
మానవ మనుగడకు
మనిషి ప్రగతే చివరి మలుపని
తెలుసుకున్నారా?
ఏమైపోయారు వీళ్లంతా?!
క్రిమి సోకిన దేశం గజ గజా వణుకుతుంటే
వీళ్ల మాయలూ మంత్రాలూ
మాయ నూనెలూ, మంత్రజలాలూ
ఉబుసుపోని మాయోపదేశాలు మూటకట్టి
ఏ కలుగుల్లో నిద్ర పోతున్నారు వీళ్లంతా
ఏమై పోయారు వీళ్లంతా?!

– చిత్తలూరి
m : 8247432521

# ఫణిగిరి బౌద్ధ ఆరామ శిథిలాలు

హైదరాబాదు సంస్థానం పూర్వ ఆంధ్రసామ్రాజ్య శిథిలాలకు పట్టుకొమ్మ, పూర్వ ఆంధ్రసాహిత్య, శిల్ప, లలితకళాది సంపదలు అస్థి స్వరూపములో, ఈదేశపు గడ్డను శిథిలాలలో దొరుకుతాయి. ఫణిగిరి అట్టి పూర్వ శిథిలాలలో ప్రసిద్ధమయినది.

నల్లగొండ జిల్లాలో, గత పది ఏండ్లలో నేనొనర్చిన పురావస్తు పరిశోధనలకు ఆలవాలమైన పురాతన క్షేత్రాలలో ఫణిగిరి శిథిలారామము, బహుముఖ్యమైనది. ఈ విహారము ఒక చక్కని కొండగుట్టమీద నిర్మితమై ఉన్నది. ఈ గుట్టలో క్రీ.పూ. 1వ శతాబ్దము నుండి, శతాబ్దాలతరబడి కాలగర్భమున లీనమైపోయిన భారత సంస్కృతి, పురావస్తు రూపమున అంతర్గర్భితమై శిథిలస్థితిలో నిలిచి యున్నది. పరిశోధకులకు ప్రాచీన భారత సంస్కృతిని బహిరపరచుటకు అనంతమైన సంపద ఈ ఆరామ శిథిలాలలో లభించగలదు.

ఫణిగిరి పోవలెనన్న 'జనగాం' రైల్వే స్టేషనులో దిగి సూర్యాపేట రోడ్డుమీదుగా 30 మైళ్లు పోవలెను. శాస్త్రీయ పరిశోధనల వలన ఫణిగిరి శిథిలాలు, బౌద్ధయుగము నాటివని బయల్పడినది.

ఇక్కడ దాదాపు ముప్పది స్తూపముల శిథిలములు బయలు పడినవి. ఇవన్నీ గుండ్రని కట్టడములు. ఎక్కువగా రాతితో కట్టినవే. అడుగున ఎత్తుగా రాతితో నలుచదరపు వీకము కట్టినట్లుండి పైన స్తూపములు కట్టబడి యున్నవి. ఈ చదరపు ఫలకములపై మరేమైన కట్టడము కూడ యుండెడిదో లేదో, ఇదంతయు ఎప్పుడైన గిలాబా చేయబడి యుండెడిదో లేదో ఊహించుట కష్టము. ఈ స్తూపములలో చాలా భాగము, ముఖ్య ఆరామమునకు పశ్చిమ భాగముననే కొండవాలువ, వివిధ అంతస్తులుగా నిర్మింపబడి యున్నది.

ఆరామ మధ్యమున, నలుచదరపు వ్యూహముగా, ఇటుక కట్టడముల పునాదులున్నవి. ఈ పునాదులలో కూడ గదులు గదులుగా కట్టబడ్డ నిర్మాణముల శిథిలములో ఎక్కువ బయలుపడు చున్నవి. ఈ గదులు విడివిడి బౌద్ధ సన్యాసుల నివాస గృహములో (Cells) లేక మరే ఇతర ప్రయోజనార్థమై కట్టబడినవో సరిగా ఊహించుట కష్టము.

ఈ చైతన్యము కొండపైన కట్టబడినదగుటచేత కాబోలు, కట్టడాలు వానకు, వరదకు కొట్టుకొని పోకుండను, నీరు ఇంకి కూలిపోకుండను, నిర్మాతలు చాలా జాగ్రత్త వహించినట్లు కనబడుచున్నది. దాక్షిణాత్య శిల్పములో తదితర స్థానములందు కనరాని, పెట్టె కట్టుడు విధానములో (Boxed buttresses) మందిరము గోడలకు ఈ రక్షణను అవలంబించినారు.

ఈ శిథిలాలలో దొరికిన వాసపు పెంకుల వంటివి, పూర్వ ఆంధ్రశిథిలాలలో మాత్రమే లభించిన వాటివంటివగుటచేత, ఈ చైతన్యములోని ఇండ్ల కప్పులకు కూడ కొన్నిటికి పెంకులే వాడి ఉండిరేమో అని ఊహించవచ్చును. దీనినిబట్టి ఈ చైతన్యగృహముల ఉపరి భాగములు గట్టి వస్తువులతో కాక, త్వరితముగా శిథిలమైపోవు వస్తువులతోనే నిర్మించినట్లు భావించ నొస్సదము కలుగుచున్నది. కట్టడములకు వాడిన ఇటుకలు రెండడుగుల పొడవు, అడుగు వెడల్పు, 3.1/2 అంగుళముల మందముగా కలిగి ఉన్నవి. ఫణిగిరి కట్టడములలో వాడిన ఇటుకల నిర్మాణము, కొండాపురం కట్టడములోని ఇటుకల నిర్మాణ విధానములోనే జరిగినది. మట్టితో ఎండుగడ్డి, ఊక మొదలైనవి కలిపియే ఈ ఇటుకలను తయారు చేసినట్లున్నది. ఈ ఇటుకలలో, గడ్డి, ఊక మొదలైనవి కాలినప్పటి గతుకులు చెక్కు చెదరకుండ అట్లే కన్పించుచున్నవి.



ముందు దృశ్యము వెనుక దృశ్యము

ఫణిగిరిలో దొరికిన విగ్రహశకలం (ఫణిగిరి)

ఇక్కడ దొరికిన వానిలో తెల్ల సున్నపురాతి చెక్కడములు కొన్ని బహు అందమైనవి దొరికినవి. బౌద్ధుల మత విగ్రహములు తదితర లాంఛన శిల్పములుగల చెక్కడములు, తరువాయి కాలములలో ఈ ఆరామములను నాశన మొనర్చినప్పుడు, ముక్కలు ముక్కలుగా విరగగొట్టబడి, చిందర వందర చేయబడినవి.

ఫణిగిరిలో దొరికినవి శిల్ప సముదాయము బహుస్వల్పము. కాని వానిలో శిల్పకళ అత్యున్నత శిల్ప సాంప్రదాయములను వెలువర్చుచున్నది. శిల్పములలో, జీవశక్తి భావుకత్వము, రూప సౌందర్యము, విస్తృతముగ కొట్టవచ్చినట్లు కనిపించును.

ఈ దొరికిన విగ్రహములలో, ఒక విగ్రహ ఊర్ధ్వభాగము మాత్రము దొరకినది, ఆ విగ్రహములోని కండరముల సొంపు, మొగమున భావశబలత, బహురమణీయముగ భావస్ఫూరకముగ నుండి, చిత్తవృత్తుల నద్దములో ప్రతిబింబించినట్లు మొగము రేఖలలో బింబించు చున్నవి. చెవుల వ్రేలాడుచున్న తాటంకముల బరువుతో చెవి సాగిపోయినట్లు, తాటంకముల బరువును తెలుపుతూ శిల్ప

యథార్థముగ శిల్పమును నిర్మించినాడు. తలపై విజయలాంఛనముగ చుట్టబడిన ఆకుకొమ్మ, విగ్రహమునకు గ్రీకు స్వరూపమును కల్పించి, ఆనాటి శిల్పముపై గ్రీకుశిల్ప ప్రభావ మెంతగలదో చాటుచున్నది. దక్షిణ భారత భూమిలోనికి ఈ గ్రీకుశిల్ప ప్రభావము అటు ఉత్తరము నుండియూ, ఇటు తూర్పు పడమర సముద్ర తీరములనుండియూ కూడ చొచ్చుకొని ప్రవేశించినది.



కుబేరుడు

ఇచ్చట దొరికిన వస్తువులలో మరొకటి కుడ్య భాగమైన నిడుపాటి పలకల దిమ్మ. దీనిలో దొరికిన భాగము చిన్నదేయైనను, ఈ ముక్కమీదనే, మూడు ప్రక్కలు శిల్పములు చెక్కబడి యున్నవి. ముఖభాగమున, సంపూర్ణముగా రేకులు విచ్చిన పద్మము అందముగా చెక్కబడి యున్నది. ఈ పత్రముల రచన బహు ఆకర్షణీయముగ నున్నది. ఈ పద్మమునకు దిగువ, ఒక వృషభము, మానవుడు, గజము, విగ్రహములు చెక్కబడి యున్నవి. ఈ వృషభ రూపము, మూపురము ఎత్తుగా ఉండుట, సుమేరియన్, మెహెంజొదారో శిల్పాలలోని వృషభాలను జ్ఞప్తికి తెచ్చుచున్నది. అజంతా శిల్పములలోని వృషభ సమరముల చిత్రములను కూడ జ్ఞప్తికి తెచ్చుచున్నది గాని, ఇచట వృషభ స్వభావము సమర ముఖముగాలేదు ఈ వృషభమును ఏనుగు తరుముచున్నది. ఏనుగుకాయము మహాస్థూలముగునూ, ఏనుగు దంతములు దీర్ఘములుగానూ, రచించబడినవి. ఈ తరుముకొని వచ్చుచున్న ఏనుగును, అల్పకాయుడైనను, మహాధైర్యముతో ఎదుర్చుచు వృషభమునకు గజమును మధ్య నరుడు నిలిచి యున్నాడు, మానవుని రూపములో విజయమందు కొను చిహ్నాలే గాన్పించుచున్నవి.



చక్రముల పలకదిమ్మ

పలక ఎడమవైపు ముఖమున, మరల పద్మపత్ర ఖండమే లిఖించబడి యున్నది. దానికి దిగువను, వర్చస్వియైన పురుషుని రూపము చిత్రించబడి యున్నది.

పలక కుడివైపు ముఖమున కూడ రెండవ దానిలో వలనే యున్నది కాని, ఇచట పద్మము క్రింద పురుషుని బదులు, సింహము చెక్కబడి యున్నది.

ఈ శిథిలములలో దొరికిన మూడవ చెక్కడము, కుడ్య శిల్పమువలె నున్నది. దీనిలో విగ్రహము వామన రూపుడైన బొజ్జయ్య రూపమువలె, నేటి కార్టూన్ శిల్పములవలె నున్నది. ఈ విగ్రహమునకు చెక్కిన అలంకరణములు, నిండైన బొజ్జ, ఇవి కుబేరుని స్వరూపమునకు వ్యంగ్య శిల్పమేమోనని యనిపించు చున్నది. విగ్రహము రూపు రేఖలు దాక్షిణాత్య విధానములోనే ఉన్నవి. ముఖమున భావప్రకటనము, విగ్రహము అంగవిన్యాసము ఉత్తమశిల్ప లక్షణములను ప్రకటించుచున్నవి.

ఫణిగిరిలో, దొరికిన నాణెములలో ఆంధ్ర రాజులవి ఆరువది నాల్గు నాణెము లున్నవి. ఇవన్నియు సీసముతో చేయబడిన నాణెములు. క్రీ.శ. 2వ శతాబ్దపు నాణెములు కూడ మఱికొన్ని దొరికినవి. ఈ నాణెములు ఫణిగిరి ఆరామ కాలమును నిరూపించుచు తక్కిన చారిత్రక పరిశోధనలను బలీయమొనర్చు చున్నవి.

ఒకనాడు దక్కన్‌లో ప్రబలముగా వెలిగిన ఆంధ్ర సామ్రాజ్య పై భవనమును ఈ నాణెములు వేనోళ్ళ చాటుచున్నవి. వీటిని బహిరపరచి, పూర్వచరిత్రను పండిత లోకమున కందించుట, మా విధాయక ధర్మము. మనపూర్వ చరిత్ర సమీకరణలో, ఫణిగిరి శిల్ప సంపద అపారముగా నుపయోగించ గలదని ఆశించు చున్నాము.

– ఖ్వాజా మహమ్మద్ అహమద్ ద

చందాదారులుగా చేరండి! **దక్కన్ ల్యాండ్** చందాదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో ప్రజాఉద్యమాల వేదికగా ఆరంభమైన 'దక్కన్‌ల్యాండ్' తెలుగు సామాజిక రాజకీయ, పర్యావరణ మాసపత్రిక అనతికాలంలోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు కరదీపికగా మారింది. ఈ పత్రిక మరిన్ని వర్గాలకు చేరడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందాదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందాదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా**
DECCAN LAND
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029. Mob: 9030626288
E-mail:desk.deccan@gmail.com, www.deccanland.com

**చందా వివరాలు:**


| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 300 |
| 2 సం॥లకు | : | రూ. 600 |

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఒ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

## స్మృతి: మధ్య యుగాల ఆంధ్రదేశ చరిత్ర దార్శనికుడు

# ఆచార్య రావుల సోమారెడ్డి

**2018** నవంబర్ 13వ తారీఖున ఆచార్య రావుల సోమారెడ్డి మరణంతో తెలంగాణ ఒక ప్రముఖ చరిత్రకారుణ్ణి కోల్పోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కుగ్రామంలో రైతు కుటుంబంలో 1943లో జన్మించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి ఉస్మానియా యూనివర్సిటీ నుండి యం.ఏ., పి.హెచ్.డి డిగ్రీలను పొందినాడు. ఆ తర్వాత 1970లో యూనివర్సిటీ లెక్చరర్‌గా జాయిన్ అయి మూడు దశాబ్దాలకు పైగా రీడర్, ప్రొఫెసర్, చరిత్ర శాఖ అధిపతిగా పనిచేసి విశేష అనుభవాన్ని గడించినాడు. మధ్య యుగాల ఆంధ్రదేశ సామాజిక, సాంస్కృతిక చరిత్రలో ప్రత్యేక పరిశోధనలు చేసి అనేక గ్రంధాల్ని రచించినాడు. ఆయన తన సిద్ధాంత వ్యాసం హిందూ, ముస్లిం మత సంస్థలు (క్రీ.శ. 1300-1600) పుస్తకాన్ని ప్రచురించి, విషయ నిపుణుడుగా ప్రసిద్ధి చెందినాడు. భారతదేశ చరిత్రలో మధ్యయుగాల చరిత్ర ప్రాధాన్యతను, బహమని, విజయనగర, కుతుబ్‌షాహిల పాలనా కాలాల నాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత, సాంస్కృతిక, ఆధ్యాత్మిక అంశాల్ని నూతన కోణంలో విశ్లేషించి సృజనాత్మక లౌకిక వాద చరిత్రకారునిగా పేరుపొందినాడు. సామ్రాజ్యవాద, జాతీయ, మతతత్వ రచనా ధోరణుల్ని విమర్శనాత్మకంగా పరిశీలించి విలువైన పరిశోధనా గ్రంధాల్ని రచించినాడు. భారతదేశ మరియు ఆంధ్రదేశ చరిత్రను మత ప్రాతిపదికమీద కాకుండా శాస్త్రీయంగా, హేతుబద్ధంగా విశ్లేషించి మధ్య యుగాల నాటి హిందూ - ముస్లిం మత సంస్థలు, వాటి ప్రాముఖ్యతల్ని సోదాహరణంగా విశదీకరించి భావితరాల చరిత్రకారుల్ని ప్రభావితం చేసిన ఘనత సోమారెడ్డికి దక్కుతుంది.




మధ్యయుగ ఆంధ్రదేశాన్ని పాలించిన బహమని, విజయనగర, రెడ్డి, వెలమ, కుతుబ్‌షాహిల కాలంనాటి సామాజిక, సాంస్కృతిక, మత పరిస్థితుల్ని కూలంకశంగా చర్చించి అనేక నూతన అంశాల్ని ప్రామాణిక గ్రంథాలాధారంగా వెలికి తీసి హిందూయిజం, ఇస్లాం మతాల మధ్య నెలకొన్న సుహృద్భావం, అన్యోన్యతల్ని తన పరిశోధనా గ్రంథంలో వివరించినాడు. దేవాలయం, మఠం హిందూ మతంలో ప్రముఖ పాత్ర వహించినట్లే, మసీదు, కాన్‌ఖా, దర్గా, ఆషుర్‌ఖానాలు ఇస్లాం మతంలో కీలక పాత్ర వహించిన తీరుతెన్నుల్ని, దైనందిన సామాజిక రంగంలో వాటి పాత్రను నిష్పక్షపాతంగా వివరించినాడు. మధ్యయుగ ఆంధ్రదేశంలో (రాయలసీమ, కోస్తాంధ్ర, తెలంగాణ) ప్రాంతాల్లో మిశ్రమ సంస్కృతి విలసిల్లి, పరిణామం చెందిన విధానాన్ని విశ్లేషించి, లౌకికవాద సైద్ధాంతిక, భావజాల వ్యాప్తిని గురించి విపులంగా ఈ గ్రంథంలో చర్చించడం జరిగింది. ఉదాహరణకు, విజయనగరరాజులు మత పరంగా హిందువు లైనప్పటికి, సూఫీ మతాన్ని ఆదరించి ముస్లిం మత సంస్థలకు దానాలిచ్చినారు. అదే విధంగా బహుమని, కుతుబ్‌షాహి రాజులు ఇస్లాంను ఆచరించినప్పటికి హిందు మతసంస్థలకు అగ్రహారాలకు దానాల్చిన తీరును వివరించి రాజకీయ, పౌర సమాజాల్లో మత సామరస్యం విలసిల్లిన క్రమాన్ని హేతుబద్ధంగా వివరించడం జరిగింది.

మధ్యయుగాల్లో ఆంధ్ర దేశ సమాజంలోని రెండు ప్రధాన మతాలైన హిందూయిజం, ఇస్లాం, సూఫీయిజంలు, వారి మత సంస్థల నిర్మాణం, సమాజంలో వాటి పాత్ర, రాజాదరణ, ప్రభుత్వానికి మతసంస్థలకు మధ్య నెలకొన్న సంబంధాలు, ఏ విధమైన మార్పులకు గురైనాయి అనే అంశాల్ని బేరీజు వేసి లౌకిక చరిత్ర రచనకు ఆచార్య సోమారెడ్డి పునాదులు వేసినాడు. మిశ్రమ సంస్కృతి కొనసాగడానికి దోహదపడిన మత, ధార్మిక, ఆధ్యాత్మిక అంశాలైన ఉత్సవాలు, తిరునాళ్ళు, ఉర్సులు, మొహర్రంల పాత్రను, మతసామరస్యం సహజీవనం కొనసాగిన తీరును సోదాహరణంగా వివరించడం జరిగింది. తన మూడు దశాబ్దాల ఎకడమిక్ జీవితంలో ఆయన డజన్‌కుపైగా పుస్తకాల్ని, 50కి పైగా పరిశోధనా వ్యాసాల్ని రచించినాడు. వాటిలో ముఖ్యంగా మధ్యయుగ ఆంధ్రదేశంలో మత పరిస్థితులు, సంస్థలు, Hindu - Muslim Religions Institutions, Agrarian conditions in pre-colomial Andhra Desa, Socio-Economic Conditions in Medieval Andhra Desa, Industries in Pre-colonial Andhra Desa పేర్కొనదగినవి.

1970-80 దశకాల్లో జాతీయ వాద దృక్పథంతో చరిత్ర రచనలు ప్రధానంగా రాజులు యుద్ధాలు, రాజకీయ పాలనా అంశాల్ని మాత్రమే పేర్కొన్నాయి. దానికి భిన్నంగా ఆచార్య సోమారెడ్డి మధ్యయుగ ఆంధ్రదేశంలోని సామాజిక సాంస్కృతిక, ఆర్థిక చరిత్రను రచించినాడు. ప్రధానంగా ఆంధ్రదేశంలో వ్యవసాయ సంబంధాలు, భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరి విధానం, వర్తకవాణిజ్యాల వ్యాప్తి,

చేతివృత్తులు, పరిశ్రమల స్థాపన, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుటీర పరిశ్రమలు, మధ్య యుగాల నాటి వలసలు వాటి ప్రభావం ఉత్పత్తి, కులాలు, వాటి ప్రాధాన్యత, సూఫీయిజం, భక్తి ఉద్యమాల ప్రభావం, మిశ్రమ సంస్కృతి ఆవిర్భావం, పరిణామం లాంటి అంశాలపై విశేషంగా పరిశోధనలు జరిపిన ఘనత సోమారెడ్డికి దక్కుతుంది. ఉస్మానియా చరిత్ర శాఖ అధిపతిగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, న్యూఢిల్లీ నుంచి పలు పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టి 1994-2003 వరకు జాతీయ అంతర్జాతీయ సదస్సులను నిర్వహించినాడు. ఆయన హయాంలో నిర్వహించిన సెమినార్స్ ప్రొసీడింగ్స్‌ను ప్రచురించి జాతీయ అంతర్జాతీయ గుర్తింపును పొందినాడు. చరిత్రశాఖలో బోధనతో పాటు ఆయన పరిశోధనా గైడ్‌గా వ్యవహరించి అనేక యం.ఫిల్, పియచ్‌డి సిద్ధాంత వ్యాసాల్ని తయారు చేయించినాడు. ప్రసిద్ధ పరిశోధకుడిగా సోమారెడ్డి ప్రాంతీయ నాగరికత, సంస్కృతి పరిణామ క్రమాన్ని పరిశీలించడంలో భిన్న మతాలు, సంస్కృతులు, సామాజిక ఆర్థిక వ్యవస్థలు, విభిన్న జాతులు, ఆచార సంప్రదాయాలు ఏ విధంగా తోడ్పడినాయి అనే అంశాల్ని హేతుబద్ధంగా వివరించినాడు. మధ్యయుగ ఆంధ్రదేశంలో మిశ్రమ, లౌకిక సంస్కృతి విలసిల్లిన తరుణంలో ఆర్థిక సంబంధాల ప్రాముఖ్యత, సామాజిక చలనం, సామాజిక మార్పులకు దోహదపడిన శక్తులు వాటి ప్రాముఖ్యతను, ప్రభావాన్ని శాస్త్రీయంగా, ఆధారసహితంగా విశ్లేషించడం ఆయన ప్రత్యేకత అని చెప్పవచ్చును. ప్రస్తుత పరిస్థితుల్లో హిందూత్వవాదులు భారత దేశ చరిత్ర, సంస్కృతుల్ని ప్రధానంగా మధ్యయుగాలకు సంబంధించిన అనేక అంశాల్ని వక్రీకరించడం జరుగుతుంది. ఈ తరుణంలో ఆచార్య సోమారెడ్డి రచనలు ఆంధ్రదేశ సమాజంలో మతసంస్కృతి, ఆచార వ్యవహారాల పాత్రలపై లోతైన పరిశోధన జరిపి హేతుబద్ధంగా చరిత్ర రచన చేసి యువ చరిత్రకారులకు ఆదర్శంగా నిలిచినాయని చెప్పవచ్చును.

ఆచార్య సోమారెడ్డి ప్రతిభను గుర్తించి భారత ప్రభుత్వం ఆయన్ని ఇండియన్ హిస్టారికల్ రికార్డ్సు కమిషన్ సలహా సంఘం సభ్యునిగా నియమించింది. అదే విధంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్‌వార్డెన్ లాంటి అనేక ఉన్నత పదవుల్ని చేపట్టి పలువురి ప్రశంశల్ని పొందినాడు. ఇండియన్ హిస్టరీ, సౌత్ ఇండియన్ హిస్టరీలలో క్రియాశీలక పాత్ర నిర్వహించి పలు పరిశోధనా పత్రాల్ని సమర్పించాడు. అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ రంగాల్లో తనవంతు పాత్రను నిర్వహించి ఉస్మానియా యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతులు తెచ్చినాడు.

-అడపా సత్యనారాయణ
e : adapa_satyam@yahoo.co.in

# ఒంటరితనం

నాలుగోడల మధ్య
ఇంకొంతకాలమిలా
నన్ను ఒంటరిగా
నిర్బంధంలో ఉండనివ్వండి!

ఒంటరితనంమిపుడు
నాకు కొత్తేమి కాదు!

ఎవరి కంట పడకుండా
అమ్మ నన్ను తొమ్మిది
నెలలు తన గర్భకుహురంలో దాచుంచిన
అనుభవాన్ని నేనింకా మర్చిపోలేదు!

అందుకే
నేను ఇప్పుడు

శబ్ద కాలుష్యంతో
చిల్లులు పడిన నా
చెవులను

నిశ్శబ్దం అనే లేపనాన్ని
పూసుకొని తనివితీర సేదతీరుతున్నా

వాయు కాలుష్యంతో పొగగొట్టాలుగా
మారిన నా శ్వాసవయవాలను

ప్రాణయమం అనే సాధనంతో
ఆయుషును పెంచుకుంటున్నా

ఇంతకాలం స్వార్థంతో నిండిపోయిన
చెత్తకుప్ప లాంటి మెదడులోని ఆలోచనలను

ప్రార్థన అనే
నిత్యకృత్యంతో
ప్రక్షాళన చేస్తున్నా

మొత్తంగా చెప్పాలంటే
కరోన కష్టకాలంలో
ఎలా బతకాలో?

ఎలా బతకూడదో
నాకు ఈ ఒంటరితనమే
కదా గురువై నేర్పింది

అందుకే నన్ను
తిరిగి మనిషియ్యే
వరకు ఒంటరిగా
ఇలా ఉండనివ్వండి!!

-జవేరియా
m : 9849931255
e : javeriya02@gmail.com

## భారతీయుల జన్యు అమరిక చిక్కుముడిని విప్పే...

# ఇండీజెన్ ప్రాజెక్ట్...!!!

భూమి మీద అడుగిడిన తొలి మానవుడు తన ప్రారంభ దశలో ఆవాసం, ఆహారం లాంటి ప్రాథమిక అవసరాలు తీర్చుకునేందుకే ఆపసోపాలు పడ్డాడు, ఎన్నెన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. "పడి లేచిన కెరటంలా" తన జీవనగమనంలో ఎదురు దెబ్బలు తిన్న ప్రతిసారి రెట్టించిన ఉత్సాహంతో తన చుట్టూ ముసురుకున్న సమస్యలను ప్రతిఘటించాడు. అంతిమంగా మనుగడ కోసం పోరాటం తప్పదన్న నిర్ణయానికొచ్చాడు. ఈ క్రమంలో తనకు సమస్యలెదురైనప్పుడల్లా అలుపెరగని పోరాటంతో, తన సునిశిత మేధాశక్తితో వాటికి పరిష్కారాలు కనుగొన్నాడు. తన జీవితాన్ని సుఖమయం చేసుకున్నాడు. అయితే "వెలుగు తరువాత చీకటి దరిచేరినట్టు" సాఫీగా సాగిపోతున్న నావలాంటి మానవ జీవితంలోకి రోగాలు, వ్యాధుల లాంటి పెనుతుఫానులు ప్రవేశించి అల్లకల్లోలం సృష్టించాయి. ఇలాంటి ఊహించని పరిణామంతో ఉలిక్కిపడిన నాటి ఆదిమ మానవుడు తిరిగి ఆలోచనలో పడ్డాడు. తదనంతర కాలంలో ప్రతి వ్యాధికి తనచుట్టూ ఉన్న ప్రకృతిలోని వనరుల సహాయంతో విరుగుడు మందు కనిపెట్టాడు. "అయినా మనిషి మారలేదు, అతని మమత తీరలేదు" అన్న తెలుగు సినిమా పాటలో లాగా నాటి ఆదిమ మానవుని నుండి నేటి ఆధునిక మానవుని దాకా మానవుడిని పట్టిపీడిస్తున్న వ్యాధులకు మూలకారణం తెలుసుకొనేందుకు అవిశ్రాంతంగా పరిశోధనలు చేస్తూనే వచ్చారు. చివరకు మనిషి యొక్క ప్రవర్తనారీతుల్ని, అతని ప్రతి కదలికను నిర్దేశించే మూలకణం "జన్యువు" అని నిర్ధారణకొచ్చారు. ఆ జన్యుక్రమాన్ని విశ్లేషించినట్లయితే మానవుడికి సంక్రమించే రోగాల గుట్టుమట్లను ముందుగానే పసిగట్టవచ్చు అని తెలుసుకొన్నారు. తాజాగా మన భారత శాస్త్రవేత్తలు కూడా భారతీయుల యొక్క జన్యుక్రమాన్ని విశ్లేషించడానికి "ఇండీజెన్" పేరుతో ఒక ప్రాజెక్ట్‌ను చేపట్టడంతో ఈ జన్యువుల ఆమరిక వాటి, పని తీరు చర్చనీయాంశమైంది. అయితే ప్రపంచములోని విభిన్న దేశాల శాస్త్రవేత్తలందరూ కలిసి 1990లో మొదటి హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్‌ని ప్రారంభించి, 2003లో దానిని పూర్తి చేశారు.




### ఇండీజెన్ ప్రాజెక్ట్ అంటే –

భారతీయుల జన్యుక్రమాన్ని విశ్లేషించేందుకు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), ఇన్స్టిట్యూట్ ఆఫ్ జీనోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజి (ఐజీఐబి), హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీలు (సీసీఎంబీ) లు సంయుక్తంగా చేపట్టిన ప్రాజెక్ట్‌ను "ఇండీజెన్" అంటారు. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల జన్యుక్రమాన్ని విశ్లేషిం చేందుకు ఇండీజెన్ ప్రాజెక్ట్‌లో భాగంగా "సంపూర్ణ జన్యుక్రమ విశ్లేషణ" (whole genome sequence) పేరుతో గత ఏప్రిల్‌లో 1008 మంది నుండి (సీఎస్ఐఆర్) నమూనాలు సేకరించింది. ఆరు నెలలపాటు ఆ నమూనాలపై అధ్యయనం చేసి ఇటీవలే ఫలితాలు కూడా వెల్లడించారు.

### ఇండీజెన్ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యం –

భారతీయుల యొక్క జన్యుక్రమాన్ని విశ్లేషించడం ద్వారా జన్యువులలో మార్పుల వల్ల మానవులకు సంక్రమించే వ్యాధుల అధ్యయన శాస్త్రాన్ని (Genetic Epidemiology) అభివృద్ధి చేయడం whole genome sequence (దీనినే ఇండీజెన్ ప్రాజెక్ట్ అంటారు) ముఖ్య ఉద్దేశ్యమని శాస్త్రవేత్తలు చెప్పారు. ప్రజల యొక్క జన్యు సమాచారాన్ని ఉపయోగించుకొని ప్రజారోగ్యానికి సంబంధించి, సాంకేతిక రంగ సహకారంతో ముందస్తు పరిష్కారాలను కనుక్కోవచ్చు. ఎంతో సంక్లిష్టమైన జన్యు నిర్మాణాన్ని (Genetic Blue Print) అనువదించి విశ్లేషించడం భారత జీవ వైద్య విజ్ఞాన శాస్త్ర రంగం (Bio medical Science) లోనే "సంపూర్ణ జన్యు క్రమ విశ్లేషణ"

(Whole Genome Sequence) ప్రాజెక్ట్ ఒక మైలురాయిగా నిలుస్తుందని వారు అభివర్ణించారు.

ఈ నేపథ్యంలో అసలు జన్యువు జన్యువుల సముదాయం అంటే ఏమిటి, జన్యు క్రమ విశ్లేషణ అన్న విషయాలను కూడా అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది.

**జీనోమ్ (జన్యుసముదాయం) అంటే –**

మానవుని కణంలోపల డిఎన్ఏతో నిర్మితమైన తంతువులను జన్యువులు అంటారు. కొన్ని జన్యువుల యొక్క సముదాయాన్ని జీనోమ్ అందురు. మానవుని కణం యొక్క కేంద్రకంలో క్రోమోజోములు అనబడే నిర్మాణాలలో డిఎన్ఏ కొద్ది భాగం ద్వికుండలి ఆకారంలో చుట్టుకొని ఉంటుంది. మిగిలినది కణం యొక్క కేంద్రకం వెలుపల కణద్రవ్య పదార్థంలోని మైటోకాండ్రియాలో ఉంటుంది. దీనినే కణశక్త్యాగారం (Power house of the cell)అంటారు. మానవుని డిఎన్ఏలో సమాచారమంతా సంకేత రూపంలో అడినైన్, గ్వానిన్, సైటోసిన్, థైమీన్ అనే నాలుగు రకాలైన నత్రజని క్షార అణువుల సమిళితమైన న్యూక్లియోటైడ్లతో నిర్మితమై ఉంటుంది. డిఎన్ఏలో ఉన్న ఈ నాలుగు రకాలైన క్షారతంతువులనే సాధారణంగా జన్యువులు అంటారు. ఈ నత్రజని క్షారాలు డిఎన్ఏలో ఏవిధంగా అమరి ఉన్నాయో అన్న దానిపై ఆధారపడి మానవశరీరంలో అమైనో ఆమ్లాలు, ప్రోటీన్ల ఉత్పత్తి తద్వారా జీవికి కావలసిన అన్ని లక్షణాలు ఆధారపడి ఉంటాయి.



**జీనోమ్ సీక్వెన్సింగ్ అనగా –**

డీఎన్ఏలో ఉన్న అడినైన్ (A), గ్వానిన్ (+) సైటోసిన్ (C), థైమిన్ (T) అనే న్యూక్లియోటైడ్లు స్పష్టంగా ఒక వరుస క్రమంలో అమరి ఉంటాయి. ఇవి నత్రజని క్షారాలుతో పాటు చక్కెర, ఫాస్ఫేట్ మిశ్రమాలతో గోడల్లాగా ఏర్పడి ఉంటాయి. న్యూక్లియోటైడ్లోని ఎడినిన్–థైమిన్ల రాశి (A=T), సైటోసిన్, గ్వానిన్ల రాశి (C=G) సమంగా ఉంటాయి. ఈ జంటలను హైడ్రోజన్ అణువు కలుపుతుంది.

ప్రతి న్యూక్లియోటైడ్లోనూ చెక్కెర అణువు, ఫాస్ఫరస్ అణువు కలిసి ఉంటాయి. ATC+ ఈ నాలుగూ వివిధ రకాల జంటలుగా రూపొందుతూ ఉంటాయి. ఇందులో ప్రతి మూడు జతలు (TRIPLETS) ఒక్కోరకమైన అమైనో ఆసిడ్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ జతల అమరిక కూడా ఒక్కో జీవిలో ఒక్కోరకంగా ఉంటుంది. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే మానవ శరీర నిర్మాణం కేవలం ఈ నాలుగు అక్షరాలపైనే ఆధారపడి ఉంటుంది. జన్యువులపై ఈ నాలుగు పదార్థాల అమరికను తెలిపే దానిని జన్యు లిపి అంటారు. దానినే జన్యు సంకేతం (Genetic code) అని కూడా అంటారు. సరిగ్గా ఇక్కడే జీన్ సీక్వెన్సింగ్ (జన్యువుల క్రమ అమరిక) ప్రారంభమవుతుంది.

జీన్ సీక్వెన్సింగ్లో భాగంగా వివిధ రకాల వ్యక్తుల జన్యు నమూనాలు సేకరించి వారి యొక్క జన్యుసంకేతాలను శాస్త్రవేత్తలు కూలంకుషంగా అధ్యయనంచేస్తారు. వారి జన్యు లిపి యొక్క అమరిక క్రమాన్ని తెలుసుకొంటారు. ఒకవేళ ఆయా వ్యక్తుల్లో ఆశించిన లక్షణాన్ని అభివృద్ధి చేయడానికి లేదా తొలగించడానికి జెనెటిక్ కోడ్ లో (ATCGల అమరిక) మార్పులు చేయడం లేదా పూర్తిగా తొలగించడం కూడా చేస్తారు. దీనినే జీన్ సీక్వెన్సింగ్ (జన్యువుల క్రమ అమరిక) అందురు. భిన్న జాతుల, మతాల, కులాల సమాహారమైన భారతదేశంలోని వివిధ రకాల వ్యక్తుల నుండి సీఎస్ఐఆర్ శాస్త్రవేత్తలు జన్యు నమూనాలు సేకరించి వారి యొక్క జెనెటిక్ కోడ్ను సమగ్రంగా అధ్యయనం చేసి. ఇటీవలే ఫలితాలు కూడా ప్రకటించారు.

**జీనోమ్ సీక్వెన్సింగ్ ఆవశ్యకత –**

మారుతున్న కాలానికనుగుణంగా మానవాళికి సంక్రమించే వ్యాధులు కూడా తమ స్వరూప స్వభావాలు మార్చుకుంటున్నాయి. మందులకు లొంగని, అంతు చిక్కని మొండి వ్యాధులు తరుచుగా నేటి తరానికి సంక్రమిస్తూ... వారి ఒళ్ళు గుల్ల చేస్తున్న నేపథ్యంలో పాశ్చాత్య దేశాలు జీన్ సీక్వెన్సింగ్ ద్వారా ఆ దేశాల పౌరుల యొక్క జన్యువుల పటాలు (జీన్ మ్యాపింగ్) తయారు చేయడంలో ముందంజలో ఉన్నాయి. కాబట్టి మనదేశం కూడా భారతీయుల యొక్క జీన్ సీక్వెన్సింగ్ పూర్తి చేసి ఆ సమాచారాన్ని భద్రపరచుకోవాల్సిన అవసరం ఉంది. తద్వారా మొండి వ్యాధులకు ఔషధాలను కూడా తయారు చేయవచ్చు. లేదా వాటిని ముందుగా నిరోధించవచ్చు. నేర నిర్ధారణ చేయడానికి డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, ఫోరెన్సిక్ సైన్స్లోనూ జీన్ సీక్వెన్సింగ్ డేటా ఉపయోగపడుతుంది. మనుషులే కాకుండా పంటలకు వచ్చే తెగుళ్ళ కారణమైన బ్యాక్టీరియా, వైరస్ల యొక్క జీన్ సీక్వెన్సింగ్ను పూర్తి చేసినట్లయితే, ఆయా సూక్ష్మ జీవుల యొక్క జన్యువులలో తగు మార్పులు చేసి పంట నష్టం యొక్క తీవ్రతను తగ్గించవచ్చు. ఈ విధంగా అనేక రంగాలలో జీన్ సీక్వెన్సింగ్ యొక్క ఆవశ్యకత ఉంది.

**అనువర్తనాలు –**

జీన్ స్వీక్వెన్సింగ్ వల్ల విభిన్న రంగాలలో బహుళ ప్రయోజనాలు ఒనగూరే అవకాశం ఉంది.

వ్యవసాయరంగం – జీనోమ్ స్వీక్వెన్సింగ్ వల్ల వ్యవసాయ రంగంలో ఎన్నో ఉపయోగాలున్నాయి. పంటల నాశించి, విపరీత నష్టం కల్గించే వివిధ చీడ పీడలను కలిగించే సూక్ష్మ జీవుల యొక్క జన్యు క్రమాన్ని ఆవిష్కరించినట్లయితే వాటి ద్వారా కలిగే తెగుళ్ళను పూర్తిగా నిరోధించి పంట నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు. పంటలకు మేలు కల్గించే సూక్ష్మ జీవులను గుర్తించి వాటి ద్వారా పంట దిగుబడులను కూడా పెంచవచ్చు.

వైద్య రంగం – జీనోమ్ స్వీక్వెన్సింగ్ ద్వారా వంశపారంపర్యంగా మానవాళికి సంక్రమించే విభిన్న రోగ కారక జన్యువులను గుర్తించి వాటిని తొలగించడం ద్వారా, ఆ స్థానంలో ఆరోగ్య కారక జన్యువులను ప్రవేశపెట్టవచ్చు. ప్రమాదకర, దీర్ఘ కాలిక వ్యాధులను కల్గించే రోగకారక జన్యువులను కూడా గుర్తించి, జీన్ థెరపీ ద్వారా ఆయా జన్యువులను తొలగించి వ్యాధుల సంక్రమణాన్ని విజయవంతంగా నిరోధించవచ్చు.

ఫోరెన్సిక్ రంగం – నేరం జరిగిన ప్రదేశంలో లభించే వేలిముద్రలు, వెంట్రుకలు, గోర్లు, చర్మము, రక్తపు చుక్కల వంటి ఆధారాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నేరస్తుల యొక్క డీఎన్ఏతో సరిపోల్చడం ద్వారా సులువుగా నేరస్తులను గుర్తించవచ్చు.

చివరిగా – భూమిపై జీవన పోరాటాన్ని ప్రారంభించిన మానవుడు తనకు ఎక్కడో సుదూరాన ఉన్న అంతరిక్షానికైతే నిచ్చెన వేయగలిగాడు కానీ, ఏదో ఒక రోజు మానవుడి అంతానికి కారణమౌతున్న "మరణాన్ని" మాత్రం జయించలేకపోయాడు. నేటికీ ప్రపంచంలోని అనేక దేశాలు మానవుడి మరణానికి కారణభూత మౌతున్న విభిన్న అంశాలపై విభిన్న కోణాల్లో పరిశోధనలు జరిపేందుకు లక్షల డాలర్లను తృణ ప్రాయంగా ఖర్చుచేస్తున్నాయి. హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్, ఇండీజెన్ ప్రాజెక్ట్‌లు ఈ కోవలోనివేనని చెప్పవచ్చు. ఇండీజెన్ ప్రాజెక్ట్ ద్వారా భారతీయుల జన్యువులను విశ్లేషించి అందులోని సమాచారాన్ని వెలికితీయడం వరకూ బాగానే ఉంటుంది. కానీ దేశంలోని విభిన్న వ్యక్తులకు సంబంధించిన జన్యు సమాచారం దుర్వినియోగం కాకుండా, దానిని సురక్షితంగా భద్రపరచగలిగితే ఇండీజెన్ ప్రాజెక్ట్ మన దేశ ప్రగతికి ఇరుసుగా మారుతుందనడంలో ఎలాంటి సందేహంలేదు. పాలక పక్షాలు ఆదిశగా ఎలాంటి విధానాలు రూపకల్పన చేస్తాయి, అవి ఎంత మేరకు సఫలీకృత మౌతాయన్నది వేచి చూడాలి.

–పుట్టా పెద్ద ఓబులేసు,
m : 9550290047
e : obu.jmd@gmail.com

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్ తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది.

స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందా దారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
సంపాదకులు

**చందా వివరాలు:**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 300 |
| 2 సం॥లకు | : | రూ. 600 |

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com
ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |



# తెగుళ్లు నివారిస్తేనే లాభాల పసుపు

ఈ తెగులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు, గాలిలో ఎక్కువ తేమ, తక్కువ ఉష్ణోగ్రత ఉండటం వలన వ్యాపిస్తుంది. పెద్దపెద్ద అండాకారపు మచ్చలు ఆకులపై అక్కడక్కడ కనబడతాయి. మచ్చలు ముధురు గోధుమ రంగులో ఉండి మచ్చ చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుంది. ఆకు కాడపై మచ్చలు ఏర్పడి కిందకు వాలి పోతుంది. దీని నివారణకు దృఢమైన విత్తనాన్ని ఎన్నుకోవాలి. మచ్చలు ఉన్న, ఎండిన ఆకులను తొలగించి కాల్చివేయాలి. లీటర్ నీటిలో గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజబ్‌తో పాటు అర మిల్లీ లీటర్ సబ్బునీరు లేదా థయోఫానేట్ మిథైల్ గ్రాము మార్చిమార్చి పిచికారీ చేయాలి.

**ఆకుమచ్చ తెగులు**

ఈ ఆకుమచ్చ తెగులు కూడా ఈదురు గాలులతో కూడిన వర్షాలు, గాలిలో ఎక్కువ తేమ, తక్కువ ఉషో?గ్రతల వలన వస్తుంది. మొదట ఆకులపై చిన్న, చిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడుతాయి. తరువాత చిన్నచిన్న గోధమ రంగు మచ్చలుగా మారుతాయి. తెగులు ఎక్కువైతే ఆకుమాడి పోతుంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ తెగులు ఎక్కువగా కనబడుతుంది. దీని నివారణకు ఈ తెగులు సోకిన ఆకులను కత్తిరించి నాశనం చేయాలి. తాటాకు మచ్చ తెగులుకు సూచించిన మందులతో పాటు 1 మి.లీ ప్రోపికోనజోల్ లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**దుంప, వేరుకుళ్లు తెగులు**

విత్తన శుద్ధిలేని కొమ్ములు నాటడం, మురుగు నీటి పారుదల సరిగా లేకపోవటం, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించక పోవటం, ఎడతెరిపి లేని వర్షాలు కురిసి మొక్కల చుట్టూ నీరు ఉండటంతో ఈ తెగులు సోకుతుంది.

**లక్షణాలు**

ఈ తెగులు సోకి తే ఆకులు మందంగా వాడిపోయి గోధుమ రంగుకు మారి చివరకు ఎండిపోతాయి. తరువాత మొక్క పై భాగాన ఉన్న లేత ఆకులకు ఈ వ్యాధి వ్యాపిస్తుంది.

తల్లి కొమ్ములు, పిల్ల దుంపలు కుళ్లి మెత్తబడిపోతాయి. చెడు వాసన వస్తుంది. నాణ్యత కూడా బాగా తగ్గుతుంది.

**దీని నివారణకు...**

లీటర్ నీటికి మూడు గ్రాముల రిడోమిల్ ఎం.జెడ్ లేదా మాంకోజెబ్ లేదా 2 మి.లీ మోనోక్రొటోఫాస్ లీటర్ నీటి చొప్పున కలిపిన ద్రావణంలో కొమ్ములను 30-40 నిమిషాలు నానబె ట్టాలి. తరువాత నీరు మార్చి లీటర్ నీటికి 5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి కలిపి ఆ ద్రావణంలో 30 నిమిషాలు ఉంచి నీడలో ఆరబెట్టి నాటు కోవాలి.వేసిన పొలంలోనే పసుపు వేయకుండా వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న తదితర పంటలతో పంట మార్పిడి చేయాలి.

దుంపలు విత్తిన తరువాత జీలుగు, జనుము, వెంపలి, వేప, కానుగ తదితర పచ్చి ఆకులు లేదా ఎండు వరిగడ్డి, చెరకు ఆకులను పొలంపై దుంపలు మొలకలు వచ్చేంత వరకు కప్పడం వలన తెగులు ఉధృతిని కొంతకొంత వరకు తగ్గించవచ్చును.

-సి.హెచ్.పల్లవి, యు.కిషోర్ కుమార్, డి.అనిల్

# ప్రకృతే నియంత్రిస్తుంది! ప్రకృతే శాసిస్తుంది!!-1

***కరోనా నేపథ్యంలో శాస్త్రీయ పరిజ్ఞానం గూర్చి, ప్రకృతి గూర్చి, జీవం పుట్టుక గూర్చి, జీవ పరిణామం గూర్చి విధిగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత వుంది. ముఖ్యంగా రేపటి తరాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయులు, రేపటి పథ నిర్దేశకులైన విద్యార్థులు ఈ విషయాల్ని అవగతం చేసుకుంటే, తమ పరిమితులు, బాధ్యతలు గుర్తెరిగి ప్రకృతి అనుకూల జీవనం సాగిస్తే పది కాలాల పాటు హాయిగా మనుగడ సాగిస్తాం! కాదంటే, ప్రకృతి ప్రకోపానికి, మహమ్మారీలకు బలికాక తప్పదు!!***

'చివరి కొమ్మను నరికిన తర్వాత గాని, ఆఖరి చేప పిల్లను పట్టి తిన్న తర్వాత గాని, తుది నీటిబొట్టుతో గొంతు తడుపుకున్న తర్వాతగాని, ప్రపంచంలో వున్న డబ్బునంతా పోగుపోసి ఖర్చు చేసినా, ఓ చిన్న గులకరాయిని మానవుడు సృష్టించలేడు...' అంటూ పర్యావరణవేత్తలు నినదిస్తూ వుంటారు. ఈ నినాదం వాస్తవ రూపం దాల్చడానికి మరెంతో దూరం లేదని కరోనా మహమ్మారి హెచ్చరిస్తూ వున్నది. గత ఆరు నెలలుగా ప్రపంచ వ్యాపితంగా కరోనా నేపథ్యంలో జరుగుతున్న, జరిగిన పరిణామాల్ని పరిశీలిస్తే, మానవ ఇతిహాసంలో ఇంతటి విపత్తును (స్పానిష్ ఫ్లూ తప్ప) ఎదుర్కొన్న దాఖలాలు లేవు. రోగాలు, నొప్పులు, ప్రకృతి విపత్తులు మానవునికి కొత్తేమి కాకున్నా, యావత్ ప్రపంచాన్ని వణికించిన ఘటనలు లేవు. ఇలాంటి విపత్తులు రాలేదని, జరగలేదని కాదు.. పోతే, ఓ ప్రాంతానికి, దేశానికి, ఓ భూభాగానికి పరి మితంగా అనేక మహమ్మారీలు మానవునికి, ఇతర జంతు జీవానికి సుపరిచతమే ననేది గత చరిత్ర తెలుపుతున్నది. అయితే శాస్త్ర, సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా ప్రకృతి ముందు మానవ డెల్లప్పుడు ఓ పిపీలికమే ననేది ఓ నగ్న సత్యం!

ఈ సందర్భంగా అనేక వాదనలు, సిద్ధాంతాలు ముందుకు రావడమే కాక, బ్రహ్మంగారి లాంటి వారు ఈ మహమ్మారి గూర్చి ముందే ఊహించి చెప్పారని నమ్మేవారు, ప్రచారం చేసేవారు వున్నారు. వీటిని నమ్మేవారి సంఖ్య కూడా గణనీయంగానే వుంటుంది. వీటిని నమ్మడంలో ఆశ్చర్యం లేదు. కాని భౌతిక, రసాయన శాస్త్రాల్ని ఆపోసన పట్టి, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పట్టాలు పొందినవారు, ఉపాధ్యాయులుగా చలామణి అయ్యే బుద్ధి జీవులు ఈ అశాస్త్రీయ వాదనలతో చేతులు కలపడం ఓ చేదు నిజం. వీరి దృష్టిలో సైన్సుకు, జీవితానికి సంబంధం వుండదు. చదివిన చదువు పొట్టపోసు కోవడానికైతే నమ్మకాలు నిత్యజీవిత సంబంధాలని భావిస్తారు! ఇలాంటి వింత, విపత్కర పరిస్థితుల్లో కరోనా పుట్టుక గూర్చి, కరోనా అక్కా చెల్లెండ్లైన మరికొన్ని వైరసుల గూర్చి, ప్రకృతిలో వీటి స్థానం గూర్చి, సంబంధం గూర్చి విధిగా తెలుసుకోవాల్సిందే! అందులో కొన్ని:

| వైరస్ | గుర్తించిన సం॥ | ప్రాంతం | వ్యాధి | కారకాలు |
|---|---|---|---|---|
| స్పానిష్ ఫ్లూ (Spanish Flu) | 1918 | స్పెయిన్ | తీవ్రమైన జలుబు (Influenza) | గాలి/వస్తువులు |
| జైకా (ZIKA) | 1952 | ఉగండా (జైకా అడవి) | పక్షవాతం | జంతువులు/కీటకాలు |
| ఎబోలా (EBOLA) | 1976 | కాంగో (ఎబోలానది) | జ్వరం/నొప్పులు | జంతువులు/కీటకాలు |
| హెన్డ్రా (HENDRA) | 1994 | ఆస్ట్రేలియా | శ్వాస/నాడీ | గబ్బిలం |
| నిపా (NIPHA) | 1999 | మలేసియా | శ్వాస | పందులు |
| సార్స్ (SARS) | 2002 | దక్షిణ చైనా | శ్వాస | గబ్బిలం/జంతువులు |
| మెర్స్ (MERS) | 2012 | సౌది అరేబియా | శ్వాస | గబ్బిలం/ఒంటె |

మన దేశానికి సంబంధించి జపానిస్ ఎన్‌సైఫలిటిస్ (Japanese Encephalitis - JEV) 1950లో, మిగతా ఎన్‌సైఫలిటీస్ (మెదడు వాపు వ్యాధులు) 1955లో బయట పడగా, 2000 సం॥ తర్వాత హెర్ప్స్ వైరస్ (Herpes Simplex) ఎంటరో వైరస్ (Entero), చంద్రాపుర్ వైరస్, వెస్ట్‌నైల్ వైరస్ (West Nile), క్యాసనూర్ అటవి వైరస్ (Kyasanuv forest)లతో పాటు స్క్రబ్ టైపస్ బాక్టీరియా (Scrub Typhus) చెప్పుకో తగ్గవి. ఇందులో కొన్నింటికి వాక్సిన్ రాగా, మరికొన్ని మందుల ద్వారా నయం చేయడం జరుగుతున్నది. అయినా, ఎన్‌సైఫలిటిస్ (AES) వేలాది మంది పసిపిల్లల్ని ప్రతీ సంవత్సరం చంపుక తింటూనే వున్నాయి.

ఈ ప్రాణాంతక వైరసులు, బాక్టీరియాలు కొత్తవేమి కాకున్నా, గతంలో కూడా ఇవి మానవ హెూమాన్ని సాగించాయి. ఈ విషయంగా మన తంద్రులు, తాతమ్మలు ప్లేగు, కలరా తదితర వ్యాధుల గూర్చి ప్రస్తావించడం తెలిసిందే! ఇక మశూచి, ధనుర్వాతం, క్షయ, పోలియో లాంటి వాటి గూర్చి అనునిత్యం అప్రమత్తంగా వుంటూనే టీకాలతో, చుక్కల మందులతో పిల్లల్ని రక్షించుకుంటున్నాం. ఈ మహమ్మారీలన్నింటికి కంటికి కనపబడని వైరసులు, బాక్టీరియాలు, కొన్ని జాతుల శిలీంద్రాలు (Fungi) కారణం. ఇవి జంతువుల ద్వారా, కీటకాల ద్వారా, పక్షుల ద్వారా, గాలి, నీటి, స్పర్శల ద్వారా, ఆహారం ద్వారా, వస్తువుల ద్వారా మనుషులకు వ్యాప్తి చెందుతాయి. విధిగా ఓ వాహకము వీటికి అవసరమన్న మాట! ఈ విషయాన్ని కరోనా మనకు బాగా అవగాహన కల్గించింది. కరోనా పుట్టుకకు ఇదమిత్తంగా గబ్బిలమనో, పునుగు పిల్లి అనో కచ్చితంగా చెప్పకున్నా, ఏదో ఒకటి మూలకారణమై వుంటుంది. అయితే వీటిని తుదముట్టిస్తే సరిపోతుందిగా అనేవారు వున్నారు. కాని, ఇది అసహజమైన ప్రక్రియనేకాక ప్రకృతి విరుద్ధమైన చర్య కూడా! గతంలో నిపా (NIPHA) వైరస్ సోకినప్పుడు మలేసియాలో లక్షలాది పందుల్ని వధించడం జరిగింది. దీంతో అక్కడ ఆహారపు కొరత ఏర్పడడమే కాక, పందుల జీవనాధారంగా బతికే వేలాది కుటుంబాలు వీధిన పడ్డాయి. ఈ అనుభవం 2000 సం॥లో మనం చూసాం.

### ప్రకృతి ఏ ఒక్క మానవుడి సొత్తు కాదు:

భూమిపై వుండే అన్ని జీవరాసులకు జీవించి వుండే హక్కు వుంటుందనే ప్రకృతి సూత్రం ప్రకారమే తగు జాగ్రత్తలు తీసుకుంటూ జీవన యానం సాగించడమే ప్రకృతి విధానం! ఇప్పుడు జరగాల్సింది కూడా ఇదే! ఇది అవగతం కావాలంటే, జీవుల పుట్టుక గూర్చి తెలియాలి. ఇది తెలియాలంటే, భూమి పుట్టుక, సౌరకుటుంబం ఏర్పాటు, దీనికి సంబంధించిన బిగ్‌బాంగ్ సిద్ధాంతం (Bigbang) తెలియాలి. జీవ పరిణామం, మానవ పరిణామం, విస్పోటాలు, మహా విస్పోటాలు అర్థం కావాలి. అప్పుడే ప్రకృతిలో మానవుడి స్థానమేంటో, శక్తి ఎంతో, భవిష్యత్ ఏంటో అంచనా వేయగలం. అలా కాకుండా డబ్బుంది కాబట్టి దేన్నైనా కొనుక్కునే శక్తి వుంటుందని, అవసరమైతే బంకర్లలో దాక్కొని జీవించ వచ్చని, లేదంటే, చంద్రమండలాన్ని ఆవాసంగా చేసుకొని హాయిగా సుఖపడవచ్చని భావిస్తే ఓ భ్రమ అని కరోనా నిరూపిస్తున్న దాన్ని మననం చేసుకోవాలి. కాబట్టి ఇప్పుడు కావాల్సింది ఆరోగ్యకరమైన ఆలోచనా, శాస్త్రీయ దృక్పథం, ప్రకృతి సహిత జీవన విధానం! ఇవి కొరవడితే డాలర్లు, యూరోలు, యెన్‌లు, రూపాయలు నాలుక గీసుకోవడానికి కూడా పని చేయవని గుర్తించాలి.

వాటి వివరాల్లోకి పోయే ముందు బుద్ధుడి ఓ జాతక కథను చూద్దాం!

### కిసా గౌతమి : (KISA GAUTAMI)

కిసా గౌతమి ఓ అనాధ బాలిక. ఓ ధనవంతుడి బంగారం, వెండి అంతా బూడిదగా మారగా, దాన్ని బంగారంగా, వెండిగానే గుర్తించిన అనాధ బాలికకు తన కుమారునితో పెళ్లి చేస్తాడు. వీరికో కుమారుడు జన్మిస్తాడు. కాని, ఆ బాలుడు మరణించడంతో దుఃఖించిన కిసా గౌతమి, చనిపోయిన పిల్లవాన్ని ఎత్తుకొని, కనిపించిన వారందరిని తన కొడుకు బతకడానికి మందులు ఇవ్వమని కోరుతుంది. దీనికి ఇరుగు పొరుగు వారు కిసా గౌతమి మతిస్థిమితం కోల్పోయిందని ఎగతాళి చేయగా, ఓ పెద్ద మనిషి, తన దగ్గర పిల్లవాన్ని బతికించే మందు లేదుగాని, ఓ మంచి వైద్యున్ని చూపిస్తానని, సాఖ్యమునిగా గుర్తించబడ్డ బుద్ధున్ని చూపిస్తాడు. సంతోషించిన కిసా గౌతమి, తన కుమారున్ని బతికించమని, మందులివ్వమని బుద్ధున్ని కోరగా, ఓ పిడికెడు ఆవాలు కావాలని, అవి కూడా ఏ ఒక్కరు మరణించని కుటుంబం నుంచి తేవాలని బుద్ధుడు ఆదేశిస్తాడు. అర్థం కాని కిసా గౌతమి ఆవాలకై ఇల్లిల్లు అడుగుతూ, మరణం లేని ఇంటికై వెతుకుతుంది. ఒక్కటంటే ఒక్క ఇల్లు దొరక్క పోగా, ప్రతి ఇంట్లో బతికున్న వారికంటే, చనిపోయిన వారి సంఖ్యనే అధికంగా వున్నట్లు కిసా గౌతమి గుర్తించి బుద్ధుడి అంతరంగాన్ని అర్థం చేసుకొని మరణానికి సంబంధించిన జ్ఞానోదయాన్ని పొందుతుంది.

ఈ కథ శాస్త్రీయమా, వాస్తవమా అనే వాదన కాకుండా, జీవితానికి సంబంధించిన నగ్న సత్యాన్ని కాచి వడబోసిన సారంగా గుర్తిస్తాం! ఈ కోణంతో ముందుగా **ప్రకృతి సూత్రాల్ని** (Laws of Nature) చూద్దాం!

భూమి ఏర్పడిన నుంచి, మానవుడి పుట్టుక బుద్ధి కుశలత చేగూరిన నుంచి నేటి దాకా పోగుపడిన విజ్ఞాన మంతా కొన్ని సూత్రాలకు లోబడి వుంటాయని 2000 సం॥ (Y2K మిలినియం) ఆరంభంలో ఆధునిక ప్రపంచ శాస్త్రజ్ఞులు సూత్రీకరించారు. అవి 18. ఇవి సత్యాలు (faets)గా, శిఖరాగ్ర (cardinals) సూత్రాలుగా నేటికి మనజాలుతున్నాయి. ఇందులో మొదటి 14 సూత్రాలు భౌతిక, రసాయన సంబంధమైనవి కాగా, మిగతా 4 జీవ సంబంధమైనవి.

*(వచ్చే సంచికలో వీటిని చూద్దాం!)*

– డా॥ లచ్చయ్య గాండ్ల
m : 9440116162
e : drglachaiah@gmail.com

# ఆహుతి అవుతున్న అడవులు

అభివృద్ధి హోమంలో ప్రపంచ ఊపిరితిత్తులుగా పేరొందిన అటవీ సంపద ఆహుతి అవుతున్నది. దీనికి ఆజ్యం పోస్తున్నది మనిషే. మనం కూర్చున్న కొమ్మని మనమే నరుక్కుంటున్నట్టుగానే ప్రపంచానికి ప్రాణ వాయువును ఇచ్చే అడవులను నెమ్మది నెమ్మదిగా వ్యవసాయం పేరుతొ, జీవనోపాధి పేరుతో కొల్ల గొడుతున్నాము. ఈ అడవులు ప్రకృతి వైపరిత్యాలకు కొంత , మనిషి స్వార్ధానికి కొంత అగ్నికి కాలి బూడిద అవుతున్నాయి. ఇప్పటివరకు 43 శాతం అడవులు అంతరించి పోయినవి.

NASA వారి terra శాటిలైట్ ఉపయోగించి మోడరేట్ రిజొల్యుషన్ ఇమేజింగ్ స్పెక్ట్రోరేడియోమీటర్ (MODIS) అనే సాంకేతిక పరికరం ద్వారా ప్రపంచం మొత్తం ఎక్కడ కార్చిచ్చులు రగులుతున్నాయో ప్రపంచ పటంలో నెలకోసారి పంపించే చిత్రాల ద్వారా పరిశీలిస్తారు.



గత నెల రోజులుగా అమెరికాలోని ఆరిజోనాలోని పర్వత ప్రాంతాలలో, చిట్ట డువులలో మంటలు వ్యాపిస్తూ ఉన్నాయి. ఈ మంటలు మూడు అతిపెద్ద పట్టణాలకు దగ్గరలో ఉండటంతో ఆ ప్రాంతాలలో పరిస్థితి గంభీరంగా ఉందని అక్కడి వాతావరణ సంస్థ తెలిపింది. ఈ ఒక్క సంవత్సరం లోనే 4,32,000 ఎకరాల విస్తీర్ణం గల ప్రాంతం ఈ కార్చిచ్చులో దగ్ధమైంది. ఈ మంటలలో అత్యంత తీవ్రమైనవిగా పేర్కొనబడేవి మూడు రకాలు. అవి బుష్ ఫైర్స్, బిగ్ హార్న్ ఫైర్స్, మాంగం ఫైర్స్. “ఇదే సమయంలో కరోన (COVID-19) మహమ్మారి అక్కడి ప్రజల్లో ప్రబలుతుండడం వారిని వేరే సురక్షిత ప్రాంతాలకు తరలించడం, మంటలను ఆర్పే సిబ్బంది పనిచేయడం కష్టంగా ఉంది” అని ఆరిజోనా అటవీ మరియు అగ్నిమాపక శాఖ ప్రతినిధి తెలిపారు.

ఈశాన్య ఫీనిక్స్‌లో జూన్ 13, 2020 రోజు ఒక వాహనం మానవ తప్పిదం వల్ల అగ్ని ప్రమాదానికి గురి అవడంతో బుష్ ఫైర్స్ అంటుకుని ఇప్పటికీ మండుతూనే ఉన్నాయి. 28.6.2020న 1,93,455 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రాంతం మొత్తం కాలిపోయింది. దక్షిణ ఆరిజోనా ప్రాంతంలోని పర్వత ప్రాంతం 1,04,690 ఎకరాలు (45%) మంటలకు ఆహుతైనది. వీటిని ఆర్పడానికి సుమారు 1200 మంది అగ్నిమాపక సిబ్బందిని పురమాయించారు. కైబాబ్ నేషనల్ ఫారెస్ట్ 71,450 ఎకరాలు అంటే 51% మంటల (మాంగం మంటలు) పాలైంది. జాకబ్ సరస్సు, హౌస్ రాక్ రోడ్ ప్రాంతాలలోని నివాసులను అక్కడనుండి రక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. తూర్పు ఆరిజోనా ప్రాంతంలో 22,903 ఎకరాల అపచే సిటీ గ్రీవ్స్ నేషనల్ పార్క్‌లో మెరుపులు, పిడుగులు వల్ల మంటలు (బిగ్ హార్న్ మంటలు) ఏర్పడి కాలిపోయినాయి. ఈ మంటలు ప్రతీ ఏడు జూన్ – జూలైలో అత్యంత వేడి వాతావరణం, తక్కువ ఆర్ద్రత (గాలిలో నీటి ఆవిరి) ఉండటం వల్ల సాధారణమే అయినప్పటికీ పెరిగే వాతావరణ మార్పు, గ్లోబల్ వార్మింగ్ అగ్నికి ఆజ్యం పోసినట్టుగా మరింత వాటి తీవ్రతను పెంచుతున్నాయి.

అమేజాన్ అడవులు జీవవైవిధ్యానికి పెట్టింది పేరు. ప్రపంచ జీవవైవిధ్యంలో 10శాతం ఈ అడవుల్లోనే ఉంది. 20 శాతం ఆక్సీజన్‌ని ప్రపంచానికి అందించేది ఈ అడవులే. బ్రెజిల్ స్పేస్ సెంటర్ గుర్తించిన ప్రకారం ఒక్క 2019 సంవత్సరంలోనే 73 వేల సార్లు మంటలు వ్యాపించినవి. బ్రెజిల్ లో రోరైమ, అక్రే, రోన్డోనియ, అమెజానోస్ రాష్ట్రాల్లో అగ్ని కీలల్లో దగ్ధమైన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ విషయంలో బ్రెజిల్ దేశ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. అమేజాన్ మంటల్లో తగలబడటం పట్ల ఫ్రాన్స్ దేశ అధ్యక్షుడు ఎమ్మన్యుయేల్ మక్రన్ ఆందోళన వ్యక్తం చేశారు. మంటలను ఆర్పటానికి అంతర్జాతీయ సమాజం మొత్తం బ్రెజిల్‌ని కోరుకుంది.

**కార్చిచ్చు లేదా మంటలు అంటుకోడానికి కారణాలు:**

- పెరుగుతున్న భూతాపం (గ్లోబల్ వార్మింగ్)
- వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్)
- వేడి గాలులు వీయడంతో పాటు, పొడి వాతావరణం ఉండడం.
- ఆకాశంలో మెరుపులు, పిడుగుపాటుకు గురి కావడం వలన
- మానవ తప్పిదాలు, అనుకోకుండా జరిగే అగ్ని ప్రమాదాలు వలన
- వ్యవసాయ స్థలం కోసం సహజ వనాలను కాల్చడం వలన ఎప్పుడూ ఎక్కడో ఒక దగ్గిర ఈ చెట్లు, అడవులు మంటలకు ఆహుతి అవుతూనే ఉన్నాయి.

**ఈ మంటల వలన కలిగే పరిణామాలు:**

- ఈ మంటలతో పెద్దమొత్తంలో పొగ ఏర్పడి చుట్టూ వ్యాపిస్తుంది
- ఈ మంటలనుండి గ్రీన్ హౌస్ వాయువులు విడుదల అయి మన ఆవరణ వ్యవస్థని పాడుచేస్తాయి.
- పచ్చని చెట్లు మంటలకు అంటుకొని గాలిలోని ప్రాణ వాయువు తగ్గిపోతుంది.
- వర్షాలు తగ్గుతాయి.
- భూతాపం(గ్లోబల్ వార్మింగ్) ఎక్కువవుతుంది
- అడవులే నివాసంగా ఉండే ఎన్నో ప్రాణులకు ఉండే నీడ దూరమై మనుషులు తిరిగే ప్రాంతాలలో ఉండలేక చనిపోతాయి. దానితో ఎన్నో జీవులు అంతరించిపోతున్నాయి.
- చుట్టు ప్రక్కల నివాసమేర్పరుచుకున్న ఎంతో మంది నిర్వాసితులు కావడం, వేరే ప్రాంతాలకు వలస వెళ్ళటం, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలుగుతు ఉంటాయి.

ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు చూస్తూ బాధపడటం కంటే ఆ సమస్య రాకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే దానిపై పరిశోధనలు చేయటం, చర్యలు తీసుకోవటం ఏంతో ముఖ్యం. ఈ నేపధ్యంలో అడవులు మంటలకు అంటుకోకుండా, వ్యాపించకుండా ఉండాలంటే తీసుకోవలిసిన కొన్ని చర్యలపై శాస్త్రవేత్తలు ఆలోచించాల్సిన సమయం ఇది.

- భూతాపాన్ని పెంచే గ్రీన్ హౌస్ వాయువులను కట్టడి చేయటం
- మంటలకు అంటుకోకుండా తట్టుకునే మొక్కలను సృష్టించటంపై జెనెటిక్ ఇంజనీరింగ్ పరిశోధనలు చేయడం.
- అడవుల మధ్యలో ఈ మంటలకు అంటుకోకుండా తట్టుకునే చెట్లు పెంచటం, లేదా భౌతికమైన అడ్డంకులు ఏర్పాటు చేయటం అంటే అడవి మధ్యలో అక్కడక్కడా గోడలు కట్టడం , అక్కడక్కడా నీటి చెరువులు, కాలువలు తవ్వించడం మొదలైనవి చేయడం.

ఇలా చేయడం ఖర్చుతో కూడుకున్న పనే అయినా ఒకసారి ఏర్పాటు చేస్తే కొన్ని సంవత్సరాల వరకు ఉపయోగపడతాయి.

- పెద్ద మంటలను త్వరగా ఆర్పే పర్యావరణ హిత వాయువులు లేక స్ప్రే లను కనుక్కోగలగాలి. వాటిని వాయు రవాణా మార్గాల ద్వారా సమర్ధవంతంగా ఉపయోగించగలగాలి.
- అడవుల దగ్గరలో నిప్పు వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి. బాణసంచా, టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధించాలి.
- అక్కడ నివసించే గిరిజనులు, రక్షణ సిబ్బందికి ఫైర్ ప్రూఫ్ ఇల్లులు మాత్రమే ఉండేటట్టు చూడాలి. అంటే లోపల మంట బయటికి రాకుండా.
- ప్రభుత్వ అటవీ అధికారులు, రక్షణ సిబ్బంది ఆహారం బయట తాయారు చేసి వారికి చేరవెయ్యాలి.
- పొగ త్రాగేవారిని అనుమతించ వద్దు.
- వీలయినంత వరకు కొట్టేసిన అటవీ ప్రాంతాన్ని భర్తీ చేయటానికి తిరిగి చెట్లు నాటాలి. అలా చేసే వారికి ప్రోత్సాహకాలు ప్రకటించి అందించాలి.
- వ్యవసాయం చేయటానికి అడవులను నరకటానికి అనుమతించ వద్దు. వారికి మైదాన ప్రాంతంలో భూమిని చూపించాలి.
- అటవీ భూమి విస్తీర్ణాన్ని వీలైనంత ఎక్కువగా పెంచే ప్రయత్నాలు చేస్తూనే ఉండాలి. విస్తీర్ణాన్ని తగ్గించే పనులను గట్టిగా వ్యతిరేకించి అరికట్టాలి.
- అడవులలో అగ్ని ప్రమాదాలకు కారణమైన వాళ్ళను కఠినంగా శిక్షించాలి.
- అటవీ సంరక్షణకు కొత్త చట్టాలను, పాలసీలను ఎప్పటికప్పుడు తయారు చేయాలి. అమలు పరచాలి.

– డా॥ హిమబిందు
e: binduh955@gmail.com


## పాఠకులకు :

సామాజిక అంశాలు, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యావరణం, పర్యాటకం లాంటి అంశాలతో పాటు కథ, కవితలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, విశ్లేషణతో 'దక్కన్ ల్యాండ్' మీ చేతుల్లో ఉంది. ఇందులో ప్రచురితమైన రచనల పట్ల మీ అభిప్రాయాలను లేఖల రూపంలో తెలియ జేయగలరు.

## రచయితలకు :

- కథ, వ్యాసం రెండు రెండున్నర (ఎ4 సైజ్) పేజీలకు మించరాదు.
- కవిత 20-22 లైన్లు మించకూడదు.
- పుస్తక సమీక్షలు, విశ్లేషణలు రెండు పేజీలకు మించరాదు.
- రెండు కాపీలు విధిగా పంపాలి.
- ప్రతి రచయితా తమ రచనతో పాటు, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్, పోస్టల్ అడ్రస్ తప్పనిసరిగా ఇవ్వాలి.
- మ్యాటర్ టైప్ (డిటిపి) చేసి ఉంటే ఓపెన్ & పీడీఎఫ్ ఫైల్ పంపాలి.

**చిరునామా :**

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

# కరోనాపై లోతైన అధ్యయనాలు జరగాలి

**పర్యావరణవేత్త డాక్టర్ బి.వి.సుబ్బారావుగారితో కోవిడ్-19పై ప్రత్యేక ఇంటర్వ్యూ**

ఇక్రిశాట్‌లో సైంటిస్ట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ బి.వి.సుబ్బారావు గారు ఏప్రిల్ మాసంలో దక్కన్‌ల్యాండ్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ

**కరోనాలాంటి విపత్కర పరిస్థితులకు కారణం ఏమని అనిపిస్తుంది?**

కరోనాలాంటి విపత్కర పరిస్థితిని ఒక చారిత్రాత్మక ఘట్టంగా పరిగణించాలి. ఎందుకంటే వైరస్‌లను ఇంతకు ముందు ప్లేగు, మలేరియా రూపంలో 20వ శతాబ్దంలో చాలా చూశాం. కానీ కోవిడ్-19 వైరస్ అర్థం కావడానికి చాలా సమయం పట్టింది. ఎలా వ్యాప్తి చెందుతుందో తెలుసుకోవటానికి కొంత సమయం పట్టింది. ఈ నేపథ్యంలో చాలా నష్టం వాటిల్లింది. ఇప్పటికీ పరిస్థితులు చాలా భిన్నమైనవి. ఇలాంటి వైరస్‌ను క్షుణ్ణంగా తెలుసుకోవడానికి వైద్య రంగంలో చాలా అధ్యయనాలు జరగాలి.



**లాక్‌డౌన్ సమయంలో మీకు కలిగిన ఆలోచనలు, అంతర్మథనాలు ఏమిటి?**

లాక్‌డౌన్ అనేది వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ఇదొక మార్గం. ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం కూడా చాలా చక్కటి నిర్ణయం. ఈ వైరస్ వాతావరణం, పర్యావరణ ప్రభావాల దృష్ట్యా ఇది ఒక దేశం నుండి మరో దేశానికి చాలా భిన్నంగా వ్యాపిస్తుంది. ఈ సమయంలో మనిషి సైకలాజికల్ ఒత్తిడికి గురవుతున్నాడు. లాక్‌డౌన్ వారం రోజులకో, పదిహేను రోజులకో తీసేస్తారు అంటే దానికి మనిషి కొంత తాత్కాలికంగా, మానసికంగా సన్నద్ధం అవుతాడు. అంతేగానీ నెలలు తరబడి ఉంటుంది, ఇంటి నుంచి బయటి రాకూడదు అనేటప్పటికీ మానసిక, భౌతిక ఒత్తిడులకు గురవుతాడు. ఈ లాక్‌డౌన్ సమయంలో మానసిక ఒత్తిడితో ఆలోచనలు వస్తాయి. ఈ లాక్‌డౌన్ సమయంలో అన్ని రంగాలు మూత పడుతున్నాయి. ఈ రంగాల్లో లాక్‌డౌన్ ఎంతకాలం పొడిగిస్తారో, ఏమౌతుందో తెలీదు. భవిష్యత్‌లో ఎటువంటి పరిస్థితులు వస్తాయో తెలియకుండానే ఊహాజనితంలో జీవిస్తున్నాం. మరి ఈ మానసిక ఒత్తిడుల నుంచి మనల్ని మనం కాపాడుకుంటూ మళ్ళీ ఆత్మధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రతి వ్యక్తి లోను, ప్రతి కుటుంబంలోను, సామాజికంగా దేశం మొత్తంలో రావాలి. ఎందుకంటే ప్రతి వ్యక్తి భవిష్యత్ దేశ భవిష్యత్‌పై ఆధారపడి ఉంది. గతంలో ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఆ కార్యక్రమాలు వ్యక్తిగత, జాతీయతతో ఆధారపడి లేవు. కరోనా అనేది వ్యక్తిగత స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు ఒక ఉద్దేశ్యాన్ని నిర్దేశించింది.

**ప్రజలు ప్రభుత్వాలు ఏ మేరకు ఈ విపత్కర పరిస్థితిని తట్టుకోగల్గుతున్నాయి?**

మన ప్రభుత్వాలు విపత్తుల నివారణలో (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) చాలా బాగా చేస్తున్నాయి. తుఫాన్, భూకంపాలు వచ్చినప్పుడు తక్షణ సహాయం చేయడం, పునరావాసం కల్పించడం మొదలైనవి. కానీ కరోనా విపత్తు జాతీయ విపత్తే కాదు, ప్రపంచ విపత్తు. ఈ విపత్తులో ప్రపంచంలో ఉన్న అన్ని ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయి. ఎందుకంటే ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) అందరిదీ ఒకే కుటుంబం, ఒకే భూమాత, అందరి భవిష్యత్ ఒకటే అనుకుంటూ గ్లోబలైషన్ మొదలైంది. ఇతర దేశాలకు, కార్పొరేట్ సంస్థలకు ఏ దేశంలోనైనా వ్యాపారం చేసుకోండి అని అన్నారు. కానీ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం ప్రపంచీకరణలో ఎంతవరకు అందుబాటులో ఉంది. దీని గురించి సమీక్షించుచున్నారా. గ్లోబల్ సంస్థ అయిన వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ)తో మన ఆరోగ్య శరీరాలు ఎన్ని అనుసంధానం అయి ఉన్నాయి. ఈ కరోనా వైరస్ విషయంలో ప్రిపేర్‌నెస్‌లో ఎక్కడో పెద్ద లోపం జరిగింది. లాక్ డౌన్‌లో చాలా చక్కని ఆలోచన ఏంటంటే అసలు గ్లోబలైజేషన్ అవసరమా! ఎవరి ఇంటి వద్దనే వాళ్ళు ఎవరి దేశంలోనే వాళ్ల బ్రతకాలి. ఇంత కాలం బ్రతకలేదా. ఇది చాలా అవసరం.

**ప్రభుత్వాలు వైద్యరంగంలోనూ, శాస్త్రసాంకేతిక రంగంలోను అనుసరించాల్సిన ప్రణాళికలు ఏమిటి?**

వైద్యరంగంలో భారత ప్రభుత్వాన్ని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని, వారి సలహాదారులని మనస్ఫూర్తిగా అభినందించాలి. వైద్య రంగానికి, మిగతా రంగాలకు చాలా చక్కగా సహాయ సహకారాలు అందించారు. గత పదిహేనేళ్లుగా ప్రైవేటేజేషన్ అని భూమి ఊరికే ఇచ్చాం. ట్యాక్సులు ఫ్రీగా ఇచ్చాం. అన్ని రకాల సౌకర్యాలు కల్పించాం. కార్పొరేటర్ సెక్టార్ హాస్పిటల్స్ ఏ విధంగా ఈ కరోనాలో తోడ్పాటు అందించాయి. ప్రాణాలకు తెగించి నిలబడింది ప్రభుత్వ డాక్టర్లు, ప్రభుత్వ వైద్య శాఖ, పోలీసు శాఖ, శానిటైజింగ్ శాఖ మాత్రమే. లాక్‌డౌన్ తరువాత మన పబ్లిక్‌సెక్టార్ రంగాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకో గలుగుతాం అని చూడాలి. దీనికి ముడిబడ్డదే నీటి సరఫరా. నల్లా తిప్పి పారే నీటిలో చేయి శుభ్రం చేసుకోండి అంటున్నారు. ఎంతమంది ఇళ్లల్లో నల్లా తిప్పితే నీళ్లు వస్తున్నాయి. దేశంలో కాదు, హైదరాబాద్‌లో కూడా అలాంటి సదుపాయమే లేదు. అటువంటప్పుడు ముఖ్యంగా చేయాల్సింది ఏమిటంటే వైద్య రంగాన్ని

పబ్లిక్ ఇనిస్టిట్యూటేషన్‌ని ఎంత విధిగా అభివృద్ధి చేయగలుగు తాము అన్నది ముఖ్యం.

**ప్రభుత్వాలు వైద్య సాంకేతిక రంగాలలో చేయవల్సిన కృషి ఏమిటి?**

వైద్య రంగంలో వైద్యం, శాస్త్రం. ఈ రెండింటిలో సైన్స్ & మెడిషన్స్. వీటిలో కొన్ని ఏళ్లుగా క్లీనికల్ రీసెర్చ్ జరగలేదు. క్లీనికల్ రీసెర్చ్ ఎప్పుడైతే జరగలేదో పథలాజికల్ రీసెర్చ్, కెమికల్ ప్రాక్టీస్ పోతాయి. ప్యాథోజెన్స్ ట్రాకింగ్స్ చాలా కష్టం. ఈ రోజు గట్టి గుణపాఠం ఏమిటి అంటే మెడికల్ రంగంలో రీసెర్చ్ అన్నది ఒక బలమైన ఒక అంగం. దాన్ని ఎప్పుడూ సపోర్ట్ చేస్తూనే ఉండాలి. లాక్‌డౌన్ అనేది కేవలం సామాన్య మానవులకే. ఈ శాస్త్ర సాంకేతిక, వైద్య రంగాలలో, ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు నేటికీ జీహెచ్ఎంసీలో పాత రాతి హోం పద్ధతులే పాటిస్తున్నారు. ఎటువంటి చోట కూడా మనం మోడ్రనైజేషన్ చేయలేదు పారిశుద్యాన్ని. కరోనా వల్ల గ్యార్బేజ్ మేనేజ్‌మెంట్‌ను ఒక సైంటిఫిక్ పద్ధతిలో చేయడం చాలా ముఖ్యం. కాంట్రాక్ట్ ఇచ్చేసి మా సిటీ అంతా క్లీన్‌గా ఉందని ఎక్కడికో వెళ్లి డబ్బులు ఇచ్చి అవార్డులు తీసుకోవడం కాదు. చిత్తశుద్ధిగా పరిశుభ్రత గురించి మూడవ క్లాసులో చెప్పే వాళ్లు. నీ ఇంటి చుట్టూ పర్యావరణం పరిశుభ్రంగా ఉండాలి అని. మరి దానిని నిజంగా అమలు చేస్తామా? చేయమా అన్నది పెద్ద సవాల్ మన అందరి ముందు.

**కరోనా వ్యాప్తి నేపథ్యంలో వైద్యరంగంలోనూ, సాంకేతిక రంగంలోనూ ఎలాంటి మార్పులు ఉంటే బాగుంటుంది?**

శాస్త్ర, వైద్య రంగాల్లో రీసెర్చ్ ఉండాలి. రీసెర్చ్ అనేటప్పటికీ మన దేశంలో ఫండమెంటల్ రీసెర్చ్ మీద కూర్చుంటారు. ఆ థిరీటికల్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో అది ఎప్పుడు బయటకి వస్తుందో, ఏమి చేయాలో తెల్వదు. అప్లైడ్ రీసెర్చ్ మీద ఫోకస్ జరగాలి. ఏదైనా ఉపద్రవం జరిగితే ఏ విధంగా అరికట్టగల్గుతాం. సెంట్రల్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)వింగ్స్ ఉన్నాయి. కొన్ని వేల కోట్ల డబ్బు ప్రభుత్వం ఇస్తుంది వీటికి. నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (నీరీ) ఉంది. ఇవన్నీ ఏమి చేస్తున్నాయి. ఇవన్నీ ఒక సైన్స్‌పైన పని చేయాలి. కానీ ఈ లాక్ డౌన్ సమయంలో ఏమి నేర్చుకుంటున్నాము అన్నది చాలా ముఖ్యం. దీనిపైన ప్రతి రంగంలోనూ చర్చలు జరగాలి.

**ఇప్పుడున్న కరోనా నేపథ్యంలో అంతర్జాతీయంగా ఆయా దేశాలు కరోనాను ఎందుకు సమర్థవంతంగా ఎదుర్కోలేక పోయాయి?**

ఒకటి మనకు వచ్చిన కేస్‌స్టడీస్ అన్నీకూడా బాగా చలి దేశాలు. యూరఫ్ దేశంలో చలి మూలంగా ఈ వైరస్ అంత విధిగా బయట పడలేదు. రెండోది ఈ దేశాలలో మలేరియాకు సంబంధిత వ్యాధుల్నే సంవత్సరాల కిందట వాళ్లు జయించారు. వాటికి సంబంధించిన మందుల్ని కూడా ఇప్పుడు మ్యాన్‌ఫ్యాక్చర్ చేయడం లేదు. మనలాంటి దేశానికి అడ్వాన్‌టేజ్ ఏమున్నది అంటే మనకు మలేరియా ఉంది, టైఫాయిడ్ ఉంది, కలరా ఉంది. అన్ని రోగాలు అన్ని చోట్ల ఉన్నాయి. కనుక వైద్య రంగంలో వాళ్లు కూడా ఆ అనుభవంతో ఉన్నారు. అక్కడ ఈ సంబంధిత రోగాలు లేకపోవడం మూలంగా వైద్య రంగంలో అనుభవం లేక పోవడం. దానికి సంబంధించిన మందులు లేకపోవడం.

**పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?**

పర్యావరణ పరిరక్షణ అంటే నాలుగు మొక్కలు నాటితే సరిపోతుంది అనుకుంటున్నారు. పర్యావరణానికి మన జీవనసరళికీ, భౌతిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి ఎటువంటి సంబంధం ఉంది అన్నది శాస్త్రవేత్తలుగానీ, విద్యావేత్తలుగానీ గ్రహించడం లేదు. ప్రతి మెట్రో సిటీని కార్యాచరణ రూపంలోకి తీసుకు రావాలి. గత పదిహేనేళ్లుగా నా ప్రతి సమావేశంలో ఒక విషయం చెపుతున్నాను. ప్రతి మెట్రో నగరం టైం బాంబు లాంటిది అని. ఎందుకంటే మెట్రో సిటీస్‌లో జన సాంద్రత పెరిగి పోయింది. హైదరాబాద్ మహానగరంలోని కూకట్‌పల్లి ప్రాంతంలోనే ఒక చదరపు కిలో మీటర్‌కు లక్ష మంది జనాభా ఉన్నారు. ఒక్కరు తుమ్మితే వంద మందికి జలుబు వస్తుంది. అటువంటి ప్రదేశాలే నేడు రెడ్‌జోన్స్, కంటైన్మెంట్ జోన్స్ కింద గుర్తించబడ్డాయి. పర్యావరణ నియమాలు పాటించకుండా నిర్మాణమైన అన్ని మహానగరాల్లో ఇదే సమస్య. బెంగుళూరు, బాంబే, ఢిల్లీ, గుర్గాం, పూణే, హైదరాబాద్, న్యూయార్క్‌లాంటి నగరాల్లో కరోనా ఎక్కువగా ఉంది.


**పర్యావరణం అంటే ప్రత్యేక ప్రణాళిక. గతంలో పరిశ్రమలకు, గృహ సముదాయాలకు మధ్య, చెరువులకు, కాలనీలకు మధ్య బఫర్ జోన్‌లు ఉండేవి. ఇప్పుడు ఆ బఫర్ జోన్‌లు కనుమరుగైనాయి.**


పర్యావరణం అంటే ప్రత్యేక ప్రణాళిక. గతంలో పరిశ్రమలకు, గృహ సముదాయాలకు మధ్య, చెరువులకు, కాలనీలకు మధ్య బఫర్ జోన్‌లు ఉండేవి. ఇప్పుడు ఆ బఫర్ జోన్‌లు కనుమరుగైనాయి. బఫర్ జోన్ అంటే ఎన్విరాల్‌మెంట్ డిస్టెన్సీ. ఎన్విరాల్‌మెంట్ డిస్టెన్సీనే నేడు సోషల్ డిస్టెన్సీ అంటున్నారు. గృహాల మధ్య. చెరువుకు కాలనీకి మధ్య, చెరువు చెరువు మధ్య, నదీ నదీకి మధ్య డిస్టెన్సీ ఉండాలి. మొక్కలు నాటి తృప్తి పడకూడదు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాస్టర్ ప్లాన్స్ అన్నిటినీ సమీక్షించాలి. ఈ ప్లానలలో ఎక్కడ కూడా మురుగు నీటికి, వర్షం నీటికి ప్రణాళిక లేదు. రేపు వర్షాకాలం తరువాత కరోనా ఏవిధంగా విజృంభిస్తుందో తెలియదు. పర్యావరణం మన జీవన విధానంలో భాగం. పర్యావరణంలో భాగస్థులం. పర్యావరణంలో ఎలా బతకాలి, జీవన మనుగడ ఎలా ఉండాలి అన్నది మనలో రావాలి. మేము పార్కులు కట్టాము అని ఊరు అవతల ఎక్కడో కడితే గాలి ఎక్కడ వస్తది. కాబట్టి అన్ని వ్యవస్థలను పర్యావరణానికి అనుసంధానం చేయాలి. అభివృద్ధి రంగాలలో పర్యావరణ పరిరక్షణ అమలు చేసే కార్యక్రమాన్ని సమన్వయ పరచాలి. పర్యావరణాన్ని ఏదో ఒక డ్రాయింగ్ రూంలో పెయింటింగ్‌లా భావిస్తే ఇలాంటి ఉపద్రవాలు చాలా వస్తాయి.

**కరోనా పుట్టుకకు ప్రకృతి వైపరీత్యాలే కారణమా?**

కరోనా వైరస్ ల్యాబ్‌లో పుట్టింది. ల్యాబ్‌లోంచి బయట పడ్డది అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పుట్టడానికి కారణం అయినా

కాకపోయినా అది ఇంతగా వ్యాపించడానికి కారణం ఇప్పుడున్న చెడు పర్యావరణ పరిస్థితులే. ఎక్కడా బఫర్ జోన్, ఎన్విరాన్‌మెంట్ డిస్టెన్సీ లేదు. ఎక్కడా బాధ్యతగల పద్ధతుల్లో పర్యావరణ శాఖలు కానీ, మిగతా శాస్త్ర రంగాలు కానీ పనిచేయడం లేదు. వైద్య రంగానికి మనం ఎటువంటి సహాయం అందివ్వడం లేదు. అలాంటి పరిస్థితుల్లో ఈరోజు పర్యావరణం లేదని అన్ని పత్రికల్లో రాస్తున్నారు. గంగానది, గోదావరి, హుస్సేన్ సాగర్ శుభ్రమైనాయి అని వ్రాశారు. ఎందుకు శుభ్రమైంది అంటే లాక్‌డౌన్. ఇవాళ ఆర్థిక అభివృద్ధికి, పర్యావరణ అభివృద్ధికి ఈ రెండింటిని సమతుల్యలంగా ఎలా ప్రణాళికలు చేసుకుంటాము అన్నది నేర్చుకోవాలి. అంతేగానీ అభివృద్ధికి పర్యావరణానికి ఎటువంటి పోటీ లేదు. ఈ రెండు జతగా వెళ్లాలి. జతగా వెళ్ళిన రోజే అందరూ ఆరోగ్యవంతంగా ఉంటారు. సమస్త ప్రాణులు కూడా వాటి వాటి ప్రదేశాల్లో ఉంటాయి. అది చాలా ముఖ్యం.

**ప్రపంచ ఆర్థిక రంగంలో రాబోయే మార్పులు ఎలా ఉండబోతున్నాయి?**

ప్రపంచ ఆర్థిక మార్పులు అన్నది సహజం. ఉత్పత్తి వ్యవస్థని ఎలా గాడిలో పెడతామో దాని బట్టి ఉంటుంది. చాలా వరకు పెద్దఎత్తున పరిశ్రమలకు లోన్లు ఇప్పించి పరిశ్ర మలను నిలబెడుతుంటారు. పరిశ్రమలు నిలబడినా మార్కెట్ కొనుగోలు శక్తి ఉండాలి. పరిశ్రమలో ఉద్యోగాలు లేకపోతే వారు ఎలా కొనగలుతారు. కాబట్టి ఓవరాల్‌గా ఆర్థికరంగాన్ని ఎలా తీసుకువెళ్లతాము అన్నది ఆలోచన చేయాలి. కేవలం పెద్ద పరిశ్రమలు గురించే ఆలోచన చేస్తారు. ఉదాహరణకు ఎయిర్ ఇండస్ట్రీ రంగంలో విమానాలు ముందు ఎలా ఎగరాలి అనే తపన ఉంటుంది. మన ఆర్టీసీ బస్సు ఎలా కదలాలి అన్నది ఉండదు. ఆర్టీసీ బస్సు తిప్పితే ఆదాయం కాదంటున్నారు. మరి విమానం ఎగిరితే ఆదాయం అవుతుందా.



స్థానిక ఉత్పత్తి కేంద్రాలను ఏవిధంగా పునరుద్ధరించ కల్గుతాము. స్మాల్ ఇండస్ట్రీ, కాటేజ్ ఇండస్ట్రీ, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్‌ని ఏ విధంగా ముందు తీసుకెళ్లగలం. చిన్న మధ్యతరహా పరిశ్రమలను ఏ విధంగా పెంపొందించ కలుగల్గుతాం. ఏ రంగం మీద దృష్టి పెడతామో ఆ రంగంలో పూర్తిస్థాయిలో ఉద్యోగులు ఉండాలి. అలా కాకుండా మేం ఆటోమిషన్‌తో పని చేయిస్తాం అంటే ఇక్కడ కోట్లలో జనాలు ఉన్నారు. కావున ఏ రంగాన్ని తీసుకున్నా వారికి పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించే దృష్టి వైపు వెళ్లాలి. ఇప్పుడు ఉత్పత్తి మీద ఎక్కువ దృష్టి పెట్టాలి. నేడు చాలా వరకు చైనాలో ఉన్న వివిధ దేశాల పరిశ్రమలు అన్ని కూడా భారత్‌కు షిఫ్ట్ అవుతాయి. మరి మన దగ్గర అలాంటి స్కిల్డ్ లేబర్ ఉన్నదా అని చూడాలి. పాలిటెక్నిక్, ఐటీ కళాశాల్లో కోర్సులు ప్రవేశపెట్టి నైపుణ్య శిక్షణ ఇప్పించడం చేయాలి. ఆర్థికం అంటే రూపాయి పూరికే రాదు. పనిచేసే సమర్థత, నైపుణ్యం ఉండాలి. స్థానికంగా ఎక్కడ ఎలా ఉత్పత్తి చేయగలుగుతామో చూడాలి. మొదట కాటేజ్ ఇండస్ట్రీస్‌పైన దృష్టి పెట్టాలి. తరువాత చిన్న, మధ్యతరగతి పరిశ్రమలపై దృష్టి పెట్టాలి. అప్పుడు పెద్ద పరిశ్రమలు వాటంతట అవే నిలదొక్కుకుంటాయి. వాటికి ఎలాగూ ఆర్థిక సహాయం ఉంటుంది. మన దేశంలో ఉపాధి రంగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. అది ఇవ్వకపోతే మన ఆర్థికరంగం పూర్తిగా కుంటుపడుతుంది.

**ప్రపంచ దేశాల మధ్య సంబంధాలపై కరోనా ఎలాంటి ప్రభావం చూపబోతుంది?**

ఒక దేశం మరో దేశంతో ఎలా వ్యవహరిస్తుందంటే ముఖ్యంగా కోల్డ్ వార్ సమయంలో రష్యా వర్సెస్ అమెరికా యుద్ధం జరిగేది ప్రతి రంగంలో. చైనా వర్సెస్ అమెరికా బైపోల్‌గా అవుతుంది. ఏ దేశాలు ఎటువైపు వెళ్లతాయి అన్నది గమనించాలి. గత రెండు దశాబ్దాలుగా చైనా చాలా దూకుడుగా అన్ని దేశాల్లో చొచ్చుకు పోయింది. ఏ దేశాలు కూడా వారిని అడగలేదు. ఆఫ్రికన్ దేశాల్లో ఇన్వెస్ట్‌మెంట్, మ్యాన్‌ఫవర్ టెక్నాలజీతో వెళ్లి పోయిన వారు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేస్తూ పోతున్నారు. అక్కడి మీడియా ద్వారా తెలిసింది ఏమిటంటే, మీకు పది కిలోమీటర్ల రోడ్డు వేసిస్తా మాకు ఇన్ని షిప్పుల ఐరన్ కావాలి అనే బార్డర్ సిస్టంలో చైనా ఎంటర్ అయిపోయింది. ఇప్పుడు చైనా వస్తువులు అనడానికి వీల్లేదు. ఎందుకంటే అవి మల్టీ నేషనల్ కంపెనీలలో షేర్లు కొనుకున్నాయి. ఇండియాలోకి వచ్చిన ఉత్పత్తి కేంద్రాలు కూడా చైనా కంట్రోల్‌లో ఉన్నాయి. లాక్‌డౌన్ తరువాత ఏ విధంగా కాంప్రమైజ్ అవుతాయో చూడాలి. రాజీ ధోరణిలో సమాన హక్కులకోసం చర్చలు జరగవు. చైనా జరగనివ్వదు కూడా. ఎప్పటికీ వారి ఆధిపత్యం ఉండాలనే కోరుకుంటుంది. ఇన్నేళ్ల నుంచి భారతదేశం చాలా పద్ధతిగా యుఎన్ఏలో నెగ్గుకొస్తున్నది. లాక్ డౌన్ పిరియడ్ తరువాత కూడా అదే పద్ధతితో వెళ్ళాలి. రాజీధోరణితో వెళ్ళితే మన చావును మనం కోరుకున్నట్లే. మనం నెగోషబుల్ కండీషన్‌లోనే వెళ్లాలి. మిగతా దేశస్థులతో పోల్చుకోలేము. ముందు దేశాన్ని కాపాడు కోవాలి. ఫ్రీ లిబరల్ ప్రొడక్షన్ లిబరల్ అంటే ఇక్కడి ఉత్పత్తి, ఉపాధి ఆగిపోయింది. రేపు ఏ రాజీధోరణిలోనో వేరే దేశాలకు వెళ్లుతాం. అమెరికా ఐటీ సెక్టార్ కూలిపోయింది అంటే లక్షల్లో హైదరాబాద్‌లో నిరుద్యోగులు ఉంటారు. కావున జాగ్రత్త పడాలి.

**లాక్‌డౌన్ పీరియడ్‌లో ఆర్థికరంగం ఎలా వుంటుంది? ప్రజలపైన ఏ విధమైన భారం పడనుంది?**

రోజువారి పనులు జరగలేదు. లాక్‌డౌన్‌లో రెవెన్యూ పడి పోయింది. మనది వ్యవసాయ రాష్ట్రం. అన్ని పనులు వేసవి కాలంలోనే జరుగుతాయి. పంటను పొలాల నుండి ఇంటికి తీసుకురాలేని పరిస్థితుల్లో ఉన్నాం. అటువంటి ఆలోచనలు చేయలేదు. వడ్డీ వ్యాపారుల్లా ప్రభుత్వాలు ట్యాక్స్ రూపంలో వచ్చే రోజువారి రాబడి మాత్రమే చూస్తున్నాయి. మన దేశంలో నేటికీ పట్టిపీడిస్తున్న అవినీతిని మొదట అరికట్టాలి. ఆర్థికరంగం

దారికొస్తుంది. సామాన్య మానవుడి ఆలోచనలా ప్రభుత్వ ఆలోచన వుండకూడదు.

**ఆర్థిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందిన దేశాలు కూడా కరోనాను ఎదుర్కోవడంలో ఎందుకు విఫలం అయ్యాయి? చిన్న చిన్న దేశాలు ఎలా బయట పడ్డాయి?**

అభివృద్ధి చెందిన దేశాల్లో వాళ్ల పరిస్థితి వేరుగా ఉంది. యూరప్ దేశాల్లాంటి చిన్న చిన్న దేశాల్లో పరిస్థితి వేరుగా ఉన్నది. వాతావరణం, పర్యావరణ అభివృద్ధి, జనసాంద్రత దూరం దూరంగా ఉంటుంది. కాబట్టి ఇటువంటి దేశాలు కరోనా అరికట్టగలిగాయి. నేటికీ డబ్ల్యూహెచ్‌వో ఇచ్చిన సమాచారం ఎంత నమ్మకం అన్నది అనుమానమే. భారత్‌లో కూడా కొన్ని రాష్ట్రాలు కరోనా లెక్కలు ఖచ్చితంగా ఇవ్వడం లేదనే అనుమానం ఉంది. ఆఫ్రికా నుంచి ఎటువంటి సమాచారం కనబడలేదు. హెల్త్ డాక్యుమెంటేషన్, హెల్త్ డేటా విషయంలో తెలంగాణ రాష్ట్రం చాలా బాగా చేసింది. కుటుంబం మొత్తాన్ని ఆరోగ్య కార్డులు ఇచ్చి కరోనా సమయంలో సెంట్రలైజ్ డాక్యుమెంటేషన్ కిందకి తెస్తే ఇంకా ఉపయోగం ఉంటుంది. ప్రపంచ మొత్తంలో ఆరోగ్య సమాచారం చాలా వెనుకబడి ఉంది అనుకోవాలి. ఈ విషయంలో అన్ని దేశాలు ఆలోచించాలి.

**ఇటువంటి విపత్తులు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి?**

విపత్తులు రాకుండా ఉండడానికి ఖచ్చితమైన సమాధానం ఉండదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. వైద్య, విద్య, సాంకేతిక రంగాల్లో అవసరమైన రీసెర్చ్ అప్లైడ్‌కు సదుపాయాలు కల్పించాలి. ఈ రంగాల్లోకి వచ్చేటట్టు యువతను ప్రోత్సహించాలి. వివిధ రంగాల మధ్య సమన్వయం చాలా ముఖ్యం. నగరాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇది బలం కాదు బలుపు. గతంలో బోలఖ్‌పూర్‌లో కలుషిత నీటితో 27 మంది ఒకేరోజు మరణించారు. కావున చిన్న తప్పు వందలు వేల మందిని మరణానికి దారి తీస్తుంది. ఇప్పుడు నేర్చుకోవాల్సింది నగర ప్రణాళికల్లో ఎటువంటి మార్పులు తీసుకురావాలి. ఆల్ రెడీ జరిగిన అభివృద్ధిలో ఏం మార్పులు తీసుకు రాగలుగుతామో ఆలోచించాలి.

> **విపత్తులు రాకుండా ఉండడానికి ఖచ్చితమైన సమాధానం ఉండదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది.**

**రాబోయే రోజుల్లో విద్యా వ్యవస్థ ఎలా ఉండ బోతుంది?**

ప్రస్తుత పరిస్థితుల్లో డిస్టెన్సీ మూలంగా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ అనేది మొదలు పెట్టారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌తో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇద్దరూ అవగాహన కలిగి ఉండాలి. భారత్ విద్యారంగంలో ఎక్కువగా పేదవారే. కాబట్టి వారిని దృష్టిలో పెట్టుకోవాలి. ఒకే తరగతి గదిలో 100 మందిని కూర్చొబెట్టే బదులు టీచింగ్ మెథడాలజీని మార్చగలుగ తామా అని ఆలోచించాలి. కొన్ని రోజులు శని, ఆదివారాలు కూడా పని చేయాలి. ఏ సబ్జెక్టులో ఆన్‌లైన్లో చెప్పగలమో, ఏ సబ్జెక్టులు ఆఫ్‌లైన్‌లో చెప్పవచ్చునో గమనించాలి. ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎస్ఈఆర్‌టీ) ద్వారా అధ్యయనాలు చేయించాలి. ప్రభుత్వ సలహాదారులు కూడా క్షుణ్ణంగా ఆలోచించాలి. చీఫ్ సెక్రటరీగారు 'పీపుల్స్ పార్టిసిపేషన్ ' పుస్తకం రాసారు. వారికి ప్రజల భాగస్వామ్యం మీద గట్టి అవగాహన ఉన్నది. వీరు మిగతా రంగాలను లాక్‌డౌన్ పీరియడ్‌లో ఏ విధంగా ఓరియెంట్ చేయగలుగుతారో ఆలోచించాలి.

**రేపటి ప్రపంచం ఎలాంటి పాఠాలు నేర్చుకోవాలి?**

కొన్ని కట్టుబాట్లతో సమాజం ఉండాలి. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, జాతీయ, ప్రపంచ స్థాయి కర్తవ్యాలను నిర్వహించుకోవాలి. వ్యక్తిగతంగా, సంస్థాగతంగా, హక్కులు, బాధ్యతలు ఉన్నాయని తెలుసుకోవాలి. వీటిని సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సిన అవసరం రేపటి వ్యవస్థకి చాలా అవసరం. ఇంత కాలం ఏదో గడిచి పోయింది. అలా తీసుకెళ్లడానికి రాబోయే పరిస్థితులు సహకరించకపోవచ్చు. అందుకే వ్యక్తిగత స్థాయి నుంచి సంస్థాగతపరమైన బాధ్యతలని ఎంచుకోవాలి. గాంధీజీ చెప్పినట్లు సెన్స్ ఆఫ్ బిలాంగ్‌నెస్. ప్రతి ఒక్కరికి ఈ ఊరికి, ఈ సమాజానికి భాగస్థున్ని అనే భావన ఉండాలి. అప్పుడే బాధ్యతతో వ్యవహరిస్తారు.

**ఉపాధిరంగాలలో కరోనా ఎలాంటి ప్రభావం చూప బోతుంది?**

కరోనాలో ఉపాధి కన్నా ఉపాధి కల్పనలో మార్పులు తీసుకు రావాలి. ఇప్పుడు ఐటీ రంగంలో ప్రతి మూడు అడుగులకి ఒక క్యూబికల్ ఉంది. దాన్ని ప్రతి ఆరు అడుగులకి ఒక క్యూబికల్‌గా పెట్టుకోవచ్చు. మధ్యలో అతను వర్క్ ఫ్రం హోం చేసుకోవచ్చు. మార్పులు చేసు కోవడానికి కరోనా చాలా ఇస్తుంది. పూర్తిగా ఉపాధి కోల్పోయే పరిస్థితులు మాత్రం కరోనా కల్పించదు.

**కరోనా ప్రభావం పారిశ్రామిక రంగంలో ఎలా ఉండబోతుంది?**

ఇండస్ట్రియల్ రంగంలో సోషల్ డిస్టెన్సింగ్, హైజిల్ అన్నదే ఎక్కువ. ఇండస్ట్రీలో టోటల్ క్వాలిటీ, క్వాలిటీస్ సర్కిల్స్ ఎన్నో ఇంతకు ముందే వచ్చాయి. అనార్గనైజ్డ్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ దగ్గరే ప్రాబ్లమ్ వస్తది. అనార్గనైజ్డ్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌కి, మీడియం స్కేల్ ఇండస్ట్రీస్‌కి, వన్‌మ్యాన్ షో ఇండస్ట్రీస్‌కి ప్రభుత్వ సహాయం చేయాలి. ఎందుకంటే దాదాపుగా ఉత్పత్తి అంతా చిన్న పరిశ్రమల నుండే వస్తుంది.

**మన దేశ ఫెడరల్ వ్యవస్థ ఎలా ఉండబోతుంది?**

ప్రజల్లో మార్పు చాలా రావాలి. ప్రజలు ఈ రోజుకు కూడా ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యవహరించడం. ఎన్నుకోబడ్డ నాయకులు మమ్మల్ని ఎవరూ ప్రశ్నించ కూడదు అని అనుకోవడం. ప్రశ్నించడం అన్నది ప్రజాస్వామ్యంలో ఒక ఆరోగ్యకర వాతావరణం. వాళ్లు ప్రశ్న ఎందుకు వేస్తారు అంటే ఏదో లోపాలు ఉన్నాయన్నది. ఆ లోపాలను ఎలా సరి దిద్దుకోగలుగతాము అన్నదే ఆలోచన చేయాలి. రాష్ట్ర కేంద్రాల మధ్య ఆర్థికంగా ఇచ్చు పుచ్చుకోవడాలు ఈ ఫెడరల్ వ్యవస్థలో ఉండాలి. కావున దాన్ని మళ్లీ ఒకసారి పునరాలోచన చేసుకోవాలి.

***(సచిన్, మల్లేష్ – దక్కన్ ఛానల్ ఇంటర్వ్యూ ఆధారంగా)***

– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e: ackvs08@gmail.com

# ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికమాంద్యం

## తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ గారితో కోవిడ్-19పై ప్రత్యేక ఇంటర్వ్యూ

*అల్లం నారాయణ సీనియర్ జర్నలిస్ట్, నమస్తే తెలంగాణ దినపత్రిక మాజీ సంపాదకులు, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్. పత్రికా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా సేవలందిస్తున్నారు. కరోనా విపత్తుపై ఏప్రిల్ మాసంలో దక్కన్‌ల్యాండ్‌కు వారు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు.*

**ఇలాంటి విపత్కర పరిస్థితిల్లో కరోనా వ్యాప్తి ఏ విధంగా ఉండబోతుంది?**

కరోనా వైరస్ గురించి తెలిసింది చాలా తక్కువ. కానీ రకరకాల ఊహాగానాలు, అంచనాలు ఎక్కువుగా వస్తున్నాయి. కానీ బేసిక్ ఐడియా అయితే మాత్రం వుంది. కరోనా వైరస్ అనేది ఇంతకు ముందు వచ్చినటువంటి సార్స్ కుటుంబం నుంచి వచ్చిన వైరస్. ఈ వైరస్ అన్నిటికంటే ప్రమాదకర పాండమిక్‌గా తయారయ్యింది. ఒకర్నించి ఒకరికి సంక్రమించే పాండమిక్ వైరస్ అని అన్ని దేశాలకు తెలుసు. ఈ వైరస్ మీద ఉండే మిక్స్ ఎక్కువై దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందింది. చైనాలో ప్రారంభమయిన ఈ వైరస్ ముఖ్యంగా అమెరికాకు అతిపెద్ద సమస్యగా తయారైంది. ప్రపంచం వూహించిన దానికంటే ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవల్సి వస్తుంది. మరణాల విషయాలు చూసినప్పుడు, మొత్తం ప్రపంచ జనాభాలో మరణాల శాతం చాలా తక్కువ. సార్స్ నుండి మొదలు హెచ్ఐవి లాంటి చాలా వైరస్‌లు వచ్చినప్పటికి, ఆధునిక కాలంలో వచ్చిన వైరస్‌ల అన్నిటి కంటే కరోన ప్రభావం చాలా తక్కువ. అయితే దీని స్వభావం వల్ల చాలా గందరగోళం ఏర్పడింది. ఆర్థిక వ్యవస్థలని మాంధ్యంలోకి నెట్టేంతటి స్థాయిలో ప్రభావితం చేసింది.



**ప్రజలు, ప్రభుత్వాలు ఏ మేరకు ఈ కరోనా పరిస్థితిని తట్టుకొని ముందుకు వెళ్తున్నాయి?**

ప్రభుత్వాలు, ప్రజలు అంటే ప్రపంచ దేశాలలో తరతమ బేధాభిప్రాలు ఉన్నాయి. ఈ వైరస్ బారిన పడ్డ దేశాలల్లో వెనకబడ్డ దేశాలు చాలా వున్నాయి. వీటిలో చాలా దేశాలు వైరస్‌ను తట్టుకొని నిలబడ్డం ఆశ్చర్యంగా ఉంది. ముఖ్యంగా భారతదేశం లాంటి దేశంలో ప్రత్యామ్నాయం లేదు. వైద్యంలో, వైద్య సిబ్బంది అందుబాటులో ఆధునికంగా లేము. మిగతా ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు భారతదేశంలో సగం మేరకు కూడా సరైన వసతుల్లో లేము. మనము పాటించిన ఏకైక అస్త్రం లాక్‌డౌన్. ఇవాళ చాలా మంచి ఫలితాలు ఇస్తుంది. ఈ లాక్‌డౌన్ అనేది భారత్‌లో ఇప్పటివరకు దాదాపుగా నెలపైన అయినప్పటికి కూడా వచ్చిన కేసులు చూసినప్పుడు ఈ విషయం అర్థమవుతుంది. భారత్ లాక్‌డౌన్ అనే ఏకైక ఆయుధంతో మన ఆర్థికవ్యవస్థ దెబ్బతింటునప్పటికీ, అనేక నష్టాలు వాటిల్లుతున్నప్పటికీ, ప్రపంచంలో భిన్నమైన దేశం, ఎక్కువ జనాభా వున్న దేశం అయినప్పటికీ కూడా ఎన్నో కష్టానష్టాలకు ఓర్చి లాక్‌డౌన్ వల్ల వైరస్‌ను అరికట్ట గలుగుతున్నాం. ప్రపంచం మొత్తం చూసినప్పుడు అత్యంత ఆధునికమైన వైద్య సదుపాయాలు వున్న అమెరికా కుప్పకూలిపోయింది. ఈ వ్యవస్థలతో పాటుగా మనం బాగా ఆలోచించాల్సింది ఏమిటంటే, ఈ వ్యవస్థల స్వభావం వల్ల పెట్టుబడిదారీ దేశాలన్నీ ఆధునిక వసతులు ఏర్పడి కూడా, వాటి స్వభావం వల్ల హాస్పిటల్‌ల ప్రైవేటీకరణ జరిగింది. ఈ ప్రైవేటీకరణ వల్ల అనేక సమస్యలు. చాలా మందికి కేవలం బీమా సౌకర్యం మీద ఆధారపడ్డ వైద్యం. అసలు గవర్న మెంట్ అనేది వైద్యానికి చొరవ చూపక పోవడం అనేది అనేక కారణాల వల్ల ఆ పెట్టుబడి దేశాలే ఇవాళ కుప్పకూలి పోయిన పరిస్థితి. కానీ ఏ సౌకర్యాలు లేనప్పటికీ కూడా కేవలం భౌతికమైన దూరాన్నీ పాటిం చడం అలాగే మిగతా వ్యవస్థలనీ ప్రజల సహకారంతో మేనేజ్ చేస్తున్నారు. ఈ వైరస్‌ను అరికట్టాలంటే ప్రజల సహకారం ముఖ్యం, సామాజిక దూరం పాటించడం అనేది రుజువైన సత్యం.

**ప్రభుత్వాలు వైద్యరంగంలోనూ, శాస్త్రవిజ్ఞాన రంగంలోనూ ఏవిధమైన ప్రణాళికలు రూపొందించాలి?**

నిజానికి ఈ అనుభవం చాలా గొప్పది. వైరస్ వల్ల ఇట్లాంటి పరిస్థితులు ఇదివరకు ఎప్పుడూ లేవు. ఈ అనుభవం గొప్పది. ఎందుకు గొప్పదంటే ఎన్ని రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ, ఇవాళ ఆధునికంగా వచ్చిన కమ్యూనికేషన్ రెవెల్యేషన్ తర్వాత వచ్చిన గాడ్జెట్ గానీ, ఫోన్ గానీ, ఇంట్లో కూర్చుంటే అన్ని పనులు చేసే సౌకర్యాలు గానీ మనల్ని రక్షించలేవని ప్రపంచానికి వెల్లడయింది. మనకు ఎంత ఆధునికత వచ్చినప్పటికీ కూడా అంతిమంగా రక్షించేది వైద్యులు, వైద్యసిబ్బంది, వైద్య సౌకర్యాలు, ఆస్పత్రులు. కనుక ప్రపంచం ఈ నేపథ్యంలో గొప్ప అనుభవంతో పెట్టుబడిదారీ దేశాలు స్వామ్యవాద దేశాలు వెనుకబడ్డ దేశాలు, ప్రజాస్వామ్యదేశాలు కూడా చేయాల్సిన పని ఏమిటంటే బడ్జెట్‌లల్లో ఇప్పుడు రక్షణ కొనుగోళ్లకీ, యుద్ధాలకీ ఎట్లాంటి ఫుజూల్ (వృధా) ఖర్చు పెడుతున్నారో దాన్ని తగ్గించుకుని మానవాళిని

కాపాడుకోవడానికి ఇట్లాంటి వైరస్‌లు ఎప్పుడెప్పుడు వచ్చినా రక్షించుకోవడానికీ ఆస్పత్రులనీ, వైద్య సౌకర్యాలనీ పెంచుకోవడానికీ విపరీతంగా ఖర్చుచేయాల్సి ఉంటుంది. ఇదొక్కటే మానవాళిని రక్షిస్తదని ఇట్లాంటి వాటినుండి  ఇప్పుడు ఒక అనుభవంగా చెప్పుకోవచ్చు.

**అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన దేశాలు ఈ కరోనా వ్యాప్తిని ఎందుకు అరికట్టలేకపోతున్నాయి?**

చాలా విచిత్రమైన అనుభవాలున్నాయి. ఎందుకంటే ప్రజాస్వామ్య దేశాలు ఒకరకంగా అనాగరిక దేశాలని చెప్తా ఉంటాయి. ఆధునిక దేశాలన్నీ కూడా జీవిత భద్రత ఎక్కువ, జీవిత భద్రతతో పాటు ఆర్థిక భద్రత ఎక్కువ, ఒక భరోసా గల దేశాలు ఇవి. యూరోప్‌లో ఉన్న దేశాలు కానీ, బ్రిటన్, స్పెయిన్, అమెరికా, ఇటలీ లాంటి దేశాలను చూసినప్పుడు వైద్య సౌకర్యాలు గానీ, ఇతరేత్ర గానీ ఫర్ క్యాపిటల్ ఒక మనిషికి ఖర్చు పెట్టేదిగానీ, ఆదాయం గానీ చాలా ఎక్కువ ఉన్న దేశాలు. చాలా ఆశ్చర్యకరంగా ఇవన్నీ కూడా పెట్టుబడి దారీ దేశాలే. ఇవి కూలి పోయినాయి.  ప్రతిదేశంలో అటు యూరప్‌లో చూసినా, ఇటు అమెరికాలో చూసినా అత్యంత ఆధునిక సౌకర్యాలున్నాయి. కానీ పెట్టుబడి దారీ స్వభావం వల్ల అవి లాభాల కోసం ఏమైన చేస్తయి. అట్లాగే ఇప్పుడు ఉదాహరణకు మన తెలంగాణలో చూసుకుంటే ప్రత్యేకంగా ప్రైవేట్ హాస్పిటల్‌ల ఊసేలేదు. ఎందుకంటే ప్రైవేట్ హాస్పిటల్స్ అనేవి భిన్నమైనవి. మనం ఇట్లాంటి వైరస్ వచ్చినప్పుడు కానీ, ఇట్లాంటి పాండమిక్ వచ్చినప్పుడు ప్రైవేట్ హాస్పిటల్స్‌ని నమ్మలేం. అందుకే ప్రభుత్వానికి ఇవాళ గాంధీ హాస్పిటల్ ఒక్కటే మార్గంగా ఉన్నది. కాబట్టి ఎక్కడైనా కూడా విద్య, వైద్యం లాంటి మౌళిక వసతులన్నీ ప్రభుత్వాలు కల్పించాల్సిన అవసరం ఉన్నది. కనుక పెట్టుబడిదారి దేశాలను మోడ్రన్ దేశాలు, ఆధునిక దేశాలు చాలా గొప్ప దేశాలమని చెప్పుకుంటున్నాం. కారణం ఏమిటంటే పెట్టుబడిదారీ విధానం వలన లాభాలను ఆశించే సంస్థలు ఉన్నందు వల్ల. ఇవాళ చాలా పెద్ద క్రైసిస్ ఎదుర్కొంటున్నవి. అట్లాగే సరిపడ బీమా మీద ఆధారపడ్డా ఎక్కడైనా కూడా సరిపడే హాస్పిటల్స్ ఉంటే తప్ప మీ డిమాండ్‌కు తగిన సప్లై ఉంటుంది. ఇట్లా ప్రజా ఉపయోగాల కోసం, ప్రజా అవసరాల కోసం ఉండదు. అట్లాగే చైనాలాంటి దేశాలలో వైద్యమనేది ప్రజల పరం చేయడానికి  ప్రయత్నం చేసినారు. మన దగ్గర కేరళలో కూడా ఉన్నది. వీరందరికి కూడా మంచి ఫలితాలు వచ్చినవి. కేరళ గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయాలు డెవలప్ చేసినారు. చైనాలో పది రోజులలో పదివేల పడకల హాస్పిటల్‌ని కట్టినారు. ఇలాంటి అనుభవాలు చూసినప్పుడు అన్ని దేశాలు ఆధునిక మైనప్పటికీ ఆధునిక పరికరాలు, ఆధునిక సౌకర్యాలు ఉన్నప్పుడు కూడా ఎదుర్కోడానికి ఎందుకు విఫలమవుతు న్నాయంటే, అక్కడి పెట్టుబడిదారి స్వభావం. ప్రభుత్వాలు ఆలస్యంగా మేల్కోవడం. అక్కడి జీవన విధానం. ఉదాహరణకి స్పెయిన్, ఇటలీలలో ప్రజలు బయటనే ఉంటరు, బయటనే తింటరు. అలాగే అమెరికాలో శుక్రవారం దాకా పనిచేస్తారు. శుక్రవారం తరువాత ఒక్క మనిషి కనపడడు. ఇలాంటి అవుటింగ్ కల్చర్ ఒకటి ఉన్నది. ఇటువంటి దేశాలలో పాండమిక్‌గా మారి చాలా విపరీతంగా విరుసుకుపడింది. దాన్ని కంట్రోల్ చేయడానికి వాళ్లు చాలా తంటాలు పడుతున్నారు. ప్రజాస్వామ్య దేశాలలో ఉన్న గొప్ప లక్షణం ఏమిటంటే అరకొరగా ఉన్నప్పటికీ కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న వైద్య వ్యవస్థలు ఇంకా కొంచెం బ్రతికి ఉండడం. ఇవాళ మనం కొంచెం మెరుగుగా ఉండడానికి కారణంగా  చెప్పుకోవచ్చు.

భవిష్యత్తులో అతి పెద్ద మార్పు ఆర్థికరంగం మీద పడుతున్నది. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికరంగంలో పెరిగిన అసమానతలు ఇవాళ మన కండ్లకు కొట్టొచ్చినట్టుగా కనబడు తున్నాయి.

**ఆర్థికరంగం ఎలా ఉండబోతుంది? మీ సూచనలు సలహాలు?**

భవిష్యత్తులో అతి పెద్ద మార్పు ఆర్థికరంగం మీద పడుతున్నది. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికరంగంలో పెరిగిన అసమానతలు ఇవాళ మన కండ్లకు కొట్టొచ్చినట్టుగా కనబడు తున్నాయి. భారతదేశంలో రెండు భారత్‌లు ఉన్నాయి... ఇండియా, భారత్. వలస కూలీలు ప్రాణాలకు తెగించి 1800 కిలోమీటర్లు పోయినవారు ఉన్నారు. ఇంకొక వైపు లోకల్‌గా ఉన్నవాళ్లు నియమాలు పాటించకుండా రోడ్లమీద తిరిగేవాళ్లు ఉన్నారు. ఇలా భిన్నమైన పరిస్థితులు ఉన్న దేశం కనుక ఆర్థికంగా విపరీతంగా నష్టపోయే అవకాశం ఉన్నది. 1930లో వచ్చిన ఉపద్రవం, తరువాత అమెరికాలో వచ్చిన ఆర్థిక మాంధ్యం లాంటివి వచ్చే అవకాశం ఉన్నదని నిపుణుల అంచనాలు చెపుతున్నాయి. ఎందుకంటే లాక్‌డౌన్ పీరియడ్‌లలో అన్ని దేశాలలో దాదాపుగా 60 నుంచి 70 రోజులు, 50 నుంచి 70 రోజులు ఇలా లాక్‌డౌన్ ప్రకటించిన దేశాల్లో ఉత్పత్తి స్తంభించి పోయింది. ఈ ఉత్పత్తి అనేది గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఒక దేశం నుంచి ఇంకొక దేశానికి సంబంధాలు ఉన్న ఉత్పత్తి కాబట్టి ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి రంగం అనేది పూర్తిగా క్షీణించి పోయింది. ఆర్థికరంగం, సేవల రంగం పనిచేయడం లేదు. వీటి వల్ల వచ్చిన పరిణామాలు రెండు నెలలకే ప్రపంచ వ్యాప్తంగా ఒక ఆర్థికమాంద్యం దాపురించే అవకాశం కలుగుతుంది. అలాగే మనుషుల్లో వస్తున్న మార్పు. ఇవాళ్ల కొనుగోలు శక్తి ఉన్నప్పటికీ కొనడం ఏమిటి అనే విచక్షణ వచ్చే అవకాశం ఉంది భవిష్యత్తులో. ఇంతకు ముందు బ్రాండెడ్ షర్ట్ కొంటే ఇప్పుడు మామూలు షర్ట్ కొనుక్కునే అవకాశం ఉంది. ఏవైతే లగ్జరీస్ అనుకున్నారో జీవితంలో వాటన్నిటి నుంచి రాజీపడే అవకాశం ఉంది. ఇవే కాకుండా కుదేలైన ఆర్థికరంగం, వస్తు ఉత్పత్తి రంగం, ఆటోమొబైల్ రంగం వీటన్నిటి వల్ల డిమాండ్, సప్లైలో  తీవ్ర వ్యత్యాసం వుండే అవకాశం వుంది. అలాగే దాదాపుగా 16 కోట్ల మంది ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది. ఈ ఉపాధి కోల్పోయే వాళ్ళందరికీ కూడా కొనే శక్తి నశించినందువల్ల చాలా తీవ్రమైన ఆర్థిక మాంధ్యం ప్రపంచాన్ని పట్టి పీడించే అవకాశం ఉంది. భవిష్యత్తు ఇప్పుడు అంచనా వేసే దానికంటే భయంకరంగా ఉండబోతున్నది అని చెబుతున్నారు. ఇండియాలో డీ–మ్యానిటేజేషన్ అనేది అనవసర ప్రక్రియ. ఆ తరువాత అనుసరించిన విధానాల వల్ల చాలా వరకు ఇండియాలో ఇప్పటికే ఆర్థికమాంధ్యం సూచనలు ఉండినాయి. దానిమీద ఒక పిడుగులాగా

మళ్లీ ఈ కరోనా వైరస్ అనేది రెండు నెల్ల పాటు దాదాపు దేశాన్ని మూసి వుంచినందువల్ల భారతదేశం విపరీతమైన ఆర్థిక మాంద్యంలోకి పోయే ప్రమాదంలో కనబడుతున్నది. ఇప్పటికీ రోడ్ల మీద తమ స్వస్థలాలికి వెళ్లాలని తహతహలాడుతున్న వలస కూలీల జీవితాలను రోజూ చూస్తున్నాం. మన జీడీపీ 203 లక్షల కోట్లు. ప్రభుత్వానికి సంబంధించిన జీడీపీ 203 లక్షల కోట్లు అయితే, ఒక పది పదిహేను కార్పొరేట్ కుటుంబాల దగ్గర 446 లక్షల కోట్లు సంపద ఉన్నది. ఈ అసమానతల వల్ల కూడా వచ్చే సమస్యలు చాలా ఉన్నాయి. భారతదేశపు జీడీపీ కంటే దాదాపు రెట్టింపు జీడీపీ ధనం ఇవాళ కార్పొరేటర్ల దగ్గర ఉన్నది. ఉదాహరణకు ఒక వైపు కరోనా మనందరి జీవన్మరణ సమస్య అనుకుంటుంటే ఫేస్‌బుక్‌లో అంబాని గ్రూప్ 43వేల కోట్ల అతిపెద్ద ఎఫ్‌డీఐ ఒప్పందం చేసుకున్నది. అంటే పెట్టుబడి దారులుగా ఆ కంపెనీలు గానీ, కార్పొరేట్ కంపెనీలుగానీ లాభాలు ఆశిస్తే తప్ప మానవాళిని పట్టించుకోవు. ఎన్ని లోపాలు ఉన్నా మానవాళిని మళ్లీ ప్రభుత్వాలు మాత్రమే పట్టించుకోవాలి. కార్పొరేటర్లకు దోచిపెట్టే ప్రభుత్వాలు ఉన్నవి కనుక ఈ కార్పొరేట్ల సౌకర్యాల కోసం 446 లక్షల కోట్ల సంపద పది పదిహేను మంది చేతుల్లో ఉన్న సౌకర్యాల కోసం ఖర్చు పెడితే ఈ అంతరాలు మరింత పెరిగే అవకాశం ఉంది. భారతదేశం, పాకిస్తాన్ లాంటి దేశాలన్నీ కూడా దుర్భర దారిద్ర్యంలో కొట్టుమిట్టాడే అవకాశం ఉంది. ఐ.రా.స. లెక్కల ప్రకారం గానీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కిస్తున్న ప్రకారం గానీ దాదాపుగా మూడు కోట్ల నుండి ఆరు కోట్ల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో ఆకలితో భవిష్యత్తులో చనిపోయే అవకాశం ఉందనే హెచ్చరికలు వస్తున్నాయి. ఒక చిన్న వైరస్‌తోటే మన జీవితం ముడిపడి ఉంటది. మంచి వైరస్‌లు కూడా ఉంటవి. చెడ్డ వైరస్‌లలో ఒక చిన్న వైరస్ ఇవాళ ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన చరిత్రను మనం చూస్తున్నాం. భవిష్యత్తు భయానకంగా ఉండే అవకాశం ఉంది. కనుక చాలా మార్పులు వస్తాయి. ఆర్థికంగా కావచ్చు, ప్రజల జీవన విధానాల్లో, సామాజిక జీవన విధానాల్లో కావచ్చు. ఈ మార్పులన్నీ ప్రతిబింబించే అవకాశం ఉంది.



**వైద్య, ఆర్థికరంగాలలో బలమైన కొన్ని దేశాలు కరోనా వ్యాప్తిని ఎదుర్కోవడంలో విఫలమయ్యాయి. చిన్న చిన్న దేశాలు కరోనా వ్యాప్తిని అరికట్టగలుగుతున్నాయి. ఎందువల్ల?**

చిన్న దేశాలలో వాళ్ల మెథడాలజి చాలా బాగుంది. ఉదాహరణకి సౌత్ కొరియా, వియత్నాం. ఈ రెండు మంచి ఉదాహరణలు. వియత్నాం, దక్షిణ కొరియా అంత వెసులుబాటు ఉన్న దేశాలేమి కావు. వాళ్ల మీద విపరీతమైన ఒత్తిళ్లు, ఆంక్షాలు ఉన్నప్పటికీ ఆ రెండూ దేశాలు ఈ వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగల్గినాయి. ఆధునిక వ్యవస్థలు కలిగిన పెట్టుబడిదారి సమాజంలో ఉన్నప్పటికీ జర్మనీ కొంత సమర్థంగా ఎదుర్కోగల్గింది. జర్మనీలో అనుసరించిన వైద్య విధానం. ముఖ్యంగా ఈ వైద్యవిధానం కమ్యూనిటీలో గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. ఒకసారి ఒక శాంపిల్స్‌లో 64 టెస్టులు చేసి రెండున్నర కోట్ల మంది జనాభాకి టెస్టులు చేయగలిగినారు. ఎక్కువ టెస్టులు చేసిన ప్రతి దేశంలో మంచి ఫలితాలు వచ్చినాయి. భారతదేశంలో విషాదకరం ఎక్కడంటే జర్మనీలో పది లక్షల మందిలో దాదాపు లక్షా ముప్పై ఐదువేల టెస్టులు చేస్తే భారతదేశంలో పది లక్షల మందిలో 350 టెస్టులు మాత్రమే చేశారు. ఇక్కడ కరోనా వ్యాప్తి అరికట్టడానికి, ఒకరి నుంచి మరొకరికి సోకకుండా ఉండడానికి ప్రధానమైనది ఏమిటంటే రోగిని గుర్తించడం. ఇలా టెస్టులు జరగని దేశాలలో ముఖ్యంగా భారతదేశంలో చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉన్నది. అయినప్పటికీ కూడా మనం లాక్‌డౌన్ అనే ఒక ఆయుధంతో నెట్టుకు రాగలు గుతున్నాం. చిన్న దేశాలుగా చెప్పుకున్న దక్షిణ కొరియా, జర్మనీ, యూరప్‌తో చూసు కున్నప్పుడు బ్రిటన్, స్పెయిన్, ఇటలీలు నిలబడలేక పోయాయి. జర్మనీ 5 వేలకే కట్టడి చేసుకోగల్గింది. ఈ టెస్టుల వల్ల, కొన్ని వైద్య విధానాలు, సామాజిక విధానాలు, లాక్‌డౌన్ త్వరగా ప్రకటించడం, అలాగే ప్రజలను అప్రమత్తం చేయడం వ్యాప్తిని నియంత్రించవచ్చు. సింగపూర్ లాంటి దేశాలల్లో ప్రజలు ప్రభుత్వా విధానాలు, చట్టాలను పాటిస్తారు. రోడ్డుమీద ఉమ్మివేసినా జరిమానా వేస్తారు. చాలా ముఖ్యమైన ఒక క్రమశిక్షణ కనబడుతుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ లైట్స్, రెడ్ లైట్స్ దగ్గర ఖచ్చితమైన నిబంధనలు పాటిస్తారు. అక్కడి ప్రజలు పొరపాటున కూడా రెడ్‌లైట్ ఉన్నప్పుడు వాహనాలు పోనియ్యరు. ఇటువంటి చైతన్యం, పౌరస్పృహ కల్గిన దేశం సింగపూర్ కాబట్టి వైరస్‌ను కట్టడి చేసింది. మొదట కొంత వెసులుబాటు ఇచ్చినా మళ్లీ లాక్‌డౌన్ ప్రవేశ పెట్టారు. ఇటువంటి దేశాలను ఆదర్శంగా తీసుకున్నప్పుడు వైద్య విధానంలో కొత్త పద్ధతులు అనుసరించడం, వైద్య విధానంతో పాటు సామాజిక దూరాలు పాటించడం. వ్యవస్థల యొక్క గొప్పతనం, ప్రజల సివిల్ సివిక్ సెన్స్ వల్ల చాలా వరకు తగ్గింది. ఉదాహరణకు హైదారాబాద్‌ను సింగపూర్‌తో పోలిస్తే హైదరాబాద్‌లో లాక్‌డౌన్ ప్రకటించినప్పటి నుంచి రోడ్లు ఎప్పుడూ ఖాళీ లేవు. ఇప్పటికీ ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్న చిన్న సిల్లీ కారణాలతో బయట తిరిగేవాళ్లు చాలా మంది ఉన్నారు. అంటే ఈ సివిక్స్ సెన్స్ అనేది ఇంతకు ముందే లేదు మనకి. హైదరాబాద్‌లో ట్రాఫిక్ చూసినా, ఇలాంటి సమస్యలు చూసినా మనకు అర్థమవుతది. సివిక్‌సెన్స్ ఉన్న ప్రజలు, వైద్య విధానాలు, సామాజిక విధానాలు ఈ మూడు ఉన్న దేశాలు సింగపూర్, వియత్నాం, దక్షిణ కొరియా, జర్మనీ, యూరప్. ఇవి వైఫల్యం కాలేదు. ఆధునిక దేశం, సాంకేతికంగా అద్భుతమైన దేశమైనప్పటికీ అమెరికా ఇవాళ విఫలమై ఎలా విలవిల లాడుతున్నదో మనం గమనిస్తున్నాం.

ముందుగా లాక్‌డౌన్ నిర్ణయం తీసుకుకోవడం, దాన్ని అమలు చేయించడం, ఎక్కువ పరీక్షలు జరపడం. ఈ ఎక్కువ పరీక్షలు ద్వారా వచ్చిన కాంటాక్ట్ మళ్లీ ఇంకొకరికి సోకకుండా చూడడమనేది ఈ వైరస్‌లో ముఖ్యమైనది. ఇంకొక వైపు అంకితభావం ఉన్న వైద్యులు. అమెరికాలో

మన ఇండియన్ డాక్టర్‌కు వాహనాలతో బారులు తీరి గౌరవం చేసినారు. ఇవాళ వైద్యులే చాలా ముఖ్యం. మన దగ్గర వైద్యుల మీద దాడులు జరుగుతున్నవి. వైద్యులకు అక్కడ వాళ్లు గౌరవం ఇస్తుంటే మనం ఇక్కడ వాళ్లమీద దాడి చేస్తున్నాం. ఈ వైద్యుల మీద దాడి చేసిన వారికి ప్రభుత్వం ఏడేళ్ల శిక్ష అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. అంటే ఇది సివిక్స్ సెన్స్. వైద్యులు ప్రాణదాతలు అనేది గుర్తించడం. ఈ సమయాల్లో వైరస్‌ను కట్టడి చేయడానికి వైద్యులు తప్ప మరో మార్గం లేదు అని గుర్తించడం. 'వైద్యో నారాయణో హరి' అని ఊరికే చెప్పితే సరిపోదు. వైద్యులను, వైద్య సిబ్బందిని, పారిశుధ్య సిబ్బందిని గౌరవించడం. పోలీసులు కూడా చాలా ఉపయోగపడుతున్నారు. పోలీసులను గౌరవించడం నేర్చుకోవాలి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు కూడా ఈ విషయాలను పదే పదే చెబుతున్నారు. ఆయనకు కూడా నిజానికి కృతజ్ఞులమై ఉండాలి. ఆయన సరైన సమయాలలో మొత్తం ప్రాపంచిక వ్యవహారాలన్ని చూసి, లాక్‌డౌన్ తీసేస్తే ఏమవుతుందో పరిశీలించి లాక్‌డౌన్ పెంచడం. ఈ కారణంగా తెలంగాణలో తబ్లీగ్‌ని మినహాయిస్తే వచ్చిన కేసులు దాదాపుగా కొన్ని వందలకంటే మించే అవకాశం తక్కువ. లాక్‌డౌన్ నిర్ణయం ముందుగా తీసుకోవడం, దాన్ని పొడిగించడం. తరువాత వైద్య సిబ్బందిని ఉపయోగించు కోవడము, హాస్పిటల్ సౌకర్యాలు పెంచుకోవడం వీటన్నటి వల్ల తెలంగాణ కూడా ఒక మెరుగైన పరిస్థితిలో ఉందని చెప్పుకోవచ్చు.

### ప్రపంచ దేశాల సంబంధాలు ఎలా ఉండ బోతున్నాయి?

నిజానికి ఇదంతా ఊహగానాలే గానీ ఇప్పుడే మనకు బయట పడుతున్నాయి. వైరస్ ఎక్కడనుంచీ వచ్చింది? ఎలా వచ్చింది? అనే దాని మీద విపరీతమైన ఊహగానాలు. మీడియా కూడా ఇవాళ చాలా ఆశ్చర్యకర మైన పాత్రలో ఉంటున్నది. చివరికి మీడియా వల్ల ఏమైదంటే నోమ్‌ట్రాన్స్‌కిల్లర్ చెప్పినట్లుగా ఒక సమ్మతి తయారవుతుంది. కన్‌సెట్‌ని మేడ్ చేస్తది మీడియా. అంటే అందరి జన ఆమోదాల్ని పొందడానికి ఒప్పిస్తది. మీడియా ఎలా తయారవుతుందంటే చైనాలో వైరస్ ప్రకృతి పరంగా వచ్చిందా? గబ్బిలాలనుండి వచ్చిందా? ఎక్కడ్నుంచీ వచ్చింది? మీట్ షాప్ నుండి వచ్చిందా? మీట్ మార్కెట్ నుండి వచ్చిందా అని పట్టించు కోకుండా చైనా కావాలనే వదిలి పెట్టిందని మొదలైంది చర్చ. ఇవాళ అమెరికా ఎక్కడదాకో పోయింది. ఇరాక్‌లో ఆయుధాలు ఉన్నాయని దాని మీద దాడి చేసింది అమెరికా. కానీ అక్కడ ఆయుధాలు లేవు. ఈ విషయం అన్ని దేశాలకు తెలుసు. ఇరాన్ మీద దాడి చేసినప్పుడు కూడా ఇలానే. అలా చాలా గ్లోబెల్ ప్రచారాలు చేస్తుంటది అమెరికా. గ్లోబెల్ యూరప్‌లో మొదలైనప్పటికీ, అమెరికా అంతకంటే అధ్వానమైన గ్లోబెల్స్ ప్రచారాలు చేస్తుంటది. ఇలాంటివి అందుకొని చివరికి ఆ దేశ అధ్యక్షుడు ట్రంఫ్ తన దేశానికి కారణమైనటువంటి వాటిని చైనా మీదికి నెడుతుంటాడు. ఇప్పుడు ఐ.రా.స., డబ్ల్యూహెచ్‌వో (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్)కు నిధులు బంద్ చేసింది అమెరికా. వరల్డ్ ఆర్గనైజేషన్ చెబుతున్నది ఏమిటంటే. అది బయట నుంచి రాలేదు, నేచురల్‌గానే వచ్చిందని చెపుతున్నారు. అలా చెప్పినందుకు చైనా తొత్తు డబ్ల్యూహెచ్‌వో అంటుంది అమెరికా. ఇలాంటి వ్యవహారాలు ఒకదేశానికి ఇంకో దేశానికి మధ్య వుండే సంబంధాలని దెబ్బకొట్టే అవకాశం ఉంది. కాబట్టి మళ్లీ ప్రచ్ఛన్న యుద్ధాలు, వాణిజ్య యుద్ధాలు ఇప్పటికే అమెరికా చైనా మధ్య మొదలయ్యాయి. హువాయ్ ఎలక్ట్రానిక్ సంస్థ, ఒక సాఫ్ట్‌వేర్ సంస్థ లేదా ఫోన్ల తయారు చేసే సంస్థ, 5జీ తయారు చేసే సంస్థ అనుకోవచ్చు. ఇట్లాంటి దానివల్ల వచ్చిన వాణిజ్య యుద్ధాలు భవిష్యత్తులో విపరీతంగా వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు భవిష్యత్తులో గ్లోబలైజేషన్ మీద, అలాగే అన్ని దేశాలు కూడా హెల్త్ మీద దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కాబట్టి వారి వారి బడ్జెట్లు మార్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. రక్షణ కొనుగోళ్లు చాలా వరకు తగ్గే అవకాశం ఉంటది. ఎందుకంటే బడ్జెట్‌లన్నీ వీటికి పోవల్సి వస్తుంది. కానీ ఈ రక్షణ కొనుగోళ్లు పోతే మళ్లీ ఇక్కడ యుద్ధాల కలహాలను సృష్టించే అమెరికా లాంటి దేశాలు దెబ్బ తింటాయి. ఆయుధాలు అమ్ముకొని బతికే దేశాలు ఇవన్నీ. అమెరికా, ఫ్రాన్స్, యూరఫ్ దేశాలన్నీ కూడా. ఇవన్నీ మనకు ఆయుధాలు అమ్మే దేశాలు. కాబట్టి ఈ వ్యాపా రాలు పోకుండా ఉండడానికి కూడా యుద్ధాలు సృష్టించే అవకాశం ఉంది. ఇలా గ్లోబలై జేషన్ నేపథ్యంలో ఉండే నెట్‌వర్క్‌లన్నీ దెబ్బతినే అవకాశం ఉంది.

> **ఇవాళ గ్లోబలైజేషన్ అనేది మళ్లీ కుగ్రామం వైపుకు, కమ్యూనికేషన్ రెవెల్యూషన్‌లో, ఇంటికి సామానులు తెచ్చుకునే మొత్తం వ్యవస్థలన్నీ కూడా కుప్పకూలిపోతాయి. మళ్లీ మన కిరాణ దుకాణం మనకు గొప్పగా కనబడు తున్నది.**

ఇవాళ గ్లోబలైజేషన్ అనేది మళ్లీ కుగ్రామం వైపుకు, కమ్యూనికేషన్ రెవెల్యూషన్‌లో, ఇంటికి సామానులు తెచ్చుకునే మొత్తం వ్యవస్థలన్నీ కూడా కుప్పకూలిపోతాయి. మళ్లీ మన కిరాణ దుకాణం మనకు గొప్పగా కనబడు తున్నది. కిరాణా దుకాణంలో అన్నీ కొనుక్కుంటున్నాం. ఇంటి ముందుకు వచ్చే కూరగాయల బండి గొప్పదనిపిస్తుంది. మాల్స్ కల్చర్ పోతుంది. ఇవన్నీ కూడా ఎగుమతి చేసినవారు ఎవరు? గ్లోబలైజేషన్‌లో చాలా అభివృద్ధి, లేదా సాంకేతి కంగా అభివృద్ధి చెందిన దేశాలు. చాలా వరకు అభివృద్ధి చెందిన దేశాలు. ఈ ఎగుమతులన్నీ రద్దయినప్పుడు మళ్లీ దేశీయ విధానం పుంజు కున్నప్పుడు, వ్యవసాయం లాంటివి పుంజుకున్నప్పుడు భవిష్యత్తులో మరిన్ని ప్రచ్ఛన్న యుద్ధాలు, వాణిజ్య యుద్ధాలు జరిగే అవకాశం ఉంది. ఇవాళ ఐరాసను ధిక్కరిస్తున్నారు. హువాన్‌ను ధిక్కరిస్తున్నారు. వీటన్నింటి వల్ల తీవ్రమైన మార్పులు అంతర్జాతీయంగా జరిగే అవకాశం ఉందని భావించాలి.

### వలస కార్మికుల దుస్థితికి కారణాలేమిటి? ప్రభుత్వాలు వాటిని ఎలా పరిష్కరించాలి?

వలస కార్మికుల సమస్య భారతదేశంలో అతి గొప్ప సమస్య. భారతదేశం ఒక మహోన్నతమైన దేశం అని చెప్పుకుంటుండే ఎవరైనా కూడా మొదట ఆలోచించాల్సింది మన భారతదేశంలో ఉన్న రోడ్ల మీద, రోడ్డు పక్కన, ఫ్యాక్టరీల పక్కన, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్‌గా నిర్మాణాల పక్కన

అరకొర వసతులతో జీవిస్తున్న మూడు కోట్ల మంది వలస కూలీలను మొదలు పట్టించుకోవాల్సి ఉంది. మన దగ్గర అనుకోకుండా లాక్‌డౌన్ ప్రకటించారు. ఒక నిర్ణయం ప్రకటించే ముందు అంతకు ముందు చేయాల్సిన ఏర్పాట్లు ఏమీ చేయకుండా, వలస కూలీలను ఒక రాష్ట్రం నుంచి ఇంకొక రాష్ట్రానికి తరలించడం లాంటివి కానీ, మూడు నాలుగు రోజులు సమయం ఇచ్చి వుంటే గానీ, ఎక్కడివి అక్కడ సర్దుకుని ఉండేది. కానీ అన్నిటిని లాక్‌డౌన్ చేయడం వల్ల వలస కూలీలు అందరి కంటే ఎక్కువ ఇబ్బందిపడ్డారు. ఈ వలస కూలీలు ఈవాళ భారతదేశంలో రోడ్ల మీద వందలాది కాదు, వేలాది కాదు, లక్షలాది కదలిపోవడాన్ని, వందల కిలోమీటర్లు, వేలుపైన కిలోమీటర్లు నడవడం గురించి, గర్భిణీలు చనిపోవడం గురించి వార్తలు వస్తున్నాయి. ఈ వలస కూలీలు నిజానికి ఇంత దుర్భరవ్యవస్థలో ఉండవల్సిన అవసరం లేదు. అసంఘటిత కార్మిక రంగానికి సంబంధించి 36వేల కోట్ల రూపాయలు మూలుగు తున్నాయి. వాటిని ఏమీ పట్టించుకోలేదు. భారతదేశంలో అతి గొప్ప ప్రణాళికలు వేస్తున్నా రెండుమూడు వేల కోట్లు అని చెబుతున్నారు. కానీ వలస కార్మికుల గురించి ఒక్క పైసా కేటాయించిన అవకాశాలు లేకుండా పోయినాయి. రేషన్ కార్డులు లేని వాళ్లు కానీ, గుర్తింపు లేని వాళ్లు వుంటే వాళ్లకు కనీస సాయం కూడా అందడం లేదు. రూ.500 వందలు జనధన్ ఖాతాలో వేస్తే భారతదేశం బాగుపడుతుంది అనుకోవడం భ్రమే. వలస కార్మికులకు ఈ పరిస్థితి ఉంటే వాళ్లు కోల్పోయిన ఉపాధికి సంబంధించి భవిష్యత్తు ఒక భయంకరంగా ఉంటున్నది. రోజువారి పనిచేసి బతికేవాళ్లకు, అతి ముఖ్యమైనది వనరులు పోతే రేపొద్దున ఏమిటి భవిష్యత్తు అనేది తెలియదు.



కనుక ముందు ముందు అతిపెద్ద సమస్య వలస కార్మికులు. ఈ 3కోట్ల మంది వల్ల అసలు సమస్య వచ్చే అవకాశం ఉందని భావించాల్సి ఉంటుంది.

### పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

వైరస్‌ల పుట్టుకలు కొత్తవి ఏమీ కావు. ప్లేగు వ్యాధి నుంచి హెచ్ఐవి, సార్స్ వరకు వీటన్నిటి వల్ల అనుభవంలో ఉన్న వాళ్లమే. కానీ సాంకేతికంగా గెలుచుకుంటూ వచ్చినం. కరోన వైరస్ ఒక చిత్రమైనది. ఈ వైరస్ చాలా చిత్రంగా ప్రవర్తించడం వల్ల మనకు చాలా సమస్యలు కనబడుతున్నాయి. ప్రకృతిలో ఈ వైరస్‌ల పుట్టుక సహజం. కానీ ఏ జీవరాశిని, ఆ జీవరాశిగా బతకనివ్వటం చాలా ముఖ్యం. సమస్య ఎక్కడ వస్తున్నది అంటే ప్రకృతిని ధ్వంసం చేయడం. మనుసులు మాత్రమే ప్రకృతిని ఆక్రమించు కోవడం. దురాక్రమణ చేయడం. మొత్తం ప్రకృతి వనరులను కొల్లగొట్టడం. ప్రకృతిలో ఉన్న జీవసమతుల్యను దెబ్బతీయడమనేది ఇవాళ అతిపెద్ద చేరువుగా, అతిపెద్ద భయంకరమైన వ్యాధిగా నిర్ధారణమైంది. ఇప్పుడు మనం ఆలోచిస్తే ఈ లాక్‌డౌన్ కాలంలోనే ప్రతి నగరం కూడా ఢిల్లీనగరం ఫొటోలు కూడా వచ్చినవి మీడియాలో. నిర్మలాశంగా కనబడుతుంది. ఢిల్లీలో జీవించడం సాధ్యం కాదని వెహికల్స్‌ను కంట్రోల్ చేసినారు. ఒకరోజు ఒక వెహికల్ ఇంకోరోజు ఇంకో వెహికల్ అని. ఇలాంటి పరిస్థితి నుంచి క్రమక్రమంగా కోలుకుంటున్నాయి. ప్రకృతి విధ్వంసం వల్ల ఒక వైపు వర్షాకాలపు, వానల, నీటి వనరుల కొరత ఎదుర్కొంటూ, రెండో వైపు ఈ విధ్వంసానికి మనమే మూల కారణం అవుతున్నాం. జీవ రాశుల్లో మనం ఒక భాగం. ఈ భూమి మొత్తం మనదే కాదు. ఈ భూమి అనేక జీవరాశులకు నిలయం. వాటిని బతకనియ్యాలి, మనం బతకాలి అనే ఒక సమతుల్యతను మనం కోల్పోడం వల్ల వచ్చిన పరిణామాలు చాలా వున్నాయి. భవిష్యత్తుల్లో దీని మీద కూడా విపరీతంగా ఆలోచించాల్సి వస్తుంది. దాంతో పాటు కృత్రిమ మార్కెట్ మనకు అలవాటు అయిపోయింది. ఉదాహరణకు మనిషిలో సహజంగానే రోగనిరోధక శక్తి ఉంటుంది. ఉదాహరణకి ఆదిలాబాద్‌లో ఇసుక చెలిమిలోంచి నీళు తెచ్చుకునేవాళ్లు, బావులలో నీరు త్రాగేవాళ్లు ఇప్పటికీ బతుకుతూనే ఉన్నారు. కానీ మనం ఏమి చేసినాం ఇరవై రూపాయల నీళ్ల బాటిల్ తాగితేనే ఇమ్యూనిటీ. మీరు హోటల్‌లో చేతులు పెట్టిన నీళ్లు తాగితే చచ్చిపోతారు. హోటల్ నీళ్లు తాగలేరు. బయటికి పోతే నిజంగానే చచ్చి పోతారనే సెన్స్ ఉంది. నిజమే వాటర్ బౌండ్ డిసీజ్ ఎక్కువగా ఉన్నప్పటికీ కూడా ఒక రోగనిరోధక శక్తి ఉన్నది. ఇప్పుడు ఉదాహరణకి కరోనా అందరికీ సోకుతలేదు. ఒక ఫ్యామిలీలో కొందరికి సోకుతలేదు. కారణం ఏమిటంటే రోగనిరోధక శక్తి. దీన్ని పెంచడానికి ప్రయత్నం జరగాలి. ఇది నేచురల్‌గా ఉండాలి. రెండో వైపు ఈ మార్కెట్‌ను మనం నమ్మితే ఇప్పుడు నీళ్లు తాగిస్తున్నది. అన్నీ తాగిస్తున్నది. కోకో కోలా మార్కెట్టే తాగిస్తున్నది, కోకో కోలా అనేది అత్యంత ప్రమాదకరమైన పురుగుల మందు. అది మనతోటి తాగిస్తది. మంచినీళ్లు మనతోటి తాగిస్తది. ఇరవై రూపాయలు పెట్ట మంటది. గ్లాసు నీళ్లు. మన ఇంట్లో మనం తాగే నీళ్లు. కానీ ఇప్పటికి కూడా భారతదేశంలో చేతులు కడుక్కోవడం క్యాంపెన్‌లో ఒక ముఖ్యమైన విషయంగా చెప్పుతాం. మనము చేతులతో ఒక చెత్త బుట్టను పట్టుకుంటేనే చేతులను విపరీతంగా కడుక్కోవాలి. ఎందుకంటే విపరీతమైన బ్యాక్టీరియా వుంటది దానిలో. కానీ పారిశుద్ధ్య కార్మికుల సంగతి ఏమిటి? వాళ్లు బతుకతలేదా. ఇవన్నీ ఇమ్యూనిటీకీ సంబంధించినవి. ఇవాళ మనదేశంలో ఈ వైరస్ ఎక్కువ వ్యాప్తి కాకపోవడానికి మనం తీసుకున్న టీకాలు కూడా ఒక కారణంగా వున్నాయి. ఈ స్వభావాన్ని మరిచిపోయి మనం అనేక రకాలుగా పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నాం. మరో వైపు మనల్ని మనం మార్కెట్‌కు మలచుకుంటున్నం. కాబట్టి ఇవాళ నేచురల్‌గా ప్రకృతి సిద్ధంగా ఉండే విషయాలన్నిటిని మరిచిపోయినం. కాబట్టి చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఈ వైరస్ పుణ్యాన ఇప్పటికైనా సహజ

జీవనం, సహజ జీవితం, సామాజిక బంధం, సామాజిక జీవితం, కుటుంబ జీవితం మొత్తం ప్రపంచ దేశాలన్నిటితో సంబంధం పునశ్చరణ చేసుకొని ఒక కొత్త మానవుడు ఆవిష్కృతుడు అవుతాడు.

**వైరస్‌కు ప్రకృతి వైపరిత్యాలే కారణమా?**

వైరస్ పుట్టుకకు ప్రకృతి వైపరిత్యాలే కారణమని ఎప్పుడూ అనలేము. ఎందుకంటే ఇవాళ ఇది కొత్త వైరస్ కాదు. నిజానికి చాలా ఆశ్చర్యంగా కొన్ని పరిణామాలు ఉంటాయి. అమెరికన్ సైన్యం ఆఫ్రికాని ఆక్రమించుకొని కొన్ని కొన్ని దేశాలలో తిష్ట వేసి ఉన్నప్పుడు. వాళ్లు చాలా ప్రకృతి విరుద్ధమైన పనులు చేశారు. జంతువులతో సంపర్కాలు చేశారు. దరిద్రులు గొరిల్లాలతో కూడా సంపర్కాలు చేసినారు. వీటన్నిటి వల్ల హెచ్ఐవి సోకింది. ఇది ప్రకృతికి విరుద్ధమైనది. కానీ వైరస్‌లు చాలా వరకు వైరస్ పుట్టుకంతా కూడా ప్రకృతిలో భాగమే అది. కాని కొన్ని వైరస్‌లను పుట్టించడమనేది ఉన్నది బయలాజికల్ వార్‌లో. ఈరోజు చైనా వారి తిండి గురించి మాట్లాడుతున్నారు. ఇవాళ్టిది కాదు చైనా తింటున్న ఆ తిండి. మనకు ఇష్టం లేకపోవచ్చు. మనం కప్పుల్ని, పాముల్ని తిన్నామంటే అసాధ్యమనే అనుకోవచ్చు. కుక్కల్ని తిన్నామంటే ఇంకా అసాధ్యం అనవచ్చు. మన దేశంలో కూడా ఉన్నారు నాగాలాండ్‌లో కుక్కల్ని తింటారు. అవన్నీ వేరే విషయాలు. ఆహారపు అలవాట్లు. కానీ వైరస్ పుట్టుక అనేది మీట్ మార్కెట్‌లో పుడితే వాళ్ల తప్పు కొంత ఉన్నట్టే. ఎందుకంటే రకరకాల జంతువులు తిన్నట్టు. ఇట్లాంటివి కొన్ని వున్నవి కానీ, ప్రకృతి విరుద్ధంగా వైరస్‌లు ఉండవు నిజానికి. కానీ ప్రకృతి విధ్వంసం జరిగినప్పుడు పైలాయిస్తుంటది. అంటే ప్రకృతి దానికి ఒక రక్షణ. ప్రకృతి ఉన్నది ఉన్నట్టుగా ఉంటే మనలో ఉన్న రోగ నిరోధక శక్తి సజీవంగా ఉంటది. కాబట్టి అది పని చేస్తుంటది. మనకు ఇది ప్రకృతి సిద్ధమైనది కానప్పటికీ కూడా ప్రకృతిని రక్షించుకుంటే ఇట్లాంటి వైరస్‌ల నుంచి మనల్ని మనం కాపాడుకునే స్వయంశక్తి వచ్చే అవకాశం వుంటుంది.

> **ఫెడరల్ వ్యవస్థ అనేది మన దేశంలో పేరుకే ఉన్న వ్యవస్థ అని మరొకసారి రుజువైంది. కేంద్ర ప్రభుత్వం ఎంత కంజ్యూస్ అంటే చివరికి మనకు వచ్చే డబ్బులకు కూడా కోత బెట్టింది. 219 కోట్లు మనకు కోతబడ్డది.**

**'లాక్ డౌన్' పీరియడ్‌లో కలిగిన ఆలోచనలు, అంతర్మథనాలు ఏమిటి?**

ముప్పై రోజులు ఇండ్లల్లోనే ఉన్నారు. ప్రపంచమేమీ మునిగి పోలే. ఆకాశం కింద పడలే. ఓజోన్ పొర చినిగి పోలేదు. అంతా మామూలుగానే ఉంది. కాకపోతే కొందరికి మందు అలవాటు ఉన్న వారికి మందు దొరకలేదు. వాళ్లు కొంత సఫర్ అవుతున్నరు. మళ్లీ బయటికి పోయి తాగుతారు కావచ్చు. ఇవాళ కాకపోతే రేపు తాగుతారు. వర్క్‌ఫ్రం హోం అంటే ఇంట్లో సౌకర్యాలు లేని వాళ్లు ఉండవచ్చు. అట్లాగే రిలేషన్స్‌లో ఉండే ప్రాబ్లమ్స్ కొన్ని రావొచ్చు. కానీ ఇల్లంత సుఖం, ఇల్లంత హాయి, ఒంటరితనం అంత సుఖం ప్రపంచంలో ఏదీ లేనేలేదు. ఎందుకంటే నిన్ను నీవు తెలుసుకోవడానికి. నిన్ను నీవు చూసుకోవడానికి. నీలోకి నీవు తొంగి చూసుకోవడానికి. ఏమి చేసినము, ఏమి చేస్తున్నం, ఏం చేయబోతున్నాం ఇవన్నీ అంతర్మథనం చేసే అవకాశాలు ఉంటాయి. కాబట్టి లాక్‌డౌన్ పిరియడ్ అనేది నిజానికి ఎన్నో ఏండ్ల తరువాత వచ్చిన ఒక సదావకాశంగా తీసుకోవాలి.

**మన దేశంలో ఫెడరల్ వ్యవస్థ ఎలా ఉన్నది?**

ఫెడరల్ వ్యవస్థ అనేది మన దేశంలో పేరుకే ఉన్న వ్యవస్థ అని మరొకసారి రుజువైంది. కేంద్ర ప్రభుత్వం ఎంత కంజ్యూస్ అంటే చివరికి మనకు వచ్చే డబ్బులకు కూడా కోత బెట్టింది. 219 కోట్లు మనకు కోతబడ్డది. అంటే రాష్ట్రాలకు న్యాయంగా రావల్సిన వాటాను కోతపెట్టడాన్ని ఫెడరల్ సిస్టం అనే పేరుమీద చెలామణీ అవుతున్నది. నీతి ఆయోగ్‌ద్వారా తమకిష్టమైన రాష్ట్రాలకు విపరీతమైన నిధులు ఇవ్వడం, తమకు నచ్చని రాష్ట్రాలని విపరీతంగా నష్టపరచడం. చాలా రాష్ట్రాలను కనీసం పట్టించుకోక పోవడం. పశ్చిమ బెంగాల్ అంటే పడదు, తెలంగాణ అంటే పడదు. తనుకు అనుకూలంగా ఉంటేనేమో అనుకూలంగా నిర్ణయం తీసుకుంటుంది. ఇలా రూపానికే ఫెడరల్ స్టేట్ గానీ ఆక్చువల్‌గా ఆచరణలో ఇది కేంద్రక ప్రభుత్వంగానే ఉన్నది. యునైటెడ్ గవర్న మెంట్‌గానే ఉన్నది. ఫెడరల్ ప్రభుత్వం అంటే ఇప్పటికే రాష్ట్రాలు కనీసం మూడు సార్లు సంఘీభావం తెలిపాయి. ప్రధాని మోది మూడు సార్లు పిలుపు ఇచ్చారు. ఒకసారి చప్పట్లు కొట్టమన్నరు కొట్టినం. ఒకసారి దీపాలు వెలిగించమన్నారు వెలిగించిండ్రు. కొందరు ఇంకేదో చెయమన్నరు చేసింద్రు. ఇప్పటి వరకు రాష్ట్రాలకి కనీసం ఒక పైసా ఇచ్చి ఆదుకోని ఏకైక ప్రభుత్వం ఇండియన్ గవర్నమెంట్. ఇవన్నీ లొసుగులు. ఫెడరల్ గవ్నమెంట్ లక్షణాలు ఏమీ లేవు దీనికి. నిజానికి రాష్ట్రాలను అణచివేస్తున్నది కేంద్రం ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కూడా ప్రజాస్వామ్య యుతంగా మనం రాజ్యాంగంలో నిర్మించుకున్న అంబేద్కర్ చెప్పిన ఫెడరల్ సిస్టమ్స్‌ని, ఫెడరల్ లక్షణాలని పుణికి పుచ్చుకొని అన్ని రాష్ట్రాలని కరోనా వైరస్ నేపథ్యంలో వస్తున్న నష్టాలని ఆదుకోవాలి. హెలికాప్టర్ మనీ అంటే తెల్వదు. హ్యావీ నిధులు అంటే తెల్వదు. గోదాంలలో మొత్తం కూలీలను ఏడాదిపాటు పోషించగల్గిన దానికంటే ఎక్కువ ధాన్యం మూలుగుతుంది. వాటి నిల్వలన్నీ బద్దలుకొట్టి వాళ్లకి సపోర్ట్ చేయండి. వాళ్లని బతకనీయండి. ఆకలి చావులకు గురికాకుండా చూడండి అంటే కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు బ్యాంకులకు 50వేల కోట్లు, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు 50వేల కోట్లు ఇట్లాంటి ప్రకటనలు చేసినవి గానీ, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక్క పైసా ఇవ్వలేదు. న్యాయంగా, ధర్మబద్ధంగా రావాల్సిన పన్నుల వాటా కూడా తగ్గించి కేంద్ర ప్రభుత్వం నిరంకుషంగా ఉన్నది. రాజ్యాంగంలో అంబేద్కర్ పేర్కొన్న టూ ఫెడరల్ సిస్టమ్‌ని అమలుపర్చి రాష్ట్రాలని కరోనా నేపథ్యంలో ఆదుకోవాలి.

*(సచిన్, మల్లేష్ – దక్కన్ ఛానల్ ఇంటర్వ్యూ ఆధారంగా)*

– కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com

# ప్రకృతి నేర్పే పాఠాలు అర్థం చేసుకోవాలి... ఆచరించాలి..

**ఓల్గాగా ప్రసిద్ధి పొందిన ప్రముఖ తెలుగు రచయిత్రి పోపూరి లలిత కుమారితో కోవిడ్-19పై 'దక్కన్ ఛానెల్' ప్రత్యేక ఇంటర్వ్యూ**

ప్రముఖ తెలుగు రచయిత్రి ఓల్గాగా ప్రసిద్ధి పొందిన పోపూరి లలిత కుమారి రాజకీయ, సామాజిక, సాహిత్యరంగంలో స్త్రీవాద దృక్పధాన్ని ప్రవేశపెట్టిన రచయిత్రి. స్త్రీవాద ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన ఓల్గా, అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్‌కు అధ్యక్షురాలిగా, జనరల్ సెక్రటరీగా పనిచేసారు. వీరు కరోనాపై 'దక్కన్ ఛానెల్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

**లాక్‌డౌన్ పీరియడ్‌లో కరోనా వైరస్ వ్యాప్తికి కారణం?**

ప్రకృతిని మనం చాలా దుర్వినియోగం చేశాం. ప్రకృతిని విధ్వంసం చేసి, ఎంతో నిర్లక్ష్యాన్ని, అలసత్వాన్ని ప్రదర్శించాం. ఈ ప్రపంచీకరణలో ప్రపంచమంతా ఒక కుగ్రామం అయిపోతే మానవ సంబంధాలు బావుంటాయని అనుకున్నాం. కానీ దానికి ఇంకొక వైపు కూడా ఉంది అనేది మనం మరిచి పోయాం.



సంపాదనలో అసలైన మానవ సంబంధాల గురించి మర్చిపోయాం. అందువల్ల ప్రపంచీకరణ నెగటివ్ ఎఫెక్ట్ ప్రకృతి విధ్వంసం. ప్రకృతితో సహజీవనం చేయాలనేది మర్చిపోయి, ప్రకృతిని మనం కంట్రోల్ చేయగలం, ప్రకృతిని కంట్రోల్ చేసి మనం ఏదో సాధించగలం అని అనుకోవటం.

**కరోనా పుట్టుకకు ప్రకృతి వైపరీత్యాలే కారణమా?**

ప్రకృతి వైపరీత్యాలకు రకరకాల కారణాలు కావొచ్చు. ప్రకృతి సహజంగా ఎలా ఉంటుందో అలా ఉండనివ్వకుండా ప్రకృతిని దారి మళ్ళించి దాని మీద ఆధిపత్యం చెలాయించి, దానిని ఆక్రమించు కోవాలనుకోవడంతో ఎక్కువ అపకారం జరిగింది.

**ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలి? ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?**

ప్రభుత్వాలు, ప్రజలు అందరు కలిసి పనిచేయాల్సిన సందర్భం. అప్పుడే దీన్ని మనం నియంత్రించు కోగల్గుతాం. ఎప్పుడంటే అందరికి సమానమైనటువంటి అవకాశాన్ని, సమానమైనటువంటి గౌరవాన్ని ఎప్పుడు ఇస్తామో అప్పుడు ప్రజలు, ప్రభుత్వం కలిసి దీనిని నివారించు కోగల్గుతూ, నియంత్రించు కుంటాం. అలా కాకుండా సమాజంలో ఉండేటువంటి తేడాలు, వర్గాలు, పేదవాళ్ళు, ధనికులు, కులాలు, మతాలు వీటినన్నింటిని మనం వెంట బెట్టుకుని పోరాటం చేయాలంటే చాలా కష్టం. మనం జయించలేం. మనందరం బేసిక్‌గా మనుషులం. అందరం ఒకటి. అందరికి ఇది వచ్చే అవకాశం ఉంది కాబట్టి అందరం కలిసి ఒక పద్ధతిలో దీన్ని ఎదుర్కోవాలని పనిచేస్తే ఎదుర్కోగల్గుతాం.

**కరోనా వైరస్ వ్యాప్తి ప్రజలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది?**

కొంతమంది భయపడ్డం నేర్చుకున్నారు. కొంతమంది ప్రేమించటం నేర్చుకున్నారు. ఇంకొంతమంది భయపెడుతున్నారు. మూడు అడుగుల దూరం, లేదా ఆరు అడుగుల దూరంలో అని. ఇంకొక వైపు నావాళ్ళు ఎక్కడున్నారో, నావాళ్ళు ఏమైపోతారో అని బెంగపడ్డం నేర్చుకున్నారు. ఇది ఒకరకమైనటువంటి ఉద్వేగ కల్లోల పరిస్థితి కదా. కొంచెం ఇది తగ్గిన తరువాత మనుషులు మనుషుల విలువ తెల్సుకుంటారని తమ తోటి వారిని ప్రేమించటం నేర్చుకుంటారని నాకు ఆశగానే ఉంది.

**ప్రజలు, ప్రభుత్వాలు ఏ మేరకు ఈ పరిస్థితిని తట్టుకోగల్గుతాయి?**

ఒకే వేలో పనిచేయగలగాలి. ప్రభుత్వాలు ప్రజలందరు సమానమని చూడగలగాలి, ప్రజల్లో పేదవాళ్లు, ధనికులు, ఈ మతం ఆ మతం ఇవన్నీ తేడాలన్ని తీసేసి ప్రజలకు ఏది మేలు, ప్రజలను ఎట్లా మంచిగా ఉంచాలనేది ప్రభుత్వాలు ఆలోచించాలి అలా ఆలోచించే ప్రభుత్వాలకు ప్రజలు సహకరిస్తారు. ఈరెండు జరిగినప్పుడు దీన్ని తప్పకుండా మనం తట్టుకోగల్గుతాం.

**రాబోయే రోజులల్లో ఇకొన్ని వర్గాలపై ఏమైనా తేడాలు చూసే ఆస్కారంముందా?**

కొన్ని చోట్ల జరగొచ్చు. ఇప్పటికే మనం చూస్తున్నాం కదా, మనం ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు ఈ నిర్ణయం ఏ వర్గ ప్రజలను ఎలా తాకుతుంది. అనేది ఆలోచించి తీసుకోవాలి దాన్ని అలా తీసుకునే సందర్భాలు ఇంతవరకు మనకు కన్పడలేదు.

**ప్రభుత్వాలు వైద్యరంగంలోను, విజ్ఞాన శాస్త్ర రంగంలోను అనుసరించవలసిన ప్రణాళికలు ఏమిటి?**

వైద్యరంగంలో పెద్ద మార్పులు తీసుకురావాలి. పబ్లిక్ హెల్త్ అంటే ప్రజారోగ్యాన్ని మనం చాలా సంవత్సరాల నుండి నిర్లక్ష్యం చేసుకుంటూ వస్తున్నాం. కనీసం 60వ దశాబ్దంలో ఉన్నటువంటి ప్రజారోగ్య పాలసీలు కూడా ఇప్పుడు ఉన్నాయో లేదో తెలీదు. పూర్తిగా ప్రైవేటు వాళ్ల చేతుల్లో పెట్టేశాం. డబ్బు గుంజుకోవటం అనేది తప్ప ప్రైవేటు వాళ్లు ఏం చేస్తున్నారు అనేది ఆలోచించలేదు. ఏ పథకాలు పెట్టినా అది ప్రైవేటురంగానికే వెళ్ళేటట్లుగానే ఉన్నాయి. కాబట్టి అది సమూలంగా మార్పు చెందాలి. విద్య వైద్యం ఈ రెండు కూడా సంక్షేమరంగాలు. ఈ రెండు రంగాలు కూడా ప్రభుత్వ ఆధీనంలో ఉండి ప్రజలందరికి సమానంగా అందేలా చూడాలి. అలాంటి ప్రణాళికలు వేసుకొని వెళ్తే తప్ప ఇలాంటి విపత్తులను ఎదుర్కోలేం.

**కార్పొరేట్ వ్యవస్థపై మీ అభిప్రాయాలు?**

కార్పొరేట్ రంగాలు ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఇవాళ అందరికి తెల్సినటువంటి సత్యం. కార్పొరేట్ రంగాల కోసమే ప్రభుత్వాలు చాలా వరకు పనిచేస్తున్నాయి. ఆరెండింటి మధ్య ఉన్న సంబంధం చాలా వరకు విడదీయరానిది. ఈ రెండింటి మధ్య సంబంధం ఎలా తెగుతుందో తెలీదు. కానీ కార్పొరేట్ వ్యవస్థ తన లాభాల కోసం, కొంతమంది ధనికుల లాభాల కోసం వేలాదిమంది ప్రజలని అభద్రతలోకి, అనారోగ్యంలోకి, అవిద్యలోకి నెట్టిపారేశారు.

కార్పొరేట్ రంగాలు ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఇవాళ అందరికి తెల్సినటువంటి సత్యం. కార్పొరేట్ రంగాల కోసమే ప్రభుత్వాలు చాలా వరకు పనిచేస్తున్నాయి. ఆరెండింటి మధ్య ఉన్న సంబంధం చాలా వరకు విడదీయరానిది.

**కార్పొరేట్ రంగాలను ఏ విధంగా నిర్మూలించాలి? దానికి ప్రభుత్వం ఏ విధంగా సహకరించాలి?**

నిర్మూలించటం అనేది చాలా పెద్ద మాట. నిర్మూలించటం కంటే కనీసం నియంత్రించటం చేయాలి. మనకి చట్టాలు ఉన్నాయి. కార్పొరేట్ రంగాలకు రుణాలు విపరీతంగా ఇచ్చేసి ఆ రుణాలను మళ్లీ పట్టించుకోకుండా, అలాగే అవి ఏమి ఉత్పత్తి చేస్తున్నాయి. అవి ఉత్పత్తి చేస్తున్నటువంటి వస్తువుల వల్ల, ప్రొడెక్ట్ వల్ల ప్రజలకు ఎట్లాంటి మానసికమైన అనారోగ్యాలు వస్తున్నాయి, ఎట్లాంటి శారీరకమైన అనారోగ్యాలు వస్తున్నాయని గమనించాలి. ఇవాళ విశాఖపట్నంలో గ్యాస్ ఫ్యాకర్టీ లీకేజీ మూలాన అప్పటికప్పుడు ఒక పెద్ద ప్రళయం లాగా వచ్చిపడింది. ఒక ఐదారు కిలోమీటర్ల మేర ఎవరు బాధ్యులు దీనికి. వాళ్ల దగ్గర డబ్బు ఉంది. పలుకుబడి ఉంటుంది. ఏమైనా చేస్తారు ఎంతైనా నిర్లక్ష్యంగా ఉంటారు. ప్రజల ప్రాణాలు తీస్తారు. ఎప్పుడో భోపాల్ గ్యాస్ సంఘటన జరిగింది. మనం అప్పటినుంచి ఇప్పటి వరకు ఏమన్నా నేర్చుకున్నామా? ఫ్యాక్టరీలను పొల్యూషన్స్ కంట్రోల్ వాళ్లో, ఇంకోరో నిరంతరం నిఘాలో ఉంచాలి అనేదాన్ని మనం పట్టించుకున్నామా కార్పొరేట్ రంగాన్ని నియంత్రించగల్గినా, నిర్మూలించటం అనేది ఇప్పుడు అసాధ్యం గానీ, నియంత్రించి వాళ్లకు చక్కని బ్యాలెన్సింగ్ పెడుతూ వాళ్లకి తప్పులు జరిగితే పనిష్మెంట్ ఇస్తు ముఖ్యంగా వాళ్లు ఏదో రుణమో ఏదో ఇస్తున్నప్పుడు వాళ్లను ఆపి వాళ్లని జైలుకి పంపించి వాళ్ల ఆస్తులన్ని స్వాధీనం చేసుకుని వాటిని ఆరంగాలల్లో పనిచేస్తున్న వర్కర్స్‌కి, కార్మికులకి పంచిపెట్టి వాళ్లకి ఎలాంటి లోటులేకుండా చేయాలి. ప్రైవేట్ రంగాన్ని ఇప్పటికి ఇప్పుడు నిర్మూలించమని కూడా ఎవరు అనరు. దాన్ని సరిగ్గా నడపండి మీరు ఉన్నది ఎందుకు? ప్రైవేట్ చెప్పుచేతల్లో మీరు నడవడానికి కాదుకదా మీ చెప్పుచేతల్లో అది నడవాలి. ప్రజల కోసం అవి పనిచేయాలి. ప్రజలకోసం జరగాలి, ప్రజల ఆరోగ్యం కోసం జరగాలి

**ఇండ్రస్టీయల్ పాలసీ ప్రకారం అసలు ఇండ్రస్టీస్ అనేది జనసంచార ప్రాంతంలో ఉండకూడదు? మరి అట్లాంటి వాటికి ప్రభుత్వాలు ఎందుకు పర్మిషన్స్ ఇస్తున్నాయి?**

ప్రభుత్వాల్లో ఉన్న వాళ్లకి వాళ్లకి ఉన్న సంబంధ బాంధవ్యాల మూలానా పర్మిషన్స్ ఇస్తాయి. పర్మిషన్స్ ఇచ్చినప్పుడు మేము చచ్చిపోము కదా అనుకుంటారు వాళ్లు. ఇవాళ కరోనా గురించి ఇంత గోల ఎందుకు చేస్తున్నారంటే వాళ్లు కూడా చచ్చిపోవచ్చు. ఫ్యాక్టరీకి పొల్యూషన్స్ వస్తే ఆ కార్మికులు చచ్చిపోతారు. మేము కాదుకదా అనుకుంటున్నారు. కానీ ఇప్పుడు మనిషి నుంచి మనిషికి వస్తుంది. ఎలా వస్తుందో తెలియలేదు. అమ్మో కరోనా అని చెప్పి భయపడుతున్నారు. అంటే మనదాకా వస్తే తప్ప ప్రాణం విలువ తెలియని మనుషులు ఉన్నటువంటి కాలం ఇది. దీన్ని పూర్తిగా మార్చనిదే ఇట్లాంటి విపత్తులు ముందుముందు కూడా రాక తప్పవు.

**ప్రపంచ ఆర్థిక రంగంలో రాబోయే మార్పులు ఏమిటి?**

ఆర్థికరంగంలో చాలా సంక్షోభం రావొచ్చు. ఎందుకంటే నిరుద్యోగం విపరీతంగా ఉన్నది ఇప్పటికే. ఇంకా నిరుద్యోగం పెరిగే అవకాశాలు ఉన్నాయి. సంక్షోభం తప్పనిసరి. కాకపోతే దాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవటం కూడా ఇప్పుడు బహుశా లేట్ అవొచ్చు, టెక్నాలజీ వల్ల గానీ, ఇంకొకదాన్ని వల్ల గానీ ఎందుకంటే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో వచ్చిన దాన్ని నివారించాలంటే చాలా కాలం పట్టింది. ఇప్పుడు అంతకంటే తొందరగా దాని బాగు చేసుకోగలమేమో. చిత్తశుద్ధి ఉండి, స్వార్థం లేకుండా ఉంటే స్వలాభాపేక్ష లేకుండా ఉంటే కొంచెం బాగు చేసుకోగల్గుతాం.

**ఎలాంటి ఆహార పదార్థాలు ఉంటే బావుంటుంది?**

ఆరోగ్యకరమైనది, రుచికరమైన ఆహారం. వెస్టర్న్ ఫుడ్ అంతా అనారోగ్యకరమైనదని అభిప్రాయాన్ని మనం వ్యాపింప చేయకూడదు. అక్కడ కూడా ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలు ఉన్నాయి. అమ్మలు అమ్మమ్మలు చేసి పెట్టేటువంటివి మనకి ఉన్నాయి. రుచిగా ఉండాలి, తాజాగా ఉండాలి మన శరీరానికి శక్తిని ఇవ్వాలి. ఇదే ఆహారంలో ఉండే రహస్యం మన శరీరం దేనినైనా తట్టుకోగల్గినటువంటి శక్తి ఉండాలి. అట్లాంటి శక్తి ఉన్నటువంటి పదార్థాలు చాలా ఉన్నాయి. మనదేశంలో, ఏదేశంలోనైనా ఉంటాయి.

**వలస కార్మికుల ఇబ్బందుల పరిష్కారానికి ఏమి చేయాలి?**

వలస కార్మికుల ఇబ్బందుల పరిష్కారానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో కష్టం. అంటే వాళ్లకి ముందే మీరు ఉన్న చోట ఉండండి మీరు పని చేసినా చేయకపోయినా కొన్ని రోజుల పాటు మీ జీవన భృతికి, మీ ఆరోగ్యానికి మేము గ్యారంటీ ఇస్తాము అని వాళ్లు పనిచేస్తున్న కంపెనీలు, ప్రభుత్వం కలిసి హామీ ఇచ్చిన్నట్లైతే ఇంత విపత్కర పరిస్థితి వచ్చేది కాదు. ఆ హామీ ఇవ్వలేకపోయాం అందరం కూడా. వాళ్లు అలా రోడ్డు మీద నడుస్తుంటే దుఃఖపడటం తప్ప, కొంతమంది చేయగల్గినంత సహాయం చేయటం తప్ప ఏది చేయలేకపోతున్నాం. వాళ్లు వెళ్ళిపోయిన తరువాత పనులు చేసేవాళ్లు లేక ఆయా రంగాలు కూడా దెబ్బతింటాయి.

**ఇన్ని రోజులు వలస కార్మికులు ఇన్‌సెక్యూర్‌గా ఫీలయ్యారా?**

వాళ్లు ఎంత అల్లాడిపోతున్నారో మీడియాలో చూస్తున్నాం. ఇండ్లలో కూర్చుని బయటికి అడుగుపెట్టాల్సిన అవసరం లేని వాళ్లు కూడా భయంతో అల్లాడిపోతుంటే, నడిరోడ్డుమీదో, షెల్టర్ హోంలోనో ఎలాంటి సౌకర్యాలు లేకుండా ఉన్న వలస కార్మికులకు ఎంత అభద్రత ఉంటుందో ఆలోచించండి.

**ఎలాంటి పాలసీ విధానాలను వలస కార్మికుల కొరకు ప్రభుత్వాలు తేవాలి?**



వలస కార్మికులకులైనా, ఒక ప్రొడక్షన్‌లో ఉన్నారు వాళ్లు వాళ్ల శ్రమ చాలా విలువైనది. వాళ్ల శ్రమే మన సంపద. సమాజపు సంపద అనే విషయం గుర్తించి వాళ్లకు కావాల్సినటు వంటి సౌకర్యాలన్నీ సమకూర్చాలి. ఒకప్పుడు ప్రభుత్వరంగంలో పనిచేసే టువంటి కార్మికులకి, చిన్న ఉద్యోగస్తులకి కూడా చాలా సౌకర్యాలు ఉండేవి. బిహెచ్ఇఎల్, ఇసీఎల్ ప్రభుత్వ రంగ సంస్థలు బోలెడు ఉండేవి. అప్పుడు ఆ సంస్థల్లో పనిచేసేవాళ్లకి క్వాటర్స్ ఉండేవి. బస్సులు నడిపేవాళ్లు, వాళ్లకి హాస్పటల్స్, స్కూల్స్, కాలనీలు ఎంతో చక్కగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలని మూసి పారేసి ఏ సౌకర్యాలు కల్పించని, ఏ లేబర్ చట్టాలు వర్తించనీయకుండా చేయగల్గినటువంటి ప్రైవేట్ సంస్థలకి, కార్పొరేట్ సంస్థలకి కట్టబెట్టారు. పనిచేసేటువంటి కార్మికులందరికి కనీస గృహ, వైద్య, విద్య ఆరోగ్య సదుపాయాలన్నీ ఉండాలి అనేటువంటిది ఒక పాలసీగా తీసుకొని ఇది సంఘటిత రంగంలోనే కాదు అసంఘటిత రంగంలో కూడా వాళ్లు అక్కడ పనిచేస్తున్నంత కాలం కల్పించాలి.

**పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి?**

పర్యావరణ పరిరక్షణ గురించి పర్యావరణ శాస్త్రవేత్తలు దాంట్లో పనిచేసే వాళ్లు ఎంతో కాలంగా మొత్తుకుంటున్నారు. అడవులు నరికి వేయకండి, అడవులను పెంచండి, నదులను కాపాడుకోండి, తరువాత కాలుష్యాన్ని తగ్గించుకోండి కర్బన వాయువులను విడుదల చేయకుండా చేయండి అని చెప్పి, కరోనా రాకముందు కూడా గ్లోబల్ వార్మింగ్ మీద చాలా మంది పనిచేస్తున్నారు. చాలా పరిశోధనలు చేసి ఎంతో మెటీరియల్ ఉంది మన దగ్గర. అంతర్జాతీయ ఒప్పందాలు ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి సమతుల్యాన్ని కాపాడేందుకు ఆ అంతర్జాతీయ ఒప్పందాలను ఏ దేశము ఖాతరు చేయదు. సంపన్న దేశాలు అసలే ఖాతరు చేయవు. ఇష్టం వచ్చినట్లు ప్రకృతిని, అడవులను నాశనం చేసుకుంటూ పోయాం. నదులను కాలుష్యం చేసుకుంటూ, ఎండగట్టుకుంటూ పోయాం. కాలుష్యరహితగాలి తప్ప మంచి గాలి లేని నగరాల్ని నిర్మించుకుంటు పోయాం.

**టెక్నాలజీ పర్యావరణం మీద ఎలాంటి ప్రభావం చూపుతుంది?**

టెక్నాలజీకి, పర్యావరణానికి వైరుధ్యం ఉండకుండా చూసుకోవాలి మనం. టెక్నాలజీని మరీ ప్రకృతిని ధ్వంసం చేసేంతగా పెరగనీయవద్దు. మనకి కొన్ని తెలిసి కూడా చేస్తాం. ఉదాహరణకి అణుబాంబు వల్ల ఎలాంటి విధ్వంసం జరుగుతుందో తెలిసి బాంబులు తయారు చేస్తాం. వేస్తాం. యుద్ధం వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయో తెలిసి యుద్ధాలు చేస్తాం. ఇట్లా తెలిసి చేస్తున్నటువంటి వాటిని ఎలా అర్థం చేసుకోవాలి మానవులు. కాబట్టి పర్యావరణానికి, టెక్నాలజీకి కూడా ఒక స్నేహాన్ని కల్పించాలి. పర్యావరణాన్ని ఇది పాడు చేస్తుంది, ఇది ప్రకృతిని దెబ్బ తీస్తుంది అని అనుకొంటే ఆ టెక్నాలజీని ఉప సంహరించు కోవాలి. అట్లాంటి ఒప్పందాలు తీసుకోవాలి దేశాలు.

**పర్యావరణం కొరకు ఎలాంటి మార్గదర్శకాలు ఉంటే బావుంటుంది?**

పర్యావరణ సమతుల్యత గురించి ఒక మంచి అంతర్జాతీయ ఒప్పందం జరిగింది. యునైటెడ్ నేషన్‌తో ఆ ఒప్పందంపై చాలా దేశాలు సంతకాలు పెట్టాయి. అట్లాంటి ఒప్పందాలను ప్రజలందరికి పంచిపెట్టి వాటిని అమలు చేసేటట్లుగా చేస్తే చాలు.

**ప్రపంచదేశాల మధ్య సంబంధాలపై కరోనా ఎలాంటి ప్రభావం చూపబోతున్నది?**

ప్రపంచ దేశాల మధ్య సంబంధాల గురించి చెప్పలేము. ఒక దేశానికి ఒక దేశం సహకరించుకుంటే ఈ విపత్తు నుంచి బయట పడవచ్చు. సహకరించుకుంటారు అని నేను అనుకుంటున్నాను. ఒక దేశాన్ని నిందించటం. అంటే చైనాని కరోనా అక్కడి నుంచి వచ్చిందని నిందిస్తున్నారు. ఇట్లాంటివి కొన్ని రోజుల పాటు జరగొచ్చు. కొన్ని దేశాలను, కొన్ని జాతులను నిందించటం అవన్నీ క్రమంగా పోతాయనే అనుకుందాం.

**విద్యావ్యవస్థపై కరోనా ఎట్లాంటి ప్రభావాన్ని చూపబోతోంది?**

విద్యా వ్యవస్థ ఇప్పుడు బాగోలేదు. కరోనా ఎలాంటి ప్రభావాన్ని చూపినా ఈ విద్యా వ్యవస్థ మారితే చాలు. ఈ విద్యా వ్యవస్థ మేలు చేసేది లాగా లేదు. ప్రైవేట్ రంగంలోకి వెళ్ళిపోయి కొన్ని స్కూల్స్, కాలేజీలు విపరీతంగా సంపాదించుకోవటానికి ఉపయోగపడుతుంది.

పాఠశాలలు ఏవీ సరిగ్గా పనిచేయట్లేదు. ఎట్లాగో వీళ్లు డిగ్రీలు తీసుకొని బయటికి వస్తున్నారు కానీ, అది మంచి విద్య కాదు. కాబట్టి ఈ రకమైన విద్యా విధానం పోవాలి. ఇది కరోనా వల్ల పోతుందా ఇంకో దాని వల్ల పోతుందా అనేది ప్రక్కన పెడితే ఈ విద్యా విధానం సమూలంగా మార్పు చెందేటటువంటి అవకాశం వస్తే మంచిదే. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం ఇట్లా పాఠాలు చెప్పలేం. అందరు స్కూల్స్‌కి రావటం కుదరదు. కాబట్టి ఒక సార్వత్రిక విద్య టెలివిజన్ ద్వారా గానీ, ప్రసార మాధ్యమాల ద్వారా గానీవ్వండి ఎక్కువ మందికి సమానమైన విద్య కల్పిస్తే చాలా మంచిది.

**అత్యున్నతమైనటువంటి విద్యా వ్యవస్థ ఎందుకిలా ఉంది?**

నిజం చెప్పాలంటే మా చిన్నప్పుడు కొద్దిమందే చదువుకొనేవాళ్లం. అందరు అక్షరాస్యులని చెప్పలేను. కానీ మా క్లాసులో చాలా ధనికులు ఉండేవారు. చాలా పేదవాళ్లు, మధ్య తరగతి వాళ్ళు అందరు కలిసి చదువుకునేవాళ్లం. అన్ని కులాలు, మతాలు ఉండేవి. కానీ ఇప్పుడు ఏమౌతుందంటే ఒక వర్గం వారందరికి ఒక రకమైన స్కూల్, పేదవాళ్ల అందరికి ప్రభుత్వ పాఠశాలలు. ఇలా ప్రభుత్వ రంగం నిర్వహించాల్సిన సంక్షేమ రంగమైనటువంటి విద్యను ప్రైవేట్ రంగంకు అప్పచెప్పటంతోనే ఈ బెడద వచ్చి పడింది.

**ప్రైవేట్ రంగం అంటే ఎలాంటి విద్యా విధానాలు ఉండాలి?**

అందరికి సమానమైనటువంటి జ్ఞానం, విలువతో కూడినటు వంటి విద్యా ఉండాలి. ఆ విలువలు లేని విద్యా వాళ్లను బట్టి పట్టించేసి మళ్లీ వాటిని పరీక్షల్లో ప్రాక్టీస్ చేయించి దానికి మార్కులు వేయించి అక్కడ బోలెడన్ని అవినీతి బాగోతాలు, పేపర్స్ లీకేజీ, దిద్దటంలో తప్పులు, అంతా పతనమైపోయింది.

> **తరగతి గది ఉంటే గనక మామూలుగానే ఉంటుంది. కొంచెం దూరం పాటించాలి కొన్ని రోజుల పాటు. అంతే కానీ పెద్ద మార్పులేమి ఉండవు. డిజిటల్ అంటే టీచర్ కనపడదు కదా మనకి ఎక్కడో ఉండి చెబుతూ ఉంటారు. కాకపోతే మరీ అప్పుడు టీచర్ మీద ఎక్కువ ప్రేమ కలగొచ్చు. కొట్టదు, తిట్టదు కాబట్టి.**

**ఇప్పుడున్న కరోనా ప్రభావం అనేది తరగతి గదులలో ఒక క్లాస్ టీచర్‌కి ఒక స్టూడెంట్‌కి ఏ విధంగా ఉండబోతుంది?**

తరగతి గది ఉంటే గనక మామూలుగానే ఉంటుంది. కొంచెం దూరం పాటించాలి కొన్ని రోజుల పాటు. అంతే కానీ పెద్ద మార్పులేమి ఉండవు. డిజిటల్ అంటే మళ్లీ అందరికి ల్యాప్‌టాప్‌లు. పేదవాళ్లకి అవన్నీ కుదురుతాయా, కుదరవా ఆలోచించాలి. టెలివిజన్‌లో కొన్ని గంటలు పిల్లలకి పాఠాలు చెబితే ఎలా ఉంటుంది. ఇలా రకరకాల ఆలోచనలు చేస్తున్నారు. అట్లా ఉంటే టీచర్ కనపడదు కదా మనకి ఎక్కడో ఉండి చెబుతూ ఉంటారు. కాకపోతే మరీ అప్పుడు టీచర్ మీద ఎక్కువ ప్రేమ కలగొచ్చు. కొట్టదు, తిట్టదు కాబట్టి.

**స్టూడెంట్‌కి ఏమైనా డౌట్స్ వస్తే టీచర్‌ని డైరెక్ట్‌గా వెళ్ళి కలిసేవారు. డిజిటల్ విద్య వస్తే అలాంటి అవకాశాలు ఉంటాయా?**

ఉండొచ్చు. ఇవాళ ఒక లెసన్ చెబుతారనుకోండి రెండవ రోజు ఒక అరగంట సేపు డౌట్స్ కోసం కేటాయించాలి. రెండవ రోజు చెప్పిన పాఠం మూడవ రోజు. అందువల్ల సందేహాలకి సమయం అనేది ఇవ్వాలి పిల్లలకి. ఆ సమయంలో సందేహాలు అడిగితే ఆ టీచరు సమాధానాలు ఇస్తారు.

**వలస కూలీల పిల్లలందరు ప్రభుత్వ పాఠశాలకే వెళతారు! అలాంటి వారికి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుంది?**

వాళ్ళకి మంచి విద్య అందించాలి. వారికి విశాలమైనటు వంటి తరగతి గదులు, మనిషికి మనిషికి కొంత దూరం ఉండేలాగా గాలి వెలుతురు బాగా వచ్చేలాగా, తరగతి గదులు పరిశుభ్రత, బాత్‌రూం ఇలాంటివి అన్నీ ఉండేలాగా చేయగల్గితే మంచిదే.

**ఇటువంటి విపత్తులు రాకుండా ఉండటానికి మనం తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి?**

ఇంతవరకు మనం చెప్పుకున్నవన్నీ అట్లాంటివే. కేవలం ప్రభుత్వాలే కాదు పౌరుడిగా మనం కూడా కొన్ని చేయాలి. మరీ ముఖ్యంగా మధ్యతరగతివాళ్లు, ఎగువ మధ్యతరగతివాళ్లు ఎంత నీటిని మనం దుర్వినియోగం చేస్తున్నాం. ఎంత నీటిని వాడుతున్నాం. అట్లాగే మనం అవసరం ఉన్నా లేకపోయినా సరే ఒక్కొక్క ఇంట్లో ఎన్ని కార్లు ఉంటున్నాయి. వాటిని వేసుకుని రోడ్ల మీద విచ్చల విడిగా తిరిగి గాలిలో కార్బన్ మోనాక్సైడ్ రిలీజ్ చేస్తున్నాం. ఇట్లాంటివి చాలా మంది ఆలోచించుకోవాలి. అవి నియంత్రించుకోవాలి.

**లాక్‌డౌన్ తరువాత కరోనా అనేది ప్రపంచంలో గానీ, దేశంలో గానీ ఎలా ఉండబోతుంది?**

చాలా విపరీతంగా పెరుగుతుంది. డాక్టర్లు, సైంటిస్టులు ఏం చెబుతున్నారంటే ఎలాగు పెరుగుతుంది పెరిగి హార్డ్ ఇమ్యూనిటి అనేది వస్తుంది. అంటే అత్యధిక శాతం జనాభాకి ఇమ్యూనిటి వస్తే అప్పుడు క్రమంగా తగ్గుతుంది. అప్పటి వరకు పెరుగుతుందని, అలాగని ఎన్ని రోజులు కూర్చుంటాం, దాన్ని ఎదుర్కోవటానికి మన ఇమ్యూనిటిని పెంచుకోవటానికి ప్రయత్నించాలి.

**రేపటి ప్రపంచం ఎలా ఉండబోతుంది? ఎలాంటి పాఠాలు నేర్చుకోవాలి?**

చాలా మార్పులు వస్తాయని మాత్రమే చెప్పగలం. పాఠాలు మాత్రం ప్రకృతి నేర్పుతోంది. ఈ ప్రకృతి నేర్పే పాఠాలని కొంత జాగ్రత్తగా విని అర్థం చేసుకొని మనం వాటిని ఆచరించాలి.

**ఆర్థిక సాంకేతిక అభివృద్ధి కల్గిన దేశాలు కరోనాను ఎదుర్కోవటంలో ఎందుకు విఫలమైనాయి? చిన్న చిన్న దేశాలు ఈ పరిస్థితి నుండి ఎలా బయట పడతాయి?**

అంటే కొంత సోషలిస్టు దేశాలు బయట పడ్డాయి. ఇప్పుడు క్యూబా గానీ, ఒకప్పుడు సోషలిస్టు దేశంగా ఉన్నటువంటి యూరప్ దేశం గానీ పబ్లిక్ హెల్త్ మీద చాలా ఖర్చుపెట్టాయి. ఆ పబ్లిక్ హెల్త్ మీద పెట్టిన ఖర్చు వాళ్లకి ఇప్పుడు అక్కరకొచ్చింది. వాళ్లు కొంచెం నిరోధించుకోగలిగారు. మిగిలిన పెద్ద దేశాలకు ఏం ఖతరు లేదు పబ్లిక్ హెల్త్ మీద. వాళ్ల దగ్గర ఏమీలేవు ప్రజలను ఆదుకోవటానికి ఆరోగ్య పరంగా. అందువల్ల ఆ దేశాలు ఎక్కువగా దెబ్బ తిన్నాయి.

***(సచిన్, మల్లేష్ – దక్కన్ ఛానల్ ఇంటర్వ్యూ ఆధారంగా)***

**– ఎసికె. శ్రీహరి,**
m : 9849930145
e: ackvs08@gmail.com

# విపత్కర పరిస్థితుల్ని సైన్స్ మాత్రమే ఎదుర్కొంటుంది!

**ఉ. సా. (ఉప్పుమావులూరి సాంబశివరావు) కోవిడ్-19పై ప్రత్యేక ఇంటర్వ్యూ**

ఉప్పుమావులూరి సాంబశివరావు (ఉ.సా.) విప్లవోద్యమ క్షేత్రంలో అస్తిత్వ పోరాటాల గొంతుక, రచయిత, వక్త, ఉద్యమాల ఉపాధ్యాయుడిగా పేరొందారు. 'దక్కన్ ఛానల్'కు మే మాసంలో ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

**కరోనా వ్యాప్తి చెందడానికి కారణం ఏమనిపిస్తుంది?**

విపత్కర పరిస్థితికి ప్రధానంగా రెండు కారణాలు చెప్పవచ్చు. ఒకటి కరోనా మిగతా వైరస్‌ల కంటే విలక్షణ లక్షణాలు కలది. ఈ వైరస్ వ్యాప్తి చెందడంలో చాలా చురుకైన, వేగవంతమైన పాత్ర వహిస్తుంది. ఒకరినుంచి మరొకరికి వ్యాధి చాలా తొందరగా వ్యాపిస్తుంది. వ్యాధి సోకగానే వచ్చే లక్షణాల్లో శ్వాస తీసుకోవడం కష్టమైపోతుంది. ఐసీయూలో పెట్టి ప్రత్యేక వైద్యం వల్ల లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇంత ఖరీదైన వైరస్‌ను ఎదుర్కోవడానికి అన్ని సదుపాయాలు సమకూర్చుకునే లోపే మరణాలు సంభవిస్తున్నాయి.



రెండో కారణం ఈ వైరస్ చైనాలోని వూహాన్ ప్రాంతంలో ఏర్పడితే ఆ దేశానికి, ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచమంతా వ్యాపించి విపత్కర పరిస్థితి ఏర్పడడం రెండో కారణం. నేడు ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిపోయింది. చైనాతో ప్రపంచం దేశాలన్నిటికీ సంబంధాలు ఉన్నాయి. చైనాకు వెళ్ళి వచ్చిన వారు, చైనా నుండి ఇతర దేశాలకు వచ్చిన వాళ్ళ ద్వారానే ప్రతి దేశానికి ఈ వ్యాధి అందింది. ఒక వాహకంగా ప్రపంచీకరణ తోడ్పడింది. కోవిడ్ కరోనాకి పాండమిక్ అనే పదాన్ని వాడుతున్నారు. దాని అర్థం ఏమిటంటే ప్రపంచ మహమ్మారి అని. ఒక దేశానికి మాత్రమే పరిమితమైంది కాదు. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి ఇది సోకుతుందనే భయం అందరిలో ఉంది. ఈ భయం ప్రతి దేశంలోకి ప్రవేశించింది.

**ప్రపంచీకరణ తోడ్పాటు, గ్లోబలైజేషన్ అనే అభివృద్ధి లేకపోతే ఇలాంటి వైరస్‌లను అధిగమించవచ్చా?**

సాంకేతిక అభివృద్ధి, శాస్త్ర పరిజ్ఞానానికి సంబంధించిన అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి ఇలా అన్ని రకాలుగా అభివృద్ధి చెందటం అవసరమే. అభివృద్ధి అందరికి అందించాలనే లక్షణం ఒక సర్వజనీనం. ధనిక వర్గానికో, ప్రైవేటు వర్గానికో కాకుండా ప్రజలందరికి అందిచాలనే సత్‌సంకల్పం ఉంటే అభివృద్ధి ప్రపంచానికి మేలు చేస్తుంది. ప్రపంచదేశాలల్లో అమెరికా పెద్ద దేశం అని అంటున్నాం. ఆర్థికంగా, సాంకేతికపరంగా, విజ్ఞానపరంగా అభివృద్ధి చెందినటువంటి అమెరికావంటి దేశాలు ఈ పరిస్థితిని ఎదుర్కొలేక పోయాయి.

**కరోనాను ఇండియా ఎలా కట్టడి చేసింది?**

ఇండియా కట్టడి చేసిందని అనుకోవటం కరెక్ట్ కాదు. మరణాలు ఎక్కువగా లేకపోవటం అనేదాన్ని చూపించి అలా మాట్లాడుతున్నాం గానీ, అది వాస్తవం కాదు. ఇండియాలో కూడా దాదాపు ఒక 60, 80వేల దాకా కేసులు రికార్డు అవుతున్నాయి. దాదాపు 20వేల దాకా మరణాలు దగ్గరౌతున్నాయి. రేపు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. కట్టడి చేసే పరిస్థితులు లేవు. ఒకటి ప్రపంచ మహమ్మరి కరోనా క్రిమిని చంపటానికి మందు కనుక్కోలేదు. మందు లేకుండా వైద్యం చేయటం సాధ్యం కాదు. ఈ ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా నియంత్రించటం కోసం వివిధ దేశాలు, రాష్ట్రాలు ప్రభుత్వాలు ముందు జాగ్రత్తచర్యలు తీసుకున్నాయి. అందులో భాగంగా లాక్‌డౌన్. ఎవరికి వాళ్లు భౌతిక దూరం పాటించటం. వ్యాప్తికి అవకాశం ఇచ్చే వాటిన్నిటిని బంద్ చేయటం. మాల్స్, సినిమాలు, బస్సులు, రైలు, విమానాలు, పండుగలు, ప్రార్థన స్థలాలు అనేక ఉదాహరణలు చెప్పవచ్చు. మాస్క్‌ను ఒక సింబాలిక్‌గా తీసుకున్నారు. కనీసం దూరం పాటించటం, మాస్క్‌లు ధరించటం, దానితో పాటు చేతులను ఎప్పటికప్పుడు శానిటైజర్ ద్వారా శుభ్రపరుచుకోవటం. ఈ జాగ్రత్తలు తీసుకొని మనం కట్టడి చేయడానికి ప్రయత్నం చేసినాం. ఇవన్నీ ఆ వైరస్ మనకి సోకకుండా, సంక్రమించకుండా తీసుకునే జాగ్రత్తల కిందకి వస్తాయి. ఇతర దేశాలకంటే మన దేశం మెరుగుగా ఈ పని చేసిందా అంటే చేయలేదనే చెప్పాలి. ఎందుకంటే మార్చి రెండో వారం దాకా కేంద్ర ప్రభుత్వం మేలుకోలేదు. ఈ లోపల ఇండియాకు

ట్రంప్ వచ్చాడు. ట్రంప్ వస్తూ వస్తూ ఆరువేల మందిని తీసుకొచ్చి దేశమంతటా తిరిగి వెళ్ళిపోయారు. మనమేమో నమస్తే ట్రంప్ అని చెప్పడం కోసమే లక్షలాది మందిని జమ చేశాం. వీటివల్ల జరగాల్సిన నష్టం జరిగింది. ప్రభుత్వ కట్టడి కన్నా భారత దేశంలో ఉండేటు వంటి సమశీతోష్ణ స్థితి ఒక వరం మనకి.

**వలస కార్మికుల విషయంలో ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు ఎలా ఉన్నాయి?**

కోవిడ్ మహమ్మరిని ఎదుర్కొవటం కోసం ప్రభుత్వాలు తీసుకునే చర్యలకు సహకరిస్తు ప్రజలు ఏ మేరకు స్వయం నియంత్రణ పాటిస్తున్నారో అది కూడా ఒక చర్యనే. జీవితం జీవనాధారం ఈ రెండు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. సంపన్న వర్గం, ఉన్నత మధ్య తరగతికి సంబంధించిన వాళ్లకి రేషన్, కూరగాయలు, డబ్బులకు ఇబ్బంది లేదు. కానీ ఏ పూటకు ఆ పూట రెక్కడితేగానీ డొక్కాడని వాళ్లు జీవనాధారం కోసం బయటికి రావాల్సి వస్తది. నిబంధనల్ని పాటిస్తే మంచిదని అందరికి తెలుసు. కానీ కరోనాతో వచ్చేటువంటి చావు కంటే తాము ఉన్న స్థితిలో ఆకలి చావుతో వచ్చే చావు ముందుగా వస్తే ఏం చేయాలి. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇల్లులేని వలస కూలీల, అసంఘటిత కూలీల, నిరాశ్యుల నిర్భాగ్యుల స్థితిగతులను పట్టించుకోకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారికి జీవనాధారం కల్పించక పోవడాన్ని చూశాం.

> **కోవిడ్ మహమ్మరిని ఎదుర్కొవటం కోసం ప్రభుత్వాలు తీసుకునే చర్యలకు సహకరిస్తు ప్రజలు ఏ మేరకు స్వయం నియంత్రణ పాటిస్తున్నారో అది కూడా ఒక చర్యనే. జీవితం జీవనాధారం ఈ రెండు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి.**

అసలు ముందు వలస కార్మికులు ఎంత మంది ఉంటారో అవగాహన లేదు. మన తెలంగాణలో ఉండే పాలమూరు జిల్లాకు సంబంధించిన వారు దేశం నలుమూలా ఉన్నారని తెలుసు తప్ప, దేశం నలుమూల నుంచి మన రాష్ట్రంలోకి వచ్చారని మనం గమనించలా. ఇప్పుడు కరోనా రాకుంటే ఈ వార్తలు మనం చూసే వాళ్లమే కాదు. ఈ రెండు రకాల సమస్యలు ఏవైతే ఉన్నాయో ఇది గమనించటంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలం చెందాయి. ప్రజలు వంద రోజులు ఇంట్లో కూర్చుని జీవనాధార సమస్య తలెత్తకుండా జీవించే పరిస్థితి ఈ దేశంలో ఉందా? లేదు అనే సంగతి కరోనా బయటికి తీసుకొచ్చింది.

జీవనాధారంతో జీవించే హక్కు ప్రజల హక్కు అయినప్పుడు వాళ్లు జీవనాధారం కోల్పోతే లేదా పొందే పరిస్థితి లేకపోతే కల్పించాల్సిన బాధ్యత ఎవరిది! హీన స్థితిలో ఉన్న వాళ్లకి ముందు ప్రాధాన్యత ఇవ్వాలని, నిస్సాయత స్థితిలో ఉండే వాళ్లకి సహాయక పాత్ర వహించాలని రాజ్యాంగం చెబుతుంటే ఈ ప్రభుత్వాలు ఏం చేసినాయి. మూడు సార్లు ప్రసంగాలు చేసినటువంటి ప్రధానమంత్రి వలస కూలీలకు సంబంధించిన ఆర్థిక ప్యాకేజీ గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదు. రాజ్యాంగ ఉల్లంఘనకి పాల్పడటం జరిగింది. వలస కార్మికుల ఇబ్బందికి ప్రభుత్వం చేయాల్సిన పని చేయకపోవటం వల్ల మరీ చివరికి వలసకార్మికులే తిరుగుబాటు చేసి మా ప్రాంతాలకి వెళ్తామని ఆందోళనకి దిగటం జరిగింది. అందరం చూశాం సూరత్‌లో, బాంబేలో జరిగింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ సంగారెడ్డిలో జరిగింది.

గౌడోన్లల్లో ధాన్యం మూలుగుతుంది. వలస కార్మికుల కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి! ప్రతి కుటుంబానికి నెలకి 10వేల రూపాయలు నగదు, ప్యాకేజీ ఇవ్వాలి. రెండు ఈ మూడు నెలలకి సరిపడా నిత్యావసరాల సరుకులు పంపిణీ చేయాలి. నిత్యావసరాల సరుకులు రేషన్ షాపుల ద్వారా రేషన్ కార్డు లేకపోయినా సరే పంపిణీ చేయాలి. మూడు స్వస్థలాలకు వెళ్లాల్లి అనుకొనేవారికి ప్రయాణ సౌకర్యాలు ఉచితంగా కల్పించాలి. వలస కార్మికులకు ఫుడ్, ఫుట్‌వేర్, వాటర్, మాస్క్ ఉచితంగా అందించాలి. పనిచేసే చోట, ఉద్యోగం చేసే చోట వారిని ఉద్యోగంలోంచి తొలగించకుండా లాక్‌డౌన్ కాలానికి వేతనం ఇచ్చేలాగా యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిస్సహాయులకు సహాయం అందించాలి. సాధారణ ప్రజల విషయంలో, ఈ వలస కార్మికుల విషయంలో ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్నటువంటి బాధ్యతా రాహిత్య వైఖరి ఇది కరోనా కంటే ప్రమాదకరమైనదని చెప్పవచ్చు.

**చిన్న చిన్న దేశాలు విపత్కర పరిస్థితి నుండి ఎలా బయట పడ్డాయి?**

అభివృద్ధి చెందిన పెద్ద దేశాలే ఈ కరోనా విపత్కర పరిస్థితిని ఎదుర్కోవటంలో ఘోరంగా విఫలమయ్యాయి. అభివృద్ధిలో వెనుకబడిన చిన్న దేశాలే చాలా వరకు సక్సెస్ అయినాయని ప్రపంచ అనుభవాలు చెబుతున్నాయి. సైన్స్, వైద్య రంగంలో అభివృద్ధి చెందిన దేశాన్ని ఈ కరోనా వైరస్ ఏం చేస్తుందని చాలా తేలికంగా నిర్లక్ష్యంగా, అహంకారంతో మాట్లాడం ఒక కారణం. చిన్న దేశాలు పెద్ద దేశాల వాళ్లలాగా నేలను విడిచి సాము చేయలేదు. అందుకని వాళ్లు బెటర్ పోజిషన్‌లో ఉన్నారు. వియత్నాం, దక్షిణ కొరియా, క్యూబా ఉదాహరణలు. వియత్నాంలో వాళ్లు త్రిముఖమైన వ్యూహం అనుసరించారు. ఆ త్రిముఖమైన వ్యూహంలో అంశాలు ఏమిటంటే, ఒకటి నిర్లక్ష్యం చేయకుండా ముందుగా మేల్కొనటం. ముందు జాగ్రత్తలు తీసుకోవడం. ఇది ఏదో మామూలు ఫ్లూ జ్వరం లాగా పారాసిటమాల్ వేసుకుంటే పోతుంది అని కాకుండా, ఇది చాలా ప్రమాదకరమైన వ్యాధి, అది చాలా ఫాస్ట్‌గా వ్యాపిస్తుంది. ప్రాణప్రాయాలు కల్గిస్తుంది. ప్రభుత్వ సాధనాల ద్వారా చాలా ముందు జాగ్రత్త చర్యగా గ్రాస్‌రూట్ లెవల్‌లో ప్రతి మనిషికి అర్థం అయ్యేటట్లుగా ప్రచారం చేశారు. అందువల్ల ప్రపంచంలోనే ఒక్క చావు కూడా లేని దేశం వియత్నాం. చైనాకు ఆనుకొని వున్న దక్షిణ కొరియా పరిమితులను, లోపాలను అధిగమించి దాన్ని ఎదుర్కోవటం

కోసం కొన్ని చర్యలను తీసుకున్నది. అంటే క్వారంటైన్‌లు తరువాత ఐసోలేషన్ వార్డులు, వెంటిలేటర్లు పరికరాలు, వైద్య సిబ్బంది ఇలాంటివి ఏవైతే అవసరం అవుతాయో అవి దేశ ప్రజలకి సరిపడినన్ని తయారు చేసుకొని వున్నారు. ఇవి ఉండటం వల్ల వాళ్లు వెంటనే వియత్నాం లాగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటంతో పాటు, టెస్ట్‌లు చేయటం క్వారంటైన్‌కు పంపటం, వైద్యం చేయటం తద్వారా మినిమం మరణాలతో ఆ దేశం ఎదుర్కోగల్గింది. తరువాత క్యూబా. క్యూబా అదొక కమ్యూనిస్టు దేశం. అభివృద్ధి చెందిన దేశం అమెరికా ఇవాళ ప్రపంచంలోనే మరణాల రేటులో నెంబర్ వన్ స్థానంలో వుంటే క్యూబా ప్రమాదంలో వున్న దేశాలకు వైద్యుల్ని, వైద్య పరికరాల్ని, మందులను పంపగల్గుతుంది. చిన్న దేశాలకు ప్రజల సంక్షేమం పట్ల ఉన్న బాధ్యత వల్ల, నిబద్ధత వల్ల యిది సాధ్యమైంది.

### ప్రపంచ ఆర్థిక రంగంలో రాబోయే మార్పులు ఏమిటి?

ఇప్పుడు నడుస్తున్నది న్యూయో లిబరల్, న్యూ ఎకనమిక్ పాలసీ. ఉదార ఆర్థిక విధానం, నూతన ఆర్థిక విధానం. దాన్ని వ్యక్తీకరణ ఎల్పీజీ రూపంలో లిబలైజేషన్, ప్రవైటేజేషన్, గ్లోబలైజేషన్ నడుస్తుంది. ఈ కరోనా తరువాత ఈ న్యూయో లిబరల్, న్యూ ఎకనమిక్ పాలసీ స్థితిలో మార్పులు రాబోతున్నాయి. ఎల్పీజీలో కూడా మార్పులు రాబోతున్నాయి. ఇంకో మాటలో చెప్పాలంటే అది ప్రపంచీకరణ అయితే అది గ్లోబలైజేషన్. అయితే రాబోయే పరిణామం లోకలైజేషన్ రాబోతుంది. మా తెలంగాణ మాకు ముఖ్యం. మా ఇండియా మాకు ముఖ్యం. మా అమెరికా మాకు ముఖ్యం, ఒక స్థూల నైతికతతో లోకలైజేషన్ అనేది స్థానికీకరణ రాబోతుంది. ఉదార ఆర్థిక విధానం అంటే ప్రపంచ మార్కెట్‌లో ఎవరైనా ఏ దేశంలోనైనా వ్యాపారం చేసుకోవచ్చు. ఇక నుంచి అది జరగదు. చైనాలో ఉండే వ్యాపారాలన్నింటిని యూరప్ దేశాలు ఎత్తేసుకొని ఇతర దేశాలల్లో పెట్టబోతున్నాయి. ఇండియా కూడా చైనా నుండి మన దేశానికి దిగుమతి అయ్యేటువంటి వస్తువులు ఏవి కూడా దిగుమతి కావటానికి వీల్లేకుండా ఒక చట్టాన్ని చేసింది. ప్రపంచీకరణతో పాటు ప్రైవేటీకరణ ప్రక్కన పెట్టి ప్రభుత్వ రంగంలో స్వావలంబన పాటించి అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది.



### కరోనా పరిస్థితులను అంచనా వేయటంలో ప్రపంచ వ్యాప్తి వైఫల్యానికి కారణం ఏమిటి?

ఈ వైఫల్యం అమెరికా నుండి కనిపిస్తుంది. ఈ వైఫల్యం ఇతర పశ్చిమ దేశాలనుంచి యూరప్ దేశాల నుంచి ఇటలీ, ఫ్రాన్స్ ఇంగ్లండ్ దేశాలనుంచి కనిపిస్తున్నది. ఎక్కువ జనసాంద్రత కల్గిన భారతదేశం లాంటి దేశం నుంచి కనిపిస్తున్నది. ఒకరకంగా వైఫల్యం ప్రపంచ వ్యాప్తంగా ఉంది. దీనికి కారణం కరోనా ఎంత ప్రమాదం కల్గించగల్గుతుందో అంచనా లేకపోవటం. ఇప్పటికి అది ప్రపంచ వైఫల్యం అనే దానికంటే కరోనాకి సంబంధించిన విలక్షణం అని చెప్పుకోవాలి.

### పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

కరోనానే పర్యావరణాన్ని కాపాడుతున్నదేమో అనిపిస్తుంది. ఇది ఎంత ప్రమాదం కల్గిస్తా ఉన్నదో అంత మేలు కూడా చేస్తున్నది. గంగానదిలో నీళ్ళు ఇప్పుడు ఉన్నంత స్వచ్ఛంగా ఎప్పుడూ లేవట. జల కాలుష్యం లేకుండా కరోనా కాపాడుతుంది. రెండోది శబ్ద కాలుష్యం. మనం బయటికి వెళ్ళి ఇంటికి వచ్చే సరికి చెవులు దిబ్బిలు లేస్తుంటాయి. మూడోది వాయు కాలుష్యం. ఈ వాహనాల కార్బన్ డయాక్సైడ్ వలన అసలు భూమి యొక్క భూతాపం ఎక్కువై పోతుందని చెబుతున్నారు. వాయు కాలుష్యం తగ్గింది, జలకాలుష్యం తగ్గింది, శబ్ద కాలుష్యం తగ్గింది. అందువల్ల భూతాపం తగ్గింది. కారణం లాక్‌డౌన్ విధించి అందరిని ఇంట్లో ఉంచడం వలన. మళ్లీ మనం బయటికొస్తే చేసేవన్నీ చేస్తాం. కరోనా సందర్భంలో ఈ పర్యావరణానికి ఎంత మేలు జరిగిందో గమనించి ఆ జాగ్రత్తలను పాటించటం అవసరం.

### కరోనా పుట్టుకకు ప్రకృతి వైపరీత్యాలే కారణమా?

ప్రకృతి వైపరీత్యాలు కారణం కాదు. ప్రకృతి కారణం కావొచ్చు. చెట్లు జంతువులు, పక్షులు, మనుషులు మొత్తం కలిసి ప్రకృతి. ప్రకృతితో సంబంధం లేకుండా మనిషి లేడు. ప్రకృతి ధర్మాలను బట్టి మనిషి కూడా నడుచు కోవాలి. చలికాలం ఎలా బతకాలో, ఎండాకాలం ఎలా ఉండాలో, వానా కాలంలో ఎట్లా బతకాలో మనకు తెలుసు. ప్రకృతి అనుగుణంగా నడుచుకోవాలి. ప్రకృతితో మానవుడికి వుండే సంబంధాన్ని శాస్త్రీయంగా ఏర్పాటు చేసుకోవాలి.

### మానవ సంబంధాలు ముఖ్యంగా కుటుంబ వ్యవస్థపై దీన్ని ప్రభావం ఎట్లా ఉంటుంది?

మానవుడికి రెండు లక్షణాలు ఉన్నాయి. ఒకటి స్వార్థం, రెండు మానవుడు సంఘ జీవి. సంఘంతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా మనిషి బతకలేడు. అలాగే స్వార్థ జీవి కూడా. ఇప్పుడు కరోనా అంటే ఎందుకు అంత భయపడుతున్నాం. ఉప్పెన వస్తుందంటే, భూతాపం పెరిగిపోతుందంటే, భూగోళం బద్దలు అవుతుందంటే అవ్వనీలే నాకేమిలే అనుకొంటాం. ఎక్కడో ఏదో జరిగిదంటే నాకేమిలే అనుకుంటాం. దేనికీ భయపడని వాడు కరోనాకి ఎందుకు భయపడు తున్నాడు. ఒకరినుంచి మరొకరికి సోకుతుంది అనే సూత్రంలో ఆ మరొకరిని నేను కాకూడదని ప్రతి ఒక్కరు అనుకుంటారు. ఆ వ్యక్తి ప్రాణాప్రాయం కల్గకుండా ఉండటం కోసం అవసరమైతే కన్న

తల్లినైనా, కన్న కొడుకునైనా, కుటుంబ సభ్యులనైనా, ఫ్రెండ్స్‌నైనా, రాజకీయ పార్టీ వాళ్లనైనా అవతలికి తీసేసి వాడిని వాడు కాపాడుకోవాలని చూస్తాడు.

మానవ సంబంధాలు, రక్తసంబంధాలు, కుటుంబ సంబంధాలు, బంధుత్వ సంబంధాలు ఎక్కడ ఏడ్చినాయి. బేసిక్‌గా మానవుడు స్వార్థపరుడు. తన ప్రాణానికే ప్రమాదం వచ్చినప్పుడు ఎవ్వరిని పట్టించుకోకుండా తన ప్రాణాన్నే కాపాడుకుంటాడు. ఇది మంచిదా, చెడ్డదా అని కాదు. ఇది మనిషి లక్షణం. ఈ స్వప్రయోజనంతో కూడుకొన్న స్వార్థ లక్షణానికి సామాజిక సమిష్టి ప్రయోజనానికి మధ్య ఎప్పుడు కూడా సంఘర్షణ జరుగుతా వుంటది. ఈ కరోనా ఏం చేసిందంటే మనిషిని మళ్లీ భయం రీత్యా స్వార్థ పరుడిగా ఒంటరిని చేసింది. మనం ఏం చేయా లంటే మళ్లీ మానవ సంబంధాలను పెంపొందిం చాలి. నా తల్లిని చూసుకోవాలని, నా బిడ్డను చూసుకోవాలని వేల కిలోమీటర్లు నడుచుకుంటు పోతాడు ఒక మనిషి. స్వార్థానికి – నిస్వార్థానికి, వ్యక్తికి – సమిష్టికి, మానవ సంబంధానికి – రక్త సంబంధానికి, సమాజ సంబంధానికి – సంఘు సంబంధానికి మధ్య సంఘర్షణలో మళ్లీ వీటిని నిలుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కోవిడ్ మహమ్మరిని ఎదుర్కొవటం కోసం ప్రభుత్వాలు తీసుకునే చర్యలకు సహకరిస్తు ప్రజలు ఏ మేరకు స్వయం నియంత్రణ పాటిస్తున్నారో అది కూడా ఒక చర్యనే. జీవితం జీవనాధారం ఈ రెండు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి.**

## మనదేశ ఫెడరల్ వ్యవస్థ రేపు ఎలా ఉండబోతుంది? ఎలా ఉండాలి?

కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకి ఎలాంటి సహాయం చేయకుండా, రాష్ట్రాలకు ఉండే హక్కులను కూడా హరించేస్తుంది. రాష్ట్రాలకుండే ఆదాయాలకు గండి కొడుతూ ఒకరకంగా రాష్ట్రాలను వేధిస్తుంది. ఇప్పటి దాకా సహకార ప్యాకేజీ ఇవ్వలేదని అంటున్నారు. సహకార ఫెడరలిజం అంటేనే సహకారం అందించేది. సహకారం అందించకపోతే కేంద్రం వేధించుతుంటే ఫెడరలిజం ఎలా అవుతుంది. దీన్ని సీరియస్ సమస్యగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. మూడు అంశాలను ఇక్కడ నేను ప్రస్తావిస్తాను. ఒకటి ఇప్పుడున్న పరిస్థితుల్లో అసలు రాష్ట్రాలు లేకుండా కేంద్రం లేదు. ఒకప్పుడు ఎన్టీరామారావు అయితే కేంద్రం మిధ్య అన్నాడు. రాష్ట్రాలు సత్యం, కేంద్రం మిధ్య. అయినా రాష్ట్రాలను ఇప్పుడు మిధ్య చేసి కేంద్రం సత్యం అవుతున్నది. కరోనా సందర్భంగా చెప్పుకోవాల్సి వచ్చినప్పుడు మూడు రకాల నష్టాలను కల్గుజేస్తున్నది. ఒకటి ఒక ఎలక్ట్రిసిటి బిల్లు చట్టంగా తీసుకురాబోతున్నదని ఇవాళ నిన్న వార్తలు వస్తావున్నవి. రాష్ట్రాల చేతుల్లో ఉండే అధికారాన్ని కేంద్రం లాక్కోమని ఏ రాజ్యాంగం చెప్పింది కోపరేటివ్ ఫెడలిజం సహకరించమందే గానీ గుంజుకోమనలేదే. రాష్ట్రాల హక్కు ఇది. రాష్ట్రాల హక్కుల్ని కేంద్రం తీసుకెళ్తుంది. రాష్ట్రాలకి కేంద్రాలకి ఉమ్మడి హక్కులు ఉన్నాయి. అది కూడా కేంద్రం హక్కుల్లోకి తీసుకెళ్తా ఉంది. దీని ద్వారా ఏమౌతుంది రాష్ట్రాలకు వచ్చే ఆదాయాన్ని దొంగ దెబ్బ తీసి కేంద్రం తీసుకుంటా ఉంది. పోనీ నీవు తీసుకున్న ఆదాయాన్ని రాష్ట్రాలకు ఏమన్న ఇస్తున్నావా.

ఉదాహరణకి ప్రధానమంత్రి సహాయనిధి, ముఖ్యమంత్రి సహాయ నిధి రెండు రకాల నిధులు ఈ విపత్కర పరిస్థితులో వస్తున్నాయి. ప్రధానమంత్రి సహాయనిధికింద దాతలు చేసినటువంటి సహాయానికి ట్యాక్స్ వెసులుబాటు కల్గిస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి సహాయం చేసే విషయంలో ట్యాక్స్ వెసులుబాటు లేకుండా కేంద్రం చేస్తుంది. అప్పుడు ప్రధానమంత్రి నిధికి ఇస్తే ట్యాక్స్ వెసులుబాటు వస్తుందని చెప్పి అటే ఇస్తారు కొంతమంది.

కేంద్రం ప్రభుత్వం అధికార కేంద్రీకరణ పెరిగి పోతా ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తెలిసో తెలియకో ఇప్పటి దాకా ఆమోదం తెలియచేస్తూ ఉన్నాయి. రాష్ట్ర పాలితప్రాంతాల్ని దేశ వ్యాప్తంగా కేంద్ర పాలిత ప్రాంతం చేయబోతున్నది. కేంద్రం అధికార కేంద్రీకరణ, ఆర్థిక వనరుల నియంత్రణ రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని గుర్తించి రాష్ట్రాలు నిజమైన ఫెడలిజం కోసం పోరాడకపోతే రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజల చేత ఓట్లు పొంది ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకొన్న రాష్ట్ర పాలిత ప్రాంతాలు ఉండవు. మొత్తం కేంద్ర పాలిత ప్రాంతంగా మారిపోతుంది. అందుకే నిజమైన ఫెడలిజం రావాల్సిన అవసరం ఉంది. రియల్ ఫెడలిజం అంటే నాలుగైదు అధికారాలు మాత్రమే కేంద్రంలో ఉండాలి. రైల్వే, పోస్టల్, టెలిగ్రాఫ్, రక్షణ, సైన్యం, కరెన్సీ ఇలాంటి నాలుగైదు అంశాలు కేంద్రం చేతిలో ఉండాలి. మిగతావన్నీ కూడా రాష్ట్రాల చేతిలో ఉండాలి. ఈ రాష్ట్రాలను సమన్వయం చేసే పాత్ర కేంద్రానికి ఉండాలే తప్ప పెత్తనం చేసే పాత్ర ఉండటానికి వీలు లేదనే మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది. లేకపోతే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ఉండదు.

## కరోనా సందర్భంగా మీ అంతర్మథనం, ఆలోచనలు ఏమిటి?

హెల్త్ అనేది పబ్లిక్ సెక్టార్‌లో ఉండకపోతే ఎంత అభివృద్ధి చెందినా విపత్తుని ఆపలేమని తేలిపోయింది. సైన్స్‌ను నమ్మండి. మూఢనమ్మకాల్ని, మూఢ విశ్వాసాలని నమ్మితే మనం ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కోలేమని కరోనా మనకు గుణపాఠం చెబుతావుంది. జబ్బులొచ్చినప్పుడు, ఇబ్బందులు వచ్చినప్పుడు దానికి మందులు వేసుకోవాలి, వైద్యం చేయించుకోవాలి. అలా అయితేనే బతుకుతాం. లేకపోతే బతుకు లేదని కరోనా చెబుతున్నటువంటి ఈగుణపాఠాన్ని చూసి నేర్చుకోవాలి. కోవిడ్ సందర్భంగా ఈ విషయాలు మాట్లాడడానికి అవకాశం ఇచ్చిన దక్కన్ ఛానల్ వారికి ధన్యవాదాలు.

*(సచిన్, మల్లేష్ – దక్కన్ ఛానల్ ఇంటర్వ్యూ ఆధారంగా)*

– జుగాష్ విలి, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

ద

# వన్యప్రాణి రక్షణే జీవ వైవిధ్య పోషణ

## (కేరళలో గర్భం దాల్చిన ఏనుగు హత్యకు స్పందనగా)

కేరళలోని నీలంబూర్ అటవీ ప్రాంతంలో గర్భం దాల్చిన 15 సంవత్సరాల వయస్సు గల ఏనుగును క్రూరంగా హత్య చేసిన ఘటన యావత్ భారతదేశ ప్రజలను, జంతు ప్రేమికులను విస్మయానికి గురిచేసింది. ఈ ఘటనకు స్పందించిన వారిలో రతన్ టాటా, విరాట్ కోహ్లీ, ఇతర ప్రముఖులతో పాటు అసంఖ్యాక సామాన్య జనం తమ గళాన్ని వినిపించడం ఆహ్వానించదగిన పరిణామం. కరోనా లాక్‌డౌన్ కారణంగా వన్యప్రాణులు కొంత స్వేచ్ఛను తీసుకోవడం, మానవ నివాసాలకు దగ్గరగా రావడం కూడా ఏనుగు హత్యకు దారి తీయవచ్చు. పైనాపిల్ పండులో పేలుడు పదార్థాలను నింపి ఎరగా వేసి తినిపించిన కారణంగా తీవ్ర నోటిగాయాలతో 3 రోజులు నరకాన్ని అనుభవిస్తూ ఆహారం తినలేక, వైద్యానికి స్పందించక చివరికి 27 మే రోజున చనిపోవడం అత్యంత విచారకరం. వెల్లియార్ నదీ జలంలో కూరుకుపోయి, బయటకు తీయడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ప్రాణం పోయిందని అటవీశాఖ అధికారులు తెలిపారు.



ఏనుగు దవడలకు తీవ్రగాయాలై దంతాలను కోల్పోయి ఆహారం తినలేక చనిపోయింది. నీటిలో చిక్కుకున్న ఏనుగును బయటకు తీసేలోపుగానే మరణించిందని వార్తలు వచ్చాయి. ఏనుగును పోస్టుమార్టం నిర్వహించగా గర్భవతి అని తేలడం బాధాకరం. ఈ విషాద ఘటనను పోస్టుమార్టం నిర్వహించిన డా: కృష్ణన్ ఫేస్ బుక్ పోస్టులో రాసిన కారణంగా బయటి ప్రపంచానికి తెలిసింది. ఈ పాశవిక చర్యకు పాల్పడిన మానవ మృగాల్ని పట్టుకునే ప్రయత్నాలు ఇప్పటికీ ఫలించకపోవడం విచారకరం. పతనపురం అడవులలో ఏప్రిల్ మాసంలో ఇలాంటిదే మరో ఘటన జరగడం వలన ఆడ ఏనుగు మరణించింది.

అడవుల్లో మనుషులకు వన్యప్రాణులకు మధ్య అనాదిగా పోటీ జరుగుతూనే ఉంది. వన్యప్రాణుల మాంసం, జంతు చర్మాలు, దంతాలు (ఏనుగు), ఇతర జంతు శరీర భాగాల కోసం దుండగులు, స్మగ్లర్లు జంతువులను హత్య చేయడం కొత్తేమీకాదు. వీరప్పన్ లాంటి అనేక మంది క్రూరులు వన్యప్రాణులను చంపడమే వృత్తిగా తీసుకొని అడవులలోనే నివాసం ఉంటున్నారు. అదుపు చేసేందుకు ప్రయత్నించిన అటవీ అధికారులను కూడా హత్య చేయటానికి వెనుకాడటం లేదు. ఏనుగులను హత్య చేసి దంతాల స్మగ్లింగ్‌కు పాల్పడి లక్షల రూపాయలను గడిస్తున్న కీచకులను పట్టుకొని కఠినంగా శిక్షించాల్సిన తరుణం ఆసన్నమైంది. అలక్ష్యం చేస్తే మరి కొన్ని వన్యప్రాణులు అంతరించే ప్రమాదం కూడా లేకపోలేదని జంతు ప్రేమికులు వాపోతున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ ఏనుగు హత్యోదంతానికి స్పందించిన వారు, దొంగలను పట్టిచ్చిన వారికి లక్షల రూపాయల నజరానాలు ప్రకటనలు చేశారు. నోరు లేని మూగజీవాలను క్రూరంగా చంపే రాక్షసులను శిక్షించాలని కోరుకునే జంతు ప్రేమికులు కూడా అనేక మంది ఉన్నారు. మృగాలు క్రూరమైనవి కాదని, మానవులే నిజమైన క్రూర మృగాలని నెటిజన్లు వ్యాఖ్యలు చేయడం ఆహ్వానించదగిన పరిణామం.

ప్రపంచవ్యాప్తంగా 4,15,000 ఏనుగులు ఉన్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. భారతదేశ అడవుల్లో 27,000 ఏనుగులు ఉన్నాయని అంచనా వేశారు. దశాబ్దాల క్రితం మిలియన్ల ఉన్న ఏనుగుల సంఖ్య క్రమంగా తగ్గడం జరుగుతున్నది. కర్నాటకలో 6,049, అస్సాంలో 5,719 మరియు కేరళలో 3,054 ఏనుగులు అన్నాయని తేల్చారు. 2018 కేరళ అటవీశాఖ వివరాల ప్రకారం, ఏనుగులను హత్య చేసే ప్రయత్నాలు లేదా హింసించే వారిలో 21 మంది మరణించగా, 45 మంది తీవ్రంగా గాయపడడం జరిగింది. గజరాజులను ప్రభుత్వాలు నడిపిస్తున్న ప్రముఖ దేవాలయాలలో పూజాకార్యక్రమాలకు వినియోగించటడం ఆచారంగా వస్తున్నది. తిరుమల, గురువాయూర్, కోచి, ట్రావెన్‌కోర్, మలబార్ దేవస్థానాలలో ఏనుగులను పూజలలో మరియు స్వామివారి ఊరేగింపు ఉత్సవాలలో పెద్ద ఎత్తున వాడుతున్నారు. ఒక్క కేరళ రాష్ట్ర దేవాలయాలలోనే 486 పెంపుడు ఏనుగులు ఉన్నాయని అంచనా. కొన్ని చోట్ల ఈ ఏనుగుల కాళ్ళకు భారీ గోలుసులు కట్టి వాటి స్వేచ్ఛకు విఘాతం కలిగించుట, హింసించుట జరుగుతోంది. ఆలయాలలో దేవుని

దర్శనంతో పాటు గజరాజులు కూడా భక్తుల పూజలందుకోవడం చూస్తున్నాం. ఏనుగులను పెంపుడు జంతువులా కట్టి పడేయడం, గొలుసులతో బంధించడం, హింసించడం లాంటివి మన మనసును పిండేసిన అనుభవం కూడా ఉంది. ఇవే కాకుండా ప్రైవేట్ వ్యక్తుల వద్ద కూడా 507 ఏనుగులు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

03 జూన్ రోజున రతన్ టాటా స్పందిస్తూ, గర్భవతిగా ఉన్న నోరు లేని వన్యప్రాణి ఏనుగును పేలుడు పదార్థం కలిపిన పైనాపిల్ తినిపించి పాశవికంగా చంపిన క్రూర మానవ మృగాలను సత్వరమే పట్టుకొని హత్యా నేరం కింద కఠినంగా శిక్షించాలని కోరారు. దీనిని మానవ హత్యగా పరిగణించాలని ఆవేదన వ్యక్తం చేయడం సమస్య గంభీరతను తెలియజేస్తున్నది. ఇలాంటి అమానవీయ ఘోర అకృత్యాల వలన జీవ వైవిధ్యం దెబ్బ తినడం, పర్యావరణానికి విఘాతం కలగడం జరిగి మానవాళి మనుగడే ప్రశ్నార్థకం కానున్నది. మనం అనుభవిస్తున్న వైరస్‌ల కల్లోలం, పెనుతుఫానులు, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, సునామీలు మొదలగు విపత్తులకు ఇలాంటి సంఘటనలు ఆజ్యం పోస్తాయని గుర్తుంచుకోవాలి. "సర్వ ప్రాణి సుఖినోభవంతు" నినాదమే మన ఊపిరి కావాలి. ప్రాణికోటి పరిరక్షణే మన లక్ష్యం కావాలి. ఈ విషయంలో ప్రతి ఒక్కరు తమ తమ కర్తవ్యాలను తూచాతప్పక పాటించాలి. మనిషి సంఘజీవి మాత్రమే కాదని, సకల జీవుల సంరక్షణ పక్షపాతియని రుజువు చేయాల్సిన సమయం ఆసన్నమైందని భావిద్దాం.

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
m : 99497 00037
e : burramsreddy@gmail.com

# "పని" లేని మనుషులు!

తెంపేసిన పువ్వుల్లా దిక్కులు చూస్తున్నరు
విసిరేసిన పండ్లలా మూలుగుతున్నరు
నరికేసిన చెట్లలా కూలబడ్డరు
ఏం దరిద్రమో
పని చేతులను విరిచేసింది
పని బతుకులను కూల్చింది

కల్గినోళ్ల బంగ్లాలల్ల
అంట్లు తోమితేనే పూటగడుస్తది
వాకిండ్లూడ్చి సాంపిచల్లి
కడపపై ముగ్గులేస్తేనే దినమెల్లుతది
నాలుగిండ్లల్ల పాచిపనులు చేస్తేనే
సద్దిదో గిద్దిదో మిగిలిందేదో మూటగట్టుకొస్తే
ఆ పూటెల్తుండే
దరిద్ర్యం కంట్ల ముండ్లు మొలువ

మాయరోగానికి జడిసి
ఇండ్లల్ల పనికి రావొద్దంటున్నరు
సొంతూరికి పోలేరు సొంతపనికి సాయంలేదు
నగరాల్లో పనిలేదు ఉండ కిరాయిలేదు
పిల్లలు రోడ్లను చూస్తున్నరు
ఏ దర్మాత్ముడన్న పనికి పిలుస్తరేమోనని రెప్పలను వత్తులుచేసి
చూస్తున్నరు

ఇంటిపని,వంటపని
ముసలోల్లను లేవట్టుడు కూసపెట్టుడు
చిన్నపిల్లల ఆలనపాలన
కూరగాయలు తెచ్చుడు బండలుకడుగుడు
బట్టలుతుకుడు చెట్లకు నీళ్లుపట్టుడు
నెలనాడొచ్చిన నాలుగువేలతోనే కాలమెల్లేది

సూర్యుడు పొద్దుపొడుస్తున్నడు
పని పొట్టలు మాడి పోతున్నవి
ఏ అపార్ట్మెంట్ వాళ్లను పలుకరియడంలేదు
ఏ గేటెడ్ కమ్యూనిటీ
పిడికెడు బువ్వపెడ్తలేదు
అన్ని రంగాల పనులు గేట్లెత్తేసినా
బడా బాబులు దర్వాజలు తెరువలే
పని జీవుల తండ్లాట


ఒక్కనాడు జ్వరమొచ్చి పనికోకుంటే
ఎన్ని పోన్లో ఎన్ని తిట్లో ఎంతరందో
పనుండి పోపోతే గిన్నెలు తోమెటోడెవరని
కస్సున కసురుకునేటోళ్లు
మూడునెల్లదినమాయే నిర్భాగ్యుల
దిక్కు మల్లిచూసిన బాబులే లేరు

కూలిన కొట్టాల గురించి మాట్లాడుదాం
విరిగిన వంతెనలపై నాలుగు అక్షరాలను రాద్దాం
కొట్టుకుపోతున్న మూటలను నిలబెడుదాం
పనికిమాలిన రోగం వల్ల
పనికొచ్చే పనిమనుషులకు పనేలేదు
పసివాడి కళ్ళల్లో ఆకలి మంట

-వనపట్ల సుబ్బయ్య
m : 9492765358
e : subbaiahvanapatla@gmail.com

# జీవవైవిధ్య రక్షణే ప్రాణికోటి సంరక్షణ

ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ప్రాణవాయువును, జీవక్రియల నిర్వహణకు నీటిని, ఆరోగ్య సిద్ధికి పోషకాహారాన్ని మరియు ప్రాణకోటి మనుగడకు అనువైన పరిసరాలను ప్రకృతి మాత ప్రసాదించింది. గాలి, నేల, నీరు, నింగిల సమ్మిళితమే పర్యావరణంగా పేర్కొనబడింది. ఎన్విరాన్‌మెంట్‌లోని 'ఎన్విరోనియా' అనగా పరిసరాలని, వీటిలోకి జీవ మరియు నిర్జీవ పదార్థాలు వస్తాయని అర్థం చేసుకోవాలి. పర్యావరణంలో నేల, నీరు, గాలి, జీవులు మరియు సౌరశక్తి ప్రధాన భాగాలున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకున్నప్పుడే జీవకోటి ఉనికి ప్రకటితమవుతుంది. భూగోళాన్ని నివాసయోగ్య ఆలయంగా మార్చుటకు ప్రతి ఒక్కరు తమ తమ చేయూతను ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ధరణి ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణతోనే సుసాధ్యమని భావించాలి. పర్యావరణాన్ని కాపాడుకొనుటలో మన స్వరాన్ని పెంచుతూ చేయి చేయి కలిపి కాలుష్య భూతాన్ని తరుమాల్సిన తరుణమిది. పర్యావరణ సమతుల్యతను పునర్ ప్రతిష్టించుటలో సభ్యదేశాలు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరాలను ప్రజలకు వివరించేలా ఐక్యరాజ్య సమితి జూన్ 05 రోజున ప్రపంచ పర్యావరణ దినాన్ని జరుపుతున్నది. శిథిలమౌతున్న శిలావరణం, అపరిశుద్ధ జలావరణం, అనారోగ్య జీవావరణం, కలుషిత వాతాపరణం, సమతుల్యత తరిగిన జీవ వైవిధ్యం ప్రాణి మనుగడను పెను ప్రమాదంలోకి నెట్టిన అకాలంలో మనం ఉన్నాం. ప్రతి సందర్భాన్ని అవకాశంగా తీసుకొని జల కాలుష్యం, భూతాపం, జీవ వైవిధ్య వినాశనం, జనాభా పెరుగుదలతో గాలి మరియు నేల కాలుష్యాలు విసిరిన సవాళ్ళకు సమాధానాలు సత్వరం వెతకాల్సిన బాధ్యత మనిషి మీదనే ఉంది. పర్యావరణానికి తూట్లు పొడిచిన నడవంత్రపు నరుడు కరోనా, మిడతల దండు, దట్టమైన పొగ మేఘాలు కమ్మిన నగరాలు, అకాల వర్షాలు, జీవజాతులు అంతరించడం, ప్రకృతి ప్రళయాలు, జీవుల అనారోగ్యాలు లాంటి పెను సమస్యలను ఎదుర్కొంటూ ఉన్నాడు.



పర్యావరణ పరిరక్షణను ఒక పవిత్ర యజ్ఞంగా భావించి కాపాడుకోవలసిన అవసరాన్ని ప్రచారం చేయడం, విద్యార్థిలోకానికి పలు పర్యావరణ అంశాలలో పోటీల నిర్వహణ, ప్రదర్శనలు, వనమహోత్సవాలు, ర్యాలీలు, స్వచ్ఛ భారత్ కార్యాలు, ఉపన్యాసాలు, పర్యావరణహితుల సన్మానాలు, పోస్టర్ విడుదలలు ఉద్యమంలా చేపట్టాలి. ప్రభుత్వ, ప్రభుత్వేతర స్వచ్ఛంధ సంస్థలే కాకుండా ప్రతి ఒక్కరూ పాల్గొని రేపటి తరానికి ఆరోగ్యకర పర్యావరణాన్ని అందించే బాధ్యతలను భుజాన వేసుకోవాలి. రాజకీయ సంకల్పం లేనిదే పర్యావరణ పరిరక్షణ జరుగదు. సమాజం మేల్కొననిదే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించదు. జీవవైవిధ్యానికి విఘాతం కలుగుట వలన ఒక మిలియన్ జీవులు అంతరించబోతున్నాయనే వాస్తవం విచారకరం. 'జీవవైవిధ్య వేడుకలు' నినాదంగా పర్యావరణ పరిరక్షణ జరుపుకోవలసిన సందర్భమిది. భూమిపై ప్రాణికోటికి ఊపిరితిత్తులుగా వర్ణించబడిన అమెజాన్ మరియు ఆస్ట్రేలియా అడవులు అగ్నికి ఆహుతి కావడం పర్యావరణానికి ప్రమాదకరం.

పర్యావరణంలో భాగాలైన 'జలావరణం'లో సముద్రాలు, నదులు, సరస్సులు, చెరువులు లాంటి ఉపరితల జలాలు మొదలగునవి వస్తాయి. ఎడారులు, నేలలు, పర్వతాలు, కొండలు, కోనలు, వ్యవసాయ భూములు మొదలగునవి 'భూతలావరణం' లేదా 'శిలావరణం'లోకి వస్తాయి. భూమి చుట్టూ ఉన్న పలు వాయువుల (ఆక్సీజన్, నైట్రోజన్, హైడ్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్ మొదలగు) సమ్మిళితమైన గాలి అంతా కలిపుకొని 'వాతావరణం'లోకి వస్తుంది. భూమండలంపై నివసిస్తున్న జీవులన్నీ కలిసి 'జీవావరణం'గా గుర్తించబడింది. మరొక వర్గీకరణ ప్రకారం 'సహజ పర్యావరణం' (నీరు, కాంతి, నేల, గాలి మరియు జీవులు), 'పారిశ్రామిక పర్యావరణం' (నగరాలు, నివాసల ప్రాంతాలు, పరిశ్రమలు లాంటి మానవ నిర్మితాలు) మరియు 'సాంఘీక పర్యావరణాలు'గా (ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు, విద్యాలయాలు, కంపెనీలు మొదలగునవి)గా వివరించబడినవి.

పర్యావరణ పరిరక్షణకు సాంప్రదాయ తరిగే శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూ, సాంప్రదాయేతర తరగని ఇంధనాలైన సౌరశక్తి, పవన శక్తి, అలల శక్తుల వంటి వాటి వినియోగాన్ని పెంచే కృషి చేయాలి. వీటి ద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. అడవుల నరికివేతతో పాటుగా అడవీసంపద అగ్ని ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నగరాలకు, నివాసప్రాంతాలకు దూరంగా పరిశ్రమలను నెలకొల్పి, వ్యర్థాలను శుద్ధి చేస్తూ బయటకు వదలాలి. సముద్రజలాలలో వ్యర్థాలను, నగర మురికి నీటిని కలువకుండా మరియు పెట్రోలియం ఉత్పత్తులు లీక్ కాకుండా చూసుకోవాలి. అవకాశం ఉన్న ప్రదేశాలలో విరివిగా మొక్కలు నాటడం మరియు పోషించడం చేయాలి. చెట్ల వలన గాలి శుద్ధి చేయబడుతుందని మరువరాదు. వాహనాల వినియోగాన్ని తగ్గిస్తూ సైక్లింగ్‌ను

ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుటతో పాటు వ్యర్థ ప్లాస్టిక్‌లను తిరిగి వినియోగంలోని తేలాలి. ప్రకృతి వనరులను తక్కువగా వాడటం(రెడ్యూస్), తిరిగి వాడడం(రీయూస్) మరియు మరో వస్తు ఉత్పత్తికి (రీసైకిల్) వాడడం మూలంగా పర్యావరణానికి మేలు కలుగుతుంది. ప్రకృతి ప్రసాదించిన వనరులను, అమూల్య సంపదలను విచక్షణతో వాడుకోవాలి. ప్రజలందరికీ పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించాలి. నీటిని పొదుపుగా వాడడంతో పాటుగా ఇంకుడు గుంటలను, వాటర్ షెడ్ నిర్మాణాలను చేపట్టాలి. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, జీవ విచ్ఛిన్న ప్లాస్టిక్‌లను వాడుకలోని తేవాలి. విద్యుత్ వినియోగాన్ని, శిలాజ ఇంధనాల వాడకాన్ని పొదుపుగా వాడాలి. నివాసప్రాంతాలలో శబ్ద కాలుష్యాన్ని తగ్గించాలి. భూతాపానికి కారణమైన హరిత గృహ ప్రభావాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి. జీవావరణానికి విఘాతం కలుగకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలి. పర్యావరణ పరిరక్షణే జీవి రక్షణ అని నమ్మాలి. ప్రకృతిలోని ప్రతి అంశానికి ఒక ప్రత్యేకత ఉందని గమనించాలి. 'ధరణీ రక్షతి రక్షితః'ని నిజం చేస్తూ పర్యావరణ ఆరోగ్యమే విశ్వ జీవుల ఆరోగ్యంగా భావించి, మన కోసం మనమే నడుంబిగించి, మానవాళి ప్రగతి పథంలో నడవటానికి అందరం కంకణ బద్ధులమవుదాం. అందరం పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తూ ఆరోగ్యంగా జీవిద్దాం.

-డా॥ బి.ఎం.ఆర్
m : 99497 00037
e : burramsreddy@gmail.com

# నగర భయం

దావానలంలా దహిస్తు
నగరారణ్యాల ముట్టడిలో
కరోనా కార్చిచ్చు.
ప్రాణాలెన్నో!
ప్రాణభయంతో
కలుగుల్లోకి ఎలుకల్లా
పరుగులుతీస్తు
కూటి పోరాటాలు చాలించి
గూటికి చేరుకునే పక్షుల్లా
పల్లెమూలాల్లోకి మళ్ళిపోతు

మానవహారాలతో
మహారాణిలా పల్లె
బోసిపోయిన దాసి మెడలా నగరం.
దప్పిక తీర్చని ఎండమావుల్లా
ధర్మాసుపత్రులు
అందని ద్రాక్షల్లా ఊరిస్తు
కార్పొరేట్ వైద్యం
మరణాలకు చిరునామాల్లా
మారిన వైనం.
చావుబతుకుల దోబుచులాటలో
చచ్చినట్టు బతకటం
బతుకుతు చావటం.

పల్లె పట్నాల పై
కమ్ముకున్న
అనుమానం పెనుమేఘాలు.
మనుషుల మధ్య
అంటరాని అపనమ్మకాల
ఒంటరితనాలు.
అస్థిత్వం పునాదులను
ప్రశ్నిస్తు
అదృశ్యక్రిమి.

ఇప్పుడు
గాలిగత్తరను చీల్చుతు
రాలిపోని ఈతాకుల్లా
బతికే
మొండితనాలు కావాలి.

దిగులు దిబ్బల కింద నలిగే
గుబులు గుండెలకు
చావునెదిరించే
లావుధైర్యాలు రావాలి.

గాలిదీపాల్లా మలిగిపోకుండా
కలుపు తెగుల్లను తగలేసే
ముళ్ళకంపల
మంటల్లా రగిలిపోవాలి.

-గంజి దుర్గాప్రసాద్
m : 9885068731

## జ్ఞాపిక అనగానే గుర్తొచ్చేవి...

# పెంబర్తి మెమెంటోలు

జ్ఞాపిక అనగానే గుర్తుకొచ్చేవి పెంబర్తి హస్తకళారూపాలు అంటే అతిశయోక్తి కాదు. వరంగల్ జిల్లా జనగాం మండలానికి చెందిన గ్రామం పెంబర్తి హస్త కళాఖండాలకు దేశవ్యాప్తంగా గొప్ప పేరున్నది. ఇక్కడ తయారయ్యే ఇత్తడి కళారూపాలు, నగిషీలు, జ్ఞాపికలు ప్రసిద్ధి కాకతీయుల కాలం నుండి పేరొందాయి.

పెంబర్తి హస్తకళాకారుల లోహపు రేకుల కళను పెంబర్తి లోహ హస్తకళలుగా వ్యవహరిస్తారు. పెంబర్తి లోహ హస్తకళలు ఎక్కువగా ఇత్తడి, కంచు లోహాల మీద ఉంటాయి. కాకతీయుల కాలం నుండి పెంబర్తి గ్రామం హస్త కళలకు నిలయంగా మారింది. కాకతీయ శైలిని అనుసరించడం వీరి కళ ప్రత్యేకత.



పూర్వకాలం నుంచి పెంబర్తి గ్రామం హస్త కళలకు నిల యంగా మారింది. పూర్వం కాకతీయుల పాలనలో రాజకుటుంబానికి అవసరమైన పనిముట్లను అందించిన వీరు రాను రాను తమ నైపుణ్యాన్ని పెంచుకొని ప్రపంచ ఖ్యాతిని ఆర్జించారు. యాదగిరి గుట్ట నుండి తిరుపతి వరకు– గుడి, బడి సంబంధిత పనులను, సచివాలయం నుండి కళాతోరణం వరకు ప్రభుత్వ, ప్రైవేటు మెమొంటోలు ఇక్కడ తయారు చేస్తారు

### చరిత్రపుటల్లో...

ఈ ప్రాంతం లోహపు రేకుల కళకు ప్రసిద్ధి గాంచినది. ఈ లోహపు రేకులను పురాతన కాలం నుంచి కూడా దేవాలయాలకు, రథాలకు అలంకరించడానికి ఉపయోగించేవారు. మధ్యలో కొంతకాలం ఈ కళకు ఆదరణలేక అంతరించి పోయింది. తర్వాత నిజాం నవాబు కాలంలో ఈ కళను ప్రభువులు బాగా ఆదరించడం ఈ కళకు జీవం పోసింది.



### విశేషాలు

పెంబర్తి హస్తకళాకారులు తయారుచేస్తున్న షీల్డ్స్, మెమెంటోలు, గృహోపకరణాల వస్తువులకు ప్రపంచ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ తయారైన కళాత్మక వస్తువులను అమెరికా, జర్మనీ, బెల్జియం, జపాన్ దేశాలు దిగుమతి చేసుకుంటున్నాయి. వీరు వివిధ దేవాలయాల గోపురాలకు, ఇత్తడి, రాగి, వెండి, బంగారు తాపడాలను తయారు చేశారు. ధ్వజస్తంభ తొడుగులు, గోపుర కలశాలు, కవచాలు రూపొందించడంలో వీరు దిట్ట. లోహాలు, లోహ మిశ్రమాలతో కుడ్యాలంకరణ చేయడంలో, గీతోపదేశం, దశావతారాలు, అష్టలక్ష్మీ, సీతారామ పట్టాభిషేకం, కాకతీయ కళాతోరణం, చార్మినార్, గణేష్, లక్ష్మీదేవి, సరస్వతి, హంస తదితర రూపాలను హృద్యంగా ఆవిష్కరిస్తారు.

### తెలంగాణకు ఖ్యాతి :

కంచు కళా వైభవానికి పుట్టినిల్లయిన పెంబర్తి గ్రామానికి ప్రపంచ పటంలో సుస్థిరమైన పేరు ప్రతిష్ఠ ఉన్నాయి. కాకతీయుల కాలం నుండి పెంబర్తి గ్రామం హస్త కళలకు నిలయంగా మారింది. పెంబర్తి కళారూపాలు అనేకం గొప్ప కళాఖండాలుగా దేశ విదేశాల్లో వర్ధిల్లుతున్నాయి. సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, దేవతల విగ్రహాలను, కళాఖండాలను, గృహ అలం కరణ వస్తువులను– గుడి, బడి మొదలైన అనేక హస్త కళారూపాలను కళాకారులు చేతి నైపుణ్యంతో తయారు చేస్తారు.

### కాకతీయుల కాలం నుంచి...

కాకతీయ రాజుల కాలంలో కళలు పరిఢవిల్లాయి. రామప్ప, వేయి స్తంభాల గుడి, ఏకశిలా తోరణాలు మాత్రమే కాదు, ఈనాటికీ తెలంగాణ మారుమూల పల్లెల్లో సైతం నాటి శిల్పకళ సజీవంగా అబ్బురపరుస్తుంది. కానీ, కళాకారులు చెల్లాచెదురయ్యారు. వలస వెళ్లారు. ఊరూరా ఉన్న వారిలో కొందరు నవాబ్ లను ఆశ్రయించారు. వారి కళకు ముగ్ధులైన నాటి ఏలికలు వారికంతా ఒకే చోట నివాసాల ఏర్పాటుకు సంకల్పించారు. అలా రూపుదిద్దుకున్నదే 'పెంబర్తి'.

హైదరాబాద్‌కు 55 మైళ్ల దూరంలో ఉన్న ఆ ప్రాంతాన్ని గుర్తించి వారికి అక్కడ నివాసాలు కల్పించారు. అది అప్పటికే ఉని కిలో ఉన్న జనగామ సమీప ప్రాంతం. అంతకు

ముందు అయిలోని, తంగెళ్లపల్లి, మల్యాల, పోలంపల్లి, బెజ్జంకి తదితర గ్రామాల్లో ఉన్న కళాకారులంతా పెంబర్తి ప్రాంతానికి ఉపాధి కోసం తరలి వచ్చారు. కాలక్రమంలో గ్రామ పేర్లే వారి ఇంటిపేర్లుగా స్థిరపడ్డాయి. నవాబ్, ఆయన పరివారం, అధికారుల అభిరుచులకు అనుగుణంగా పెంబర్తి కళాకారులు ఆకృతులు తయారు చేసేవారు. అత్తర్‌దాన్, పాన్‌దాన్ నుంచి మొదలుకొని దర్బార్ హాల్‌లోని వివిధ కళాకృతులు, సింహాసనం, దాని అలంకారాలు తయారు చేసేవారు. రాగి, ఇత్తడి, కంచు లోహాల మిశ్రమంతో వీరు చేసే కళాకృతులు కళా ప్రేమికుల హృదయాలను నాటి నుంచి నేటి దాకా దోచుకుంటూనే ఉన్నాయి. నగిషీలతో గంగాళాలను వివిధ పరిమాణాల్లో తయారు చేయడం వీరికే చెల్లింది. దేవాలయాలలో మూల విరాట్టు నుంచి ఎన్నెన్నో విగ్రహాలను తయారు చేసిన ఘనత వీరి సొంతం. గీతోపదేశం, దశావతారాల చిత్రికలను లోహంతో తయారు చేసి ఎలాంటి కర్రను వాడకుండా గోడలపై తాపడంలో నేర్పరితనం ఎప్పటికీ పెంబర్తి కళాకారులదే అగ్రాసనం! సంప్రదాయంగా వీరిది పూర్తిగా చేతి పని.

**లోగోలు.. షీల్డులు.. సమస్తం**

తొలి తెలుగు ప్రపంచ మహాసభలకు (1975) లోగోలు, షీల్డులను తయారు చేసిన ఘనత వీరిదే. అంతకు ముందే ఐదో దశకం ఉత్తరార్ధం నుంచి అయిలా చారి అనే కళాకారుడు ఈ గ్రామ ఘనతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ఆయనకు రాని అవార్డు లేదు. సన్మానించని రాష్ట్రపతి, ప్రధానులు లేరంటే అతిశయోక్తి కాదు. ఆయన స్థాపించిన విశ్వకర్మ సహకార సంస్థను ఎందరో గవర్నర్లు, ముఖ్యమంత్రులు పెంబర్తికి వెళ్లి స్వయంగా సందర్శించారు. ఆయన గ్రామంలోని కళా కారులకు ప్రాత: స్మరణీయులు. 1956లో అయిలా చారి నేతృత్వంలో 'విశ్వకర్మ బ్రాస్, కాపర్, సిల్వర్, ఇండస్ట్రియల్ సొసైటీ' ఏర్పాటైంది. ఆయన పర్యవేక్షణలో కేంద్రప్రభుత్వం 30 మాసాల శిక్షణ కోర్సును ప్రారంభించింది. అందులో శిక్షణార్థులకు డ్రాయింగ్, డిజైనింగ్ నేర్పేవారు. ఆయన హయాంలో జపాన్ దేశస్తులు సైతం హోమ కలశాలను ఇక్కడి నుంచే తయారు చేయించి తీసుకెళ్లారు.



**తాపడ రారాజులు**

తాపడ కళలో పెంబర్తి వాసులను మించిన వారు కానరారు. వివిధ దేవాలయాలపై ఉన్న ఇత్తడి, రాగి, వెండి, బంగారు తాపడాలను తయారు చేశారు. ధ్వజస్తంభ తొడుగులు, గోపుర కలశాలు, కవచాలు రూపొందించడంలో వీరు దిట్టలు. లోహాలు, లోహ మిశ్రమాలతో కుడ్యాలంకరణ చేయడంలో వారు అద్వితీయులు. హైకోర్టు భవనంపైనున్న లోహ తాపడం ఇక్కడి కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్నదే. మహారాష్ట్రలోని తుల్జాభవానీ మాత దేవాలయంలో వీరి కళాకృతులు ఉన్నాయి. కాకతీయ శైలిని అనుసరించడం వీరి కళ ప్రత్యేకత. ఆదరణ కరువై కళాకారులు పట్టణ ప్రాంతాలకు తరలివెళ్లి ఇతర వృత్తుల్లో అవకాశాలు వెతుక్కుంటున్నారు. చాలా మంది వంటపాత్రల తయారీకే పరిమితమయ్యారు. అలంకరణ వస్తువులు, బంగారు సిగరెట్ పెట్టెలు, యాష్ ట్రేల పైకి వారి కళ ప్రసరించింది. వీరు ఇత్తడి లోహంతో తయారు చేసే గోడ దీపాలకు (1950లలో) ఆస్ట్రేలియాలో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కళాకారులకు ఉత్పత్తికి అవసరమైన నిధుల లేమితో ఆ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు.

**ఇ-కామర్స్ ద్వారా అమ్మకాలు**

పెంబర్తి బ్రాస్ సొసైటీని స్ఫూర్తి పథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర హస్తకళల అభివృద్ధి సంస్థ కమిషనర్ కుంతాటి గోపాల్ తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో 70 కార్యాలయాల ద్వారా అభివృద్ధి అధికారులు హస్త కళాకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వడం, గ్రూపులు, ఫెడరేషన్లు ఏర్పాటుచేసి వారికి ముద్ర పథకం ద్వారా బ్యాంకు రుణాలు, బీమా సదు పాయం కల్పిస్తున్నట్లు చె ప్పారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్మల్, పెంబర్తి వంటి ప్రాంతాల్లో 1.50లక్షల మంది కళాకారులు వివిధ సొసైటీలు, సంస్థల ద్వారా ఆయా రంగాల్లో ఉత్పత్తులు తయారు చేస్తు న్నట్లు గుర్తించామన్నారు. ముంబై నుంచి ముడిసరుకు తీసుకువచ్చి స్థానికంగా ఒక బ్యాంకు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ఉందన్నారు. ఒకేచోట సామూహికం గా పనిచేసేందుకు వర్క్‌షెడ్లు ఏర్పాటు చే యాలని నిర్ణయించామన్నారు. అభివృద్ధి చెందబోతున్న యాదాద్రిలో పెంబర్తి బ్రాస్ ఎంపోరియం ఏర్పాటు చేయాలనే ప్రతి పాదన ఉందన్నారు. త్వరలో హస్తకళలకు సంబంధించి ఒక వెబ్ పోర్టల్ దేశవ్యాప్తంగా రూపొందించి ప్రత్యేక యాప్ ద్వారా కళా కారులు తయారుచేసే వస్తువులను రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ, సొసైటీల ద్వారా ఇ-కామర్స్‌తో అమ్మకాలు సాగించాలని నిర్ణయించా మన్నారు.

కళాకారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఆధునిక ఉత్పత్తుల తయారీకి అవకాశం కల్పించాలని స్థానిక కళాకారులు వినతిపత్రం అందజేశారు.

**కీర్తితోరణం వెనుక పెంబర్తి కళ!**

ఓరుగల్లు ఘనమైన వారసత్వ సంపదకు ఇంతకాలం గుర్తుగా ఉన్న కాకతీయుల శిలాతోరణం ప్రభుత్వ అధికారిక చిహ్నంగా మారింది. కాకతీయులు అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది కీర్తి తోరణం. వరంగల్, తెలంగాణ, తెలుగు ప్రజలను సింబాలిక్‌గా చూపించేందుకు కాకతీయుల కీర్తి తోరణాన్ని మించిన చిహ్నం మరొకటి లేదు. కాకతీయుల కీర్తితోరణానికి ప్రచారం తీసుకురావడంలో పెంబర్తి గ్రామానికి చెందిన ఐలాచారి కీలకపాత్ర పోషించారు. 1973లో వరంగల్ ఇండస్ట్రియల్ ఏరియాలో కొత్తగా ఆపే ట్రాక్టర్ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం

నిర్వాహకుడు ఆహూతులకు ఇచ్చేందుకు ఏదైనా జ్ఞాపికను తయారుచేయమని కళాకారుడు ఐలాచారిని కోరగా... కాకతీయ కీర్తితోరణం మధ్యలో ఆపే ట్రాక్టర్ ఉండేలా ఓ జ్ఞాపికను తయారు చేశారు. షోరూం ఫంక్షన్‌లో ఆ జ్ఞాపిక హైలెట్‌గా నిలిచింది. అక్కడికి వచ్చిన ప్రతిఒక్కరూ ఆ జ్ఞాపికపై ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు.

**ప్రపంచ కీర్తికి నాంది**

1974లో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించి లోగోను రూపొందించాల్సిందిగా కళా కారులను కోరింది. దీంతో గతంలో పేరు తెచ్చిన కాకతీయ కీర్తి తోరణం ప్రధానంగా డిజైన్ రూపొందించారు. అప్పటి ముఖ్యమంత్రి వెంగళరావు ఈ డిజైన్ చూసి ముగ్ధుడై ఆ సభలో బహూకరించేం దుకు 200 జ్ఞాపికలు కావాలంటూ అక్కడికక్కడే ఆర్డరు ఇచ్చారు. ఒక్కో జ్ఞాపిక తయారీకి రూ.180 కోట్ చేస్తూ ఐలాచారి టెండర్ వేశారు. ఈ కళాఖండానికి రూ.180 అంటే తక్కువ అని... రూ. 200గా కోట్ చేయమని వెంగళరావు ప్రత్యేకంగా సూచించారు. అంతేకాదు... అదనంగా మరో 300 జ్ఞాపికలు తయారు చేయాలని పురమాయించారు. అలా మొదటిసారిగా కాకతీయుల కీర్తి తోరణం ప్రపంచ వేదికలపై సగర్వంగా దర్శనం ఇచ్చింది. ప్రపంచ తెలుగు మహాసభలు ముగిసిన మూడు నెలలకు నాటి ముఖ్యమంత్రి వెంగళరావు పెంబర్తిని దర్శించారు. ఈ నేపథ్యంలో కీర్తితోరణం డిజైన్‌కు డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోయింది. అప్పటి నుంచి వందల ఫంక్షన్లలో వేలాదిగా జ్ఞాపికలు పంచారు. ఆ తర్వాత నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయ్యాక పోలీసులకు మెడల్స్ తయారు చేసే పని పెంబర్తి కళాకారులకు అప్పగించారు. గోల్కొండ, చార్మినార్‌లతో కూడిన వివిధ డిజైన్లు ఆయనకు నచ్చలేదు. చివరకు కాకతీయ కీర్తితోరణంతో డిజైన్ తయారు చేయగా... వెంటనే ఆయన ఒప్పుకున్నారు. ఇప్పటికీ ఆ డిజైన్‌తోనే పోలీసులకు మెడళ్లు ప్రదానం చేస్తున్నారు. ప్రస్తుతం కాకతీయ మెడికల్ కాలేజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాకతీయ యూనివర్సిటీ, కలెక్టరేట్, జిల్లా సరిహద్దులు ఇలా అంతటా కీర్తితోరణాలు నిర్మించారు. ఇలా అన్ని ప్రముఖ స్థలాల ముందు ఠీవీగా నిలబడి అందరికీ స్వాగతం పలికిన కీర్తి తోరణం తెలంగాణ ప్రభుత్వ అధికార చిహ్నంలో భాగమైంది.

**పెంబర్తి విశ్వకర్మ బ్రాస్ సొసైటీ**

పెంబర్తి గ్రామంలో 1990 ముందు వరకు పెంబర్తి విశ్వకర్మ బ్రాస్ సొసైటీ కార్యక్రమాలకు బాగా డిమాండ్ ఉండేది. దాదాపు 100 విశ్వకర్మ కుల వృత్తివారు ఈ వృత్తి మీద ఆధారపడి జీవించే వారు. దేశ విదేశాల ప్రతి నిధులు నిత్యం పెంబర్తి గ్రామానికి వచ్చేవారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ, అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ తదితరులు పెంబర్తి గ్రామాన్ని సందర్శించారు. నిత్యం గ్రామంలో కంచు పైన సుత్తి దెబ్బల మోత కంచరి వాడల్లో ప్రతిధ్వనించేది. జాతీయ, అంతర్జాతీయ మీడియా వారు, విదేశీ టూరిస్టులతో పెంబర్తి నిత్యం రద్దీగా ఉండేది. విశ్వకర్మ బ్రాస్ సొసైటీ భవనం ఆ రోజుల్లో ఇంద్ర భవనం లాగ ఉండేది. హస్త కళాకారుల వల్ల ఆ గ్రామంలో పెరిగిన సందర్శకుల తాకిడికి– ఇతర వృత్తులవారైన గీత కార్మికులు– ఆరె కటిక, కిరాణ షాపుదారు ల వస్తువులకూ బాగా ఆదరణ ఉండేది. ప్రపంచ పటంలో ఒక వెలుగు వెలిగిన పెంబర్తి హస్తకళలు నేడు మసకబారుతున్నవి. ప్రపంచీకరణ, ఆధునికీకరణ– వీరివృత్తి పైన తీవ్రమైన ప్రభావం చూపుతున్నవి. రెండు దశాబ్దల క్రితం ఉన్న హస్తకళల మార్కెట్ నేడు లేకుండా ఉన్నది. సొసైటీలోని సభ్యులు కొందరు సొంత దుకాణాలు పెట్టుకున్నారు. కొంతమంది హైద్రాబాద్‌కు వలస వచ్చి కొత్తగా హస్త కళల షాపులు పెట్టుకొని జీవిస్తున్నారు. ఇత్తడి, రాగి, వెండి మొదలగు వాటికి ధరలు పెరగ డంతో మార్కెట్‌లో తగిన రేటు రావడం లేదు. ఉత్పత్తి చేసిన వస్తువులు అమ్ముడు పోక పోవడం, ఆధునిక పద్ధతిలో హస్త కళా ముద్రణ మిషన్లు రావడంతో హస్త కళల వృత్తి రోజు రోజుకూ క్షీణిస్తున్నది. ఇత్తడి స్థానంలో కొత్త పద్ధతి, ప్లైవుడ్ షీట్స్ పై స్టిక్కరింగ్ మెమొంటోలు తయారై అవి అన్ని ప్రాంతాలలో అందుబాటులోకి రావడంతో– ఈ వృత్తి దారులకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి.



అయితే ఆధునిక పద్ధతులను సైతం వీరు ఎప్పటికప్పుడు చేరదీసుకొని ముందుకు వెడుతున్నారు. ఈ మధ్య కాలంలో విశ్వకర్మ బ్రాస్ సొసైటీ వారు కాకుండా ఇతర కులాలకు చెందిన వారు కూడా చాల వరకు ఈ వృత్తిలోకి వచ్చారు. స్వతహాగా వారు హస్తకళా షోరూంలు ఏర్పాటు చేసుకొన్నారు. తద్వారా దాదాపు వంద మంది వరకు స్వయం ఉపాధి పొందుతున్నారు. స్వయం ఆధారిత వృత్తివారైన హస్త కళా కారులను ప్రభుత్వం ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. ముఖ్యం గా హస్త కళాకారులకు ఇత్తడి, రాగి, వెండి రేకులకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి. ఆధునికతతో భాగంగా వీరికి హస్తకళా మిషన్లను ప్రభుత్వం కొని ఇవ్వాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేపాక్షి హ్యాండి క్రాఫ్ట్‌లో వీరి వస్తువులకు స్థానం కల్పించి, ప్రభుత్వం ముందుగానే వీరి వస్తువులకు డబ్బు చెల్లించాలి. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న హస్తకళల నైపుణ్యంపైన వీరికి ప్రతి సంవత్సరం వర్క్‌షాపులు నిర్వహించాలి.

పెంబర్తి గ్రామంలో హస్తకళల పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. హస్త కళాకారుల కుటుంబాలకు హస్తకళా సొసైటీ హౌస్ కమ్యూనిటీ ఏర్పాటు చేయాలి. 60 సంవత్సరాలు నిండిన ప్రతి

వృత్తిదారుడికి నెలకు రూ. 3000 పెన్షన్ ఇవ్వాలి. వారి కుటుంబాలకు విద్య, వైద్యం అందించాలి. ఎంతో విశిష్టమైన పెంబర్తి హస్తకళలను భవిష్యత్ తరాలకు అందించ వలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం హస్తకళాకారుల జీవితాల్లో వెలుగులు నింపాలి. పూర్వవైభవం తీసుకు రావాలి.

**బ్రాండ్‌నేమ్‌తో బతికేయవచ్చు....**

'పెంబర్తి' అన్న ఒకే ఒక బ్రాండ్ నేమ్‌తో బతికేయవచ్చు. మార్కెట్ అవసరాలకు సరిపడా కళాకృతుల ఉత్పత్తి జరగడం లేదు. ఇప్పుడు యాంత్రీకరణ ప్రభావం మాపై ఉన్నది. జాతీయ రహదారి ఇరుపక్కలా గ్రామ దుకాణాల్లోని వస్తువులన్నీ ఇక్కడే తయారయ్యాయనుకోవద్దు. అడిగి తీసుకోవాలి. గతంలో విశ్వకర్మ 'కులవృత్తి'గా కొనసాగినా.. ప్రస్తుతం ఇతర కులస్తులు సైతం ఇందులో ప్రవేశించారు. మా సంఘంలో విశ్వకర్మలు కేవలం 20 శాతం మందే ఉన్నారు. మిగతా వారు ముదిరాజ్, కుమ్మరి, రజక, తురక, మాల– మాదిగ, గౌడ, కురుమ తదితర కులాల వారున్నారు. మా సభ్యులకు ప్రభుత్వం మరింత మెరుగైన శిక్షణ కల్పించి మార్కెటింగ్ మెలకువలు నేర్పించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం "గోల్కొండ" (గతంలో లేపాక్షి) ఎంపోరి యం కొంత మేర మా మార్కెటింగ్ అవసరాలను తీరుస్తోంది అని అంటారు పెంబర్తి కళాకారులు.



**పెంబర్తి ప్రముఖులు**

**అయిలాచారి:** రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన కళాకారుడు. ఆయా స్థాయిల్లో అవార్డులందుకున్నారు. ఎందరికో స్ఫూర్తి ప్రదాత. గురువు. ఈయనంటే గ్రామస్తులం దరికీ ఎనలేని అభిమానం.

**రుద్రోజు శ్రీనివాస చారి:** ఈయనకు 2001లో రాష్ట్ర స్థాయి ప్రథమ పురస్కారం లభించింది. దాదాపు 210 కిలోల ఇత్తడితో కెప్టెన్ ఉమ్రావ్‌సింగ్ ఇత్తడి విగ్రహాన్ని రూపొందించినందుకు ఆ పురస్కారం లభించింది.

**అయిల వేదాంతాచారి:** ఈయన సైతం రాష్ట్ర పురస్కార గ్రహీత.

**రంగు వెంకటేశ్వర్లు:** రాష్ట్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత. జాతీయ స్థాయి అవార్డును సాధించారు.

**అయిలా సోమ బ్రహ్మచారి:** పంచలోహ కళాకృతులను తయారు చేయడంలో దిట్ట. అవార్డు గ్రహీత కూడా.

**అమెరికాలోని రెస్టారెంట్‌కు పెంబర్తి కళాఖండాలు**

హస్త కళలకు పుట్టినిల్లయిన పెంబర్తి కళా వైభవం ఖండాంతరాలు దాటి వెలుతోంది. అమెరికాలోనూ ఇక్కడి కళా ఖండాలకు ఘనకీర్తి దక్కుతోంది.

ఇక్కడ తయారైన ఇత్తడి కళాఖండాలు అమెరికాలోని ఓ రెస్టారెంట్‌లో అలరించనున్నాయి. హైదరాబాద్ దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ కాలనీకి చెందిన కొమ్మిడి బల్వంతరెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన న్యూజెర్సీలో మొఘల్ దర్బార్ రెస్టారెంట్‌ను నెలకొల్పుతున్నారు. ఈ రెస్టారెంట్ ముఖద్వారం, కాన్ఫరెన్స్ హాల్, భోజనశాలతో పాటు ఇంటీరియల్ డిజైన్లను పెంబర్తిలో తయారు చేయిస్తున్నారు. సుమారు రూ.7 లక్షల విలువైన 250 కిలోల ఇత్తడితో ఈ కళాఖండాలు రూపుదిద్దుకుంటున్నాయి. రెస్టారెంట్ ముఖద్వారంపై 'మొఘల్ దర్బార్ హోటల్' అని తెలుగులో రాయిస్తూ మాతృభాషపై తనకున్న మమకారాన్ని చాటుకున్నారు.

పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన మరో ఎన్ఆర్ఐ సంపత్‌రెడ్డి టెక్సాస్‌లో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ఆలయ ముఖద్వారం, ధ్వజస్తంభాల రేకులను కూడా పెంబర్తిలోనే తయారు చేయించి తీసుకెళ్లారు. ముఖద్వారం కోసం రూ.5 లక్షలతో తీర్చిదిద్దిన తలుపులను పంపించారు. కళాఖండాల తయారీ కోసం అమెరికా నుంచి ఆర్డర్లు రావడం ఆనందంగా ఉందని స్థానిక కళాకారులు అంటున్నా రు. అమెరికా, జపాన్, ఇటలీ లాంటి ఎన్నో దేశా లకు ఇక్కడ తయారు చేసిన వాటిని తీసుకెళ్తున్నా రని చెప్పారు.

**పెంబర్తి హస్తకళల పితామహుడు ఐలా**

ప్రపంచ వ్యాప్తంగా పెంబర్తి హస్తకళలకు ప్రాచుర్యాన్ని కల్పించిన ఐలా ఆచారి(79) గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఇటీవల మృతి చెందారు. వరంగల్ జిల్లా జన గామ మండలం పెంబర్తికి చెందిన ఆచారి విశ్వ కర్మ హస్తకళల సొసైటీ ద్వారా పెంబర్తి హస్త కళలను విశ్వవ్యాప్తం చేయడానికి ఎంతోకృషి చేశా రు.

ఇత్తడి, రాగి, వెండి లోహాలతో వివిధ రకాల షీల్డులు, పలు ఆకృతులను చేయడం ఆచారి కుటుంబంతోనే ప్రారంభమైంది. వీరి పూర్వీకులు నైజాం నవాబులకు వెండితో కూడిన అత్తర్‌దాన్, పాన్‌దాన్‌లను చేసేవారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా హస్తకళలను నేర్చుకున్న ఆచారి.. గ్రామంలో 1970లో విశ్వకర్మ హస్తకళల సొసైటీని స్థాపించి ఎందరో కళాకారులను తీర్చిదిద్దారు.

పలు దేశాల్లో పెంబర్తి కళలకు విశేష ప్రాచుర్యం కల్పించడంలో ఆచారి కృషి ఎంతగానో ఉంది. జాతీయ అవార్డు అందుకున్న ఆచారి: హస్తకళల విభాగంలో 1979లో అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి నుంచి ఆచారి ఢిల్లీలో జాతీయఅవార్డు అందుకొన్నారు. నాటి ప్రధానులు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, అప్పటి ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, మర్రి చెన్నారెడ్డి, జలగం వెంగళరావు తదితరుల నుంచి ఆయన అవార్డులు, సన్మానాలు పొందారు.

– ఎన్.వి.ఎం
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com


# విచారణే ఓ పెద్ద శిక్ష..!?

తెలుగు కవి ఓ కవితలో ఇలా అంటాడు

*"ఎన్నో సంవత్సరాల*
*విచారణ అనే శిక్షని ఎదుర్కొన్న తరువాత*
*రాబోయే శిక్ష ఏ పాటిది*
*ఈ దేశంలో*
*ట్రయలే ఓ పెద్ద పనిష్మెంట్"*

నిజమే. మనదేశంలో ట్రయలే ఓ పెద్దపనిష్మెంట్. విచారణ ఖైదీలుగా ఎంతో మంది జైళ్లల్లో బతుకులీడుస్తున్నారు. ఇంకా ఎంతో మంది బెయిల్ మీద వుండి విచారణని ఎదుర్కొంటున్నారు. విచారణ తుది దశకి ఎప్పుడు చేరుతుందో తెలియదు. ఎన్ని సంవత్సరాలు వేచి వుండాలో తెలియదు. అప్పీల్లు వగైరాలు ముగించుకొని ఆ ఊబి నుంచి ఎప్పుడు బయట పడతారో అందులో చిక్కుక్కున్న వాళ్ళకి బోధపడదు.

'విచారణే పెద్ద శిక్ష' ఈ స్టేట్‌మెంట్‌ని బలపరచడానికి ఎన్నో కేసులని ఉదహరించవచ్చు. తాజా ఉదాహరణ ప్రేంచంద్ కేసు. ప్రేంచంద్‌కి హర్యానా రాష్ట్రంలోని సోనిపట్ అన్న గ్రామంలో చిన్న కిరాణా షాపు వుండేది. ఆయనకు 38 సంవత్సరాల వయస్సు వున్నప్పుడు అంటే 38 సంవత్సరాల క్రితం ఆయన షాప్‌కి ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఆహార తనిఖీ కోసం వచ్చాడు. (ఇప్పుడు ప్రేంచంద్ వయస్సు 76 సంవత్సరాలు) ప్రేంచంద్ షాపు నుంచి 600 గ్రాముల పసుపుని కల్తీ వుందా లేదానన్న విషయం తెలుసుకోవడానికి 600 గ్రాముల పసుపుని శాంపిల్ తీసుకొని ల్యాబ్‌కి పరీక్షల కోసం పంపించాడు. ఇది జరిగింది 18.8.1982 రోజున. ఇద్దరు సాక్ష్యుల సమక్షంలో శాంపిల్ తీసుకున్నాడు. పబ్లిక్ అనలిస్ట్ ఆ శాంపిల్‌ని పరీక్షించి తన నివేదికను 7.09.1982 రోజున పంపించాడు. ఆ నివేదిక ప్రకారం నాలుగు భోజన పురుగులు, ఇంకా మరో రెండు పురుగులు వున్నాయి. అందుకని అతనిపై ఆహారకల్తీ నిరోధక చట్టప్రకారం కేసు నమోదు చేశారు. ఆ విచారణని పూర్తి చేయడానికి ట్రయల్ కోర్టుకి 13 సంవత్సరాలు పట్టింది. చివరికి అతని మీద కేసు రుజువు కాలేదని ట్రయల్ కోర్టు తేల్చుతూ తన తీర్పుని 31.8.1995 రోజున ప్రకటించింది. ఈ తీర్పు మీద హర్యానా ప్రభుత్వం హైకోర్టులో అప్పీలుని దాఖలు చేసింది. హైకోర్టు ఈ అప్పీలుని పరిష్కరించడానికి హైకోర్టు మరో 14 సంవత్సరాలు తీసుకుంది. పసుపులో కల్తీ జరిగిందని, అతను లైసెన్స్ లేకుండా పసుపుని అమ్ముతున్నాడని హైకోర్టు భావించి ఆరు మాసాల శిక్షని జరిమానాన్ని విధించింది.




ఈ తీర్పుకి వ్యతిరేకంగా ప్రేంచంద్ సుప్రీంకోర్టులో అప్పీలుని దాఖలు చేశాడు. సుప్రీంకోర్టు తన తీర్పుని జులై 30, 2020న ప్రకటించి అతని మీద కేసుని కొట్టివేసింది. అంటే సుప్రీంకోర్టు మరో 11 సంవత్సరాల కాలాన్ని తీసుకొంది.

ప్రేంచంద్ జీవితంలో సగం జీవితం మూడు కోర్టుల చుట్టూ తిరగడానికే సరిపోయింది. అతను చేసిన నేరం హత్యకాదు. ఆర్థిక నేరం కాదు. ఆహార కల్తీ తీవ్రమైన నేరమే. అందులో రంగుల కల్తీ చేయలేదు. అతని షాపు దగ్గర తీసుకున్న శాంపిల్‌లో భోజన పురుగులు కన్పించాయి. అది కూడా శాంపిల్ తీసుకున్న రోజున కాదు. 19 రోజుల తరువాత. ఆ పురుగులు ఆ మధ్య కాలంలో అందులో తయారై వుండవచ్చు. పుట్టి వుండవచ్చు. ప్రేంచంద్ అనుభవించిన ఈ ట్రయలనే శిక్షకి కారకులు ఎవరు?

ప్రభుత్వంలో వున్న బ్యూరోకాట్ల నిర్లక్ష్యానికి ప్రేంచంద్ బలైనాడా? కోర్టుల్లో జరిగే జాప్యం వల్ల వేదనకి గురైనాడా?

ప్రేంచంద్‌ని నిర్దోషిగా ప్రకటించడానికి ఆ కేసుని విచారించిన కోర్టుకి 13 సంవత్సరాలు పట్టింది. ఆయన పాత కేసులో కూడా అప్పీలు చేయాల్సిన అంశాలు వున్నాయని హర్యానా ప్రభుత్వం భావించి హైకోర్టులో అప్పీలుని దాఖలు చేసింది. దీని తరువాత పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు ప్రేంచంద్‌కి మరో షాక్‌ని ఇచ్చింది. అతనికి శిక్షను విధించింది. అది కూడా 14 సంవత్సరాల తరువాత.

అక్కడితో ఆయనకు షాక్‌లకు ముగింపు రాలేదు. అతనికి ఆ కేసునుంచి ఉపశమనం సుప్రీంకోర్టు నుంచి లభించడానికి 11 సంవత్సరాలు పట్టింది. అదృష్టం ఏమంటే ఈ మధ్య కాలంలో అతనికి ఏమీ జరుగలేదు. తుది తీర్పు వచ్చేవరకు అతను బతికే వున్నాడు. ట్రయలనే శిక్షని అనుభవిస్తూ అతను బతికే వున్నాడు.

ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు బెంచి ఈ తీర్పుని ప్రకటించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుని రద్దుచేసి విచారణ కోర్టు తీర్పుని సుప్రీంకోర్టు ధృవీకరించి అతన్ని ఈ కోర్టు బంధనాల నుంచి విముక్తి చేసింది. ఈ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఈ కేసులో సూక్ష్మ న్యాయ సమస్యలు లేవు.

రికార్డులో వున్న సాక్ష్యాలని ఆధారం చేసుకొని సుప్రీంకోర్టు తన తీర్పుని ప్రకటించింది. అతని షాపు నుంచి సేకరించిన శాంపిల్‌నే పబ్లిక్ అనలిస్టే పరీక్షించాడా అనేందుకు కోర్టు ముందు సాక్ష్యం లేదు. ఒకవేళ అది శాంపిల్ అయినా కూడా శాంపిల్ తీసుకున్న రోజు నుంచి పరీక్ష చేసే రోజు వరకు భోజనపు పురుగులు అందులో తయారయ్యే అవకాశం వుంది. ఈ రెండూ కారణాలు పేర్కొంటూ కేసుని సుప్రీంకోర్టు కొట్టివేసింది. న్యాయ సూక్ష్మం లేదు. అయినా ఈ కేసు నుంచి బయటపడటానికి ప్రేంచంద్‌కి 38 సంవత్సరాలు పట్టింది.



ఈ కేసులో నేరన్యాయ ప్రక్రియ చాలా రకాలుగా విఫలం చెందింది. ప్రేంచంద్ దగ్గర శాంపిల్‌ని తీసుకున్న ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనలిస్ట్‌కి శాంపిల్‌ని పంపించాడు. పంపించినట్టు రశీదుని తీసుకోలేదు. తీసకున్నట్టు కోర్టు ముందు దాన్ని ఉంచలేదు. ఆ శాంపిల్‌ని పరీక్షించడానికి అంత సమయం ఎందుకు పట్టిందో తెలియదు.

ఈ ఆహార కల్తీకేసుల్లో సాధారణంగా ముగ్గురే సాక్షులు వుంటారు. ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఇద్దరి సమక్షంలో శాంపిల్‌ని తీసుకుంటాడు. ఈ ముగ్గురే సాక్షులు. రెండు మూడు వాయిదాల్లో విచారణని కోర్టు పూర్తి చేసే అవకాశం వుంటుంది. కానీ కేసు విచారణ కోసం అన్ని సంవత్సరాలు ఎందుకు తీసుకున్నారో అర్థంకాని విషయం.

ట్రయల్ కోర్టు ప్రేంచంద్‌ని నిర్దోషిగా తేల్చింది. అది కూడా 14 సంవత్సరాల తరువాత. కేసులోని మెరిట్ ప్రకారం అప్పీలు చేయడానికి వీల్లేదు. ఒకవేళ మెరిట్ వుందని హర్యానా ప్రభుత్వంలోని బ్యూరోకాట్లు భావించినా కేసు విచారణలో జరిగిన జాప్యాన్ని గమనించైనా అప్పీలుని చేయకూడదు. అప్పీలు చేయమని ఆదేశించడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. ఏ మాత్రం బుద్ధిని ఉపయోగించకుండా చేసిన అప్పీలు అది.

హైకోర్టులో ఈ అప్పీలుని పరిష్కరించడానికి దాదాపు 14 సంవత్సరాల కాలం పట్టింది. అందుకు కారణం తెలియదు. ఈ ఆలశ్యానికి ఎవరిని బాధ్యులని చేయాలో అర్థం కాని పరిస్థితి. సుప్రీంకోర్టులో కూడా అలాంటి పరిస్థితే. కేసు పరిష్కారం కోసం 11 సంవత్సరాల కాలం పట్టింది. 9 సార్లు కేసు విచారణ కోసం లిస్ట్ అయ్యింది సుప్రీంకోర్టులో. కానీ అది ఎప్పుడూ విచారణ దగ్గరికి చేరుకోలేదు. ఈ పరిస్థితికి కారకులు ఎవరు?

ఒక్కటి మాత్రం నిజం. ప్రతి అధికార వ్యవస్థ కేసు ఫైలుని మామూలు కట్టగానే చూశారు తప్ప అందులో జీవితం వుంది, అతని మీద ఆధారపడిన వ్యక్తుల జీవితాలు వున్నాయన్న విషయాన్ని గ్రహించలేదో నిర్లక్ష్యం చేశారో తెలియదు. ప్రతి దశలో ప్రేంచంద్ ఫైలుని ఫైలు మాదిరిగానే చూశారు తప్ప అందులో జీవితం వుందని ఎవరూ గుర్తించలేదు.

ఫలితంగా 76 సంవత్సరాల ప్రేంచంద్ తన సగజీవిత భాగాన్ని ఈ ఒక్క కేసు కోసమే వెచ్చించాడు.

ఎంత ఖర్చులని భరించాడో

ఎంత వేదనని అనుభవించాడో

ఆ పసుపు శాంపిల్‌లో వున్న నాలుగు భోజనం పురుగులకి తెలియదు. కానీ బ్యూరోకాట్లకి, న్యాయ వ్యవస్థకి తెలియాలి కదా?

ఒక్క ప్రేంచంద్ కాదు. కొన్ని మిలియన్ల ప్రేంచంద్‌లు ఇలా వున్నారో ఇప్పుడు మనకు తెలియదు. చట్టం కోసం, న్యాయం కోసం ఎదిరి చూడటం ఎన్ని సంవత్సరాలో?

హాజిర్‌హై అన్న శబ్దం కోసం ఎదురు చూసి చూసీ వరదలో మనిషి కొట్టుకుంటాడు. కేసు మొదలైన దగ్గర నుంచి తీర్పు వరకి ఆశా నిరాశల మధ్య అతని ప్రయాణం.

మనిషిని నిర్వీర్య పరచడానికి ఇంతకు మించి శిక్ష మరేమీ వుంటుందీ?

ట్రయల్ కన్నా మరో శిక్ష ఏం వుంటుందో మన దేశంలో.


-మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com

# నల్లమలలో చల్లని పర్యటనలు

"నీ కడుపు చల్లగుండ".

పెద్ద మనుషులు మనల్ని దీవించేటప్పుడు మనకు వినిపించే ప్రధాన వాక్యం ఇది. కారణం మనది వేడి ప్రదేశం... కాబట్టి మనకు చల్లదనం కావాలి. వేసవి కాలపు సెలవుల్లో చల్లదనం కోసం కూర్గ్, ఊటీ, కొడైకెనాల్, కుల్లు-మనాలి వంటి ప్రదేశాలకు ప్లాన్ చేసుకుంటుంటాం. డబ్బులు వేస్ట్ చేసుకోకుండా ఒక్కసారి మన తెలంగాణలోనే ఏవైనా చల్లని ప్రదేశాలున్నాయేమో ఆలోచించండి. ఏవీ తట్టలేదా? అయితే ఈ వ్యాసం చదవండి... తెలంగాణలోనూ ఉన్న చల్లని పర్యాటక స్థలాలేవో మీకే తెలుస్తుంది.

చల్లగా ఎక్కడుంటుంది? ఎత్తైన గుట్టలు, జలపాతాలు, నదులు... ఇక్కడేగా చల్లగా ఉండేది. మనది దక్కన్ పీఠభూమి. ఎత్తుగా ఉంటుంది. పైగా నల్లమల పర్వతాలు, దండకారణ్య పర్వత సానువులు కూడా తెలంగాణలో ఉండడంతో ఎత్తైన గుట్టలకు, వాటిపై నుండి దూకే జలపాతాలకు, వాటి మధ్య నుండి పారే నదులకు కొదువ లేదు. మరి చల్లదనానికి కొదువ ఎందుకుంటుంది?



అది సరే. ఇంతకీ ఎక్కడ ఎత్తైన గుట్టలున్నాయి? ఎక్కడ జలపాతాలున్నాయి? ఎక్కడ నదులు అనువుగా ఉన్నాయి?... ఇవేగా మీ ప్రశ్నలు? అయితే చదవండి.

### నల్ల'మలయ' పర్వతాల్లో

తెలంగాణకు దక్షిణాన మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో కృష్ణానది సరిహద్దుగా విస్తరించాయి నల్లమల అడవులు. వీటిల్లో 1978లో పులుల సంరక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఇది భారతదేశంలోనే అతి పెద్ద పులుల సంరక్షణా కేంద్రం. అధికారిక అంచనాల ప్రకారం ప్రస్తుతం నల్లమలల్లో చిన్నవి పెద్దవి కలిపి సుమారు 164 పులులున్నాయట. పులులతో పాటు అనేక జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, వృక్ష జాతులు... ఇలా ఎన్నో వైవిధ్య భరితమైన జీవజాలానికి నిలయమైన నల్లమల అడవులు దేశంలోనే రెండవ అతిపెద్ద అడవులు. వీటి వైశాల్యం 3,568 చదరపు కిలోమీటర్లు. నల్లమల గుట్టల సరాసరి ఎత్తు 914 మీటర్లు. కాబట్టి చల్లగా ఉంటాయి. వాటిమీద నుంచి ఎన్నో జలపాతాలు, వాటి మధ్య నుంచి ఎన్నో ఏరులు పారుతున్నాయి. అవేమిటో... మనం ఈ వేసవి కాలంలో ఎక్కడికి వెళ్ళి చల్లగా, హాయిగా గడపవచ్చో చూద్దాం.

### మల్లెల తీర్థం జలపాతం

హైదరాబాద్ శ్రీశైలం రూట్‌లో వటవర్లపల్లి మీదుగా... బస్సులో గాని, సొంత వాహనంలోగాని ప్రయాణించి ఈ జలపాతాన్ని చేరుకోవచ్చు. మొత్తం 165 కిలోమీటర్ల ప్రయాణం. ఇందులో 40 కిలోమీటర్లు మాత్రం నల్లమల అడవుల్లో రోడ్డుకు ఇరువైపులా జుయ్‌యీ... మని ఈదర గాలినిచ్చే ఎత్తైన చెట్ల మధ్య, కోతులు, కొండెంగలు, అడవి కోళ్ళు, నల్లమల ఉడుతలు, నెమళ్ళ మధ్య... ఎర్లీ మార్నింగ్, లేట్ ఈవినింగ్ అయితే ఎలుగుబంట్లు, జింకలు, అడితులు, అడవి పందుల మధ్య ఆసక్తికరమైన అనుభవాలతో ఎంజాయ్ చేస్తూ సాగిపోవచ్చు. అలా మధ్యలో కనిపించిన అటవీ జీవజాలాన్ని ఉచితంగా ఫోటోలు తీసుకోవచ్చు కూడా.

ఈ 40 కిలోమీటర్ల అటవీ ప్రయాణంలో మనకు అటవీ జీవజాలం మాత్రమే కాదు అడవుల్లో నివసించే చెంచులు, లంబాడీలు, వారి పెంటలు, తండాలు... అంటే చిన్న చిన్న గ్రామాలు... వారి వేషభాషాదులు, తిండి తిప్పలు... అన్నీ మనకు కొత్తగానే కన్పిస్తాయి. అవన్నీ మనమో, మన పూర్వీకులో దాటి వచ్చారనుకుంటే మనకు ఒక ఆశ్చర్యకరమైన ఆసక్తి ఏర్పడుతుంది.

ఇక ఈ అడవుల్లో ఎన్నో ఘాట్లు, మూల మలుపులు, వాటిపై ప్రయాణిస్తున్నప్పుడు, వాహనాల్లో నుంచి లోయల్లోకి చూస్తున్నప్పుడు మనం ఎంత ఉన్నత స్థితిలో ఉన్నామో తెలిసి పులకించిపోతాం. అదే లోయలో ప్రయాణిస్తూ కొండల అంచులను చూస్తున్నప్పుడు మనం ఎంత కింది స్థితిలో ఉన్నామో కూడా తెలుస్తుంది. ఇక పీఠభూమి సమతలంపై ప్రయాణిస్తున్నప్పుడు ఎత్తైన పచ్చని చెట్ల వరుసల మధ్య నల్లని సన్నని పాపిట దూరంగా పరుగెత్తుతున్నట్లు కనిపిస్తుంది... ఇలా నల్లమలలో చేసే ప్రయాణమే ఒక పరవశం.

మల్లెల తీర్థం జలపాత నిర్వహణను సార్లపల్లి-కుడిచింతలబైలు అనే చెంచు పెంటలకు చెందిన స్థానిక చెంచు గిరిజనులకు అప్పజెప్పారు. వారి దగ్గర టికెట్లు తీసుకుంటుండగానే మనకు జలపాతపు హోరు వినిపిస్తూనే ఉంటుంది. కాని దాన్ని చూడటానికి

మాత్రం సుమారు మూడు వందల మెట్లు దిగవలసి ఉంటుంది. సగం మెట్లు దిగుతుండగానే ఎడమ వైపు చెట్ల మధ్య నుంచి నురగలు కక్కుతూ దూకే జలపాతం మనల్ని ఉవ్విళ్ళూరిస్తుంది. ఇక కాళ్ళకు ఎక్కడ లేని శక్తి వచ్చి జలపాతం వైపు పరుగెత్తుతాం. దగ్గరికి వెళ్ళీ వెళ్ళక ముందే మన కళ్ళ ముందు అద్భుతమైన అందమైన జలపాతం ఆవిష్కారమవుతుంది.

మల్లెల తీర్థం జలపాతం ఎత్తు సుమారు వంద అడుగులు. రెండు పర్వత సానువుల మధ్యనున్న లోయలో నుంచి ఒక ఏరు పారుతూ వచ్చి అకస్మాత్తుగా మరో లోయలోకి దూకుతుంది. దూకే క్రమంలో జలధారలు మల్లెపూవుల ఆకారం తీసుకోవడమే కాకుండా మల్లెల వలె చల్లగా కూడా ఉంటాయి కాబట్టి ఈ జలపాతానికి మల్లెల తీర్థమని పేరు. అయితే జలపాతానికి కుడివైపునున్న ప్రాచీన శివలింగాన్ని సుమారు రెండు వేల మూడు వందల ఏళ్ళ కింద మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని కూతురు చంద్రావతి ప్రతిష్ఠించి మల్లెపూలతో పూజించడం వల్ల ఇక్కడి జలపాతానికి మల్లెల తీర్థం అని పేరు వచ్చిందని స్థానిక / పురాణ కథనం.



ఈ జలపాతం అందమైనది మాత్రమే కాకుండా ఆహ్లాదకరమైంది కూడా. చాలా జలపాతాలను చూడడమే కాని వాటితో కలిసిపోయి ఆనందించలేము. మల్లెల తీర్థం జలపాతం కింద మాత్రం స్త్రీ, బాల, వృద్ధులు, యువకులు అందరూ స్నానం చేయవచ్చు. కొండ మీద నుంచి గుండంలోకి జలపాతం దూకేటప్పుడు కొండ చరియకు, గుండానికి మధ్య ఏర్పడిన ఆ ఖాళీ స్థలంలోకి మనం వెళ్ళి ఎంచక్కా జలపాత ధారల కింద ఎంజాయ్ చేయవచ్చు. మండుటెండలో వెళ్ళిన మనకు జలపాత ధారలు మరీ చల్లగా తగలడంతో అలవోకగా మన నోటి నుండి అత్యుత్సాహంతో కేరింతలు వెలువడతాయి. ఆ కేరింతల ధ్వనులు అక్కడి గుట్టలు, లోయల మధ్య గింగిరాలు తిరిగి వింతైన ప్రతిధ్వనులు వస్తాయి. అలాంటి ప్రతిధ్వనులు అక్కడికి వెళ్ళినవారికే ప్రత్యేకం/సొంతం.

జలపాతం ముందున్న నీటి గుండం కూడా చాలా లోతైనది, విశాలమైనది, అందమైనది. పెద్ద పెద్ద వట వృక్షాలు ఆ గుండం నీటి ఉపరితలంపై తమ కొమ్మలను వేలాడేయడంతో కన్పించే దృశ్యం ఒక సుందరకాండ.

రెండు గుట్టలను చీల్చుకుంటూ పారుతున్న గుండం నీళ్ళు అలా ఉత్తరం వైపు ముందుకు సాగుతూ అల్లంత దూరంలో ఒకటి తర్వాత ఒకటి చొప్పున మరో ఆరు జలపాతాలను ఏర్పరుస్తాయట. ఆ ఏరుకు ఇరువైపులా ఉండే ఒడ్ల మీది నుంచి నడుచుకుంటూ వెళ్ళి వాటినీ చూడవచ్చు. కాని మధ్యలో చాలా గుబురు పొదలు అడ్డుతగుల్తాయి. అంతేకాదు, ముందుకు వెళ్ళినకొద్దీ అడవి చిక్కనవుతుంది కాబట్టి అడవి జంతువుల సంచారం కూడా ఉంటుంది. కాబట్టి గుండం ముందు ఫర్లాంగు దూరంలో ఉన్న విశాలమైన స్థలంలో నీటి అంచున చెట్ల నీడలో కావలసినంత సేపు కాలం గడిపి వెనుదిరగడం శ్రేయస్కరం. ఇప్పుడిప్పుడే ఇక్కడ పర్యాటకుల వసతి ఏర్పాట్ల గురించి ఆలోచిస్తున్నారు. అయితే ఇప్పటికే ఇక్కడ స్థానిక గిరిజనులు టిఫిన్స్, స్నాక్స్ పర్యాటకులకు అందుబాటులో ఉంచారు.

ఇక తిండి, వసతి సౌకర్యాలు కూడా ఈ జలపాతానికి 25 కిలోమీటర్ల దూరంలో హైదరాబాద్ వైపున్న మన్ననూరిలోని చీతల్ రెస్టారెంట్‌లోను, 25 కిలో మీటర్ల దూరంలో శ్రీశైలం వైపున్న దోమలపెంట వనమయూరి గెస్ట్ హౌజ్‌లోను అందుబాటులో ఉన్నాయి. వనమయూరి గెస్ట్ హౌజ్ కృష్ణానది ఒడ్డున ఉంది కాబట్టి, శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ నల్లమల పర్వత సానువుల్లో చిక్కుకున్న అందమైన దృశ్యాన్ని, ఆ నీటి పైనుంచి వచ్చే చల్లగాలులను ఆ గెస్ట్ హౌజ్‌లో ఉండి ఆస్వాదించవచ్చు. చీతల్ రెస్టారెంట్ (వనమాలి గెస్ట్ హౌజెస్), వనమయూరి గెస్ట్ హౌజ్... రెండూ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉన్నాయి కాబట్టి సందర్శకులు ముందే వాటిని బుక్ చేసుకోవలసి ఉంటుంది. వనమాలి గెస్ట్ హౌజ్‌లో ఉన్నవారు ఆ చుట్టు పక్కల్లో ఉన్న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషనల్ సెంటర్‌ను, చెంచు లక్ష్మి అనే గిరిజన మ్యూజియంను, దగ్గరలోని ఉమామహేశ్వరం అనే గుహాలయాన్ని, ప్రతాపరుద్ర కోటను, షావలి దర్గాను కూడా సందర్శించవచ్చు.

### లొద్దిలో మరో జలపాతం

మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూరులో ఉన్న వనమాలి గెస్ట్ హౌజ్ నుంచి శ్రీశైలం వైపు వెళ్తున్నప్పుడు 16 కిలో మీటర్ల దూరంలో రోడ్‌కు కుడివైపున లొద్ది అనే ప్రదేశం ఉంది. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారి వాచ్‌మన్ గది దగ్గర తమ వాహనాలను ఆపి సుమారు అర కిలోమీటరు దూరం అడవిలో నడిచాక ఒక వింతైన లొద్ది కనిపిస్తుంది. మూడు దిక్కులా వేయి అడుగుల ఎత్తైన గుట్టలు వర్తులాకారంలో మూసుకోగా తూర్పు వైపు నుంచి పడమర వైపు ప్రవహిస్తున్న ఒక ఏరు (చంద్రవాగు) సుమారు 150 అడుగుల ఎత్తునుండి లోయలోకి దూకుతుంది. ఆ అరుదైన అందమైన దృశ్యాన్ని చూడడానికి మనం తూర్పు వైపున చంద్రవాగును దాటి దక్షిణం వైపు నుండి పావు కిలోమీటరు ప్రయాణించి, ఉత్తరం వైపుకి తిరిగి లోయలోకి చేరుకున్నాక మళ్ళీ పశ్చిమం వైపు నుండి తూర్పు వైపుకి తిరిగి లొద్ది జలపాతం వైపుకు నడిచి చేరుకోవలసి ఉంటుంది. నడవలేనివారు జలపాతం పైనుంచే లోయలోకి చూసి అందులో

నుండి వేగంగా వచ్చే ఈదర గాలులను ఆస్వాదించవచ్చు.

లొద్ది జలపాతం తాకిడికి దాని కింద ఒక విశాలమైన గుండం ఏర్పడింది. అందులోని నీళ్ళు చాలా తేటగా, స్వచ్ఛంగా ఉంటాయి. నీళ్ళపైకి గుండం చుట్టూ పెరిగిన పెద్ద పెద్ద చెట్లు వంగి అద్భుత దృశ్యాన్ని ఏర్పరుస్తుంటాయి. గుండం నీళ్ళల్లో ఎవరైనా... ఈత రానివారు కూడా స్నానం చేయవచ్చు. ఎందుకంటే, గుండం లోతు తక్కువగా ఉండి దాని అడుగు పైకే కనిపిస్తుంది.

గుండం తూర్పు అంచున జలపాతం కింద ఒక చదునైన బండ ఉంది. దానిపై నిల్చుని కూడా జలపాతం కింద హాయిగా పోవచ్చు. ఆ బండ మీద నిల్చున్న వారు పాపాత్ములైతే వారి మీద జలపాతం దూకకుండా పక్కకు తప్పుకుంటుందని, అది ఈ 'పుష్కర తీర్థం' మహిమ అని 17వ శతాబ్దానికి చెందిన నాగలూటి శేషనాథా చార్యులు 'శ్రీ పర్వతపురాణం'లో వర్ణించారు.

గుండం చుట్టూ గుట్టల సొరికెలు(గుహలు)న్నాయి. వాటిల్లో సునాయాసంగా నడవవచ్చు. జలపాతం వెనుక ఉన్న గుహలో జలపాతపు చల్లని తుంపర్లను ఆస్వాదిస్తూ నడువడం మరువలేని మధురానుభూతినిస్తుంది. ఉత్తరపు గుహ చాలా విశాలమైంది, లోతైంది. కాబట్టి అందులో 1600 సంవత్సరాల కిందనే ఈ ప్రాంతం నుంచి ఎదిగిన విష్ణుకుండి రాజులు శివాలయం కట్టించారు. కాకతీయుల కాలం (క్రీ.శ.1200)లో మరిన్ని విగ్రహాలు చేర్చారు. ఇక్కడ ప్రతి యేటా తొలి ఏకాదశి పండుగ సందర్భంలో స్థానిక చెంచు గిరిజనుల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జాతర జరుగుతుంది. ప్రకృతి ప్రేమికులు, చల్లదనాన్ని ఆస్వాదించాలనుకునేవారు మిస్ కాకండి మరి. ప్రధాన గుహ ముందు పైకి చూసి పావు కిలోమీటరు ఎత్తైన గోడ లాంటి గుట్ట నుండి పొడుచుకొచ్చిన రాయికి పెట్టిన తేనె తుట్టెలను చెంచులు ఎలాంటి నిర్మాణాల (మంచెల) సహాయంతో కొట్టుతున్నారో చూసి ఆశ్చర్యపడండి.



గుండం నుంచి పారుతున్న ఏరు వెంట కొంత దూరం వెళ్ళి అక్కడున్న నిటారైన గుట్టను స్త్రీబాలవృద్ధులు కూడా చీమల దండులా నిజాం కాలం నాటి నిచ్చెన నెక్కుతూ 'వత్తున్నాం వత్తున్నాం లింగమయ్యా' అని అరుస్తూ ఎలా వస్తున్నారో చూసి వెనుదిరగండి.

### ఊహకందని వ్యూ పాయింట్స్

లొద్ది నుంచి శ్రీశైలం వైపు ఫర్లాంగు దూరం ప్రయాణించగానే ఫరహాబాద్ గేట్ వస్తుంది. అక్కడ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు ఆరుగురికి ఆరు వందల రూపాయలు తీసుకొని ఫారెస్ట్ జీప్‌లో టైగర్ సఫారీకి తీసుకెళ్తారు. మన అదృష్టాన్ని బట్టి పులులు, జింకలు, ఎలుగుబంట్లు, ముళ్ళ పందులు, అడవి పందులు, అడితిలు వంటి జంతువులు అక్కడక్కడా ఉండే నీటి గుంటల్లో నీళ్ళు తాగడానికి వస్తూ కన్పిస్తాయి. మార్గ మధ్యంలో నిజాం కట్టించుకున్న గెస్ట్ హౌజ్, వంటశాల, గుర్రాల శాలలను చూసి... ఏడెనిమిది దశాబ్దాల క్రితం ఈ అడవుల్లో నిజాం రాకుమారులు వేటాడి ఆ జంతువుల మాంసాన్ని వండించుకుని తిని తాగి ఆనందించిన వైనాన్ని తలచుకుంటే కూడా థ్రిల్ అన్పిస్తుంది.

ఇదే నిజాం రాజులు మరో ఏడెనిమిది కిలోమీటర్ల ప్రయాణం తర్వాత వచ్చే పర్వత సానువు అంచున కూడా గెస్ట్ హౌజ్ కట్టించారు. వాటిని పదిహేనేళ్ళ క్రితం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిత్వ హయాంలో పునరుద్ధరించి వసతి యోగ్యంగా చేశారు. కాని, నక్సలైట్లు పేల్చేశారు. అట్లని నిరుత్సాహపడకండి. ఆ శిథిల గెస్ట్ హౌజ్‌ల ముందర ఉన్న గుట్ట కొనకెళ్ళి చూడండి... భయము ప్లస్ అనిర్వచనీయమైన ఆనందం ఒకేసారి కలిగే దృశ్యం కన్పిస్తుంది. ఆ గుట్ట అంచున నిల్చున్న మన కాళ్ళ కింద కిలో మీటరు లోతైన లోయ, మైదానాలు, వాటిల్లో చిక్కటి అడవుల్లో చిక్కుకున్న పెద్ద పెద్ద చెరువులు కాన్వాస్ మీద గీసిన చిత్రాల్లా కన్పిస్తాయి. మనం ఆ లోయలోకి పడిపోతా మేమోనన్న భయమూ కలుగుతుంది. తల తిరిగినట్లనిపిస్తుంది. అందుకే అక్కడ రైలింగ్ (ఇనుప కంచె) ఏర్పాటు చేశారు... మనం పడిపోకుండా. ఆ కంచె కడీలను పట్టుకొని లోయలోకి చూస్తుంటే ఆ పల్లపు ప్రాంతపు చెట్ల పుప్పొడి (వాసన)ని, నీటి తుంపర్లను మోసుకొంటూ వస్తూ మనల్ని వెనక్కి తోసి పడేసేంత వేగంగా వీస్తున్న ఈదర గాలులను ఆస్వాదిస్తుంటే 'గాల్లో తేలినట్టుందే' అని అరువక మానం.

నిజాం గెస్ట్‌హౌస్ నుంచి రాంపూర్ పెంట మీదుగా కుడివైపు 18 కి.మీ. దూరంలో సలేశ్వరం జలపాతం, గుహాలయాలు ఉన్నాయి. ఇక్కడ స్థానిక చెంచు గిరిజనుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా చైత్ర పౌర్ణమికి జాతర జరుగుతుంది.

వ్యూ పాయింట్ మరొకటి ఫరహాబాద్ గేట్ నుండి శ్రీశైలం రూట్‌లో సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. దాని పేరు 'ఆక్టోపస్ వ్యూ పాయింట్'. ఇది కృష్ణానది ఎడమ ఒడ్డున అర కిలోమీటరు ఎత్తులో ఉంది. ఇక్కడ వ్యూ పాయింట్ కియోస్క్ (మెట్ల గూడు) కట్టారు. దానిపై నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ ఆక్టోపస్ ఆకారంలో పచ్చగా ఉన్న కొండల మధ్య చిక్కి(పోయి)న సౌందర్యం, ఆ నీళ్ళల్లో శ్రీశైలంలోని పాతాళ గంగ నుంచి వీచే చల్ల గాలులకు ఎగిరే మన ముంగురులను సవరించుకుంటూ ఆ ప్రాంతంలో ఎక్కువగా సంచరించే నెమళ్ళను, 2,300 ఏళ్ళనాటి చంద్రగుప్త పట్టణపు శిథిలాలను చూస్తూ ఆనందంతో కడుపు నిండిన

స్మృతులతో వెనుదిరగండి.

**అరుదైన అక్కమహాదేవి గుహలు**

ఫరహాబాద్ గేట్ నుండి శ్రీశైలం రూట్‌లో వటవర్లపల్లి మీదుగా సుమారు 18 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన తరువాత కుడివైపున్న లోయలో 'అక్కమహాదేవి గుహలకు దారి' అనే బోర్డు కన్పిస్తుంది. అక్కడి నుండి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం ఆహ్లాదకరమైన ప్రకృతిలో వెలగపండ్లు, పరికి పండ్లు తింటూ ట్రెక్కింగ్ చేసి శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ అంచున ఉన్న అరుదైన గుహలను చేరుకోవచ్చు. క్రీ.శ.12వ శతాబ్దంలో ఈ గుహల్లో కర్ణాటక నుంచి వచ్చిన శివభక్తురాలు శ్రీశైలం శివుణ్ని సేవించి తరించడంతో ఆమె పేరు మీద వీటిని అక్కమహాదేవి గుహలు లేదా అక్కమ్మ బిలం అంటున్నారు.



ముందుగా మనల్ని సహజ శిలాతోరణం ఆహ్వానిస్తుంది. తూర్పు పడమర దిక్కుల మధ్య సుమారు 50 గజాల దూరంతో రెండేసి స్తంభాలు ఇరువైపులా సహజంగా ఏర్పడగా వాటిపైన రెండు గజాల మందం, నాలుగు గజాల వెడల్పు, 55 గజాల పొడవు ప్రమాణాలతో ఉన్న ఒక చదునైన బండను పొందించినట్లున్న సహజమైన ఏర్పాటుంది. ఈ బండ (పందిరి) కింద సుమారు వేయి మంది నిల్చోవచ్చు. ఏవైనా ఆహ్లదకరమైన కార్యక్రమాలు నిర్వహించు కోవచ్చు.

అన్నట్టు ఇక్కడ స్థానిక చెంచు పిల్లలు అమ్మే బోలు పేలాలు ఓ ప్లేటు తిని టీగాని, మజ్జిగగాని తాగి వాళ్ళలో ఒకర్ని గైడ్‌గా తీసుకొని గుహలోకి గబ్బిలాల శబ్దాల మధ్య కొవ్వొత్తి వెలుతురులో మూడు మలుపుల ద్వారా 108 అడుగులు నడిచి గుహ చివరనున్న గజమెత్తు గద్దెపైన సహజంగా వెలిసిన శివలింగాన్ని దర్శించుకుని ఆధ్యాత్మిక ఆనందంతోపాటు అడ్వెంచరస్ థ్రిల్లింగ్‌నీ మన సొంతం చేసుకోవచ్చు. తూర్పునుండి పడమర వైపు సాగే ఈ గుహకు ఎదురుగా మరో గుహ, దానికి సమాంతరంగా ఇంకో గుహ, వీటన్నింటి పైన మరి రెండు గుహలు ఉన్నాయి. పై గుహల్లో ఇప్పటికీ కర్ణాటక నుండి వచ్చిన శివ భక్తులు నివాసం ఉంటున్నారు. కింది గుహల్లో అదే రాష్ట్రానికి చెందిన శివశరణురాలు నివాసం ఉంటున్నది.

ఈ గుహల అంచునే ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో స్నానం చేయడం మర్చిపోకండి. చేస్తూ అవతలి ఒడ్డుపైన అక్కడక్కడా విసిరేసినట్లు కన్పిస్తున్న ఆవులపెంట, చేపలోళ్ళ పెంటలు, సూర్యోదయం, సూర్యాస్తమయం నీళ్ళలో ప్రతిఫలిస్తున్న ప్రతిబింబాల అందాలనూ చూడండి. పాతాళగంగ నుంచి ఇక్కడికి 22 కిలోమీటర్లు పర్యాటక శాఖవారి బోటులో ప్రయాణించి కూడా చేరుకోవచ్చు. తెలంగాణ వైపున్న నీలిగంగ రేవు నుండి ప్రైవేటు బోట్లనూ ఎంగేజ్ చేసుకోవచ్చు. బోటు విహారమూ ఒక థ్రిల్లింగే కదా!

– ద్యావనపల్లి సత్యనారాయణ,
m : 94909 57078
e: dyavanapalli@gmail.com

*('తెలంగాణ కొత్త విహార స్థలాలు' పుస్తకం నుంచి)*
*ప్రతులకు: తెలంగాణ రిసోర్స్ సెంటర్, చంద్రం 490, వీధి నెం.12, హిమయత్‌నగర్, హైదరాబాద్-29. తెలంగాణ. వెల: రూ.100*

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు




**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

చిరునామా :

DECCAN LAND : "CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

TELANGANA RESOURCE CENTRE




# బాలచెలిమి గ్రంథాలయంతో సెలవుల సద్వినియోగం

## నందిమేడారం గ్రామం, ధర్మారం మండలం, పెద్దపల్లి జిల్లా

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల చెలిమి గ్రంథాలయం గత మార్చి నెలలో పెద్దపెల్లి జిల్లా, ధర్మారం మండలం, నందిమేడారం గ్రామంలో ఏర్పాటు చేయడమైంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన ఈ గ్రంథాలయం సెలవుల్లో తమ విరామ కాల సద్వినియోగానికి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

**అభిప్రాయాలు..**

చారిత్రక ప్రాధాన్యం కలిగిన మా ఊరు (నంది మేడారం)లో బాల చెలిమి గ్రంథాలయం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఎన్నో వేల రూపాయల విలువ చేసే పుస్తకాలను మా పాఠశాలకు అందజేయడం మా విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ఈ సెలవులలో కూడా ఉపాధ్యాయులు, విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు ఇచ్చి ఇంటివద్ద చదువుకునే విధంగా ప్రోత్సహించారు. బాల చెలిమి గ్రంథాలయ చైర్మన్‌కు మా ప్రత్యేక ధన్యవాదాలు.



**-ఏ. శ్రీనివాస్.** ఎస్.ఎం.సి. చైర్మన్, జడ్.పి.హెచ్.ఎస్. నంది మేడారం.

వేసవి కాలము ఎండలు మరియు కరోనా వైరస్ దృష్ట్యా విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగము చేసుకోవాలనే మంచి ఉద్దేషముతో మా పాఠశాల విద్యార్థులకు బాలచెలిమి గ్రంథాలయ పుస్తకాలని వారి ఇంటికిచ్చి చదువుకోవాలని ప్రోత్సహించడము జరిగింది. పాఠశాల దరిదాపులలో ఉన్న దాదాపు 40 మంది 8, 9, 10 తరగతుల పిల్లలకు పుస్తకాలు అందజేయడము జరిగింది. పుస్తకాలు చదవడము ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవడముతో పాటుగా నీతిని, సభ్యత, సంస్కృతిని అలవర్చుకోవచ్చు. బాలచెలిమి పుస్తకాలలో చాలా విలువైన విషయలున్నాయి. వాటిని చదివి విద్యార్థులు తమ భవిష్యత్తుకు మంచి పునాది వేసుకుంటారని ఆశిస్తున్నాను. బాలచెలిమి గ్రంథాలయాల వ్యవస్థాపకులు శ్రీ వేదకుమార్ గారికి, నందిమేడారం గ్రామస్థులు జస్టిస్ శ్రీ నవీన్‌రావు గారు మా పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయమని సలహా ఇచ్చిన వీరికి మా పాఠశాల తరపున ధన్యవాదములు. వేదకుమార్‌గారు మంచి మనసుతో మాకు గ్రంథాలయాన్ని కేటాయించినందుకు అది మా విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేటట్టు చూస్తానని మీ కృషికి మావంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందచేస్తామని హామీ ఇస్తున్నాము.



**-మహమ్మద్ ఉమర్ అలీ,** ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాల నంది మేడారం, ధర్మారం మండలం, పెద్దపల్లి జిల్లా.

సెలవులలో మాకు గ్రంథాలయ పుస్తకాలు ఇచ్చినందుకు చాలా సంతోషముగా ఉంది. ఇంటివద్ద ఖాళీగా ఉండే బదులు పుస్తకాలు చదివి ఎన్నో తెలియని విషయాలు తెలుసుకోవచ్చు. సమయాన్ని సద్వినియోగము చేసుకోవచ్చు. మేము చదివి మా కుటుంబసభ్యులకు కూడా విషయాన్ని చెప్పి చర్చించి అవగాహన చేసుకుంటాము. ఇట్టి పుస్తకాలు మాకు అందచేసిన మా హెడ్మాస్టర్ గారికి బాలచెలిమి నిర్వహకులకు ధన్యవాదములు.



– సాహిత్య రాసూరి, 8వ తరగతి



*లాక్‌డౌన్ తరువాత బాలచెలిమి గ్రంథాలయం నుంచి పుస్తకాలు అందుకుంటున్న విద్యార్థులు*



మా పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలచెలిమి గ్రంథాలయం ద్వారా మేము ఎన్నో పుస్తకాలను చదివే అవకాశం కలిగింది. సెలవులలో కూడా మా ప్రధానోపాధ్యాయులు మాకు ఈ పుస్తకాలను అందజేసి ఇంటి వద్ద చదువుకొమ్మని చెప్పారు. దీనితో మేము కరోనా సమయంలో బయటికి వెళ్లకుండా ఇంటిలోనే ఉండి చదువుకొని అనేక విషయాలను తెలుసుకొనే అవకాశం కలిగింది. బాల చెలిమి గ్రంథాలయ నిర్వాహకులకు మరియు మా ప్రధానోపాధ్యాయులకు ధన్యవాదాలు. **–రాజ్ కుమార్,** 9వ తరగతి.



మా పాఠశాలలో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ వారు ఏర్పాటు చేసిన బాల చెలిమి గ్రంథాలయం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఈ పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలు వెల్లివిరుస్తాయి. ఈ పుస్తకాలే కాకుండా ప్రతి నెల మ్యాగజైన్ లు కూడా నిర్వహకులు పంపిస్తామనడం మాకు చాలా సంతోషదాయకం. బాలచెలిమి గ్రంథాలయ చైర్మన్ శ్రీ మణికొండ వేదకుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**–అరుణ,** జీవశాస్త్ర ఉపాధ్యాయులు



**అనిత**

పుస్తకాలు విలువైన సమాచారాన్ని విషయ జ్ఞానాన్ని అందజేస్తాయి. విద్యార్థులు సన్మార్గంలో నడవడానికి పుస్తక పఠనం ఎంతో దోహదపడుతుంది. మా పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయం ఏర్పాటు చేయడం విద్యార్థులకు ఒక గొప్ప అదృష్టమని చెప్పాలి. ఈ పుస్తకాలను మా విద్యార్థులు చాలా చక్కగా వినియోగించుకుంటున్నారు. బాలచెలిమి గ్రంథాలయాల చైర్మన్ శ్రీ వేదకుమార్ గారు, కన్వీనర్ గరిపల్లి అశోక్‌గారు, విద్యార్థులకు గ్రంథాలయాల ఏర్పాటు ద్వారా, వివిధ రచనల ద్వారా, పుస్తక సంకలనాల ద్వారా చేస్తున్న సేవలు అమూల్యమైనవి. వారికి మా పాఠశాల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు.

**–అనిత,** తెలుగు ఉపాధ్యాయురాలు.

బాల చెలిమి గ్రంథాలయ నిర్వాహకులు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందిమేడారం



*లాక్‌డౌన్ వేళ ఇంటి దగ్గర పుస్తక పఠనం కోసం బాలచెలిమి గ్రంథాలయం నుంచి విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు ముహమ్మద్ ఉమర్ అలీ*


– కట్టా ప్రభాకర్
m : 8106721111
e:akumarkatta@gmail.com

# వలస బతుకులు

"ఏమే" అంటూ బార్య తులసమ్మ వైపు చూస్తూ పలకరించాడు ఆమె పెనిమిటి చంద్రయ్య. అతనలా పిలువగానే "ఏందయ్యా" అంటూ అతనివైపు చూస్తూ మారడిగింది. "పొయ్యి కాడ ఎంతసేపు కూలవడ్తవ్, వంట జల్ది కానియ్యరాదే సుతారం జెయ్యక, "అంటూ గొనిగాడు తలపై చేతితో రుద్దుకుంటూ

అతను చూడనికె దుక్కలా కరుకుదేలి చామన చాయతో వుంటాడు కోలమొఖంతో నెత్తికి సమరు లేక ఎఱ్ఱ బారింది

"ఏందయ్య అట్ట ఆత్రిస్తవ్, నాకేమన్న నాల్గు చేతులున్నయా, ఇదేమన్న మిషినా, మనదేమన్న గ్యాసుపొయ్యా" అంటూ అతనివైపు గుడ్లురిమి చూసత్తూ అసహనంతో పలికింది.



తులసమ్మ సూడ నల్లని కురులు, కాటుక కళ్ళు ముత్యాల పళ్లు, ఎరుపు తెలుపు మట్టి రంగువన్నె తో జిగేలుమని మెరిసిపోతుంది

''ఒయబ్బో మాటకు మాటేస్తదిరయ్య బుక్కమల్పక జర కానియ్ అవుతల పొద్దుపోతుంది, బుక్కెడు బువ్వ తిని పనికుర్కాలే" అని ఆమెవైపు నింపాదిగా చూసత్తూ పలికాడు.

"సిడెం ఆగరాదు ఎందుకు నీకు పరిగడ్పు దేవులాట, తిండి చింత తప్ప, పిల్లలున్నరు నాల్గురాల్లు ఎనకేస్కుందామన్న ఆలోచన వుందా లొట్టెడుతాగాలే, ఉన్నకాడ్కి ఊడ్సుక తినాలే బరివత్తల పండాలే ఇగ ఇల్లెందుకు పొల్లెందుకు. నువు సంసారం జేస్తే సక్కదనం కుల్కుతుంది... "అంటూ అతనివైపు అసహనంతోనే తన అక్కసు ఎల్లగక్కింది.

"ఓర్నితల్లి పొద్దుపొద్దుగాల నీ రాషంగంకున వార్దెంగుదు, పనికి ఆల్చమైతుందంటే కాలికి గజ్జెగట్టి కయ్యిన లేస్తవ్ కుక్కోలె." అంటూ నసిగాడు.

"జఱ్ఱాగరాదు చేస్తున్నగదా, గింతకుమునుపే చాయ్ చేస్తే గిలాసడు తాగితివి, నేనేమన్న వూకె కూకున్ననా లేశ్నసంది చేస్తనేవుంటి కూలవడి కూలవడి రెక్కలిసే." ఆమె గండిపడిన చెరువులా వాగుతనే వుంది. అతను తనని కాదన్నట్టు బీడి ముట్టించుకొని తాగవట్టిండు కాలుగాలిన పిల్లోలె.

"నా యెన్కెమ్మటే తిర్గకుంటే పెద్ద మేస్త్రికి పోన్నన్న జేయవైతివి ఆడాడా పనులు బందువెడుతుర్రట. పట్నమంతా ఒకటే కలకలం జనం సుత అప్పటిలెక్క తిర్గుతలేరు ఏందో మాయదారి రోగం పట్నానికొచ్చిందట"అంటూ వీస్తూ పోయి పలికింది

"ఏందే నువ్వ నీ అపశకునం మాటలు" అంటూ అతను ఆశీర్కపోయి చూశాడు

"అయ్యో ఉన్న మాటంటే అట్టుల్కిపడ్తవ్ నాకేమెర్క నేను సూడబోయిన్నా" అంటూ ఆమె పెనిమిటి వైపు గుడ్లప్పగించి చూసింది

"ఈ ఫోన్ కలుస్తలేదే ఎన్నిసార్లు చేసినా బిజి బిజి వొస్తుందేవే'' అసహనంగా పలికిండు అతడు.

"ఆయనకి నువ్వొక్కన్వే పన్యవ్ నీ కోసమే ఎదురుజూస్తుండు ఎప్పుడొస్తడు పిలగాడ అని ఊకే ఫోన్ గెల్కకుంట రప్పున సైటుమీదికి పొయ్యిరాపోరాదు నీకు ఒనరు గాకుంటే నేను రాన" అంటూ అతని వైపు వారగా చూసత్తూ పలికింది. ''ఊకే శల్పట్లాడకు పోతగాని'' అంటు కదలబోయాడు.

అప్పుడే మేస్త్రిరి వాళ్లదగ్గరకొచ్చినాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టు,'' ఇగో తులసమ్మ మీరు ఇంతకుముందు పోయిన సైటుమీదికి పోండ్రి ఆడ పని అయిపోతే నాకు ఫోన్ చేయుండ్రి, మిగుల్తే రేపుగూడ ఆడికే ఎల్లుండ్రి. ఇగో చంద్రయ్య పని తొందరగ వొడగొట్టు" అంటూ ఆతను పలికిండు. ఆమాటకు వారు "ఇంకెవలు వస్తుండ్రు మేస్త్రి" అని అడిగారు మేస్త్రి ని. అందుకతను "మీరిద్దరు మీతోపాటు ఇంకిద్దరు వొస్తరు జర జల్ది జల్ది పని కానియుండ్రి." అని అతను అక్కడినుండి కదలబోయాడు. "మేస్త్రి పోతంగని గిన్ని పైసలు జూడుండ్రి" అంటూ అతనినే తదేకంగా చూస్తూ. "మొన్ననే ఇస్తిగదయ్యా" అని అతననగానే "అదికాదు మేస్త్రి ఇంట్ల సరుకులు వొడిసినయ్, నువ్ ఇచ్చిన దాంట్ల ఇంటికిన్ని పంపిస్తి, పిల్లలున్నతాన కూకోనితింటే కొండలాగుతయా" అని ఆశగా పలికింది తులసమ్మ.

"సరే లేవ్వయ్య దానికేం తక్వలేదు గాని ముందైతే పనికెల్లుం(డి" అని అతను కదిలాడు "సరే మేస్త్రి.." అంటూ వారు గదిలోకి కదిలారు.

"అమ్మొ చాయ్ పొయ్యే" అంటూ పిల్లలిద్దరు వొచ్చిర్రు. "గిప్పుడు చాయేందిరా గింత అన్నం తిని బడికి పోరి నాయినా" అంటూ ఆమె పలికింది పిల్లల యిద్దరిని వొడిలోకి తీసుకుంటూ "మాకు బడి లేదే" అంటూ హుషారుగా పిల్లలు పలికారు. "అప్పుడే శెలవులొచ్చినాయిరా" అంటూ యింతగా పిల్లల వైపు చూసింది ఆమె."ఇగో ఒకపూట బడేగాని అక్కడేందో కరోనా వచ్చిందట సార్లు బడికొచ్చి పోతరు మమ్ములమట్కు ఇంటిపట్టున్నే ఉండమన్నరు మేం పోవొద్దట బడికి, "అని వారనగానే" ఒశే ఏందల్లా విచిత్రము, బాగుందిగా సక్కదనం పిల్లలు లేన్ది సార్లు వచ్చేంజేస్తర్రా బడికి" అంటూ వింతగా అడిగింది ఆమె.

"ఏమో గది మాకు తెల్వదు సార్లు చెప్పిర్రు మీకు చెప్తున్నం" ఆనందంతో పిల్లలు పలికారు.

"సరేగాని ఎండపొద్దు నాయినా అటిటు తిర్గకుం(డి ఎండకు పానం గావరైతది ఇంటిపట్టున్నే ఉందుర్రి" అంటూ మురిపెంతో పిల్లల ముద్దాడింది. "సరేనే అమ్మా ముందైతే గింత చాయ్ పొయ్యి" అని ఆమె నే అమాయకంగా చూస్తూ పలికారు.



"జర్రాగురా తలిస్తే ఆగవ్ శిడం, ఓపికపట్టు మాకు సద్దులు కావాలే పొయ్యి మీద అన్నం కూరుంది జర్రాగితే చాయ్ గరం చేసి పోస్తగని మిమ్ముల కాదంటనా నా చిట్టి బంగారి ఇగ్గో అక్క నువ్వు పక్కింటికి పొయ్యి టి.వి.సూడుపోరి." అని కొడుకు తల నిమురుతూ అనగానే పిల్లలిద్దరు ఉరికి టి. వి. సూస్తుర్రు పక్కింటి పిల్లలతో కలిసి ఆ ఇంటామే రేకలవారకముందే ఇండ్లల్ల పనికిపోయింది...

వారు అన్నం తిని పనికి పొయ్యారు సాయంత్రం ఐదు గంటలకు మేస్త్రిరి సైటుమీదికి వచ్చిండు పని మొత్తం తెప్పరిల్లి పరీచ్చగా పరిశీలించి చూసిండు. వారు పనిలో మునిగారు ఏదన్న వొంక పెడ్తడో ఏమో, పనికేంది ముతోంకరా ముక్కొంకరా" అని లోలోన అనుకోసాగారు,

"ఇగో తులసమ్మ ఇను ఓ నాల్గు దినాలు పని బందు పెట్టాల్నట గదేందో కరోనా మహమ్మారి మన దేశానికొచ్చింది. దానికి మందు లేదు అదిగన ఎవరికి సోకినా ఇగ సావే, బతికుంటే బల్సాకైనా తిని బత్కొచ్చు ముందైతే రేపటిసంది మీరు పని బందు పెట్టి ఇంటిపట్టున్నే ఉండండి అటిటు తిర్గకండి ఇగో మన ఇంటిసారు కొన్ని పైసలిచ్చిండు పురా మొత్తం ఇయ్యాలే కర్సులమట్కు ఇస్తున్న ఎట్నో అట్ల ఎల్లదీస్కోరి ఏమన్నంటే తతిమ్మ పైసలు అన్ని కులాయించినంక ఈ నాల్గుదినాలు గడ్సినంక మల్ల పనికొస్తరు గదా అప్పుడు చూద్దాం" అంటూ అతని చేతిల కర్సులకని కొన్ని పైసలిచ్చిండు.

"అన్ని రోజులు ఎట్ల ఎలదీస్కోవాలే మేస్త్రిరి మిమ్ములనే నమ్ముకున్నం అమ్మ పిల్లల కాదంటారా

పిల్లలు తల్లిని కాదంటారా, ఏదో పెద్ద మనసుతో సూడాలే ఆమె దీనంగ పలికింది.

"ఇగో తులసమ్మగా యింటి వోనర్ యిస్తనేకదా నాచేతికొచ్చేది. నేనేమన్న రూపాయలు కట్టుకోని కూర్చున్ననా. మీలెక్కనే నేను, నాకొచ్చేదే కమీషన్ మీకు తెల్వనిదేముంది. ఎలాగొలా ఎల్లదీస్కోం(డి. ఇగో రేషన్ కారట్వుంటే పన్నెండు కిలోల బియ్యం, గిన్ని పైసలు గూడ యిస్తదంట కర్సులకు నేను చెప్పేది చెప్పిన యిగ మీయిష్టం. అంటూ నింపాదిగా అక్కడినుండి కదిలాడు మేస్త్రిరి.

వారు పని ముగించి గులుగుకుంట అలసిన దేహాలతో ఇంటివైపు కదిలారు. ఆమె మై మర్సి నడుస్తోంది పోలీసుల గస్తి పెరిగింది, జనం షాపులు బందువెట్టి వారివారి ఇంటి పట్టున్నే ఉండండి అటిటు తిర్గకండి అంటూ జీపులో తిరుగుతూ మైకు శబ్దం చేస్తూ రోడ్డుపై పరుగులు తీస్తుంది. వారు యిల్లు చేరారు. వారిని చూడగానే పిల్లలు ఎగబడి ఎగ బడి పరుగున వచ్చి వారిని చుట్టుకున్నారు. తులసమ్మ పిల్లల రూపం జూస్తాలికి మతిని పుర్రె తొలుస్తుంది "ఉన్న పైసలు గీడనే గిప్పుడే కర్సయితే యిరవై రోజులు ఎట్ల ఎలదీస్కోవాలే "అంటూ గొనుగుతూ తిన్నగా మళ్ళీ తనంతట తానే పెనిమిటితో అతనివైపు చూస్తూ పలికింది. "నీయవ్వ ఎందుకే కొంపలు మునిగినట్టు అట్ల బాదపడతవ్. గీ శర మనకు వొక్కరికే నా, లోకమంత ఎట్లుంటే మనం గట్లనే. ఊరంత వొకదారయితే వులిపికట్టెదొకదారి అన్నట్టూ శింత జేయకు. పైన పరమాత్ముడుండు ఆయినే సూస్కుంటడు" అంటూ ఆమెకు దైర్యం మాటలు పలికిండు "అదికాదయ్యా నా బాద మనం ఎట్లన్న వుంటం. ఉప్పిడో సప్పిడో తిని బత్కొచ్చు పాలపండ్లోతిగ పిల్లలున్నరు లేవంగనే అమ్మా చాయ్ అంటరు. ఎప్పుడుపడితే అప్పుడు ఆకలి అంటూ తిని లేగలెక్క గంతులేస్తరు ఆటకాయి పోరలు ఆళ్ల ఆకలి దూప సూడొద్దా చెప్పు. "పిల్లల జుసుకొని బాధలన్నీ మర్శిపోయి బతుకాలే ఉన్న ఊరిలో పని కరువని వలస బాట పట్టి పట్టన మొస్తే ఏం ఎలగబెడుతున్నం ఆళ్ళే ఉట్టి కట్టుకొని ఊరేగుతారు. మనం సూసి సూసి కళ్ళు కాయలు గాసినయి "అంటూ వొనుకుతున్న గొంతుకతో పలికింది పెనిమిటి వైపు దిగులుగా చూస్తూ. ఆమె మాటలకు అతనూ గుమ్మం ముందు దిగులుతో కూలవడ్డడు "ఏమే ఆళ్లు పెద్దోళ్ళు మన కాలు జారితే కష్టం

నోరు జారితే అంతకు పదిరెట్లు నష్టం, కూలికొచ్చి నం ఏడయినా మన బతుకులు గింతే ఉచుబ్బులకు ఉచ్చ తాగితే నోరంతా గత్తు వాసన గొడ్డది గాని అత్తరు వాసనొస్తదా ఇంకెన్ని సూడాల్నో గని కానియ్యే పిల్లల ఆకలి దూప సూడొద్దా " అంటూ బీడీ ముట్టించి బుక్క దమ్ము గుంజుతూ కూలవడ్డడు ఆమె పనిల మునిగింది.

పిల్లలు టివి చూడనికె పక్కింటికి పొయ్యింౢడు. ఆమె వంటచేస్తుంది ఇద్దరూ అన్నం తిని పిల్లల దరికి చేరి టివి చూడనికె ఎల్లింౢడు అప్పటికే పని ముగించుకొని ఇల్లు చేరిన భారతమ్మ తలకు జండుబాం రాసుకొని మూలుగుతూ కుస్కు కుస్కున దగ్గుతూ మంచంల వొరిగింది. అమె ఆయసపడుతూ తిన్నగా ఊపిరి తీయసాగింది. ఆమె ఇద్దరు పిల్లలు తల్లిని చూడకుండా గుడ్లప్పగించి టీవి చూస్తూ కూలబడిపోయారు అమె ఆలతు జూస్న తులసమ్మ "ఏందేపొల్లా ఏమైందే పొద్దున బాగనే వుంటివి పొద్దు పుచ్చే యాల్లకు మంచం బట్నవ్ ఎట్లుందే తిన్నవా ఏమన్న టిపిని చెయక పోయినావ్" అంటూ ఆమెను పలకరించింది "ఒళ్ళంత వొకటే నొప్పులు రేపు ఒక సూది ఏపించుకుంటక్క'' అంటూ తిన్నగా పలుకుతూ ఊపిరి తీయసాగింది



"ఏందో మాయదారి జరం సూస్త సూస్తనే పట్టుకుంది. ఒళ్ళంత పీల్చి పిప్పి జేసింది"...

"ఏం జరిగింది పిల్లా జర గా ముచ్చట జెప్పు"

"చెప్పనికే ఏముందక్క"

"అదెందే అట్లంటవ్'' అంటూనే అనుమానం తో ఆమెవైపు తీక్షణంగా చూసింది. చంౢదయ్య వుండబట్టలేక నూట నాలుగు కు పోన్ చేసిండు

"ఎన్నిరోజులు అయ్యింది సుస్తీ జేసి"

"సారు నాల్దినాలు అయ్యింది"

"ఏం పనికి పోతవ్"

"సారు ఇగో ఓ పెద్ద సారు ఇంట్ల పనిజేస్త

అది లంకంత కొంప ఆడా నల్గురు పనొళ్లమున్నం, గాళ్ల దాంట్లో నేనొదాన్ని

అదిసరే ఆయనేం పని జేస్తడు

ఆయనకి పెద్ద పెద్ద యాపారాలు ఉన్నాయ్

ఆయినెప్పుడు బయటి దేశాలు తిరుగుతాడు

గీ మజ్జే పోయిండ

పోకేం పోయిండు

మల్ల ఎప్పుడొచ్చినా

అగో గిమజ్జనే ఉగాది ముంగల వోచిండు

వొచ్చినప్పుడు మంచిగానే వుండు గానీ గియ్యన్ని ఇసయాలు ఎందుకడుగుతుంౢడు సారు"

"అమ్మ ఆ సారూకు కరోనా రోగం అంటుకుంది."

"ఎంది"

"ఆ మేం చెప్పేది నిజం అతనికి కరోనా

అదే నీకు అంటుకుంది"

"ఏంది సారు మీరనేది"

"అవునమ్మా, అది సరే ఆ సారు "ఇల్లు ఎక్కడవుంది"

"అగ్గో అట్ల కనిపించే పెద్ద బంగ్లా ఆయిన కొడుకు గీమజ్జనే అమెరికా నుంచి వొచ్చే" "కొంపదీసి ఆచినబాబుకు వుందా... వుండే వుంటది.. ముందు నిన్నూ గాంధీ ఆసుపౢత్రికి చికిత్స కోసం తిస్కపోతం ఆడా ఓనాల్దినలు వుండాలే"

"సారు నా పిల్లలు"

"నికేవరు లేరా"

"లేరు"

"అది మేం జస్కుంటం"

కండ్ల నీళ్లు దెచ్చుకొని పిల్లల వైపు ఆశగా చూస్తూ అంది అమ్మ చిట్టీ చెల్లెలు భౢద్రం అంటూనే మూసుకున్న కళ్ళ మాటున మల్ల నేనొస్తనా నా పిల్లల జూస్తన అండ్లనే సస్తన, సస్తే నా పిల్లలకు దిక్కెవరు ఆళ్ళ పసిపోరలు ఎవలు దగ్గరికి రాణిస్తారు. ముదనష్టపొడు తాగుడు మర్సుమంటే ఒకటే తాగి తాగి సచ్చి కుకునే, అట పానంతో వుండ పాయే అండ వుండి కొండ పాకాలంటరు, అండలేని మనిషికి నీడ లేని బతుకే " అని లోలోన బాధతో నిటూర్చింది కండ్లపొంటి దారగా కన్నీళ్లు కార సాగాయి. ఆమె దుఃఖంతో లోలోపల కుముల సాగింది.

"నువెం పికరు జేయకే పిల్లా ఎట్ల అయ్యేదుంటే అట్ల అయ్యిది. అందరూ అమ్మ అయ్య వున్నొల్లే వున్నారా అంతా భగవంతునికి బారం నారుపోసినోడే నీరు పొస్తడు గానీ దైర్యంగ వుండు"అంటూ చెమ్మ గిల్లిన కళ్లతో పలికింది తులసమ్మ

"ఇదుగో చూడమ్మా మీరు ఆ పిల్లల కనిపెట్టుకొని వుండుౢరి. ఏవురు మీది నల్లగొండ దగ్గర చిన్న గూడెం సారు."

"అచ్చా అట్లనా

మీరు సిటీ విడిచి పోవద్దు మీరుకూడా ఇంటి పట్టునే వుండాలే బయట తిరుగొద్దు ఇది ఎనకట కలరా, గత్తరా అనీ పిలుస్తారు పేరు మారింది అదే కరోనా రోగం మందులేదు నివారణ ఒక్కటే మార్గం

కూలీనాలీ జేస్కుంటే నోటికింత ముద్ద ఎట్ల బతుకాలే

చూడమ్మా బతికుంటే బలుసాకు తిని బతుకొచ్చు పానం పోతే"....

ఆమ్మో దీని పీనుగెళ్ళగి మహమ్మారి ఎంత మందిని మింగుద్దో దేష్ట ముండ ఎందర్ని సంపుకటింటడో ఏమయ్యో జర భౢద్రం గుండాలే

తుమ్మితే వస్తదటగి నాల్దినలు బయట తిరుగాకుంట వుండాలంట.

సరెనే.... పిల్లలిద్దరు తల్లివైపు అమాయకంగా చూడసాగారు. ఆమె మొఖం పాలిపోయింది కండ్లు కంతలకు పోయాయి ఒళ్ళు వేడితో సెగలు గక్కుతుంది గొంతులో పట్టరాని ఆయసంతో గునుపు తీస్తుంది ఆ అవుస్త చూస్తున్న పిల్లలు తల్లడిల్లిపోయారు

కొంపదీశి ఇది ఆ రోగమైతే కాదుగా అని అనుమానంతోనే తన పిల్లలను తన దగ్గరికి రాకుండా దూరంగా ఉండుర్రి నాకు అంటుకున్న మహమ్మారి మీకు సోకుతుంది" అంటూ తిన్నగా పలుకుతూ చెయ్యితో అసుంటపోరి అన్నట్టుగా సైగ చేసింది. పిల్లలు ఇద్దరు తల్లిని చూసి కళ్ల నీళ్లు తెచ్చుకున్నారు చంద్రయ్య కు సగ కండ్ల నీరు కమ్మింది "పిల్లలకు తల్లి వుండాలి గాళ్ళ ఎట్లున్న సాకుతది మొగ మనిషి వుంటే ఏం లాభం లొట్టల కొట్కోని లొట్టెడు తాగి కట్టకు పంతరు పిల్లల ఆకలి దప్పులు చూస్తరా పాడా" అని లోలోపల నసిగిండు.

అంబులెన్స్ వచ్చి బారతమ్మ ఇంటిముందు ఆగింది మాస్కులు ధరించిన నల్గురు కిందికి దిగారు అందులో ఒక డాక్టరు ఇద్దరు స్రెట్చర్తో లోనికి వెళ్లి చూశారు. ముందుగా డాక్టరు నర్సు ఇరుగురు వెళ్లి ఆమెకు కరోనా వైరస్ ఉందా లేక మరేదైనా ఫ్లూ జ్వరమా అని తేల్చనికే వైరస్ గుర్తించే పరికరంతో ఆమెను ప్రాథమిక టెస్టు చేశారు. ఆమెకు కరోనా సోకినట్టు నిర్ధారణైంది పిల్లలకు చూశారు వారికి లేదు వారిని ఇంటిపట్టున్నే ఉండమని బైటికి వెళ్లొద్దని చెప్పి చంద్రయ్యను వారిని కనిపెట్టమని చెప్పి ఆమెను గాంధీ హాస్పిటల్కు తరలించారు. పనిలో పనిగా పక్కిళ్లు కావడం చేత కూలినాలి చేసి బతుకుతున్న చంద్రయ్య , తులసమ్మలకు వారి పిల్లలకు చుట్టుపక్కలవారికి టెస్టులు చేసి లేదని నిర్ధారించుకుని "మీరు మటుకు పద్నాలుగు రోజుల పాటు బయటికి రాకుండ ఇంటిపట్టున్నే ఉండమని చెప్పి వెళ్లిపోయారు

ఆమెను ఆసుపత్రికి తీసికొని పోతుంటే పిల్లలు గైయ్యిమంటూ ఒక్కసారిగా ఏడుపందుకున్నరు. చంద్రయ్య వారిని దగ్గరకు తీసికొని ఊకుంచ సాగిండు. పిల్లలు బిక్కుబిక్కుమంటు ఆ రాత్రంతా గడిపారు వారికి తులసమ్మ చంద్రయ్యలు అండగుండి తమ పిల్లలుగా తలచి బరోసానిస్తూ నాలుగు ధైర్యం మాటలు పలికారు.

విధి విచిత్రమైంది అది బలియమైంది దాని ముందు మనిషి ఆటలు సాగవు బారతమ్మను తీసుకెళ్లిన మూడ్రోజులకే చనిపోయింది హాస్పత్రి సిబ్బందే ఆమెకు దహన సంస్కారం చేశారు

పిల్లలిద్దరు అనాదలయ్యారు తల్లిదండ్రి లేక అయినవారు లేక నా అన్న దిక్కు దాపు లేక తోడుకోసం ఎతకసాగారు వలసకూలీలైన తులసమ్మ, చంద్రయ్యలు వారిని అక్కున చేర్చుకొని ఆ పిల్లల పాలిట ఆశాదీపమయ్యారు.

–భూతం ముత్యాలు
m : 9959546780
e : buthammuthyalu@gmail.com

# ఓ "బుద్ధి" జీవి మాత్రమే!


ఎన్ని జన్మల పాపమో...
ఎన్నెన్ని తరాల శాపమో "కోవిడ్" రూపాన
మనిషికి బతికుండగా "నరకం" చూపుతుంది
అపార జ్ఞాన సంపన్నునని విర్రవీగినోన్ని
వెర్రి వెంగలప్పను జేసీ ఆటాడుకుంటుంది
విశ్వంతరాల "గుట్టు' రట్టుజేస్తానని తొడగొట్టినోన్ని
నిశబ్ద నిశిథిలో "ఏకాకి"గా నిలబెట్టింది
ఆకాశానికి హద్దులు గీస్తానని మీసం మెలేసినోన్ని
అధః పాతాళంలో తొక్కి పెట్టింది
చంద్రునిపై "ఇంద్ర ప్రస్థం" కడతానని కలగన్నోనికి
భూమ్మీద నూకలకు చెల్లు చీటి రాసింది
"జీనోమ్" పేజీల తిరగేస్తానని తలెగరేసినోనికి
తన "అస్తిత్వం" ప్రశ్నార్థకం చేసింది
పంచభూతాలపై పెత్తనమంటు రొమ్ము విరిచినోనికి
చిరునామా గల్లంతు జేసింది
రాజ్యాలకు రారాజునని మురిసినోనికి
ఆరడగుల "జాగ"కూడా దూరం చేసింది
కోవిడ్ కు ధనిక బీద, రాజు, బంటు తేడాలేదేమో!
అందుకే అందరిని ఒకే గాటన కట్టిపడేసింది
మూకుమ్మడిగా "మృత్యు" నోట్లోకి నెట్టేసింది
"కరోనా"కెంత కసి లేకుంటే...
అయినవాళ్ళు పలకరించనంతగా
కడసారి హత్తుకు దుక్కించలేనంతగా
ఖననానికి కూడా నోచుకోలేనంతగా,
కుక్కల కన్నా హీన "చావు" రుచి చూపుతుంది

ఏతా వాతా "కరోనా" తేల్చిందేమంటే
ఈ అనంత విశ్వంలో,
కోటాను కోట్ల జీవరాశుల్లో,
మనిషన్నవాడు ఓ "బుద్ధి" జీవి మాత్రమేననీ..!

–కోడిగూటి తిరుపతి
9573929493
thirupathi.hm@gmail.com

# పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు శుభవార్త

తెలంగాణ రిసోర్స్ సెంటర్ (టీఆర్‌సీ) ఆధ్వర్యంలో వెలువడుతున్న 'టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్' త్రైమాసిక జర్నల్‌కు **ఆర్ఎన్ఐ నంబర్ TELBIL/2019/78615** వచ్చిందని తెలియ జేస్తున్నందుకు సంతోషిస్తున్నాం. త్వరలో **ఐఎస్ఎస్ఎన్** ఆమోదం పొందడానికి కావలసిన పత్రాలు సమర్పించడం జరిగింది.




## జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్-త్రైమాసిక

TELANGANA RESOURCE CENTRE

# TRC
# Journal of Telangana Studies

తెలంగాణ రిసోర్స్ సెంటర్ (TRC) ఆధ్వర్యంలో 'టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్' త్రైమాసిక జర్నల్ (జనవరి–మార్చి 2020 నాల్గువ సంచిక) వెలువడింది. దీనికి ఓయూ మాజీ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ఎడిటర్‌గా, తెలంగాణ రిసోర్స్ సెంటర్, చైర్మన్ మణికొండ వేదకుమార్ పబ్లిషర్‌గా ఉన్నారు. ఈ జర్నల్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ప్రచురితమవుతుంది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యావరణంపై ప్రముఖంగా వచ్చిన వ్యాసాలను ఈ జర్నల్‌లో ప్రచురిస్తారు. టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్ (TRC Journal of Telangana Studies)లో వివిధ రాష్ట్రాలు మరియు దేశాల నుండి ఎమినెంట్ స్కాలర్స్ రాసిన పరిశోధన పత్రాలను ప్రచురిస్తారు. ఎడిటోరియల్ బోర్డు పర్యవేక్షణలో ఈ త్రైమాసిక జర్నల్ అక్షర రూపంగా వెలువడుతుంది. తెలంగాణ రాష్ట్ర చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్ట్స్ అండ్ లిటరేచర్, హెరిటేజ్ మొదలైన సామాజిక అంశాలపై విస్తృతంగా, పరిశోధనాత్మకంగా వ్యాసాలను క్రోడీకరించి వాటిని ప్రపంచంలోని పలు యూనివర్సిటీలకు, సంస్థలకు అందిచేస్తుంది.


**Books for reviews may be sent to the postal address:**
**"BHOOPATHI SADAN"** 3-6-716, Street :12, Himayathnagar,
Hyderabad-500029, Telangana.
Mob: +91 8686 66 4949 email: trcjts@gmail.com

**Subscription:**

- Individual (India) : Rs. 250/issue; • Annual Subscription Rs. 800/-
- Institution (India) : Rs. 400/issue; • Annual Subscription Rs. 1,500/-
- Foreign Individual : US$ 65/issue; ▪ Annual Subscription US$ 260
- Foreign Institution : US$ 70/issue; ▪ Annual Subscription US$ 280

**ACCOUNT DETAILS:**


*A/C Name :*
Telangana Resource Centre
*Bank Name :*
Telangana Grameena Bank
*A/c. No. :* 79009067970
*IFSC No. :* SBIN0RRDCGB;
*Branch Code :* 229





**చిరాయువులు (ప్రాచీన రోమన్ చరిత్ర)**
రచన : డా॥ వి. శ్రీనివాస చక్రవర్తి
ప్రచురణ : మంచి పుస్తకం
వెల : రూ. 150
ప్రతులకు : 12-13-439, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాదు - 500 017.
ఫోన్ : 94907 46614





**పటం కతలు**
సంపాదకులు : మామిడి హరికృష్ణ, విష్ణుభట్ల ఉదయశంకర్
ప్రచురణ : భాషా సాంస్కృతిక శాఖ
వెల : రూ. 250
ప్రతులకు : కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500004.
ఫోన్ : 040-29703142





**సామల సదాశివ ఖండకావ్యాలు**
**(నిరీక్షణము, అంబపాలి, మీరాబాయి)**
ప్రచురణ : తెలంగాణ సాహిత్య అకాడమి
వెల : రూ. 30
ప్రతులకు : కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500004.
ఫోన్ : 040-29703142





**హిందువుల పండుగలు**
రచన : సురవరం ప్రతాపరెడ్డి
ప్రచురణ : తెలంగాణ సాహిత్య అకాడమి
వెల : రూ. 100
ప్రతులకు : కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500004.
ఫోన్ : 040-29703142




**కొండలలో వింతలు**
అనువాదం : కొల్లూరి సోమ శంకర్
ప్రచురణ : మంచి పుస్తకం
వెల : రూ. 70
ప్రతులకు : 12-13-439, స్ట్రీట్ నెం.1, తార్నాక, సికింద్రాబాద్.
ఫోన్: 94907 46614




**శిలాఫలకం (కవిత్వం)**
రచన : దేవనపల్లి వీణావాణి
వెల : రూ. 150
ప్రతులకు : 24-3-29, దర్గా ఖాజీపేట, హన్మకొండ, వరంగల్. మరియు ప్రముఖ పుస్తక కేంద్రాలలో.





**ప్రేమలహరి (హాఫెజ్ కవిత్వం)**
అనువాదం : జలజం సత్యనారాయణ
ప్రచురణ : ధ్వని
వెల : రూ. 200
ప్రతులకు : నవతెలంగాణ, ప్రజాశక్తి బుక్ హౌస్, నవచేతన, నవోదయ, పాలపిట్ట మరియు ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.





**కర్తవ్య దర్పణము**
తెలుగు అనువాదం : మణికొండ భూపతిరావు
ప్రచురణ : భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్
వెల : రూ. 30
ప్రతులకు : డి. లక్ష్మణస్వామి, ఫోన్ : 9963616999
ఆర్య ప్రతినిధి సభ, సుల్తాన్ బజార్, హైదరాబాద్.
టీఆర్‌సి, 3-6-716, స్ట్రీట్ నెం.12, హిమయాత్‌నగర్, హైదరాబాద్




**కంచెమీద పక్షిపాట (కవిత్వం)**
రచన : డా॥ నూకతోటి రవికుమార్
ప్రచురణ : సిక్కోలు బుక్ ట్రస్ట్
వెల : రూ. 110
ప్రతులకు : సిక్కోలు బుక్ ట్రస్ట్, శ్రీకాకుళం.
ఫోన్ : 9989265444




**ఎద్దు ఎవుసం సురుకుల వైద్యం (కవిత్వం)**
రచన : గులాబీల మల్లారెడ్డి
ప్రచురణ : పాలపిట్ట బుక్స్, హైదరాబాద్
వెల : రూ. 100
ప్రతులకు : 16-11-20/1/1, 403, విజయశ్రీ రెసిడెన్సీ, సలీమ్ నగర్, మలక్‌పేట, హైదరాబాద్
ఫోన్ : 040-27678430, 9848787284






**శతవాసంతిక**
**(ఉస్మానియా వందేళ్ళ సంబరాల ప్రత్యేక జ్ఞాపిక)**
రచన : ప్రొ॥ ఎస్. రామచంద్రం
ప్రచురణ : ఉస్మానియా విశ్వవిద్యాలయం
వెల : రూ. 400
ప్రతులకు : తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్



**కళా తెలంగాణం**
సంపాదకులు : మామిడి హరికృష్ణ, విష్ణుభట్ల ఉదయశంకర్
ప్రచురణ : భాషా సాంస్కృతిక శాఖ
వెల : రూ. 300
ప్రతులకు : కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500004.
ఫోన్ : 040-29703142

చరిత్ర, సాహిత్యం, వారసత్వం, పర్యాటకం, కళలు, సంస్కృతి, సామాజిక అంశాలు, తెలంగాణ ఉద్యమం.. ఇలా ఎన్నో అంశాలపై తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది. ప్రచురించిన ప్రతి పుస్తకం కూడా ఆ రంగంలో లేదా విభాగంలో ఒక ఆణిముత్యంలా నిలిచింది.








రకరకాల కారణాలతో తెలంగాణ ప్రముఖుల చరిత్రలు అంతగా వెలుగులోకి రాకుండా పోయాయి. ఆయా ప్రముఖులపై ప్రజలకు ఒక అవగాహన కల్పించేలా వివిధ వ్యాసాల సంకలనంతో మనిషి పేరిట తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది.



DECCAN LAND, Telugu Monthly Magazine 15th - July - 2020, ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, RNP/HD/1167/2018-2020

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar